# ఇంటర్మీడియట్

## తెలుగు వాచకం


**సంపాదక మండలి**

**ఆచార్య బన్న అయిలయ్య,** ప్రధానాచార్యులు, యూనివర్సిటీ ఆర్ట్స్ & సైన్సు కళాశాల, వరంగల్.

**ఆచార్య పంతంగి వెంకటేశ్వర్లు,** డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్, తెలుగు విభాగాధిపతి, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

**డా॥ ఎన్. రజని,** అసోసియేట్ ప్రొఫెసర్, డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**డా॥ ఎస్. రఘు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**డా॥ సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాదు.

**శ్రీ సువర్ణ వినాయక్,** కో-ఆర్డినేటర్, తెలుగు, రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, హైదరాబాద్, తెలంగాణ.

**సమన్వయం, సహకారం**

**శ్రీ మారసాని సోమిరెడ్డి,**
సంయుక్త సంచాలకులు,
సార్వత్రిక విద్యాపీఠం,
తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ బోయినపల్లి వెంకటేశ్వరరావు,**
స్టేట్ కో-ఆర్డినేటరు,
సార్వత్రిక విద్యాపీఠం,
తెలంగాణ, హైదరాబాద్.

**పాఠ్యపుస్తక ప్రచురణ సమితి**

**శ్రీమతి ఎ.దేవసేన,** ఐ.ఎ.ఎస్.,
సంచాలకులు,
పాఠశాల విద్యాశాఖ,
తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ పి.వి.శ్రీహరి**
సంచాలకులు,
సార్వత్రిక విద్యాపీఠం,
తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ శ్రీనివాసాచారి,**
సంచాలకులు,
పాఠ్యపుస్తక ముద్రణాలయం
తెలంగాణ, హైదరాబాద్.

**ముఖ్యసలహాదారు**

**శ్రీమతి వాకాటి కరుణ,** ఐ.ఎ.ఎస్.,
కార్యదర్శి, విద్యాశాఖ, తెలంగాణ.



**ప్రచురణ**

సార్వత్రిక విద్యాపీఠం,
తెలంగాణ, హైదరాబాదు

© Government of Telangana, Hyderabad

*New Edition*

*First Published 2022*

**All rights reserved**

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copy right holder of this book is the Sarvatrika Vidya Peetham, Telangana, Hyderabad.

This Book has been printed on 70 G.S.M. Maplitho
Title Page 200 G.S.M. White Art Card

సార్వత్రిక విద్యాపీఠం, తెలంగాణ 2022-23

*Printed in India*
at the Telangana Govt.Text Book Press,
Mint Compound, Hyderabad,
Telangana.

# ముందుమాట

విద్య మనిషికి మూడోకన్నులాంటిది. తనను, తన చుట్టూ ఉన్న సమాజాన్ని అర్థంచేసుకొని పరిస్థితులకనుగుణంగా తనను తాను ఆవిష్కరించుకొనేలా చేసేది విద్య. విద్య మనిషికి గుర్తింపునిస్తుంది, గౌరవాన్ని పెంపొందిస్తుంది. విద్యావంతులు ఉన్న సమాజం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించి అగ్రగామిగా నిలుస్తుంది. **'అందరూ చదువాలి – అందరూ ఎదగాలి'** అనేది ఒక సార్వత్రిక లక్ష్యం. చదువుకోవడం పాఠశాలల ద్వారా మాత్రమే కాకుండా అందరికీ చదువును అందించడానికి సార్వత్రిక విద్యాపీఠం ఏర్పాటైనది. **'అందరికీ విద్య – అందుబాటులో విద్య'** అనే లక్ష్యంతో చదువునుండి దూరమైన వారికి, చదువుకోనివారికి విద్యనందిస్తున్నది. 14 సం॥రాలు నిండినవారు సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 10వ తరగతిని అభ్యసించవచ్చు. 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు ఇంటర్మీడియట్ చదువును కొనసాగించవచ్చు.

పదవతరగతి పూర్తిచేసిన వారు ఇంటర్మీడియట్‌ను పూర్తిచేయడానికి వీలుగా 2022 సంవత్సరం నుండి నూతన వాచకాలను అందించాలని నిర్ణయించారు. మారుతున్న సామాజిక పరిస్థితులు, అవసరాలు, జాతీయ విద్యావిధానం మౌలిక సూత్రాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా అభ్యాసకులకు తెలంగాణ సాహిత్యం, చరిత్ర, సంస్కృతి వంటి వాటి ఆధారంగా నాణ్యమైన విద్యను అందించడంకోసం వాచకాలను ఆధునీకరించారు.

'భాష' భావ వినిమయ సాధనం మాత్రమేకాదు, ఆలోచన సాధనంగా ఆలోచించడానికి, ఆలోచనలను క్రమబద్ధీకరించుకొని వ్యక్తీకరించడానికి తోడ్పతుంది. భాషలో సమర్థతను కల్గి ఉండి, అభ్యాసకులు తమ దైనందిన వ్యవహారాలలో భాషను సమర్థవంతంగా వినియోగించగలగాలి. వీటిని దృష్టిలో పెట్టుకొని భాషాసామర్థ్యాల సాధనకు అనుగుణంగా ఈ వాచకాన్ని రూపొందించారు.

ఇంటర్మీడియట్ దశ పాఠశాల విద్యకు, ఉన్నత విద్య మధ్య సంధానకర్తగా ఉంటుంది. 10వ తరగతి పూర్తిచేసిన అభ్యాసకులు ఇంటర్మీడియట్ స్థాయిలో తెలుగును అభ్యసించడం ద్వారా ఉన్నత విద్యలో తెలుగును అభ్యసించడానికి అవకాశం ఉంటుంది. అవసరమైన సామర్థ్యాల సాధనను స్వయంగా చేయడానికి అనుగుణంగా ఇంటర్మీడియట్ తెలుగు వాచకాన్ని రూపొందించారు.

ఈ వాచకంలో 12 పాఠాలను పొందుపరిచారు. పద్యం, వచన కవిత, గేయం, వ్యాసం తదితర ప్రక్రియలతో పాఠాలు ఉన్నాయి. కథావిభాగం పేరుతో ఉపవాచకం ఉన్నది. వ్యాసం, పర్యావరణం, నైతిక ఆధ్యాత్మిక విలువలు, దేశభక్తి, సహానుభూతి, పిల్లల స్వభావం, సామాజిక స్పృహ, వ్యక్తిత్వ వికాసం, భాషాభిరుచి, గిరిజనుల జీవనం, శ్రమజీవన సౌందర్యం మొదలైన ఇతివృత్తాలతోకూడిన పాఠ్యాంశాలను తెలుగు సాహిత్యం నుండి ఎంపికచేశారు. భాషాసామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలు సాధించడానికి అనుగుణంగా అభ్యాసాలను పొందుపరిచారు. తెలుగు భాషపట్ల అవగాహన పెంపొందించేలా వ్యాకరణాంశాలను పరిచయం చేశారు. పుస్తకం భారం తగ్గించి స్వయం అధ్యయనానికి అనుగుణంగా, ఆసక్తికలిగించేలా రూపొందించారు.

అతి తక్కువ సమయంలో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి వాచక రూపకల్పనలో పాల్గొన్న సభ్యులకు, సంపాదకమండలి సభ్యులకు, డిటిపి ఆపరేటర్‌కు కృతజ్ఞతలు. వాచక రూపకల్పనలో సంధానకర్తగా, విషయనిపుణుడిగా వ్యవహరించిన **శ్రీ సువర్ణ వినాయక్,** కో–ఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి. గారికి అభినందనలు. వాచక రూపకల్పన కోసం విషయనిపుణులు, కోఆర్డినేటరు సేవలు వినియోగించడానికి అనుమతించి సహకరించిన **శ్రీమతి ఎమ్. రాధారెడ్డి,** సంచాలకులు, ఎస్.సి.ఇ.ఆర్.టి. గారికి, వాచక రూపకల్పనను ప్రారంభించి ఎప్పటికప్పుడు సహకరించిన పాఠ్యపుస్తక ముద్రణాలయం సంచాలకులు **శ్రీ శ్రీనివాసాచారి** గారికి కూడా ప్రత్యేక కృతజ్ఞతలు. వాచకాల మార్పు ఆవశ్యకతను గుర్తించి ప్రేరేపించి దిశానిర్దేశం చేసిన **శ్రీమతి వాకాటి కరుణ,** ఐ.ఎ.ఎస్., కార్యదర్శి, విద్యాశాఖ గారికి ధన్యవాదాలు. రాష్ట్రవిద్యాశాఖామంత్రిగా ఎప్పటికప్పుడు దిశానిర్దేశంచేసి ప్రోత్సహిస్తున్న **శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి** గారికి ప్రత్యేక ధన్యవాదాలు. రూపకల్పనలో రచయితలు, సంపాదకమండలి, కో–ఆర్డినేటర్లతో చర్చించి, సమన్వయంచేసి పుస్తకం పూర్తికావడానికి కృషిచేసిన సంయుక్త సంచాలకులు **శ్రీ మారసాని సోమిరెడ్డి, శ్రీ బోయినపల్లి వెంకటేశ్వర రావు** స్టేట్ కో–ఆర్డినేటర్ గారికి ప్రత్యేక అభినందనలు. ఈ వాచకం అభ్యాసకుల అవసరాలను తీర్చి, భాషా సమర్థతను పెంచడానికి తోడ్పడుతుందని ఆశిస్తున్నాను.

**పి. వి. శ్రీహరి**
**సంచాలకులు**
సార్వత్రిక విద్యాపీఠం, తెలంగాణ, హైదరాబాద్.

తేది : 03-11-2022
స్థలం : హైదరాబాద్.

## విషయనిపుణులు, నిర్వహణ

**శ్రీ సువర్ణ వినాయక్**, కో-ఆర్డినేటర్, తెలుగు, రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, హైదరాబాద్.

## రూపకల్పనలో పాల్గొన్నవారు

**డా॥ కోయి కోటేశ్వర్ రావు,** అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ సిటి కాలేజి, నయాపూల్, హైదరాబాదు.

**స్వప్న భువకర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మల్కాజ్‌గిరి.

**జి. సత్యపాల్ రెడ్డి,** ఉపన్యాసకుడు,
ప్రభుత్వ జూనియర్ కళాశాల, దిలావర్‌పూర్, నిర్మల్.

**డా॥ పి. భాస్కరయోగి,** ఉపన్యాసకుడు,
ప్రభుత్వ జూనియర్ కళాశాల, పరిగి, వికారాబాద్ జిల్లా.

**శ్రీ పల్లెర్ల రామమోహన రావు,** స్కూ.అ. (తెలుగు),
జి.ప.ఉ.పా., వేముల, మహబూబ్‌నగర్ జిల్లా.

**శ్రీ గాజుల రవీందర్,** స్కూ.అ. (తెలుగు),
ప్ర.ఉ.పా., కార్ఖానాగడ్డ, కరీంనగర్.

**శ్రీ ఎల్.ఎం.ప్రసాద్,** భాషోపాధ్యాయుడు,
ప్ర.ఉ.పా., సి.పి.ఎల్., అంబర్‌పేట, హైదరాబాద్.

**డా॥ వి. జయప్రకాశ్,** పి.జి.టి. తెలుగు,
తెలంగాణ మోడల్ స్కూల్, రేగోడు, మెదక్ జిల్లా.

**సంబరాజు రవిప్రకాశ రావు,** ఉపాధ్యాయుడు,
పి.ఎస్. గోవిందాయపల్లి తండా, రంగారెడ్డి జిల్లా.

---

**ముఖచిత్రం : కె. సుధాకరాచారి,** ఉపాధ్యాయుడు, ప్రా.పా. మైలారం, రాయపర్తి మండలం, వరంగల్ జిల్లా.

**సాంకేతిక సహకారం : వెంకటస్వామి,** వరికుప్పల, జి.ప.ఉ.పా. ధర్మారరావు పేట, కామారెడ్డి జిల్లా.

---

**డి.టి.పి., లే ఔటు & డిజైనింగ్ : ప్రతిమ పాతూరి,** హైదరాబాద్.

# విషయ సూచిక


| క్ర.సం. | పాఠం పేరు | కవి / రచయిత | ఇతివృత్తం | ప్రక్రియ | పుట |
|---|---|---|---|---|---|
| | | పద్య భాగం | | | |
| 1. | లోకరక్షణము | బమ్మెర పోతన | పరోపకారం | పద్యం | 1 |
| 2. | సత్యనిష్ఠ | గౌరన | సత్యం | ద్విపద | 11 |
| 3. | శతక పద్యాలు | శతక కవులు | నైతిక విలువలు | పద్యం | 22 |
| 4. | మంజీర | డా॥ దాశరథి కృష్ణమాచార్య | పర్యావరణం | గేయం | 34 |
| 5. | మానవ సంగీతం | కవిరాజ మూర్తి | వ్యక్తిత్వ వికాసం | వచన కవిత | 44 |
| 6. | స్వాతంత్ర్య రథము | మామిండ్ల రామగౌడు | దేశభక్తి | గేయం | 52 |
| | | గద్య భాగం | | | |
| 7. | మా వూరు మాట్లాడింది | డా॥ సి. నారాయణ రెడ్డి | భాషాభిరుచి | వ్యాసం | 64 |
| 8. | హైదరాబాద్ నగరం | ఏనుగుల వీరాస్వామి | చరిత్ర | యాత్రారచన | 75 |
| 9. | ప్రచార సాధనాలు | ఆచార్య పేర్వారం జగన్నాథం | సామాజిక స్పృహ | వ్యాసం | 83 |
| 10. | ఆదివాసులు | బూసాని బాబురావు వర్మ | గిరిజన సంస్కృతి | వ్యాసం | 94 |
| 11. | గురుశిష్య బంధం | సామల సదాశివ | సంస్కృతి | వ్యాసం | 102 |
| 12. | మా కాలంలో వృత్తులు | డా॥ కపిలవాయి లింగమూర్తి | శ్రమగౌరవం | ఆత్మకథ | 111 |
| | | ఉపవాచకం – కథావిభాగం | | | |
| 13. | మంకు | జి. సురమౌళి | పిల్లల స్వభావం | కథ | 119 |
| 14. | సియాసీ సభలు | బెల్లంకొండ నరసింహాచార్యులు | సంఘ చైతన్యం | కథ | 123 |
| 15. | అడవి పూలు | బోయ జంగయ్య | గిరిజనుల జీవనం | కథ | 128 |
| 16. | చిరుదీపం | బొమ్మ హేమాదేవి | సహానుభూతి | కథ | 135 |
| | పదవిజ్ఞానం | | | | 144 |

# ఇంటర్మీడియట్ వాచకం ద్వారా సాధించబడే భాషాసామర్థ్యాలు, అభ్యసన ఫలితాలు

## I. అవగాహన – ప్రతిస్పందన

- ముద్రిత, చేతిరాతల్లోని అంశాలను ధారాళంగా చదువగలగాలి, అర్థం చేసుకోగలగాలి.
- పరిచిత పద్యం, గద్యం, గేయం, వచన కవిత, సంభాషణ, కరపత్రాలు మొదలగువాటిని ధారాళంగా చదువగలగాలి, అర్థం చేసుకోగలగాలి. వీటికి చెందిన ప్రశ్నలకు జవాబులివ్వగలగాలి.
- అపరిచిత పద్యం, గద్యం, గేయాలు మొదలగువాటిని చదివి అర్థం చేసుకోగలగాలి. వీటికి చెందిన ప్రశ్నలకు జవాబులివ్వగలగాలి.
- తారుమారైన కవితాపంక్తులు, పద్యపాదాలు మొదలగు వాటిని సరిచేసి వరుసక్రమంలో రాయగలగాలి.
- చదివిన అంశం ఆధారంగా తప్పొప్పులు గుర్తించడం, ఖాళీలు పూరించడం, శీర్షికలు పెట్టడం వంటివి చేయగలగాలి.
- వార్తాపత్రికలు, మ్యాగజైనులు, ప్రసారమాధ్యమాలలోని అంశాలను అర్థంచేసుకుని ప్రతిస్పందించగలగాలి.
- పుస్తకపఠనం అలవాటుగా చేసుకుని సాహిత్యాన్ని, కవులు, రచయితలను ప్రశంసించగలగాలి.

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

- ఇచ్చిన ప్రశ్నలకనుగుణంగా విశ్లేషణాత్మకంగా జవాబులు రాయగలగాలి.
- తెలిసిన, చూసిన, విన్న, చదివినవాటి గురించి సొంతమాటల్లో రాయగలగాలి.
- విరామచిహ్నాలనుపయోగించి దోషరహితంగా క్రమపద్ధతిలో రాయగలగాలి.
- సమర్థిస్తూ లేదా విభేదిస్తూ, వివరిస్తూ రాయగలగాలి.
- పద్యాలు, గేయాలు, కవితలకు తాత్పర్యాలు, భావాలు సొంతమాటల్లో రాయగలగాలి.
- పాత్రల స్వభావాలు, సారాంశాలు, కథలను సొంతమాటల్లో రాయగలగాలి.
- లేఖలు, కథలు, ఆత్మకథలు, వ్యాసాలు, సంభాషణలు, దినచర్య వంటివి రాయగలగాలి.
- గేయాలను పొడిగించగలగాలి. కవితలను రాయగలగాలి.

## III. భాషాంశాలు


- అర్థాలు, నానార్థాలు, పర్యాయపదాలు, ప్రకృతి–వికృతులు, వచనాలు వంటివి రాయగలగాలి.
- నిఘంటువును ఉపయోగించి అర్థాలను గ్రహించగలగాలి.
- పారిభాషిక పదజాలాన్ని అర్థం చేసుకోగలగాలి.
- ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి. జాతీయాలను అర్థం చేసుకొని ఉపయోగించగలగాలి.
- గురులఘువులను గుర్తించి గణవిభజన చేయగలగాలి.
- ఉత్పలమాల, చంపకమాల లక్షణాలను అర్థం చేసుకోగలగాలి.
- సవర్ణదీర్ఘ, గుణసంధులతోపాటు అత్వసంధి, వృద్ధి సంధులను అర్థం చేసుకోగలగాలి. ఉదాహరణలు ఇవ్వగలగాలి.
- ద్విగు, ద్వంద్వ సమాసాలతోపాటు బహువ్రీహి, రూపక సమాసాలను అర్థం చేసుకోగలగాలి. విగ్రహ వాక్యాలను రాయగలగాలి.
- అంత్యానుప్రాసం, అతిశయోక్తి అలంకారాలతోపాటు స్వభావోక్తి, ఛేకానుప్రాస అలంకారాల లక్షణాలను అర్థం చేసుకోగలగాలి. ఉదాహరణలు ఇవ్వగలగాలి.

పద్య భాగం

# 1 లోకరక్షణము

– బమ్మెర పోతన

## కవి పరిచయం


15వ శతాబ్దం

బమ్మెర పోతన జనగామ జిల్లా 'బమ్మెర' గ్రామంలో జన్మించాడు. తల్లి లక్కమాంబ. తండ్రి కేసన. భోగినీ దండకము, వీరభద్ర విజయము, నారాయణ శతకము, శ్రీమహాభాగవతము ఇతని రచనలు. 'సహజ పండితుడి'గా కీర్తింపబడినాడు.

బ్రతుకుతెరువు కోసం ఏ రాజునూ ఆశ్రయించలేదు. స్వాభిమానంతో బ్రతికాడు. వ్యవసాయం చేశాడు. పరమభక్తుడైన ఇతడు తన శ్రీమహాభాగవతాన్ని శ్రీరామచంద్రునికి అంకితం చేశాడు. తెలుగు పద్యపు అందచందాలు ఇతని కవిత్వంలో చూడవచ్చు. శబ్దాలంకారాలతో ముఖ్యంగా వృత్త్యను ప్రాస, అంత్యాను ప్రాసలతో పద్యాలు ముచ్చటగొలుపుతాయి.

ప్రస్తుత పాఠ్యభాగం పద్య ప్రక్రియకు చెందింది. ఇది శ్రీమహాభాగవతములోని అష్టమస్కంధము నుండి గ్రహింపబడింది.

## నేపథ్యం, ఉద్దేశం

శ్రీమహావిష్ణువు సూచన మేరకు, బలిచక్రవర్తి సమక్షంలో ఇంద్రుడు చెప్పగా దేవతలు, రాక్షసులు పాలసముద్రాన్ని చిలకడానికి సిద్ధపడ్డారు. మంథర పర్వతాన్ని కవ్వంగా, 'వాసుకి' అనే సర్పమును తాడుగా చేసుకొన్నారు. శ్రీమహావిష్ణువు కూర్మం (తాబేలు)గా మారి పర్వతాన్ని తన వీపున ధరించాడు. దేవతలు, రాక్షసులు చిలకడం మొదలుపెట్టారు. అప్పుడు ఆ పాలసముద్రం నుండి 'హాలాహలం' అనే విషం పుట్టింది.

కష్టాల్లో ఉన్నవారిని కరుణతో ఆదుకోవాలి. ఆ ప్రయత్నంలో ఎంతటి కష్టనష్టాలకైనా వెనుదీయగూడదు. పరోపకారాన్ని మించిన ధర్మం లేదు. ప్రభువుల విషయంలో ఇది పరమ కర్తవ్యం కూడా. ఆర్తులను ఆదుకోవడం, అందుకు సహకరించడం లోని ఔన్నత్యాన్ని తెలియజెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

## I

కం. ఆలోల జలధిలోపల
నాలో నహి విడిచి సురలు నసురులు బఱవం
గీలా కోలాహల మై
హాలాహలవిషము పుట్టె నవనీనాథా! 1

వ. అప్పుడు 2

✿మ. చని కైలాసముఁ జొచ్చి శంకరు నివాసద్వారముం జేరి యా
సున దౌవారికు లడ్డపెట్టఁ దల మంచుం జొచ్చి కుయ్యో మొఱో
విను మాలింపుము చిత్తగింపుము దయన్ వీక్షింపు మం చంబుజా
సన ముఖ్యుల్ గని రార్తరక్షణ కళాసంరంభునిన్ శంభునిన్! 3

వ. అప్పుడు భోగిభూషణునకు సాష్టాంగ దండప్రణామంబులు గావించి, ప్రజాపతి ముఖ్యు లి ట్లని స్తుతియించిరి. 4

కం. లంపటము నివారింపను
సంపద కృపసేయ జయము సంపాదింపన్
జంపెడివారి వధింపను
సొంపారఁగ నీకె చెల్లు సోమార్ధధరా! 5

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. దేవతలు శివుణ్ణి ఎందుకు స్తుతించారు?
2. ద్వారపాలకులు అడ్డగించినా దేవతలు పట్టించుకోకపోవడానికి కారణం ఏమిటి?

## II

వ. అని మఱియు నభినందింపుచున్న ప్రజాపతిముఖ్యులం గని సకలభూత సముండగు నద్దేవుండు తన ప్రియసతి కి ట్లనియె. 6

కం. కంటే జగముల దుఃఖము
వింటే జలజనిత విషమువేఁడిమి ప్రభు వై
యుంటకు నార్తుల యాపద
గెంటించుట ఫలము దానఁ గీర్తి మృగాక్షీ! 7

కం. ప్రాణేచ్ఛ వచ్చి చొచ్చిన
ప్రాణుల రక్షింపవలయుఁ ప్రభువుల కెల్లన్
బ్రాణుల కిత్తురు సాధులు
ప్రాణంబులు నిమిష భంగురము లని మగువా! 8

కం. పరహితము సేయు నెవ్వడు
పరమ హితుం డగును భూత పంచకమునకున్
బరహితమె పరమధర్మము
పరహితునకు నెదురులేదు పర్వేందుముఖీ! 9

కం. శిక్షింతు హాలహలమును
భక్షింతును మధుర సూక్ష్మ ఫలరసము క్రియన్
రక్షింతుఁ బ్రాణికోట్లను
వీక్షింపుము నేఁడు నీవు వికచాబ్జముఖీ! 10

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. శివుడు విషాన్ని స్వీకరించాలని ఎందుకు అనుకున్నాడు?
2. కీర్తి దేనివల్ల కలుగుతుంది?

## III

వ. అని పలికినఁ బ్రాణ వల్లభునకు వల్లభ యి ట్లనియె "దేవా! దేవర చిత్తంబు కొలఁది నవధరింతురు గాక" యని పలికె.
11

కం. మ్రింగెడువాఁడు విభుం డని
మ్రింగెడిదియు గరళ మనియు మేలని ప్రజకున్
మ్రింగు మనె సర్వమంగళ
మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో! 12

✿ మ. తన చుట్టున్ సురసంఘముల్ జయజయ ధ్వానంబులన్ బొబ్బిడన్
ఘన గంభీర రవంబుతో శివుడు లోకద్రోహి! హుం! పోకు ర
మ్మని కెంగేలఁ దెమల్చి కూర్చి కడిగా నంకించి జంబూ ఫలం
బన సర్వంకషమున్ మహావిషము నాహారించె హేలాగతిన్! 13

✿ మ. కదలంబాఱవు పాఁపపేరు లొడలన్ ఘర్మాంబు జాలంబు పు
ట్టదు నేత్రంబులు నెఱ్ఱగావు నిజ జూటార్ధేంద్రుఁడున్ గందఁడున్
వదనాంభోజము వాడ దా విషము నాహ్వానించుచో డాయుచోఁ
బదిలుం డై కడిసేయుచోఁ దిగుచుచో భక్షింపుచో మ్రింగుచోన్! 14

ఆ. హరుడు గళమునందు హాలాహలము వెట్టఁ
గప్పు గలిగి తొడవు కరణి నొప్పె
సాధురక్షణంబు సజ్జనునకు నెన్న
భూషణంబు గాదె భూవరేంద్ర! 15

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. పార్వతి శివునితో విషము మింగుమనడంలో ఆంతర్యమేమిటి?
2. శివుని కంఠంలోని నలుపు అలంకారంగా ఉందని కవి ఎందుకు భావించాడు?

## తాత్పర్యాలు

1. ఓ రాజా! అంతలోనే అల్లకల్లోలమైన ఆ పాలసముద్రం నుండి హాలాహలము అనే విషం పుట్టింది. అది అగ్నిజ్వాలల కోలాహలంతో కూడి ఉన్నది. దాన్ని చూసి బెదిరి దేవతలు, రాక్షసులు వాసుకిని వదిలి పరుగులు తీశారు.

2. ఆ సమయంలో

3. బ్రహ్మ మొదలైన దేవతలంతా కలిసి కైలాసానికి వెళ్ళారు. శివుని మందిరం ముందుకు చేరుకున్నారు. అక్కడి ద్వారపాలకులు వారిని లోపలికి వెళ్ళనీయలేదు. కాని వారంతా ద్వార పాలకులను అడ్డుతొలగమని చెప్పి లోపలికి వెళ్ళారు. (బాధలో ఉన్న వారిని రక్షించగలిగిన) శివుణ్ణి చూశారు. దయతో రక్షింపుమని శరణువేడారు.

4. బ్రహ్మాదులు శివునికి సాష్టాంగ నమస్కారం చేసి ఈ విధంగా ప్రార్థించారు.

5. చంద్రశేఖరా! కష్టాన్ని తొలగించడానికి, సంపదను ఇవ్వడానికి, విజయాన్ని చేకూర్చడానికి, చంపెడి వారిని చంపడానికి నీకే సాధ్యమవుతుంది.

6. అని పొగుడుతున్న బ్రహ్మాది దేవతలను చూసి శివుడు తన భార్య యైన పార్వతితో ఇలా అన్నాడు.

7. పార్వతీ! లోకాల బాధను చూశావు కదా! సముద్రంలో పుట్టిన హాలాహల విషపు వేడిమి గురించి విన్నావు కదా! ప్రభువు అయిన వాడు బాధలో ఉన్నవారి ఆపదలను తొలగించాలి. అది ప్రభువుకు తగినపని. అలా చేయడం వల్ల కీర్తి కలుగుతుంది.

8. పార్వతీ! ప్రాణభయంతో ఆశ్రయించిన వాళ్ళను రక్షించడం ప్రభువుల కర్తవ్యం. ప్రాణాలు క్షణములో నశించే వని తెలిసి ఉత్తములు ఇతరుల ప్రాణాలను కాపాడడానికి తమ ప్రాణాలను సైతం ఇస్తారు.

9. ఇతరులకు మేలు చేసినవాడు, పంచభూతాలకూ పరమాప్తుడు అవుతాడు. ఇతరులకు మేలు చేయడమే గొప్ప ధర్మము. ఇలా చేసిన వానికి ఎదురులేదు.

10. ఈ హాలాహల విషాన్ని ఇప్పుడే దండిస్తాను. తియ్యనైన చిన్నపండు రసాన్ని తాగిన విధంగా తాగేస్తాను. ప్రాణులను రక్షిస్తాను. నీవు ఇలా చూస్తూ ఉండు.

11. అనగానే పార్వతీదేవి శివునితో “స్వామీ! మీ మనసుకు నచ్చినట్లు చేయండి” అన్నది.

12. తింటున్నది విషమనీ తినేవాడు తన భర్తయనీ తెలిసి కూడా అలా తినడంవల్ల ప్రాణులకు (ప్రజలకు, లోకానికి) మేలు జరుగుతుందని భావించిన పార్వతి శివుణ్ణి విషాన్ని మింగుమన్నది. తన మంగళసూత్రము పై ఆమెకు ఎంత నమ్మకమో!

13. దేవతలందరూ తన చుట్టూచేరి 'జయజయ'మంటూ పెద్దగా ధ్వనులు చేస్తుంటే శివుడు గంభీరస్వరంతో హుంకారం చేసి విషముతో "లోకద్రోహీ! పోవద్దు, రా!" అంటూ తన ఎర్రని చేతులతో ఆ విషాన్ని ముద్దగా చేసుకొని నేరేడు పండులా దాన్ని విలాసంగా ఆరగించాడు.

14. శివుడు హాలాహలాన్ని రమ్మని పిలిచినప్పుడు ఆ వేడిమికి అతని శరీరంపై ఉన్న పాములు పారిపోలేదు. విషాన్ని సమీపిస్తున్నప్పుడు అతనికి ఏమాత్రం చెమట పట్టలేదు. దాన్ని ముద్దగా చేస్తున్నప్పుడు ఆ ప్రభావంతో కళ్ళు ఎర్రబడలేదు. తలపైని చంద్రుడు ఏ మాత్రం కందిపోలేదు. విషాన్ని మింగినప్పుడు ముఖము వాడిపోలేదు.

15. శివుడు గొంతులో విషాన్ని నిలుపుకోవడం వల్ల అక్కడ నల్లగా మారింది. కానీ, అదీ ఒక అలంకారమైంది. మంచివారికి ఉత్తములను రక్షించడమే అలంకారం కదా!

## సారాంశం

పాలసముద్రం నుండి 'హాలాహలము' అనే విషం పుట్టింది. అగ్నిజ్వాలలతో భయంకరంగా ఉంది. దాన్ని చూడగానే దేవతలు, రాక్షసులు అక్కడి నుండి పారిపోయారు. దేవతలు కైలాసం చేరారు. ఈ మహావిష ప్రమాదం నుండి కాపాడమని శివుణ్ణి వేడుకున్నారు. శివుడు ప్రసన్నుడయ్యాడు. ప్రాణభయంతో వచ్చిన వారిని కాపాడడం ప్రభువుల కర్తవ్యమని పార్వతితో అన్నాడు. పరోపకారానికి మించిన ధర్మం లేదన్నాడు. హాలాహలాన్ని ఫలరసంలాగా స్వీకరిస్తానన్నాడు. స్వీకరించేది విషమనీ, స్వీకరించేవాడు తన భర్త అనీ తెలిసినా, లోకాలకు మేలు జరుగుతుందని భావించింది పార్వతి. అందుకే శివుణ్ణి స్వీకరించుమన్నది. తన మాంగల్యం మీద ఎంత గట్టి నమ్మకమో?

శివుడు హాలాహలాన్ని గ్రహించడానికి సిద్ధపడ్డాడు. అతని చుట్టూ చేరిన దేవతలు 'జయజయ' ధ్వానాలు చేస్తున్నారు. శివుడు హుంకారం చేశాడు. విషముతో "ఓ లోకద్రోహీ! పోవద్దు! రా!" అంటూ గంభీరంగా పలికాడు. విషాన్ని చేతుల్లోకి తీసుకొని ముద్దగా చేశాడు. నేరేడుపండును తిన్నంత సులభంగా మింగాడు. ఇదంతా జరుగుతున్నప్పుడు ఆ హాలాహల ప్రభావం అతనిపై ఇసుమంతైనా పడలేదు. అతని శరీరంపై ఉన్న పాములు పారిపోలేదు. చెమట పట్టలేదు. కళ్ళు ఎర్రబడ లేదు. జటాజూటం లోని చంద్రుడు కందిపోలేదు. ముఖము వాడిపోలేదు.

విషాన్ని గొంతులో నిలుపడంవల్ల ఆ ప్రదేశం నల్లగా మారింది. కాని తెల్లని శివునికి అదికూడా ఒక అలంకారమై ఒప్పింది. ఉత్తములను రక్షించడం మంచివారికి శోభనిచ్చే అలంకారమే కదా!

## పాఠ్యాంశ అన్వయం

ఒక పెద్ద ఆపద నుండి లోకాలను రక్షించిన శివుని కథను తెలుసుకొన్నారు కదా! దీనివల్ల ఏమి గ్రహించారు? ఎందుకంటే సారం గ్రహించలేని చదువు వ్యర్థం.

హాలాహల విషంవల్ల లోకాలకు ప్రమాదమని భావించిన శివుడు దానిని మింగడానికి సిద్ధపడ్డాడు కదా! అంటే సమాజానికి ఆపద కలిగినప్పుడు దాన్ని తొలగించడానికి ముందుండాలి. ఎంతటి కష్టనష్టాలకైనా సిద్ధపడాలి. చేయాల్సిన వాడు, చేతనయిన వాడెప్పుడూ చేతులు ముడుచుకొని కూర్చోకూడదు. సమాజానికి మేలు చేయడంలోనే జన్మ సార్థకత ఉన్నది. శివుడు విషం తాగుతానంటే 'సరే' నన్నది పార్వతి. ఎందుకు? అది లోకాలకు మేలు జరిగేపని కనుక. దీనివల్ల మనం గ్రహించాల్సిందేమంటే ఎవరైనా మంచిపని చేస్తుంటే ప్రోత్సహించాలి, ప్రేరణనివ్వాలి, నైతికమద్దతు పలకాలి. అప్పుడు జరిగే ఆ మంచిలో మనకూ భాగస్వామ్యమున్నట్లే. శివుని మాటలను గమనించారు కదా! ప్రాణభయంతో వచ్చిన వారిని కాపాడాలి అన్నాడు. పరోపకారానికి మించిన ధర్మం లేదన్నాడు. వీటిని పాటించగలిగితే సమాజంలో శాంతి, సౌఖ్యాలు విలసిల్లుతాయి. ఇక చివరగా ఒక్కమాట. పాలసముద్రంలో పుట్టిన విషాన్ని శివుడు స్వీకరించాక, దేవతలు, రాక్షసులు మళ్ళీ చిలికారు. అప్పుడు దానిలోంచి అమృతం పుట్టింది. కల్పవృక్షం, కామధేనువు, ఐరావతం – మొదలైనవి పుట్టాయి. అంటే జీవితంలో ఏదైనా కష్టం వస్తే ఏడుస్తూ కూర్చోకూడదు. ధైర్యంతో అడుగు ముందుకు వేసి ప్రయత్నిస్తే, సుఖాలు మన సొంతమవుతాయి. అలుపెరుగని ప్రయత్నానికి అసాధ్యమేదీ లేదు.

## భాషా సామర్థ్యాలను సాధిద్దాం

### I. అవగాహన – ప్రతిస్పందన

**1. ఈ పాఠంలోని ఒక పద్యానికి సంబంధించిన పాదాలు తారుమారుగా ఉన్నాయి. వాటిని సరైన క్రమంలో రాయండి.**

సన ముఖ్యుల్ గని రార్తరక్షణ కళా సంరంభునిన్ శంభునిన్
విను మాలింపుము చిత్తగింపుము దయన్ వీక్షింపు మం చంబుజా
సున దౌవారికు లడ్డవెట్టఁ దల మంచుం జొచ్చి కుయ్యో మొఱో
చని కైలాసముఁ జొచ్చి శంకరు నివాసద్వారముం జేరి యా

### II. భాషాంశాలు

**పదజాలం**

**1. కింది గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి.**

ఉదా : శివుడు <u>గరళము</u>ను మింగాడు.

గరళము = విషము

అ) మా అమ్మ <u>భూషణములు</u> ధరించింది. =

ఆ) <u>అంబుజాసనుడు</u> ఈ ప్రపంచాన్ని సృష్టిస్తాడు. =

ఇ) నేను అద్దములో <u>వదనము</u>ను చూసుకొన్నాను. =

**2. కింది వాక్యాలలో పర్యాయపదాలను గుర్తించి రాయండి.**

ఉదా : అహి ప్రమాదకారి. పాము పడగ విప్పుతుంది. సర్పము కాటువేస్తుంది.

అహి, పాము, సర్పము

అ) శంభుడు కైలాసంలో ఉంటాడు. శంకరుడు త్రిశూలం ధరిస్తాడు. శివుడు పార్వతి భర్త.

________________ ________________ ________________

ఆ) సోముడు వెన్నెలలు కురిపిస్తాడు. పున్నమి చంద్రుడు ఆనందాన్ని కలిగిస్తాడు. శివుడు నిశాపతిని తలపై ధరించాడు.

________________ ________________ ________________

ఇ) జలధిలో అలలు ఎగసి పడుతుంటాయి. దేవతలు, రాక్షసులు, పాలసముద్రమును చిలికారు. ఆ నీరధి నుండి విషం పుట్టింది.

________________ ________________ ________________

**3. కింది వాక్యాల ఆధారంగా నానార్థాలు రాయండి.**

ఉదా : మామిడి ఫలము తియ్యగా ఉంది. ఆ పండు రసమును తాగుతుంటే ఎంత బాగుంటుందో! దానిని వృథా చేస్తే ఏం ప్రయోజనము?

ఫలము = పండు, ప్రయోజనము

అ) అడవిలో అనేక మృగములు ఉన్నాయి. జంతువుల పట్ల దయతో ఉండాలి. లేళ్ళు చెంగు చెంగున దుంకుతున్నాయి.

మృగము = ________________ ________________

ఆ) శివుని సతి పార్వతి. ఆమె మహా పతివ్రత.

సతి = ________________ ________________

ఇ) సంక్రాంతి గొప్ప పర్వము. ఆ పండుగనాడు వాకిళ్ళు ముగ్గులతో అలంకరింపబడతాయి. ఆనాడు ఉపయోగించే చెఱకుగడలో ఎన్నో కణుపులుంటాయి.

పర్వము = ________________ ________________

**4. కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలను రాయండి.**

ఉదా : అబ్జము = కొలను లోని అబ్జము కనువిందు చేస్తున్నది.

అ) గళము = ______________________

ఆ) ఆర్తి = ______________________

ఇ) లంపటము = ______________________

ఈ) కుయ్యోమొర్రో = ______________________

## భాషా క్రీడ

**5. కింది పదాలలో ఆ విషయానికి సంబంధంలేనని పదం ఉంది. గుర్తించండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | అ) కైలాసం | ఆ) శివుడు | ఇ) ద్వారపాలకులు | ఈ) సముద్రం | ( ) |
| 2. | అ) ప్రభువు | ఆ) కొండలు | ఇ) రక్షణ | ఈ) ప్రజలు | ( ) |
| 3. | అ) దేవతలు | ఆ) పాలసముద్రం | ఇ) ఆహారం | ఈ) విషం | ( ) |
| 4. | అ) బ్రహ్మ | ఆ) వాసుకి | ఇ) పార్వతి | ఈ) శంకరుడు | ( ) |
| 5. | అ) వెన్నెల | ఆ) వేడిమి | ఇ) హాలాహలం | ఈ) మృత్యువు | ( ) |

## వ్యాకరణాంశాలు

10వ తరగతిలో గురువు, లఘువుల గురించి తెలుసుకొన్నారు కదా! లఘువును ' I ' గా, గురువును ' U ' గా సూచిస్తారని తెలుసుకదా! హ్రస్వాక్షరాలు (ల, క, ఎ), దీర్ఘంలేని ద్విత్వాక్షరాలు (క్క, మ్మ, ల్ల), దీర్ఘంలేని సంయుక్తాక్షరాలు (క్న, వ్య, త్రి) లఘువులు. దీర్ఘాక్షరాలు (లీ, కీ, సో), సున్నతో కూడినవి (కం, లం, గం), విసర్గతో కూడినవి (దుః, మః, కః), పొల్లుతో కూడినవి (నిన్, యెన్, చెన్), ద్విత్వాక్షరాలకు ముందున్నవి (అక్క, అమ్మ, అన్న), సంయుక్తాక్షరాలకు ముందున్నవి (రశ్మి, పద్య, చిత్ర), ఐ, ఔ లు ఉన్న హల్లులు (కై, కౌ, గై, గౌ) గురువులు.

కింది పదాలను గురు, లఘువులుగా గుర్తించండి.

కమల, తల్లి, తండ్రి, భారతం, దుఃఖము.

ఇప్పుడు మరికొన్ని పదాలను గురు, లఘువులుగా గుర్తిద్దాము.

U I   I I I   U I I   U U U<br>
రాజు, జనులు, పాలన, సంతోషం.

పై వాటిలో కొన్నింటికి కేవలం లఘువులే వచ్చాయి. కొన్నింటికి కేవలం గురువులే వచ్చాయి. మరికొన్నింటికి గురువు, లఘువులు కలిసి వచ్చాయి కదా! ఇలా రావడాన్ని 'గణము' అంటారు. 'గణము' అంటే 'గుంపు' అని సామాన్యార్థము. కాని ఛందస్సు దృష్టిలో అక్షరాల గుంపుకే 'గణము' అని పేరు.

గణములలో మూడక్షరముల గణములు ఎనిమిది ఉంటాయి. రెండక్షరముల గణములు నాలుగు ఉంటాయి. మొదట మూడక్షరముల గణముల గూర్చి తెలుసుకొందాము. కింది పదాలను గురు లఘువులుగా గుర్తిద్దాము. అవి ఏ వరుసలో వస్తే ఏ గణమవుతుందో తెలుసుకొందాము.

U U U

1.. శ్రీరామా – మ గణము

U I I

2. పాటలు – భ గణము

I U I

3. పసందు – జ గణము

I I U

4. భయమా – స గణము

I U U

5.. ఇదంతా – య గణము

U I U

6. తీపిగా – ర గణము


U U I

7. పాతాలు – త గణము

I I I

8. సులువు – న గణము

ఏ గణములో గురు లఘువుల క్రమం ఎట్లా వస్తుందో సులభంగా గుర్తుంచుకోవడానికి ఇలా చేద్దాం.




దీనిని 'యమాతారాజభానస' అని గుర్తుపెట్టుకొందాం. ఇప్పుడు ఇందులో ఏ గణం కావలసివస్తే దాని నుండి రెండింటివరకు లెక్కిస్తే సరిపోతుంది. ఉదా : పై చక్రంలో మగణం అంటే మాతారా – U U U , జగణం అంటే, జభాన – I U I, నగణం అంటే నసయ – I I I... ఇలా ఆ క్రమంలో మూడింటిగా లెక్కిస్తే సులభంగా గుర్తించవచ్చు.

ఇక రెండక్షరాల గణాలు నాలుగు

U U
1.. నీ లో – "గ గ" ము

U I
2. మం చి – హ గణము

I U
3. గు ణం – వ గణము

I I
4. క ల – "లల"ము

గణముల గురించి తెలుసుకొన్నారు కదా! కింది పదాలు ఏ గణమో గుర్తించండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆటలు | ఆరోగ్యం | చదువు | సమయం | విధానం | నీరు |
| కాపాడు | ఇలాగే | చేయుమా | నీకే | సుఖం | |

## III. వ్యక్తీకరణ – సృజనాత్మకత

### స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) బమ్మెర పోతన గురించి తెలుపండి.

ఆ) బాధలో ఉన్నవారి పట్ల ప్రభువులు ఎలా ప్రవర్తించాలి?

ఇ) 'పరహితమె పరమ ధర్మము' అనడంలో ఉద్దేశమేమిటి?

ఈ) ఈ పాఠానికి 'లోక రక్షణము' అన్న పేరు ఎలా తగినదో తెలియజేయండి.

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) 'లోక రక్షణము' పాఠ్య సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

ఆ) ఈ పాఠం ద్వారా మీరేమి గ్రహించారు?

### సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

అ) 'లోక రక్షణము' పాఠాన్ని సంభాషణగా మార్చి రాయండి.

ఆ) శివుని గొప్పదనాన్ని కీర్తిస్తూ వచన కవిత / గేయం రాయండి.

**సూక్తి**

పరోపకారార్థ మిదం శరీరమ్.

– ఆర్యోక్తి

# 2 సత్యనిష్ఠ

– గౌరన

## కవి పరిచయం



15వ శతాబ్దం

పాల్కురికి సోమనాథుని తరువాత ద్విపదలో కావ్యాన్ని రచించిన కవులలో గౌరన ప్రసిద్ధుడు. తల్లి పోచాంబ, తండ్రి అయ్యలుడు. (అయ్యలుమంత్రి). హరిశ్చంద్రోపాఖ్యానము, నవనాథ చరిత్ర అనే ద్విపద కావ్యాలను, సంస్కృతంలో 'లక్షణ దీపిక' అనే ఛందోగ్రంథాన్ని రాశాడు.

ద్వైత వనంలో మార్కండేయుడు ధర్మరాజుకు హరిశ్చంద్రుని కథ చెప్పినట్లుగా, స్కాంద పురాణాన్ని అనుసరిస్తూ స్వతంత్ర కల్పనతో గౌరన హరిశ్చంద్రోపాఖ్యానం రాశాడు.

ప్రస్తుత పాఠ్యాంశం హరిశ్చంద్రోపాఖ్యానంలోని ద్వితీయ భాగం నుండి గ్రహించబడింది. ఈ పాఠ్యాంశం ద్విపద ప్రక్రియకు చెందింది.

## నేపథ్యం, ఉద్దేశం

దేవలోకంలో విశ్వామిత్రుడు, వశిష్ఠుడికి మధ్య భూలోకంలో సత్యనిష్ఠ కలిగిన హరిశ్చంద్రుని విషయంలో వాగ్వివాదం చోటుచేసుకుంటుంది. వశిష్ఠుడు సత్యవ్రతుడిగా కీర్తిస్తున్న హరిశ్చంద్రునితో అబద్ధం చెప్పిస్తానని శపథం చేస్తాడు విశ్వామిత్రుడు.

ఒకసారి వేటకు వచ్చిన హరిశ్చంద్రుడు విశ్వామిత్రుడి మాయావలయంలో చిక్కుకుంటాడు. అక్కడ హరిశ్చంద్రుడు తనపై పడుతున్న మాతంగ కన్యలను శిక్షించడంతో విశ్వామిత్రుడు అతడిని రాజ్యభ్రష్టునిగా చేస్తాడు.

హరిశ్చంద్రుడు తన సర్వస్వం కౌశికునికి అప్పగించినప్పటికీ మరింత ధనం కావాలని కోరుతాడు. తన భార్య చంద్రమతీ దేవి, కుమారుడు లోహితుడిని కాశీపట్టణంలో అమ్మి, తాను కూడా అమ్ముడుపోతాడు హరిశ్చంద్రుడు. పాముకాటుకు గురై చనిపోయిన లోహితుడిని శ్మశానానికి తీసుకువస్తుంది చంద్రమతి. వారిని గుర్తుపట్టినప్పటికీ 'సుంకము' ఇవ్వకుంటే దహన క్రియలు చేయలేనంటాడు కాటికాపరిగా ఉన్న హరిశ్చంద్రుడు.

ఆ ధనం కోసం ఆమె వెళుతుండగా రాజకుమారుడిని చంపిందని మరణశిక్ష పొందుతుంది. శిక్ష అమలుకై వధ్యశిల దగ్గరకు తీసుకెళ్ళగా హరిశ్చంద్రుడు ఆ పనికి సిద్ధపడతాడు.

అతడి సత్యనిష్ఠను, సడలని చిత్తశుద్ధిని చూసి విశ్వామిత్రుడు మెచ్చుకుంటాడు. ఇంతలో శివపార్వతులు సకల దేవతలు వచ్చి చంద్రమతి శిక్షను ఆపుతారు.

ఎన్ని కష్టాలు వచ్చినా సత్యనిష్ఠను వదలకూడదని, సత్యవాక్కు మానవుడిని అన్నివేళలా కాపాడుతుందని హరిశ్చంద్రుని కథ బోధిస్తుంది. మనిషి కష్టాలు వచ్చినప్పుడు నీతి, నిజాయితీ సత్యమార్గాలను వీడుతాడు. అలా వీడకూడదని బోధించడం ఈ పాఠం ఉద్దేశం.

## I

తలఁ దెంపుమని తెంపు దలకోనఁ బలికి
జలజాక్షి తన చీర చక్క నమర్చి
ప్రాణేశు వలగొని పదముల కెరగి
పాణిపల్లవములు భక్తితో మొగిచి. 1

యనుదిన రక్తపంకారుణం బగుచుఁ
గనుపట్టి జేవురుగట్టు చందమున
నున్న యా వధ్య శిలోపరిస్థలిని
జెన్నారి చిఱునవ్వు సెలవిఁ దళుకొత్తఁ. 2

బద్మాసనంబున బడఁతి గూర్చుండి
పద్మినీ వల్లభు పైఁ జూడ్కి నిలిపి
"లోకలోచన! సర్వలోకైక వంద్య!
నాకు వేవేల జన్మంబుల యందు. 3

సతత పుణ్యుని హరిశ్చంద్రభూవిభుని
బతిగా నొనర్పుమీ! పార్థివేశ్వరుని
యాపద లన్నియు నడఁచి సత్యంబు
దీపింపఁజేయు మీ తెఱఁగున" ననుచు. 4

వినయంబు నెక్కొన వేఁడి చిత్తంబు
తన పతిపైఁ జేర్చి, తలఁపొందు లేక
యున్నంత బంధంబు లూడ్చి పో వైచి
యన్న రేంద్రుఁడు జగదాశ్చర్య మెసఁగ. 5

శాత ధారాభీల చటుల ఖడ్గంబు
భూతముల్ భీతిల్ల ముష్టి నమర్చి
జళిపించి జీవితేశ్వరి మెడ మోపి
కలఁగక తెగవేయ గమకించునంత. 6

గ్రమ్మఱ నెడసొచ్చి ఖడ్గంబుఁ బట్టి
యమ్మనుజేశుతో ననియెఁ గౌశికుడు
"చాలు నోహో! యిట్టి సాహస కృత్య
మేల కై కొంటి నరేశ్వర! నిన్ను. 7

వీక్షింప దోషంబు వివరింప మనుజ
రాక్షసుండవు గాక రాజువా నీవు?
క్రమమున ధర్మార్థ కామ మోక్షములు
నమర నీకీఁ దగునట్టి యీ సాధ్వి. 8

జనసుత సౌందర్య సంశోభితాంగి
నినుపముల్కికి నేల యీఁ దలంచెదవు?
భువన విఖ్యాతమై పొలుపొందునట్టి
రవి వంశమునఁ బుట్టి రాజసం బుడిగి. 9

బతిమాలి పెనుమాల బందివై నీచు
గతిఁగాడు గాచు నీ కష్టంబు దగునె
కులసతి తలఁ దెగఁగొట్టి యే లోక
ముల కేగి సౌఖ్యంబు పొందఁ జూచెదవొ. 10

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. చంద్రమతి ఏమని కోరుకుంది?
2. కౌశికుడు హరిశ్చంద్రుడితో ఏమని పలికాదు?

## II

యాలికై దక్షుని నడఁపఁడే శివుఁడు
పోలింప నీ కంటె బుద్ధిహీనుండె?
సతిలేని గృహమేల? సౌఖ్యంబులేల?
సతిలేని సుతులేల? సంపదలేల? 11

సతియుఁ గల్గినఁ గల్గు సకల ధర్మములు
సతియుఁ గల్గినఁ గల్గు సకల పుణ్యములు
అటుగాన విడువు మీ యాగ్రహబుద్ధిఁ
గట గటా! నీ వివేకం బెందుఁబోయె 12

నామాటఁ గైకొని నా కుమారితల
నా మాలమగువల నర్థి వర్తింపు
నీ సుతు ప్రాణంబు నీ రాజ్య సుఖము
నీ సతితో – బొందు నీ తొంటి పెంపుఁ 13

బడయు మీవింక నీ వదును దప్పినను
గడపట నీవు తెక్కలి జత్తువనుచుఁ
బెక్కు చందంబులఁ బ్రియమును భయము
నెక్క బోధించు మునీంద్రునిఁ జూచి 14

పకపక నవ్వి యీ భవసాగరంబు
నొకదరిఁజేర్పుచు నున్నాఁడు శివుఁడె
మును నీవు చెప్పిన బుద్ధులే కాక
వినఁ గ్రొత్తలే యివి వివరించి చూడ 15

సుతునొల్ల సతినొల్ల సురలోక మొల్ల
బతిమాలి నీవిచ్చు పడఁతుల నొల్ల
సత్యంబుఁ గలిగిన జాలు వే యేల?
సత్యమే జయమని చాటు వేదములు 16

విడువు ఖడ్గం బింక వేంచేయు మిట్టి
యెడ నుండఁ జనదు మునీశ! నీవింక
నావుడు వెఱఁ గంది నరలోక నాథు
పావన సత్య సంపద కాత్మనలరి 17

బొంకించు నాసలఁ బోవీడి మౌని
పొంకంబు చెడి తలపోయుచు నుండె
నప్పుడు దేవత లంబర వీథి
నుప్పొంగు వేడ్కల నువిదలుఁ దారు 18

బహు రత్న దీప్తుల భాసిలుచున్న
మహనీయ దివ్య విమానంబు లెక్కి
వెఱగంది క్రందుగా వీక్షించుచుండ
నెస దెంపుమై దారుణీతలేశ్వరుఁడు 19

ఖిదురంబు కంటెను బెడిదమై చదల
నదరులు సెదర భయంకర లీల
వాలువాలెత్తి యా వామాక్షి కంఠ
నాళంబు తెగవేయ నది చుఱుక్కనఁగఁ 20
దాకిఁన వ్రేటు పూదండయై చెన్నుఁ
గైకొని పూఁబోడి గళమున నుండె. 21

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. చంద్రమతి గొప్పతనాన్ని వివరించండి.
2. హరిశ్చంద్రుడు కౌశికునితో ఏమన్నాడు?

## తాత్పర్యాలు

1. వధ్యశిల మీదకి వచ్చిన చంద్రమతి తన భర్తకు ప్రదక్షిణ చేసి తన చిగురుల వంటి చేతులతో నమస్కరించింది.
2. ఆ వధ్యశిల బురదతో ఎర్రగా, చిన్న కొండలా ఉంది. ఆ శిలపై కూర్చుని చంద్రమతి చిరునవ్వుతో ఇలా అన్నది.
3. ఓ సూర్యుడా! నీవు లోకాలకు కన్నుల వంటివాడివి, లోకాలు అన్నీ మొక్కదగిన వాడివి. నాకు వేల వేల జన్మాలలోనూ ఈ పతినే పొందేట్టు చేయి.
4. ఎప్పుడూ మంచి పుణ్యకార్యాలను చేసే హరిశ్చంద్రుడినే భర్తగా ఇవ్వు. ఆ రాజులకు రాజైన ఆ హరిశ్చంద్రుడి ఆపదలన్నీ తొలగిపోయి ప్రకాశించేట్లు చూడు.
5. హరిశ్చంద్రుడు, అక్కడున్న వారు చూస్తుండగా చంద్రమతి తన భర్తపై మనసు లగ్నం చేసి తనను వధించమన్నది.
6. అప్పుడు (హరిశ్చంద్రుడు) పదునైన అంచులతో ఉన్న కత్తిని తీసుకుని అక్కడున్న వారందరూ భయపడేటట్లు తన భార్యను చంపడానికి వచ్చాడు.
7. అది చూసి కౌశికుడు అడ్డంగా నిలబడి కత్తిని పట్టుకుని ఈ సాహస కృత్యం చాలు. ఓ రాజా! ఎందుకు ఈ పనికి పూనుకున్నావు అని అడిగాడు.
8. నిన్ను చూస్తే నీ లోపాలు నీకు చెప్పబుద్ధి అవుతున్నది. నువ్వు మనిషి రూపంలో కనిపించే రాక్షసుడివి. ఆమె (చంద్రమతి) ధర్మ అర్థ కామ మోక్షాలు అన్నీ ఉన్న సాధ్వి.
9. ప్రజలంతా పొగిడే అందం, ధైర్యం, స్థైర్యం, సూర్యవంశ రాజసం కలిగిన స్త్రీ ఆమె.
10. నువ్వు ఆ మాల వనితలను బతిమాలితే కాటికాపరి పని నుంచీ తప్పించుకునే వాడివి. బందీగా వచ్చిన నీకు ఈ శ్మశానం కావలి ఎందుకు? భార్య అయిన ఆమె తల తెగగొట్టి ఏ లోకాలకు వెళ్తావు. ఏ సౌఖ్యాలను పొందుతావు.

11. శివుడు తన భార్య పార్వతి కోసం దక్షుడిని అణచి వేయలేదా? అతడు నీకంటే బుద్ధిలేనివాడా? భార్య లేని ఇల్లు, సుఖాలు ఎందుకు నీకు? భార్య లేకుండా పిల్లలెందుకు? సంపదలెందుకు?

12. భార్య ఉంటేనె అన్ని ధర్మాలు పొందవచ్చు. భార్య ఉంటేనే సకల పుణ్యాలు కలుగుతాయి. అందువల్ల ఈ కోపాన్ని వదులు. కోపంలో నీ వివేకం ఎక్కడికి పోయింది.

13. నా మాటవిని నా కుమార్తెలైన వనితలను వేడుకో. నీ కొడుకు ప్రాణం, రాజ్యసుఖం, భార్యతో జీవితం, రాజుగా మునుపటి గౌరవం పొందవచ్చు.

14. నీవిప్పుడు సమయం తప్పితే మోసం వలన చస్తావు అని భయం, ప్రేమ కలిగే మాటలను కౌశికుడు చెప్పాడు. అప్పుడు హరిశ్చంద్రుడు ఇలా అన్నాడు.

15. సంసారం అనే సముద్రంలో ఈదుతున్న వారిని ఒడ్డుకు చేర్చేవాడు శివుడే. ఇప్పుడు నువ్వు చెప్పిన మాటలన్నీ ఆలోచించి చూస్తే కొత్తవేమీ కాదు.

16. నాకు సుతుడు, సతీ, దేవలోకాలు వద్దు. నీవు ఇస్తానన్న స్త్రీలు వద్దు. సత్యం ఒక్కటి ఉంటే చాలు. వేరేమీ వద్దు. సత్యమే జయాన్ని కలిగిస్తుందని వేదాలు ఘోషిస్తున్నాయి.

17. తన చేతిలో ఉన్న ఖడ్గాన్ని వదలమని చెప్పి మునీంద్రా ఇటువంటి చోట నీవు ఉండడం తగదు అన్నాడు. ఈ మాటలకు హరిశ్చంద్రుడి నిర్మలమైన సత్యనిష్ఠకు సంతోషించాడు కౌశికుడు.

18. హరిశ్చంద్రుడితో అబద్ధం చెప్పించాలన్న కౌశికుడి కోరిక వీగిపోయింది. అంతలో దేవతలు ఆకాశ వీధిలో వేడుకలతో వచ్చారు.

19. ఆకాశవీధి నుంచి దేవతలంతా ఒక గొప్ప దివ్య విమానం ఎక్కి ఆశ్చర్యంతో సంపూర్ణమైన ధైర్యంతో ఆ హరిశ్చంద్ర మహారాజును చూస్తున్నారు.

20. అప్పుడు హరిశ్చంద్రుడు ఆకాశంలో మిరుమిట్లు గొలుపుతున్నట్లున్న, వజ్రాయుధం కంటె కఠినమైన కత్తితో ఆ చంద్రమతి మెడ తెగనరకడానికి తాకాడు.

21. అప్పుడు ఆ కత్తి పూల దండగా మారి ఆ చంద్రమతి మెడలో చేరింది.

## సారాంశం

చంద్రమతి తన తలను తెంపమని హరిశ్చంద్రుడికి ప్రదక్షిణచేసి నమస్కరించి ధైర్యంగా ఇలా చెప్పింది. ప్రతి రోజు నెత్తుటి బురదతో ఉండే ఈ రాతిశిలపై పద్మాసనంవేసి కూర్చుని, సూర్యుడికి నమస్కరించి సత్యం వ్రతంగాగల హరిశ్చంద్రుడినే భర్తగా ఇవ్వు. అతడి ఆపదలన్నీ తొలగించి ప్రకాశవంతుడిని చేయమని వినయంగా స్థిరంగా ప్రార్థించింది. అప్పుడు హరిశ్చంద్రుడు ఆమెను వధించడానికి ఖడ్గాన్ని ఎత్తగా కౌశికుడు వచ్చి అతడిని ఆపి

ఈ పనికి ఎందుకు పూనుకున్నావు? నీవు మనిషిగా కనిపించే రాక్షసుడివి. రాజువా నీవు? ఆమె ధర్మార్థ కామ మోక్షాలు అమరే విధంగా నీతో జీవించిన సాధ్వి. జనులచేత, లోకంచేత పొగడబడిన రాజసం కలిగిన సూర్యవంశ స్త్రీ. నీ భార్య అయిన ఆమె తల తెగగొట్టి ఎలా సుఖంగా ఉండగలవు?

భార్య కోసం శివుడు దక్షుడిని అణచివేసాడు. అతడు నీకంటే బుద్ధిహీనుడు కాదు కదా. భార్యలేని ఇల్లు, సుఖాలు, పిల్లలు, సంపదలెందుకు? భార్య ఉంటేనే అన్ని ధర్మాలు అనుసరించవచ్చు. పుణ్యాలు కలుగుతాయి. అందువల్ల నీ కోపాన్ని వదిలేయి. నా మాటవిని నా కుమార్తెలైన ఆ మగువలను వేడుకొని నీ సుతుడి ప్రాణం, నీ రాజ్య సుఖం, నీ భార్యతో మునుపటి జీవనం, గౌరవం పొందు. నీవు ఈ సమయాన్ని వదిలితే వంచనతో చస్తావు అని భయాన్ని ప్రీతిని కలిగించే విధంగా మాట్లాడుతున్న కౌశికుడిని చూసి పక పక నవ్వి హరిశ్చంద్రుడు "ఈ సంసార సాగరంలో ఈదుతున్నవారిని ఒక దరికి చేర్చేవాడు శివుడే. ఇప్పుడు నీవు చెప్పిన మాటలేవీ కొత్తవికావు. సుతుడు, సతీ ఎవరూ వద్దు సత్యమొక్కటే చాలు. అదే అన్ని ధర్మాలకు మూలమని వేదాలు చెబుతున్నాయి. అని హరిశ్చంద్రుడు ఖడ్గమెత్తి చంద్రమతి మెడపై తగిలేట్టు కొట్టగా అది పూలదండగా మారి ఆమెను అలంకరించింది.

## పాఠ్యాంశ అన్వయం

ప్రాణం మీదికి వచ్చినా పట్టు వదలకుండా సత్యం వైపే నిలబడిన హరిశ్చంద్రుడి కథను చదివారు కదా!

ఒక మనిషి తప్పుదారి పట్టడానికి ఒక్కొక్కసారి దారిద్ర్యం కారణం అవుతుంది. తాను స్థిరంగా నిలబడడానికి తగిన ధనం నీతిగా, నిజాయితీగా మరో వ్యక్తిపై ఆధారపడకుండా జీవించడానికి అవసరమైన మనోనిబ్బరం మనుషులకు ఉండాలి. అప్పుచేసి తిరిగి ఇవ్వకుండా పారిపోయేవారు, ఆ అప్పుల బాధలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకునేవారు లోకంలో మనకు కనిపిస్తారు. అందుకు భిన్నంగా హరిశ్చంద్రుడి ప్రవర్తన కనిపిస్తుంది. విశ్వామిత్రుడి ఋణాన్ని తీర్చడానికి భార్యను, కొడుకును, తనను అమ్ముకున్నాడు. అనేక కష్టాలు పడ్డాడు. కాటికాపరి అయ్యాడు. అక్కడ కూడా తన పనిని దైవంగా భావించాడు. ఒక్క అబద్ధం ఆడితే తనకు కావలసినవన్నీ మరల దొరికే పరిస్థితి ఉన్నా నీతిని సత్యాన్ని వదలలేదు. అటువంటి దృఢ సంకల్పం వల్ల హరిశ్చంద్రుడు మళ్ళీ తన రాజ్యం, భార్య, పుత్రులను పొందాడు.

సమస్య వచ్చినప్పుడే మరింత ధైర్యంగా, మనో నిబ్బరంతో ఉండాలని, సత్యనిష్ఠ కలిగిన వ్యక్తికి ప్రకృతి సహకరిస్తుందని హరిశ్చంద్రుడి కథ బోధిస్తున్నది. సత్సంకల్పం, సత్యనిష్ఠకు సమస్త జగత్తూ సహకరిస్తుంది. సత్యనిష్ఠకు సమస్తమూ అనుకూలమవుతుంది.

# భాషా సామర్థ్యాలను సాధిద్దాం

## I. అవగాహన - ప్రతిస్పందన

**1. ఈ కింది పద్యాన్ని చదువండి. దాని ఆధారంగా ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు గుర్తించండి.**

ఆలికై దక్షుని నడపడే శివుడు
పోలింప నీకంటె బుద్ధి హీనుండె
సతిలేని గృహమేల? సౌఖ్యంబులేల?
సతిలేని సుతులేల? సంపదలేల?

అ) ఆలి అంటే ( )

ఎ) అక్క    బి) చెల్లెలు    సి) భార్య    డి) తల్లి

ఆ) సుతుడు అంటే ( )

ఎ) తండ్రి    బి) కొడుకు    సి) తాత    డి) భర్త

ఇ) అడపడే అర్థం ఏమిటి? ( )

ఎ) నశించి వేయడా?    బి) తొక్కేయడా?

సి) అణచివేయడా?    డి) ముంచివేయడా?

ఈ) బుద్ధిహీనుడు విగ్రహవాక్యం. ( )

ఎ) బుద్ధిచేత హీనుడు    బి) బుద్ధి కొరకు హీనుడు

సి) బుద్ధి యొక్క హీనుడు    డి) బుద్ధి కంటె హీనుడు

ఉ) దక్షుడు ఎవరు? ( )

ఎ) పార్వతి తండ్రి    బి) శివుడి శత్రువు

సి) పార్వతి అన్న    డి) శివుడి మిత్రుడు

## II. భాషాంశాలు

### పదజాలం

**1. కింది వాక్యాలలో పర్యాయ పదాలను గుర్తించి రాయండి.**

అ) ఉదా: ప్రాణేశుడు ప్రియసఖుడు. భర్త భార్య మనసు ఎరిగి ప్రవర్తించాలి. మొగుడు పెండ్లము కలిసి మెలిసి మెలగాలి.

ప్రాణేశుడు - భర్త - మొగుడు

ఆ) పద్మాసనంలో పడతి కూర్చుంది. పూబోడి మెడలో పుష్పమాల.

_______________, _______________

ఇ) నీ సతితో కలిసి ఉండు. ఆలి కొరకు దక్షుని శివుడు అణచాడు. భార్య భర్త పరస్పర గౌరవం కలిగి ఉండాలి.

_______________, _______________, _______________

ఈ) కమలాక్షి అయిన కాంత. పద్మ ఆసనంలో కూర్చొండి. సరస్సు నుంచి సరోజములు పుట్టాయి.

_______________, _______________, _______________

ఉ) రాజు రాజ్యాన్ని పాలిస్తాడు. భూమీశుడు భూమిని రక్షిస్తాడు. భూపతి భువిని ఏలుతాడు.

_______________, _______________, _______________

**2. పదాలకు అర్థాలు ఇవ్వబడ్డాయి. వాటితో సొంతవాక్యాలు రాయండి.**

ఉదా : రవి = సూర్యుడు. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు.

అ) పద్మినీవల్లభుడు = సూర్యుడు; _______________

ఆ) సాగరము = సముద్రం; _______________

ఇ) ఉవిదలు = స్త్రీలు; _______________

ఈ) పొలుపు = స్థైర్యం; _______________

ఉ) అంబరవీధి = ఆకాశం; _______________

**3. 'సత్యనిష్ఠ' పాఠంలోని కొన్ని పదాలు కింది పట్టికలో దాగి ఉన్నాయి. వాటిని గుర్తించి రాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| బు | ద్ధి | స | త్యం | ర |
| ల | ప | తి | డ | ప |
| చీ | ర | మ | శి | క |
| క | ల | ద్ర | వు | ప |
| ర | వి | చం | డు | క |

_______________, _______________, _______________, _______________

_______________, _______________, _______________, _______________

_______________, _______________

## భాషా క్రీడ

**4. కింది పదాలలో ఆ విషయానికి సంబంధించని పదాన్ని గుర్తించండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | అ) హరిశ్చంద్రుడు | ఆ) లోహితుడు | ఇ) శ్రీరాముడు | ఈ) చంద్రమతి | (   ) |
| 2. | అ) రాజు | ఆ) రాజ్యము | ఇ) పరిపాలన | ఈ) శ్మశానము | (   ) |
| 3. | అ) సత్యము | ఆ) హరిశ్చంద్రుడు | ఇ) హింస | ఈ) ధర్మము | (   ) |
| 4. | అ) ఉవిద | ఆ) స్త్రీ | ఇ) మగువ | ఈ) మగడు | (   ) |
| 5. | అ) గౌరన | ఆ) నవనాథ చరిత్ర | ఇ) భాగవతము | ఈ) లక్షణ దీపిక | (   ) |

## వ్యాకరణాంశాలు

**ఉత్పలమాల :**

**ఈ కింది పద్య పాదాలను పరిశీలించండి.**

భ     ర     న     భ     భ     ర     వ

U I I   U I U   I I I   U I I   U I I   U I U   U U

పుట్టిన I దేడ భూ I వలయ I భూతి వి I వర్ధన I సౌఖ్య రా I శులన్

భ     ర     న     భ     భ     ర     వ

మెట్టిన I వారికై I తమకు I మేలొక I యించుక I నెంచకుం I డ ని

ట్టట్టని I లేకసం I సరణ I యందభి I మానము I కల్గియుం I డినన్

గట్టిని I బద్ధజీ I వనము I గాసరి I లేనియ I శస్సుసై I నికా

పై పద్య పాదాలలోని గణాలను పరిశీలిస్తే

ఈ పద్యం ప్రతి పాదంలోను భ, ర, న, భ, భ, ర, వ అన్న గణాలు ఉన్నాయని తెలుస్తుంది. ఇది ఉత్పలమాల పద్యలక్షణం. ప్రాస అక్షరంగా ట్టి / ట్ట అనే హల్లులున్నాయి. యతి స్థానంలో పు – భూ, మె – మే, గ – గా అనే అక్షరాలున్నాయి. 20 అక్షరాలు ప్రతి పాదంలోనూ ఉన్నాయి.

**ఉత్పలమాల పద్య లక్షణాలు :**

1. ఇది వృత్త పద్యం.
2. పద్యంలో నాలుగు పాదాలుంటాయి.
3. ప్రతి పాదంలో భ, ర, న, భ, భ, ర, వ గణాలుంటాయి.
4. ప్రతి పాదంలో 10వ అక్షరం యతిస్థానం.
5. ప్రాస నియమం ఉంటుంది.
6. ప్రతి పాదంలో 20 అక్షరాలుంటాయి.

**కింది పద్యాలకు గణ విభజన చేసి ఏ పద్య పాదాలో గుర్తించి రాయండి.**

- ఆపురి బాయకుండు మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి భా
  షాపరశేష భోగి వివిధా ధ్వర నిర్మల ధర్మ కర్మ దీ
- శ్రీరమణీ ముఖాంబురుహ సేవన షట్పద నాదయంచు శృం
  గార రమేశయంచు ధృత కౌస్తుభ యంచు భరేఫనంబులన్

## III. వ్యక్తీకరణ – సృజనాత్మకత

### స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) గౌరన కవి గురించి తెల్పండి.

ఆ) పాఠం ఆధారంగా చంద్రమతి పాత్ర స్వభావాన్ని తెల్పండి.

ఇ) కౌశికుని మాటల సారాంశాన్ని రాయండి.

ఈ) పాఠం ఆధారంగా సత్యం విలువను తెల్పండి.

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) సత్య నిష్ఠ పాఠం సారాంశాన్ని వివరించండి.

ఆ) సత్యనిష్ఠ పాఠం బోధించిన నీతిని వివరించండి.

### సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

అ) ఒక సన్నివేశం ఆధారంగా సత్యం విలువను కథగా రాయండి.

ఆ) హరిశ్చంద్రుడు, విశ్వామిత్రుడు పాత్రలపై ఒక కవిత / గేయం రాయండి.

### సూక్తి

సత్యమేవ జయతే

సత్యము సార్వజనీనము

# 3 శతక పద్యాలు

– శతక కవులు

## కవుల పరిచయం



13వ శతాబ్దం

1. **సుమతి శతకం – బద్దెన :** వేములవాడ చాళుక్య రాజు భద్రభూపాలుడే 'బద్దెన' అని చరిత్రకారుల అభిప్రాయం. నీతిశాస్త్ర ముక్తావళి ఈయన మరో రచన. తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధమైన శతకాలలో సుమతి శతకం ఒకటి. సుమతి శతకంలో పద్యాలు అకారాది క్రమంలో ఉన్నాయి. ఈ పద్ధతికి 'బద్దెన' మొదటివాడు. ఇది కందపద్య శతకం. సుమతీ! అనే మకుటంతో ఈ శతకంలోని పద్యాలు ఉంటాయి.



17వ శతాబ్దం

2. **దాశరథీ శతకం – కంచెర్ల గోపన్న :** భద్రాచల రామదాసు పేరుతో ఈయన ప్రసిద్ధుడు. ఈయన దాశరథీ శతకంతోపాటు అనేక సంకీర్తనలను రాశాడు. ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లె కంచెర్ల గోపన్న స్వగ్రామం. కామాంబ, లింగనమంత్రి తల్లిదండ్రులు. భద్రాచల తహసీలుదారుగా పనిచేసిన రామదాసు అక్కడ ఆలయనిర్మాణం చేశాడు. భక్తి శతకాలలో దాశరథీ శతకం ఎంతో ప్రాచుర్యం పొందింది. ఇందులోని పద్యాలు చంపకాలు, ఉత్పలాలు. దాశరథీ! కరుణాపయోనిధీ! అనేది ఈ శతకంలోని మకుటం.



18వ శతాబ్దం

3. **సుభాషిత రత్నావళి – ఏనుగు లక్ష్మణ కవి :** భర్తృహరి సంస్కృతంలో రాసిన 'సుభాషిత త్రిశతి'ని 'సుభాషిత రత్నావళి' పేరుతో తెలుగులోకి అనువదించిన కవులలో ఏనుగు లక్ష్మణకవి ఒకడు. రామేశ్వర మహాత్మ్యము, విశ్వామిత్ర చరిత్ర, సూర్య శతకము, రామవిలాసము మొ॥నవి ఆయన ఇతర రచనలు. మనోహరంగా, యథామూలంగా, సందర్భ, సముచిత శైలిలో కవి హృదయాన్ని అర్థం చేసుకొని సాగించిన ఈ అనువాదంలోని అనేక పద్యాలు రసవంతంగా ఉన్నాయి. అటు పండితులను, ఇటు పామరులను ఈ రచన ఎంతో ఆకట్టుకున్నది. అనేక ఛందస్సుల ప్రయోగం ఈ శతకంలో కనిపిస్తుంది.



18వ శతాబ్దం

4. **గువ్వలచెన్న శతకం – గువ్వల చెన్నడు :** లోకనీతిని, రీతిని పరిశీలించి సామాజిక శ్రేయస్సును కాంక్షించి గువ్వల చెన్నడు ఈ శతకాన్ని రాశాడు. ఈ శతకంలో సాంఘిక దురాచారాలను, చెడ్డవారి ప్రవృత్తిని నిశితంగా ఆయన విమర్శించాడు. గువ్వల చెన్నడు 'ఆంధ్రప్రదేశ్'లోని వైఎస్ఆర్ జిల్లా రాయచోటి ప్రాంతానికి చెందినవాడు. ఇది కంద పద్య శతకం. గువ్వల చెన్నా! అనేది ఈ శతక మకుటం.



18వ శతాబ్దం

5. **నరసింహ శతకం – కాకుత్థ్సం శేషప్పకవి :** శేషప్ప మహాభక్తుడు. శ్రీ నరసింహస్వామికి తన జీవితాన్ని అంకితంచేసిన కవి. జగిత్యాల జిల్లాలోని ధర్మపురి ఆయన నివాసం. నృకేసరి శతకం ఆయన రచనలలో మొదటిది కాగా నరసింహ శతకం రెండవది. సామాన్యమైన భాషలో, చదివిన వారికి సులభంగా అర్థమయ్యేలా ఆయన శతక రచన కనబడుతుంది. పరిపూర్ణమైన భక్తి తత్పరతతో నరసింహ శతక రచన చేశాడు. ఇది సీసపద్య శతకం. "భూషణవికాస! శ్రీ ధర్మపుర నివాస! దుష్ట సంహార! నరసింహ! దురితదూర" ఈ శతక మకుటం



19వ శతాబ్దం

6. **జ్ఞానబోధిని – వరకవి సిద్దప్ప :** సిద్ధిపేట జిల్లా కోహెడ మండలం గుండారెడ్డిపల్లి ఈయన స్వగ్రామం. లక్ష్మమ్మ, పెద్ద రాజయ్య ఈయన తల్లిదండ్రులు. చిన్నతనం నుంచి సాహిత్యాభిలాషియైన సిద్దప్ప దాదాపు 40 గ్రంథాలు రాశాడు. సాహిత్యంతోపాటు ఆయుర్వేదం, వాస్తు, జ్యోతిషం, యోగ విద్యల్లో ఈయనకు మంచి ప్రవేశం ఉండేది. ఇది సీసపద్య శతకం. "వినుడి మాయప్ప సిద్దప్ప విహితుడప్ప, కనుడి కరమొప్ప కవికుప్ప కనకమప్ప" ఈ శతక మకుటం. 'జ్ఞానబోధిని' పేరుతో సంకలనం చేసిన గ్రంథం నుండి ప్రస్తుత పాఠ్యభాగం గ్రహించబడింది.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం శతక ప్రక్రియకు చెందింది. తెలుగు సాహిత్యంలో 'శతక' శాఖకు ఎంతో ప్రాధాన్యత ఉంది. పండితులను, పామరులను, పిల్లలను, పెద్దలను అందరినీ సమానంగా రంజింపచేసే శక్తి శతకానికుంది. క్రీ.శ. 12వ శతాబ్ది నుండి తెలుగులో మొదలైన శతకరచన నేటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నది. సాధారణంగా శతకంలోని ప్రతి పద్యం చివర సంబోధన ఉంటుంది. దానిని 'మకుటం' అంటారు. శతకాలకు సంఖ్యా నియమం, వృత్త నియమం కూడా ఉంటుంది. శతకాల్లోని పద్యాలు 'ముక్తకాలు'. అంటే ఏ పద్యానికాపద్యం స్వతంత్ర భావాన్ని కలిగి ఉంటుంది. శతకాలలో కవి తన ఆత్మానుభవాన్ని ప్రకటిస్తాడు. జనసామాన్యాన్ని విశేషంగా ఆకర్షించిన సుమతి శతకం, దాశరథీ శతకం, సుభాషిత రత్నావళి, గువ్వల చెన్న శతకం, నరసింహ శతకం, జ్ఞాన బోధిని – వరకవి సిద్దప్ప శతకాలలోని ఎంపిక చేసిన పద్యాలతో ఈ పాఠ్యభాగం రూపొందింది.

## నేపథ్యం, ఉద్దేశం

సమాజ పురోగతికి నీతి చాలా ముఖ్యం. నీతితో పాటు న్యాయాన్ని, ధర్మాన్ని, మంచి ప్రవర్తనను, భక్తిని, ముక్తిని, లోకం పోకడను, పెంపొందించుకోవాల్సిన మానవీయ విలువలను శతక పద్యాలు తెలుపుతాయి. మనిషి తన జీవితంలో పెంచుకునే గుణాలేవి? తుంచుకునే గుణాలేవి? వంటి ప్రశ్నలకు శతకాలు చక్కని సమాధానాలను ఇస్తాయి. భావిజీవితాన్ని తీర్చిదిద్దుతాయి. మంచి ప్రవర్తనను, ఉత్తమ విలువలను పెంపొందించుకొని సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులు తయారుకావడమే ఈ పాఠం ఉద్దేశం.

## I

✿ 1. కం॥ కమలములు నీట బాసిన
గమలాప్తుని రశ్మిసోకి కమలిన భంగిన్
దమతమ నెలవులు దప్పిన
దమ మిత్రులు శత్రులగుట తథ్యము సుమతీ!

***– సుమతి శతకం, బద్దెన***

✿ 2. కం॥ కూరిమిగల దినములలో
నేరములెన్నడును గలుగనేరవు మఱి యా
కూరిమి విరసంబైనను
నేరములే తోచుచుండు నిక్కము సుమతీ!

***– సుమతి శతకం, బద్దెన***

✿ 3. చం॥ సిరిగలనాడు మైమరచి, చిక్కిననాడు దలంచి పుణ్యముల్
పొరిబొరి జేయనైతినని పొక్కిన గల్గునె? గాలి చిచ్చుపై
కెరలినవేళ దప్పిగొని కీడ్పడువేళ, జలంబు గోరి త
త్తరమున ద్రవ్వినంగలవె? దాశరథీ కరుణాపయోనిధీ!

***– దాశరథీ శతకం, కంచర్ల గోపన్న***

✿ 4. ఉ॥ నోచిన తల్లిదండ్రికి దనూభవుడొక్కడె చాలు మేటి, చే
చాచని వాడు, వేరొకడు చాచిన లేదనకిచ్చువాడు, నో
రాచి నిజంబుకాని పలుకాడనివాడు, రణంబులోన మేన్
దాచనివాడు భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ!

***– దాశరథీ శతకం, కంచర్ల గోపన్న***

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. కమలములు ఎందుకు కమిలిపోయాయి? మిత్రుడు శత్రువుగా ఎప్పుడు మారుతాడు?
2. 'ఎవరైనా అడిగితే లేదనకుండా దానం చేయాలి' అనే అర్థం వచ్చే పద్య పాద భాగాన్ని గుర్తించండి. దాని కింద గీత గీయండి.

## II

✿ 5. తే॥ మొదల జూచిన గడుగొప్ప పిదప గుఱుచ,
యాది గొంచెము తర్వాత నధికమగుచు,
దనరు, దిన పూర్వ పరభాగ జనితమైన,
చాయపోలిక గుజన సజ్జనుల మైత్రి.

***– సుభాషిత రత్నావళి, ఏనుగు లక్ష్మణకవి***

✿ 6. చ॥ అతనికి వార్ధి కుల్యయగు, నగ్ని జలంబగు, మేరు శైలమం
చితశిలలీల నుండు, మద సింహము జింక తెఱంగు దాల్చు, గో
పిత ఫణి పూలదండ యగు, భీష్మ విషంబు సుధారసంబగున్,
క్షితి జనసమ్మతంబగు సుశీల మదెవ్వనియందు శోభిలున్.

***– సుభాషిత రత్నావళి, ఏనుగు లక్ష్మణకవి***

✿ 7. కం॥ కలిమిగల లోభికన్నను
విలసితమగు పేదమేలు వితరణియైనన్
జెలమైన మేలుకాదా?
కులనిధియంభోధికన్న గువ్వలచెన్నా!

***– గువ్వల చెన్న శతకం, గువ్వల చెన్నడు***

✿ 8. కం॥ కలకొలది ధర్మముండిన
గలిగినసిరి కదలకుండు గాసారమునన్
గలజలము మదుపులేమిని
గొల గొల గట్టు తెగిపోదే? గువ్వలచెన్నా!

***– గువ్వల చెన్న శతకం, గువ్వల చెన్నడు***

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. ఎవరి స్నేహాన్ని గూర్చి 'మొదల జూచిన గడు గొప్ప' అని కవి అన్నాడు?
2. ధర్మం లేకుంటే సంపద ఏమవుతుంది?

## III

9. సీ॥ సాధుసజ్జనులతో జగడమాడిన గీడు
కవులతో వైరంబు గాంచ గీడు
పరమదీనుల జిక్కబట్టి కొట్టిన గీడు
భిక్షుకులను దుఃఖపెట్ట గీడు
నిరుపేదలను జూచి నిందజేసిన గీడు
పుణ్యవంతుల దిట్ట బొసగు కీడు
సద్భక్తులను దిరస్కారమాడిన గీడు
గురుని ద్రవ్యము దోచుకొనిన గీడు

దుష్టకార్యము లొనరించు దుర్జనులకు
ఘనతరంబైన నరకంబు గట్టుముల్లె
భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

**– నరసింహ శతకం, కాకుత్థ్సం శేషప్పకవి**

10. సీ॥ కర్ణయుగ్మమున నీ కథలు సోకిన జాలు
పెద్దపోగుల జోళ్లు పెట్టినట్లు,
చేతులెత్తుచు బూజ జేయగల్గిన జాలు
దొరయగా కడియాలు దొడిగినట్లు,
మొనసి మస్తకముతో మ్రొక్క గల్గినజాలు
జెలువమైన తురాయి చెక్కినట్లు,
స్వరమునొవ్వంగ నీ స్మరణ గల్గిన జాలు
వింతగా గంఠీలు వేసినట్లు

పూని నిను గొల్చుటే సర్వభూషణంబు
లితర భూషణముల నిచ్ఛగింపనేల?
భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

**– నరసింహ శతకం, కాకుత్థ్సం శేషప్పకవి**

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. 'గురువు డబ్బును దొంగిలించరాదు' అనే అర్థం వచ్చే పద్య పాదం కింద గీత గీయండి.
2. కవి భావనలో చెవులకు ఆభరణాలు ఏవి?

## IV

11. సీ॥ విత్తంబు గలవారి కిత్తురే కుర్చీలు
పేదవారకివరు పీట చెక్క
కాలంబునొకరీతి గడవ దెల్లప్పుడును
యేనుగు దోమచే యెత్తబడద
నేనే బలియుడని నిక్కుచునుంటేమి?
చలిచీమలు ఫణుల జంపలేద!
నిడివి పొడవు దొడ్డు నెట్టిగ నుంటేమి?
గొడ్డలిచే మ్రాను కోలుపోద

బుద్ధిమంతులు పుణ్యపురుషార్థులైన
వారు పదిమందిలో ప్రజ్ఞ బలుకబోరు
వినుడి మాయప్ప సిద్ధప్ప విహితుడప్ప
కనుడి కరమొప్ప కవికుప్ప కనకమప్ప

**– జ్ఞానబోధిని, వరకవి సిద్ధప్ప**

12. సీ॥ కోపంబుచే నరుల్ క్రూరాత్ములగుదురు
కోపంబు మనుషుల కొంపముంచు
కోపంబు వలననె పాపంబులు హెచ్చు
కోపంబుననె నింద గూడవచ్చు
కోపంబు తన చావు కొంచెంబు నెరగదు
కోపంబు మిత్రులన్ కొంచపరచు
కోపంబు హెచ్చినన్ శాపంబులున్ వచ్చు
కోపంబు జూడగా నొరివియగును

కోపము నరుని సొంతము కూల్చును
లేదు వెదికిన యిటువంటి చేదుఫలము
వినుడి మాయప్ప సిద్ధప్ప విహితుడప్ప
కనుడి కరమొప్ప కవికుప్ప కనకమప్ప

**– జ్ఞానబోధిని, వరకవి సిద్ధప్ప**

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. బుద్ధిమంతుల లక్షణం ఏమిటి?
2. కోపం వలన మనిషికి ఏయే నష్టాలు వస్తాయి?

## తాత్పర్యాలు

1. మంచి బుద్ధి కలవాడా! కమలాలు తమ నివాసమైన నీటిని విడిచిపెట్టగానే సూర్యుని ఎండకు కమలిపోతాయి. అలాగే మానవులు తమ సొంతచోట్లను విడిచిపెడితే అంతకుముందున్న మిత్రులే శత్రువులవుతారు.

2. మంచి బుద్ధికలవాడా! ఒకరితో ఒకరు స్నేహంగా ఉన్న రోజులలో ఒకరిలోని తప్పులు మరొకరికి కనిపించవు. స్నేహం చెడిపోయినప్పుడు మాత్రం ఒకరిలో ఒకరికి అన్నీ తప్పులుగానే కనిపిస్తాయి. ఇది నిజం.

3. దశరథుని కుమారుడైన శ్రీరామా! దయాగుణానికి సముద్రం వంటివాడా! బాగా సంపద ఉన్నప్పుడు అన్నింటిని మరచిపోయి, దానిని కోల్పోయిన తర్వాత ఇతరులకు మేలుచేసే పనులను చేయకపోతినని బాధపడటం సరికాదు. విపరీతంగా మంట మండుతున్నప్పుడు లేదా బాగా దప్పిక వేస్తున్నప్పుడు అవసరమైన నీళ్ళకోసం బావిని తవ్వడం మొదలుపెట్టడంలో ఏమైనా అర్థం ఉందా? నీళ్ళు లభిస్తాయా? లభించవని భావం.

4. దశరథుని కుమారుడైన శ్రీరామా! దయాగుణానికి సముద్రం వంటివాడా! ఒకరిని యాచించనివాడు, ఇతరులు దానాన్ని కోరితే లేదనకుండా ఇచ్చేవాడు, నోరు తెరచి అబద్ధం చెప్పనివాడు, యుద్ధంలో వెన్నుచూపనివాడు అయినట్టి కుమారుడు ఒక్కడుంటే చాలు. అలాంటి కుమారుడున్న తల్లిదండ్రులు అదృష్టవంతులు.

5. చెడ్డవారితో స్నేహం ఉదయపు నీడలాగ మొదట్లో ఎక్కువగా ఉండి. రాను రాను క్షీణించిపోతుంది. మంచివారితో స్నేహం సాయంకాలం నీడలాగ మొదట్లో చిన్నగా మొదలై రానురాను పెరిగిపోతుంది. శాశ్వతంగా ఉండిపోతుంది.

6. మంచి స్వభావం ఉన్నవారికి సముద్రం కాలువలా కనబడుతుంది. వేడిని విరజిమ్మే అగ్ని జలమువలె చల్లగా మారిపోతుంది. ఎత్తైన మేరుపర్వతం చిన్నరాయివలె కనిపిస్తుంది. సింహం జింక అవుతుంది. పాము, పూలదండ అవుతుంది. విషము అమృతమవుతుంది.

7. ధనముబాగా ఉన్న పిసినారి కంటె దానగుణమున్న పేదవాడు ఎంతో మేలు. అపారమైన నీటి సంపద ఉన్న సముద్రం కంటె మంచినీరున్న బావి చాలా మేలు కదా!

8. మనలో ధర్మం ఉన్నంత కాలం సంపద కూడా స్థిరంగా ఉంటుంది. చెరువులో ఉన్న నీరు తూము లేకపోతే గట్టును తెంపేసి, గలగలా పారి బయటకు వెళుతుంది. అలాగే ధర్మం లేకుంటే సంపద కూడ ఉండదు.

9. నరసింహ స్వామీ! మంచివారితో కొట్లాడితే కీడు. కవులతో విరోధం పెట్టుకుంటే కీడు. అమాయకులను కొడితే కీడు. యాచకులను ఏడ్పిస్తే కీడు. నిరుపేదలను తిడితే కీడు. మంచి భక్తులను చులకనగా చూస్తే కీడు. గురువుల సొమ్మును దొంగిలిస్తే కీడు. ఇలాంటి పనులు చేసేవారికి నరకం తప్పదు.

10. నరసింహ స్వామీ! నీ కథలను వింటే చెవులకు పెద్ద దుద్దులజత పెట్టుకున్నట్లే. నిన్ను చేతులెత్తి పూజిస్తే చేతికి కడియాలు ధరించినట్లే. నీకు తలవంచి నమస్కరిస్తే తలపై తురాయి అలంకరించుకున్నట్లే. గొంతెత్తి నిన్ను తలచుకుంటే కంఠాభరణం వేసుకున్నట్లే. ఇష్టంతో, ప్రయత్నంతో నిన్ను సేవిస్తే అన్ని అలంకారాలు తాల్చినట్లుగానే భావిస్తాను. వేరే అలంకారాలతో పనిలేదు.

11. సమాజంలో డబ్బున్నవారిని కుర్చీలేసి కూర్చోబెడతారు. బీదవారికి పీట కూడ వేయరు. కాలము ఎప్పుడూ ఒకే మాదిరి ఉండదు. సందర్భం వచ్చినప్పుడు దోమ కూడ ఏనుగును ముప్పుతిప్పలు పెడుతుంది. నాకన్న బలవంతులు లేరని గర్వపడకూడదు. చీమల చేతిలో పాము మరణించిన విషయం తెలిసిందే కదా! చెట్టు ఎంత ఎత్తు, లావు ఉన్నప్పటికీ గొడ్డలి దెబ్బకు నేల కూలక తప్పదు. మంచి బుద్ధి ఉన్నవారు పదిమందిలో తమ ప్రావీణ్యతను, నైపుణ్యాన్ని, విజ్ఞానాన్ని ప్రదర్శించరు.

12. కోపం మనిషిని క్రూరంగా మారుస్తుంది. కోపం వలన మనిషి నాశనమవుతాడు. కోపం వలన పాపం పెరుగుతుంది. కోపం వలన నిందలు మోయాల్సి వస్తుంది. కోపం వలన ఒక్కోసారి చావుకూడ రావచ్చును. కోపం వలన మిత్రులు బాధపడవచ్చు. కోపం ఎక్కువైతే శాపాలు తప్పవు. కోపం మనిషిని మొత్తం పాడుచేస్తుంది. ఎంత వెతికినా ఇటువంటి 'చెడు' మరెక్కడా కనిపించదు.

## పాఠ్యాంశ అన్వయం

వ్యక్తి ప్రవర్తనను తీర్చిదిద్దడం, తద్వారా ఉత్తమ సమాజాన్ని కోరుకోవడం శతకాల ఉద్దేశంగా కనపడుతుంది. సమాజంలోని అనేక రకాల అసమానతలు, విభేదాలు, నీతి అవినీతులు, న్యాయాన్యాయాలు, ధర్మాధర్మాలు, దేశభక్తి, దైవభక్తి, లోభత్వం, దానత్వం, సుజనత, కుజనత, మిత్రత్వం, శత్రుత్వం ఇలా ఒక్కటేమిటి? అనేక అంశాలపై శతకాలు వెలువడ్డాయి. నశించిపోతున్న మానవీయ విలువలు, తగ్గిపోతున్న సంబంధ బాంధవ్యాలు, నిత్యం కంటపడుతున్న దారుణ సంఘటనలు, అంతులేని దౌర్జన్యాలు, మితిమీరిన స్వార్థం తదితరాలు నిండిన అనారోగ్య సమాజానికి మానవీయ విలువల చికిత్స శతక పద్యాల ద్వారా సాధ్యమవుతుంది.

మనం ఇంతవరకు చదువుకున్న శతక పద్యాలలోని సారాన్ని జీవితాలకు అన్వయించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మనం బాగా ఉన్నప్పుడు మిత్రుడుగా ఉన్న వ్యక్తి, మనం బలహీనమయ్యేసరికి ఎందుకు శత్రువుగా మారుతున్నాడో ఆలోచించాలి. మిత్రధర్మాన్ని పాటించని వారికి దూరంగా ఉండాలని, చేజేతులా మనను మనం బలహీనపరచుకోవద్దని అర్థం చేసుకుంటే జీవితానికి ఎంతో ఉపయోగం. చిన్న చిన్న తగవుల కారణంగా మనలోని తప్పులను లోకానికి చాటింపువేసే స్నేహితుడు అవసరమా? కాదా? విశ్లేషణ చేసుకోవాలి. 'ఆరు నెలలు పక్కన ఉంటే వాడు వీడవుతాడు. వీడు వాడవుతాడు' అన్న పెద్దల మాటను గుర్తుంచుకొని మిత్రుల ఎంపిక ఉండాలి. 'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అన్నట్లు మనలో శక్తిసంపదలు ఉన్నప్పుడే నలుగురికి చేయాల్సిన మంచి చేయాలి. తర్వాత ఆలోచించి ప్రయోజనం ఉండదు. 'చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు' అవుతుంది. పట్టుదల ఉన్నవారికి 'బాధకాలు' సాధకాలుగా మారిపోతాయనే సత్యాన్ని ఈ పాఠం ద్వారా గ్రహించవచ్చు. కోపతాపాలు మనిషి పతనానికి నాంది పలుకుతాయని, సొంత ప్రచార అలవాటువల్ల సభ్యసమాజంలో చిన్నచూపుకు గురి అవుతామని గ్రహిస్తే మంచిది. ఎంతోమంది కవులు అనుభవపూర్వకంగా మనకు అందించిన నీతిని గ్రహిస్తే మన జీవితాలు మరింత ఉన్నతంగా, సంస్కారవంతంగా పరివర్తన చెందుతాయి.

# భాషా సామర్థ్యాలను సాధిద్దాం

## I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది పద్యాన్ని చదువండి. దాని ఆధారంగా ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు గుర్తించండి.**

అతనికి వార్ధి కుల్యయగు, నగ్ని జలంబగు, మేరు శైల మం
చిత శిల లీలనుండు, మద సింహము జింక తెఱంగు దాల్చు, గో
పిత ఫణి పూలదండయగు, భీష్మ విషంబు సుధారసంబగున్,
క్షితి జనసమ్మతంబగు సుశీలమదెవ్వనియందు శోభిలున్.

అ) 'శీలము' అంటే ( )

ఎ) చెడు స్వభావం బి) క్రూర స్వభావం సి) మంచి స్వభావం డి) దుష్ట స్వభావం

ఆ) దేవతలు సుధారసాన్ని సేవించారు. 'సుధారసం' అంటే ( )

ఎ) నీరు బి) పాలు సి) ద్రాక్షరసం డి) అమృతం

ఇ) మంచి గుణం ఉన్నవానికి సముద్రం ఎలా కనబడుతుంది? ( )

ఎ) నది బి) కాలువ సి) జలపాతం డి) చెరువు

ఈ) శీలవంతునికి మేరుపర్వతము ఏ విధంగా అగుపడుతుంది? ( )

ఎ) గుట్ట బి) శిఖరం సి) చిన్నరాయి డి) సముద్రం

ఉ) మంచివానికి పూలదండగా మారేది ఏది? ( )

ఎ) జింక బి) శిల సి) విషం డి) పాము

## II. భాషాంశాలు

### పదజాలం

**1. కింది పదాలకు పర్యాయపదాలు రాసి, వాటితో వాక్యాలు రాయండి.**

ఉదా : శైలం - అచలం, గిరి, కొండ, పర్వతం

హిమాలయం ఒక మంచు పర్వతం. అది చూడడానికి వెండి కొండలా ఉంటుంది.

అ) నిక్కము =

___

ఆ) రణం =

___

ఇ) సిరి =

ఈ) ఫణి =

ఉ) తనూభవుడు =

**2. కింది పదాలకు అర్థాలు రాసి, వాటితో సొంతవాక్యాలు రాయండి.**

ఉదా : అంబోధి = సముద్రం

సముద్రంలో ప్రయాణం చేయడమంటే నాకెంతో ఇష్టం.

అ) కూరిమి =

ఆ) విత్తం =

ఇ) జలం =

ఈ) రశ్మి =

ఉ) వితరణ =

**3. కింద ఇచ్చిన పదాలను చదువండి. సంబంధం లేని పదాలను గుర్తించండి. దాని చుట్టు సున్నా చుట్టండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉదా: | నీరు | పాలు | నూనె | రాయి | మజ్జిగ |
| అ) | కమలాలు | మందారాలు | మల్లెలు | మంచు | గులాబి |
| ఆ) | గాలి | నీరు | చెట్టు | ఆకాశం | భూమి |
| ఇ) | ఉదయం | రేపు | మధ్యాహ్నం | రాత్రి | సాయంత్రం |
| ఈ) | ధర్మం | న్యాయం | దానం | లోభం | శీలం |
| ఉ) | కోపం | ఈర్ష్య | అసూయ | అబద్ధం | ఉపకారం |

## వ్యాకరణాంశాలు

### చంపకమాల :

**ఈ కింది పద్య పాదాలను పరిశీలించండి.**

న జ భ జ జ జ ర

III IUI UII IUI IUI IUI UIU

సిరిగ | లనాడు | మైమర | చిచ్చిక్కి | ననాడు | దలంచి | పుణ్యముల్

న జ భ జ జ జ ర

III IUI UII IUI IUI IUI UIU

పొరిబొ | రిజేయ | నైతిన | నిపొక్కి | నగల్గు | నెగాలి | చిచ్చుపై

పై పద్య పాదాలలోని గణాలను పరిశీలించండి.

ప్రతి పాదంలో వరుసగా 'న-జ-భ-జ-జ-జ-ర' అనే గణాలు ఉన్నాయి కదా! ఇలా ప్రతిపాదంలో పైన తెలిపిన గణాలు రావడమనేది 'చంపకమాల' పద్య లక్షణం. పై పద్యపాదాల్లో మొదటి పాదంలో 'సి' అక్షరానికి 'చి' అక్షరంతో, రెండవ పాదంలో 'పొ' కు, 'పొ' తో యతిమైత్రి చెల్లింది. పైన ఉదాహరణగా ఇచ్చిన రెండు పద్యపాదాల్లో ప్రాస స్థానంలో 'రి, 'రి' అనే హల్లులు ఉన్నవి. పై పద్య పాదాల్లో 21 అక్షరాలున్నాయి.

**చంపకమాల పద్య లక్షణాలు :**

1. ఇది వృత్తపద్యం.
2. ఈ పద్యంలో నాలుగు పాదాలుంటాయి.
3. ప్రతి పాదంలో వరుసగా 'న-జ-భ-జ-జ-జ-ర' అనే గణాలు వస్తాయి.
4. ప్రతి పాదంలో 11వ అక్షరం యతిస్థానం.
5. ప్రాస నియమం ఉంటుంది.
6. ప్రతి పాదంలో 21 అక్షరాలుంటాయి.

**కింది పద్య పాదాలకు గణ విభజన చేసి ఏ పద్య పాదాలో గుర్తించి రాయండి.**

- అతనికి వార్ధి కుల్యయగు నగ్ని జలంబగు మేరు శైలమం
- క్షితి జనసమ్మతంబగు సుశీలమదెవ్వనియందు శోభిలున్
- కెరలిన వేళ దప్పిగొని కీడ్పడు వేళ జలంబుగోరి త

## III. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**స్వీయరచన**

1. **కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) స్నేహం చెడినప్పుడు అన్ని పనులు తప్పులుగా ఎందుకు కనిపిస్తాయి?

ఆ) 'తమ తమ స్థానాలు తప్పితే మిత్రులు శత్రువులవుతారు'. దీని గురించి మీ అభిప్రాయం తెల్పండి.

ఇ) మంచివారితో స్నేహానికి మరియు చెడ్డవారితో స్నేహానికి మధ్య ఏమి తేడా ఉందో రాయండి.

ఈ) సంపద ఉన్న పిసినారి కన్న దానగుణం ఉన్న పేద మేలు. ఎందుకు?

2. **కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) ఉత్తముడైన కుమారునికి ఉండవలసిన గుణాలను కవి పేర్కొన్నాడు కదా! అవి ఏమిటో, ఎందుకుండాలో వివరించండి.

ఆ) మనిషికి నరకము 'కట్టుముల్లె' ఎప్పుడవుతుంది? విశ్లేషిస్తూ రాయండి.

**సృజనాత్మకత**

1. **కింది ప్రశ్నకు సమాధానం రాయండి.**

అ) 'కోపంబుచే నరుల్ క్రూరాత్ములగుదురు' అన్న పద్యాన్ని చదివారు కదా! దాని భావాన్ని ఆధారంగా చేసుకొని ఒక కథను రాయండి.

**సూక్తి**


సుజనులకు 'చెలిమి' శిలాక్షరం. 'అలుక' జలాక్షరం.
కుజనులకు 'చెలిమి' జలాక్షరం. 'అలుక' శిలాక్షరం.

**- 'కేయూర బాహుచరిత్ర' - మంచన**

# 4 మంజీర

– డా॥ దాశరథి కృష్ణమాచార్య

## కవి పరిచయం



22-07-1925
05-11-1987

డా॥ దాశరథి కృష్ణమాచార్య మహబూబాబాద్ జిల్లాలోని చినగూడూరులో జన్మించాడు. శ్రీమతి వేంకటమ్మ, వేంకటాచార్యులు ఆయన తల్లిదండ్రులు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఏ. ఇంగ్లీషు పూర్తిచేసిన దాశరథికి తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో పాండిత్యం ఉన్నది. ఆయన ఉపాధ్యాయుడుగా, పంచాయితీ శాఖలో తనిఖీ అధికారిగా, హైదరాబాదు మరియు మద్రాసు ఆకాశవాణి (రేడియో) కేంద్రాలలో ప్రయోక్తగా ఉద్యోగాలు చేశాడు.

నిజాం నిరంకుశ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ తన అక్షరాలను ఆయుధాలుగా మలచి అనేక పద్యాలు రచించాడు. ప్రజలను చైతన్యపరిచాడు. జైలు శిక్షను అనుభవించాడు. కొంతకాలం అజ్ఞాత జీవితాన్ని కూడా గడిపాడు. 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అని ఎలుగెత్తి చాటాడు. తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించాడు. వివిధ ప్రక్రియల్లో రచనలు చేశాడు. ఆయన రచనల్లో అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం, పునర్నవం, అమృతాభిషేకం, కవితాపుష్పకం, తిమిరంతో సమరం, గాలిబ్ గీతాలు, యాత్రాస్మృతి ముఖ్యమైనవి. వీటిలో కవితా పుష్పకానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, తిమిరంతో సమరానికి కేంద్రసాహిత్య అకాడమీ, గాలిబ్ గీతాలకు ఉత్తమ అనువాద పురస్కారాలు లభించాయి. ఆవేశంతో కూడిన పదగుంఫనంతోపాటు సున్నితమైన భావుకతను ప్రదర్శిస్తూ ప్రాచీన పద్యశైలిలో వర్ణనాత్మకంగా అభ్యుదయ కవిత్వం రాయడం దాశరథి ప్రత్యేకత.

మహాకవి, కవిసింహ, అభ్యుదయ కవి చక్రవర్తి వంటి బిరుదులు దాశరథి పొందాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదుతో, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మరియు ఆగ్రా విశ్వవిద్యాలయం డి.లిట్.తో ఆయనను సత్కరించాయి. నాటి భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ చేతులమీదుగా జాతీయోద్యమ రథసారథిగా తామ్రపత్రం అందుకున్నాడు. తెలుగు సినిమా పాటల రచయితగా ఎన్నో ఆణిముత్యాల వంటివి రాసి సినిమా పాటల గౌరవాన్ని పెంచాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చివరి ఆస్థానకవిగా ఉన్నాడు. ప్రముఖ నవలా రచయిత దాశరథి రంగాచార్య ఈయనకు సోదరుడు.

## పాఠ్యభాగ వివరాలు

'మంజీర' పాఠం దాశరథి రచించిన 'మహాంధ్రోదయం' ఖండకావ్యం నుండి గ్రహించబడింది. ఈ పాఠం పద్య, గేయ ప్రక్రియకు చెందినది.

## నేపథ్యం, ఉద్దేశం

తెలంగాణలో ప్రవహిస్తున్న జీవనదులలో కృష్ణా, గోదావరి తరువాత చెప్పుకోదగినది మంజీర. ఆ నది ప్రస్థానాన్ని, ఔన్నత్యాన్ని కీర్తిస్తూ దాశరథి 'మంజీర' శీర్షికతో గేయం మరియు పద్యాలు రాశాడు.

పాడి పంటలకు, సిరిసంపదలకు, ప్రజల జీవనానికి, పర్యావరణానికి నదులు ఎంతో మేలు చేకూర్చుతున్నాయి. అటువంటి నదుల పట్ల కృతజ్ఞతా భావం కలిగి ఉండి, వాటిని కాపాడుకోవాలని తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

### I

ఎవరి గజ్జెల రవళివే నీవు మంజీర!
ఎవరి కజ్జల బాష్పధారవేఁ మంజీర!
నీవు పారిన దారిలో ఇక్షుదండాలు
నీవు జారిన జాడలో అమృతభాండాలు 1

నీవు దూకిన నేల మాకు విద్యున్మాల
నీవు ప్రాకిన పథము మాకు చైత్రరథమ్ము
ఎవరికొరకయి పరుగులెత్తి వచ్చితివి?
ఎవరి జూచి తటాకమై నిల్చిపోతివి? 2

✿ ఉ. జీరలువడ్డ నా గళము జేరి నవధ్వని జాలువార్చు మం
జీరవు నీవు; నీ వెలుగు జిందెడి చక్కని దేహవల్లి కే
చీరలు కాన్క తేగలను చెప్పుము తెల్గునదీ! తెలుంగు బం
గారపు రంగు లద్దిన నిగారపు కావ్యదుకూలముల్ వినా? 3

✿ ఉ. ఆకలి తీర్చుకన్న ఘన మైన మహాయజనమ్ము కాన మీ
లోకమునందు; నీ మనసులో నొకనాడు తదీప్సితమ్ము చీ
కాకొనరింప వాకవయి, కాలువవై, ఝరివై, తటాకమై
మాకొర కేగుదెంచితిసుమా! కమనీయ పయోభరమ్మునన్. 4

✿ మ. శిలగా నే గిరిసీమ డాగితివొ మంజీరా! శతాబ్దాలు ని
శ్చలవృత్తిన్ పలుకేని లేక నొక వృక్షచ్ఛాయ దుష్టాత్ము గుం
డెలలో ద్వేషమువోలె ఇంచుకయినన్ హృద్యమ్ముగా; కిప్డు క
న్నుల నీరై ఇటు జారినావు దయ తోనో, ప్రేమభావాననో! 5

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. దేనికన్నా గొప్ప యజ్ఞం లేదని కవి అన్నాడు?
2. మంజీరకు కవి సమర్పించిన వస్త్రాలు ఏమిటి?

## II

✿ చ. నిను కరగించి తెచ్చిన పునీతు డెవం? డతనిన్ భగీరథుం
డనవలె; వాడు నా తెలుగు టంగణమందలి ముండ్లదుబ్బులన్
తునియలు కొట్టి ఈ చెరకు తోటల గూర్చి హలమ్ము గ్రుమ్మి, భూ
మిని ప్రసరింపజేసి పసిమిన్ మిసిమిన్ పెకలించె దండిగా. 6

✿ ఉ. ఆతడు నేలదున్ని బ్రతు కంతయు పస్తులు పన్న రైతు మా
పోతన యేమొ! వాని వడ పోతలలో కవితాప్రపంచ మా
పాతమనోహరమ్మయిన పల్కు జగద్విదితమ్ము; వాని సం
గాతము నీకు కావ్యతను కల్పన చేసినదోయి, వాహినీ! 7

తే.గీ. ఒకట నదివయి, ఒకచోట ఒదిగి ఒదిగి
సాగరమవై చలింపక సమసియుంటి
వెంత సౌమ్యస్వభావమోయీ! పరుంగు
లిడు మనస్సును సంధింప దొడగినావు. 8

సీ. ఇందూరు మండలం బెందాక నీనీటి
తడి తాకి తీయని తనమునొందు,
నా తెలంగాణమ్ము గీతనృత్తములతో
నెందాక నిన్ను పూజించుచుండు,
నెందాక నిరుపేద లంది నీ జలధార
పండింత్రు కొల్లగా పైరుపంట,
ఏ కవీశులు నీ మహాకావ్యత నెరింగి
తమ కలమ్ములకు సౌందర్య మిదుదు,

తే.గీ. రంతదాక మహిమండలాంతరమున
నీ వెలుంగుకు రవ్వంత నీడ రాదు,
దివ్య గోదావరీ గృహాంతికమునందు
నీ విలాస మేనాటికి నిలిచిపోదు. 9

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. ఈ భాగంలో ప్రస్తావించబడిన తెలుగు కవి ఎవరు? అతని గురించి మీరేం తెలుసుకున్నారు?
2. ఎప్పటి వరకు మంజీర కీర్తికి ఆటంకం కలుగదు?

## III

ఆ. రుద్రవీణ తీవమాద్రి జుంజుమ్మని
తరగ లెత్తి వచ్చుదాన వీవు;
నా మనస్సులోన నాదాలు కల్పించి
స్పందనమ్ము నేర్ప జాలినావు. 10

నా తెలుగువీణ పోయిన మూర్ఛనలు నేడు
నీవుగా పారినిండినవి నా భూమిలో;
ఇక ఎన్ని చెరకుతోటలు పండ వీచోట?
ఎన్ని చక్కెరమిల్లు లివురింపవు? 11

ఎవ్వరే యెదురొచ్చి ఏడుపాయలు చేసి
రవ్వల్ల వీణపై రాగమొత్తిరి నిన్ను?
ఏడుపాయల దుర్గ యేమన్నదే నిన్ను?
యేమన్నదే నిన్ను యేడుపాయల దుర్గ! (మంజీరా మౌనభంగం) 12

ఏడుపాయల దుర్గ ఎదురుగా వచ్చింది
పాడుకొమ్మన్నాది పరుగులిడమన్నాది
స్వర మొక్క పాయగా సాగిపొమ్మన్నాది
బంగారు పండించి ప్రజల కిమ్మన్నాది. (మంజీరకు విశ్రాంతి) 13

అదిగో హసంతికలు, అదె సుమ లసంతికలు
అదిగో సీమంతికలు, అదిగో వాసంతికలు
జయదాయకములు, సంశయ మాయకమ్ములు
ప్రియకరము లమృతపిచ్ఛిలము లుబ్బలములు 14

ఆ.వె. మిట్ట లెక్కియెక్కి గుట్టలు దిగజారి
త్రోవ గడచి వచ్చినావు నీవు.
మిగుల శ్రమలుగొన్న మిసిమింతు రాలవు
సేదదీరుమీ ప్రసిద్ధ భూమి. 15

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. వనదుర్గ మంజీరతో పలికిన మాటలనుబట్టి మీరేం గ్రహించారు?
2. కవి మంజీరను ఎక్కడ, ఎందుకు విశ్రాంతి తీసుకోమన్నాడు?

## సారాంశం

(తెలంగాణను సస్యశ్యామలం చేసిన మంజీరానదిని కవి పలువిధాలుగా వర్ణిస్తూ కీర్తిస్తాడు.)

1. మంజీరా! నీవు ఎవరి కాళ్ళ అందెల నుండి వెలువడిన ఆనంద రవళివో, ఎవరి కాటుక కన్నుల నుండి జాలు వారిన ఆనంద బాష్పధారవో! నీవు ప్రవహించిన దారంతా చెరుకుగడలు, అమృత కలశాలే. (మంజీరానది తాగునీటిని, సాగునీటిని అందిస్తూ ప్రజలకు ఆనందాన్ని కలిగించిందని కవి భావన).
2. మంజీర ప్రవహించిన నేలంతా మెరుపుల మాలయై, కుబేరుని ఉద్యానవనమై విరాజిల్లునట్లుగా చెరువై నిలిచింది. (మంజీర పరీవాహక ప్రాంతాలు పంటలకు నిలయమై ప్రజల జీవితాలలో వెలుగులు నింపాయి.)
3. మంజీర బొంగురుపోయిన కవి గొంతులో ప్రవేశించి కొత్తధ్వనిని పలికించింది. కాంతులు చిందే మంజీరకు కవి తెలుగుదనంతో నిండిన కావ్యవస్త్రాలను కానుకగా సమర్పించాడు. (ఎండిపోయిన నేలను తన నీటితో తడిపి ఆ నేలకు కొత్త బలాన్ని ఇచ్చిన మంజీరకు కృతజ్ఞతగా కవి ఆ నదిపై కావ్యం రాశాడు.)
4. ఆకలి తీర్చుటకన్నా గొప్ప యజ్ఞం ఈ లోకంలో లేదు. ప్రజల ఆకలిని తీర్చాలనే కోరికతో మంజీర ఏరుగా, కాలువగా, సెలయేరుగా, పలువిధాలుగా ప్రవహిస్తూ చివరకు ప్రజల కోసం చెరువై నిలిచింది. (నిజాం సాగర్ ప్రాజెక్టు నిర్మాణంతో మంజీరా నది పెద్ద చెరువుగా మారిందని కవి భావన).

5. వందల సంవత్సరాలుగా కొండ ప్రదేశంలో శిలల మధ్య చలనం లేని స్థితిలో ఉన్న మంజీర తెలంగాణ ప్రజలపై ప్రేమభావంతో, దయతో కరిగిపోయి నీరై పారింది. (మహారాష్ట్ర బాలాఘాట్ పర్వత శ్రేణిలో పుట్టిన మంజీర సన్నని ధారగా ప్రవహిస్తూ చివరకు ఒక నదిగా తెలంగాణలోకి ప్రవేశించిన సందర్భాన్ని కవి తెలియజేస్తున్నాడు.)

6. శిలల మధ్య ఉన్న మంజీరను నేలపైకి తెచ్చిన పవిత్రుడు ఎవడోగానీ, అతనిని భగీరథుడు అనాలి. అతడు తెలంగాణ భూమి యందలి ముళ్ళకంపలను ముక్కలుచేసి, నాగలితో నేలను దున్ని, చెరుకు తోటలు పెంచి ఈ నేలను పచ్చదనంతో నింపాడు.

(మంజీర నీటితో సాగుచేయబడిన నేలల్లో చెరుకు పంటలు పండాయని భావం.)

7. నేలను దున్ని, పచ్చదనంతో నింపిన అతడు పస్తులున్న రైతు. బహుశ అతను తెలుగుకవి పోతన అయి ఉంటాడు. (పోతన కూడా వ్యవసాయదారుడే). ఆ పోతన కవితలోని మాధుర్యం కవితా ప్రపంచానికి తెలుసు. అతనితో ఏర్పడిన స్నేహంవల్ల మంజీరకు కూడా కావ్యయోగ్యత కలిగింది.

8. మంజీర ఒక చోట నదిలా, వేరొక చోట కాలువలా, ఇంకొక చోట ఏరుగా ప్రవహిస్తూ చివరకు పెద్ద చెరువై శాంతంగా కనిపిస్తున్నది. (ఎన్నో విధాలుగా సాగుతున్న మంజీర ప్రస్థానాన్ని తెలుపుతూ నిజాంసాగర్ వద్ద పెద్ద చెరువులా శాంతంగా ఉన్నదని కవి తెలుపుచున్నాడు.)

9. ఇందూరు (నిజామాబాదు జిల్లా) ప్రాంతం ఎప్పటి వరకు మంజీర నీటి తడితో తీయదనం పొందుతుందో, తెలంగాణ ఎప్పటివరకు తన ఆటపాటలతో మంజీరను పూజిస్తుందో, ఎప్పటి వరకు రైతులు మంజీర నీటితో అధికంగా పంటలు పండిస్తారో, ఎప్పటివరకు కవులు మంజీరపై కవిత్వాలు రాస్తుంటారో అప్పటివరకు మంజీర కీర్తి నిలిచే ఉంటుంది. గోదావరిలో కలిసే వరకు మంజీర ఒయ్యారపు నడక సాగిపోతూనే ఉంటుంది.

10. రుద్రవీణలో తీగ మాదిరిగా జుమ్మనే శబ్దతరంగాలతో ప్రవహించే మంజీరనాదం కవి హృదయాన్ని కదిలించింది.

11. ఎండిపోయి, బీడుపడి, నెర్రెలిచ్చిన నేలల్లోకి మంజీర నీరు పారి నేలంతా తడిసింది. ఇక ఆ నేలల్లో ఎన్నో చెరుకు పంటలు పండుతాయి. ఎన్నో చక్కెర పరిశ్రమలు వెలుస్తాయని కవి ఆకాంక్షిస్తున్నాడు.

12. మంజీరానది ఏడుపాయలుగా చీలింది. ఈ ప్రాంతాన్ని 'ఏడుపాయలు'గా వ్యవహరిస్తున్నారు. ఏడుపాయలలో వనదుర్గ ఆలయం ఉన్నది. ఆ విషయాలను ప్రస్తావిస్తూ కవి మంజీరను "ఎవరు నిన్ను ఏడుపాయలుగా చేసి రత్నాలవీణపై రాగం పల్కించారు. ఏడుపాయల దుర్గ నిన్ను ఏమన్నది?" అంటాడు.

13. అప్పటివరకు మౌనంగా సాగిపోతున్న మంజీర తన మౌనాన్ని వీడి కవికి సమాధానమిస్తూ "ఏడుపాయల దుర్గ ఎదురుగా వచ్చి నన్ను పాడుకోమన్నది, పరుగెత్తమన్నది. ఒక పాయ ఒక స్వరంగా సాగిపోతూ బంగారు పంటలు పండించి ప్రజలకు ఇమ్మన్నది". అంటుంది.

14. (కవి మంజీరకు విశ్రాంతినిస్తూ) మల్లెలు, అడవి మల్లెలు, చేమంతులు, పూలహారాలు, అమృతపు తేటలు మంజీరకు ప్రియమును, జయమును కలిగిస్తాయి. సందేహం లేదు.

15. ఉన్నత భూములు ఎక్కి, చిన్న కొండలపై నుండి కిందకు జారి శ్రమతో ప్రయాణిస్తూ అలసిపోయిన మంజీరను తెలంగాణ నేలపై విశ్రాంతి తీసుకోమని కవి కోరుచున్నాడు.

## పాఠ్యాంశ అన్వయం

మానవ మనుగడకు నదులు ఆధారం. మానవ నాగరికత నదీ పరివాహక ప్రాంతాల్లో విస్తరించింది. నదీ తీరంలో ఎన్నో పట్టణాలు, నగరాలు, పుణ్యక్షేత్రాలు వెలిశాయి. అవి సాంస్కృతిక కేంద్రాలై విరాజిల్లుతున్నాయి. జీవకోటికి ప్రాణాధారమైన నదులను దేవతా స్వరూపాలుగా ఆరాధించడం, వాటిని పవిత్రంగా భావించడం మన భారతీయ సనాతన ధర్మంలో కనిపిస్తున్నది. నదులపట్ల మన భారతీయులకు గల గౌరవభావాన్ని అది తెలియజేస్తున్నది.

మనకు సాగునీరు, తాగునీరు అందిస్తూ మన అభివృద్ధికి కారణమవుతున్న నదులు నేడు కాలుష్యానికి గురవుతున్నాయి. మురికినీరు, రసాయనాలు, వ్యర్థపదార్థాలు, చెత్తాచెదారాలు నదులలో కలువడంవల్ల నీరు కలుషితమై హానికరంగా మారుతున్నది. మన తెలంగాణలో హైదరాబాదు నగరంలో ఉన్న మూసీనది ఏ విధంగా కలుషితమై నిరుపయోగంగా మారిపోయిందో అందరికీ తెలుసు. ఒక నది అంతరించడమంటే ఆ నదిపరీవాహక ప్రాంత చరిత్ర, సంస్కృతి కూడా అంతరించినట్లే. ప్రజల బాధ్యతా రాహిత్యంవల్ల నదులు కాలుష్యానికి గురవుతున్నాయి. మనకు ఎంతో మేలు చేస్తున్న నదులను మనం కాపాడుకోవాలి. నదులను కాపాడడం కేవలం ప్రభుత్వ బాధ్యతేకాదు, ప్రజల బాధ్యత కూడా. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నదుల కాలుష్యాన్ని అరికట్టాలి. నదులను కాపాడాలి. అందుకొరకు కృషి చేయాలి.

## భాషా సామర్థ్యాలను సాధిద్దాం

## I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది పద్యాన్ని చదువండి. దాని ఆధారంగా ఇచ్చిన ప్రశ్నలకు సరైన జవాబులు రాయండి.**

జీరలువడ్డ నాగళము జేరి నవధ్వని జాలువార్చు మం
జీరవు నీవు నీ వెలుగు జిందెడి చక్కని దేహవల్లి కే
చీరలు కాన్క తేగలను చెప్పుము తెల్గునదీ! తెలుంగు బం
గారపు రంగులద్దిన నిగారపు కావ్యదుకూలముల్ వినా?

అ) పై పద్యంలోని తెలుగునది ఏది?

______________________________

ఆ) కవి గొంతుకు మంజీర ఏమి కూర్చింది?

______________________________

ఇ) కవి మంజీరకు ఇచ్చిన కానుక ఏమిటి?

______________________________

ఈ) జీరలు పడింది ఏమిటి?

______________________________

ఉ) ఈ పద్యానికి ఒక శీర్షికను సూచించండి.

______________________________

## II. భాషాంశాలు

### పదజాలం

**1. కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలను రాయండి.**

అ) కమనీయం = ______________________________

ఆ) సేదతీరు = ______________________________

**2. కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు సరైన అర్థాన్ని గుర్తించండి.**

అ) ఇక్షురసం తీయగా ఉంటుంది. (నిమ్మరసం / చెరుకురసం)

ఆ) వికసించిన కలువలతో తటాకం అందంగా కనిపిస్తున్నది. (చెరువు / సముద్రం)

ఇ) రైతు హలముతో పొలము దున్నాడు. (ఎద్దు / నాగలి)

ఈ) ఎండకు అలసిపోయిన బాటసారి చెట్టు ఛాయలో విశ్రాంతి తీసుకున్నాడు. (నీడ / కొమ్మ)

**3. కింది పదాలకు సమానార్థక పదాలు పట్టికలో ఉన్నాయి. వాటిని గుర్తించి ఆ పదాలకు ఎదురుగా రాయండి.**

అ) రైతు, ______________

ఆ) వాహిని, ______________

ఇ) జలము, ______________

ఈ) చెట్టు, ______________

ఉ) సంగతము, ______________

| | | |
|---|---|---|
| స్నేహం | తీగ | నది |
| కీర్తి | వృక్షం | కాటుక |
| కర్షకుడు | ధ్వని | నీరు |

**4. కింది వాక్యాలలో గల ప్రకృతి వికృతి పదాలను గుర్తించండి.**

అ) పోతన చరిత్రము మహాకావ్యం. ఆ కబ్బం వానమామలై వరదాచార్యులచే రాయబడింది.

ఆ) నేనొక కవిత రాశాను. నాకైతకు బహుమతి వచ్చింది.

ఇ) రవి నూతన గృహము కట్టుకున్నాడు. విశాలమైన ఆ గీములో ఐదు గదులున్నాయి.

**5. కింది వాక్యాల్లో గీతగీసిన పదానికి గల నానార్థాలను గుర్తించి రాయండి.**

అ) పసిపిల్లలకు తల్లి అమృతమే బలం. అమృతంతో చేసిన మిఠాయిలు ఘుమఘుమలాడుతున్నాయి.

అమృతం = ________________ ________________

ఆ) రాజు తన వాహినితో కలిసి యుద్ధానికి బయలుదేరాడు. గోదావరి పెద్ద వాహిని.

వాహిని = ________________ ________________

**6. కింది వ్యుత్పత్త్యర్థాలకు సరైన పదాలను గుర్తించండి.**

అ) మరణం లేకుండా చేయునది ( )

ఎ) మృత్యువు బి) అమృతం సి) అంజనం డి) మార్గం

ఆ) జలముచే కొట్టబడినది ( )

ఎ) తటాకము బి) జలజాతము సి) జగద్విదితము డి) తాండవము

## వ్యాకరణాంశాలు

**కింది వాటిని పరిశీలించండి.**

1. వాడు + ఎక్కడ = వాడెక్కడ
2. ఇంక + ఒకరు = ఇంకొకరు
3. మనము + ఉన్నాము = మనమున్నాము

పై ఉదాహరణల్లో రెండేసి పదాలు కలిసి ఒకే పదంగా ఏర్పడడం గమనించారు కదా! ఇట్లా రెండు పదాల కలయికను సంధి అంటారు. రెండు పదాలు కలిసేటప్పుడు ఆ పదాల మధ్య ఉన్న అక్షరాలలో మార్పు జరుగుతుంది. దానినే సంధికార్యం అంటారు. ఆ సంధికార్యం గురించి తెలిపేవి సంధి సూత్రాలు. ఆయా మార్పులను అనుసరించి సంధుల పేర్లు ఏర్పడినాయి.

సంధిలో రెండు పదాలుంటాయని తెలుసుకున్నారు కదా! ఆ రెండు పదాలలో మొదటి పదాన్ని 'పూర్వ పదం' అనీ, రెండవ పదాన్ని 'పర పదం' అనీ అంటారు.

ఉదా : వాడు + ఎక్కడ వీటిలో వాడు అనేది పూర్వపదం, ఎక్కడ అనేది పరపదం.

మీరు పదవ తరగతిలో ఇకారసంధి, ఉకారసంధి, సవర్ణదీర్ఘసంధి, గుణసంధి గురించి తెలుసుకున్నారు కదా! కింది అభ్యాసాలలో వాటిని గుర్తించండి.

1. కింది పట్టికను పూరించండి.

| స్నేహం | సంధి పదం | విడదీసి రాయడం | సంధి పేరు |
|---|---|---|---|
| 1 | | శత + అబ్దాలు | |
| 2 | కవీశులు | | |
| 3 | | మిట్టలు + ఎక్కి | ఉకార సంధి |
| 4 | చేసినదోయి | | ఇకార సంధి |
| 5 | దేవేంద్రుడు | | |

## III. వ్యక్తీకరణ - సృజనాత్మకత

### స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) మంజీర పాఠం రాసిన కవి గురించి తెలుపండి.

ఆ) "ఆకలి తీర్చుట కంటె గొప్ప యజ్ఞం లేదు" - దీనిపై మీ అభిప్రాయం తెలుపండి.

ఇ) 'నీవు పారిన పథము మాకు చైత్రరథము' అనడంలో కవి ఉద్దేశం ఏమిటి?

ఈ) నదులవల్ల కలిగే ప్రయోజనాలను తెలుపండి.

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) మంజీర గురించి కవి ఏమన్నాడో మీ సొంతమాటల్లో రాయండి.

ఆ) నదులు ఎలా కలుషితమౌతున్నాయి? నదులను కాపాడుకోవడానికి మనమేం చేయాలో తెలుపండి.

### సృజనాత్మకత

**1. కింది ప్రశ్నకు సమాధానం రాయండి.**

అ) మీ ప్రాంతంలోని లేదా మీరు చూసిన వాగు / చెరువు / నదిని వర్ణిస్తూ కవిత / గేయం రాయండి.

### సూక్తి


జలమే జగతికి ప్రాణాధారం
జలమే ప్రగతికి మూలాధారం

పద్య భాగం

# 5 మానవ సంగీతం

– కవిరాజ మూర్తి

## కవి పరిచయం



20-02-1927
03-07-1985

కవిరాజమూర్తి ఖమ్మం జిల్లా పిండిప్రోలు గ్రామంలో జన్మించాడు. ఇతని అసలు పేరు సర్వదేవభట్ల నరసింహమూర్తి. 'కవిరాజమూర్తి' అనే కలంపేరుతో ప్రసిద్ధుడయ్యాడు. ఖమ్మంలోని మామిళ్ళగూడెంలో బాల్యం, విద్యాభ్యాసం గడిచింది. తెలుగువచన కవితారంగంలో తొలిదీర్ఘ కవితలు రాసిన తొలితరం కవులలో అగ్రగణ్యుడు కవిరాజమూర్తి. ఆనాటి నియంతృత్వ పాలకులకు, భూస్వామ్య ఆధిపత్య వర్గాలకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకున్న రైతులకు అండగా, అణగారిన పీడిత జనుల పక్షాన నిలబడిన అభ్యుదయవాది. సామాన్య జనుల ఆవేదనకు అక్షరరూపమివ్వడానికి అంకితమైన కవి. ఖమ్మం జిల్లాలో 'ప్రజాసాహిత్య పరిషత్తు'ను స్థాపించి ఆనాటి తరంలో విస్తృతమైన సాహిత్య చైతన్యానికి ఉద్యమస్థాయిలో కృషిచేశాడు. సాహిత్యానికే పరిమితంగాకుండా అనేక ప్రజారంగాలలో తన ఆలోచనా స్ఫూర్తిని అందించిన ఉద్యమకారుడుగా గుర్తింపు పొందాడు.

కవిరాజమూర్తి పలు ప్రక్రియలలో రచించి తన సృజనాత్మక ప్రతిభను చాటుకున్నాడు. గాంధీజీ చరిత్రను 'జముకుల' కథారూపంలో రాశాడు. 'నవయుగశ్రీ' అనే గేయ సంపుటిని, 'మై గరీబ్‌హూ' అనే నవలను, కొన్ని కథలను, కొన్ని సామాజిక, సాహిత్య వ్యాసాలను రచించాడు. ఉర్దూ, ఫారశీలోని గజళ్ళను 'మధుధారలు' పేరుతో ముక్తకాలుగా వెలువరించాడు. మహైక, ప్రణతి, మానవ సంగీతం (1964) అనే మూడు దీర్ఘకవితలతో తెలుగు వచన కవిత్వానికి తొలిదశలోనే బలమైన పునాదులు వేసాడు. ఇతివృత్తంలో అభ్యుదయ భావాలేకాదు కవితాభివ్యక్తిలోనూ ఆధునికతను ప్రదర్శిస్తూ ప్రయోగాత్మక రీతిలో రచనలు చేసిన విలక్షణ కవి. స్పష్టమైన భావన, సరళశైలితో గాఢమైన ఆర్తిని వినిపించిన కవి కవిరాజమూర్తి.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం దీర్ఘ కవితా ప్రక్రియకు చెందినది. ఛందోనియమాలు లేకుండా స్వేచ్ఛగా రాసే వచన కవిత మార్గంలో నడిచేదే దీర్ఘ కవిత. ప్రస్తుత పాఠ్యభాగం 'మానవ సంగీతం' అనే దీర్ఘకవితలోనిది.

## నేపథ్యం, ఉద్దేశం

మానవీయ సంబంధాల విలువలను తెలుపుతూ మానవ లోకాన్ని మేల్కొలిపే అస్తిత్వగానమే 'మానవ సంగీతం'. అనంతమైన కాలగమనంలో మనిషి పరిణామ వికాసాలను, ఉత్థానపతనాలను, విభిన్న దృక్పథాలను వినిపిస్తాడు కవి. సంశయం, సందేహం, అనుమానం తొలగించుకుని అచంచల విశ్వాసంతో అడుగులు వేయాలనేదే కవి ఆశయం. మనిషిలో దృఢ అస్తిత్వకాంక్షను నింపే సందేశం మానవ సంగీతంలో వినిపిస్తుంది.

### I

విద్యుద్దీపంలోని
విద్యుత్తు లాగా వెలుగొందు
పరాధీన భావంతో
బ్రతుకకు –

అవశుడవై
అనాథవై
జీవించకు
అవతారాన్ని చాలించు –

నీ జీవితమంతా
ఎడారికాదు
మార్గంలో
బిడారములు కలుస్తాయి.
నీ కాళ్ళ క్రింద జారుతూ
కూరుకుపోతున్న
యిసుక రేణువులు
ఒకనాడు
అచంచలమైన స్థాణువులు
మహా పర్వతాలకు
మందాన్నిచ్చిన భాగాలని
మరువబోకు –

నీ పైనిగల ముసుగును
తొలగించుకొని
స్వ స్వరూపాన్ని
ప్రకటించుకో
మన స్వహస్తాలతో
మనం కప్పుకున్న ముసుగు
పరమ దరిద్రులనుగా
దీనులనుగా

దుఃఖితులనుగా
లోకానికి చూపెడుతుంది
మనలనే –

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. 'పరాధీన భావంతో బతుకకు' అంటే ఏమిటి? ఎలా బతకాలని మీరనుకుంటున్నారు?
2. 'జీవితం ఎడారిలాగా' మారిందని ఎందుకనిపిస్తుంది?

## II

అవనిలోని
ఆనంద విషాదాలకూ
మనకూ అడ్డంగా నిలిచిన
యవనికను తొలగించి
సర్వ మానవ హృదయాల్లో
స్పందించే సత్యాన్ని పరికించు –
మృత్యువు
నిను గాఢాలింగనం చేసుకుంటే
సర్వ సంపూర్ణమైనట్లు
విలపించకు
నీవు ఎత్తగలవు
సహస్ర కోటి రూపాలు
నీవు ధరించగలవు
ఎన్నో ఎన్నెన్నో వేషాలు
నీవు ప్రసరించగలవు
అరుణా రుణ కాంతులు
చంద్రునిలోని
వెన్నెలవలె

భాష్పకణాలలోని
భావాలవలె
సర్వ పదార్ధ వ్యాపితుడవై
సర్వలోక సంచారుడవై
కీరమువై – నీరమువై
అవనివై అంబుధివై
ఆకాశమువై!
అనంత విశ్వ వ్యాపితుడవై
అంతటా అంతటా నీవై
అందరికీ అమర సందేశాన్నివ్వగలవు.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. 'మరణించినా మరో రూపంలో జీవించడం'లోని అంతరార్థం ఏమిటి?
2. కవి 'అమర సందేశాన్ని' మీరు ఎలా అర్థం చేసుకుంటున్నారు?

## సారాంశం

మానవుడు ఎవరి అండదండలు లేకుండా బ్రతకగల ధీశాలి. విద్యుత్ బల్బులోని విద్యుత్తులాగా శక్తివంతమైన వెలుగులతో బతకాలి మనిషి. తన చుట్టూవున్న సమాజానికి వెలుగులు ప్రసరిస్తూ దీపంలాగా బతకాలని కోరుకుంటున్నాడు కవి. నిన్ను నీవు తెలుసుకుంటూ సామూహిక శక్తిగా భావించు. అనాథననే భావంతో జీవించకు. నిరాశమయ ఆలోచనలను దరిచేరనీయకు.

మనిషి జీవితం ఎటువంటి సుఖాలు, ఆనందాలులేని ఎడారి వంటిదని దుఃఖించకు. ఒంటరివాడివని బాధపడకు. జీవనదారుల్లో అనేకమంది పరిచయమవుతారు. జీవనోత్సాహం కలిగిస్తారు. ఎడారిలో కాళ్ళకింద జారుతున్న ఇసుకరేణువులు మన జీవన వేగాన్ని తగ్గిస్తున్నాయని సందేహించకు. ఆ ఇసుకరేణువులే ఒకప్పుడు మహాపర్వతాలకు పునాదుల్లాంటివని గుర్తించాలి. మనిషి వేసుకున్న అనవసరపు భయాలు, అనుమానాలు, అవిశ్వాసాల ముసుగు మనలను పరమ దరిద్రునిగా, దీనుడిగా, దుఃఖితునిగా లోకానికి చూపుతుంది. ఆ ముసుగును తొలగించి మనదైన ఉత్తమ వ్యక్తిత్వాన్ని ప్రకటించే సమయం వచ్చింది. లోకంలోని ఆనందాలకు, విషాదాలకు మనిషికి మధ్య అడ్డంగా నిలిచిన ఈ తెరను తొలగించాలి. లోకం అప్పుడు స్పష్టంగా అర్థమవుతుంది. జీవించడమంటే ఏమిటో అవగాహనవుతుంది. అందరి హృదయాల్లోని స్పందన వినిపిస్తుంది. జీవన సత్యం బోధపడుతుంది.

ప్రతి మనిషికి మరణం తప్పదు. అలాగే నేను చనిపోతాననే బాధతో ఏడ్వకు. చనిపోవడంతో అంతా అయిపోయిందని భావించకు. నీవు మరో వస్తువుతో, స్వభావంతో అనేక కోట్ల కొత్త రూపాల్ని పొందుతావు. ఎన్నెన్నో వేషాలను వేస్తావు. సూర్యుని కిరణమై, చంద్రుని వెన్నెలవై భూమికి వెలుగుల్ని వెదజల్లుతావు. కన్నీటి చుక్కలోని జీవన సారాంశాన్ని తెలుపుతుంటావు. కంటికి కనిపించే ప్రతి పదార్థంలో కనిపిస్తూనే ఉంటావు. అనంతలోక సంచారిగా నిత్యం ప్రయాణిస్తూనే ఉంటావు. భూమిగా, నీరుగా, ఆకాశంగా, సముద్రంగా, చిరుప్రాణి చిలుకగా పంచభూతాలలో అంతటా నీవే వ్యాపిస్తావు. అనంతమైన ఈ విశ్వంలో నీ ఉనికే ప్రధానంగా మారిపోతుంది. నీ ఆత్మవిశ్వాస అస్తిత్వ జీవన గమనమే ఈ లోకానికి దివ్య సందేశంగా చేరుతుంది.

## పాఠ్యాంశ అన్వయం

ఈ ప్రకృతిలో, కోటానుకోట్ల ప్రాణుల సమూహంలో మనిషికున్న ప్రత్యేకమైన శక్తిని వివరిస్తున్నాడు కవి. మనిషిలోనే నిక్షిప్తమైన అనంతమైన ఆత్మవిశ్వాసాన్ని వెలికితీసే ప్రయత్నం ఈ కవితలో కనిపిస్తుంది. జీవితాన్ని ఎలా అర్థం చేసుకోవాలో విడమరచి చెబుతుంది. పుట్టిన మనిషి ఎప్పుడో ఒకప్పుడు మరణించక తప్పదనే చేదునిజం అవగతమయ్యేలా జీవన రహస్యాన్ని వెల్లడిస్తాడు కవి. మనుషులు మరణించినా వారి స్ఫూర్తి చైతన్యం అనేక రూపాలలో ఈ ప్రపంచానికి పరోక్షంగా అందుతుందనే సృష్టిలోని మార్మిక వైచిత్రిని, సందేశాన్ని 'మానవ సంగీతం' కవిత ద్వారా కవి లోకానికి అందిస్తున్నాడు.

## భాషా సామర్థ్యాలను సాధిద్దాం

### I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది కవితాభాగాన్ని చదువండి. దాని ఆధారంగా ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు గుర్తించండి.**

"అవనిలోని
ఆనంద విషాదాలకూ
మనకు అడ్డంగా నిలిచిన
యవనికను తొలగించి
సర్వమానవ హృదయాల్లో
స్పందించే సత్యాన్ని పరికించు
మృత్యువు
నిను గాఢాలింగనం చేసుకుంటే
సర్వం సంపూర్ణమైనట్లు
విలపించకు"

అ) 'అవని' అనగా అర్థం ఏమిటి? ( )

ఎ) ఆకాశం బి) భూమి సి) నది డి) సముద్రం

ఆ) 'యవనికను తొలగించు'లో యవనిక అనగా... ( )

ఎ) భూమి బి) దుమ్ము సి) తెర డి) గాజు

ఇ) 'పరికించు' పద అర్థం ( )

ఎ) విను బి) మాట్లాడు సి) ప్రశ్నించు డి) చూడు

ఆ) 'విలపించు' పదానికి వ్యతిరేక పదం ( )

ఎ) సంతోషించు బి) దుఃఖించు సి) రోదించు డి) విషాదం

ఆ) 'ఆనంద విషాదాలు' అనే పదాలను ఏమని పిలుస్తారు? ( )

ఎ) పర్యాయ పదాలు బి) జంట పదాలు

సి) వ్యతిరేక పదాలు డి) నానార్థాలు

## II. భాషాంశాలు

### పదజాలం

**1. కింది పదాలకు పర్యాయ పదాలు రాయండి.**

ఉదా : వెలుగు – ప్రకాశించు, జ్వలించు, కిరణము

అ) అవని – ________ ________ ________

ఆ) అంబుధి – ________ ________ ________

ఇ) నీరము – ________ ________ ________

ఈ) ఆకాశము – ________ ________ ________

ఉ) హృదయము – ________ ________ ________

**2. కింది పదాలకు సొంతవాక్యాలు రాయండి.**

ఉదా : ఆనందం = మంచి పనులు చేసినప్పుడు కలిగే ఆనందం వెలకట్టలేనిది.

అ) విశ్వము = ________________

ఆ) మృత్యువు = ________________

ఇ) సర్వం = ________________

ఈ) వెన్నెల = ________________

ఉ) దీనులు = ________________

**3. కింది వాటిని జతపరచండి.**

| | | | |
|---|---|---|---|
| అ) కడలి | (     ) | i) | వేయి |
| ఆ) మిన్ను | (     ) | ii) | జలము |
| ఇ) చిలుక | (     ) | iii) | సముద్రం |
| ఈ) సహస్ర | (     ) | iv) | కీరము |
| ఇ) నీరము | (     ) | v) | ఆకాశం |

## వ్యాకరణాంశాలు

### అత్వసంధి

**కింది సంధి పదాలను గమనించండి.**

1. రామ + అన్న = రామన్న
2. అమ్మ + ఇచ్చెను = అమ్మ యిచ్చెను
3. మేన + అల్లుడు = మేనల్లుడు, మేనయల్లుడు
4. ఒక + ఒక = ఒకానొక

పై పదాలను పరిశీలించినప్పుడు మొదటి పదం చివరి 'అ' కారము, రెండవ పదం మొదట అచ్చు చేరుతుంది. ఇలా 'అ' కారమునకు అచ్చుపరమైనప్పుడు సంధి జరుగుటను 'అత్వసంధి' అంటారు.

సూత్రము : అత్తునకు సంధి బహుళముగానగు.

'బహుళము' అనగా సంధి నాలుగు రూపాలలో జరుగును. అవి 1. నిత్యము, 2. నిషేధము, 3., వైకల్పికము, 4. అన్యవిధము.

పైన వివరించిన సంధి పదాలలో 'రామన్న' సంధి జరిగిన పదము. ఇది నిత్యము. అమ్మ + య్ + ఇచ్చెను = 'అమ్మయిచ్చెను'. ఇందులో సంధి జరుగక యడాగమము వచ్చింది. దీనిని నిషేధముగా భావిస్తాం. 'మేన+అల్లుడు' యందు అత్తునకు అచ్చుపరమై 'మేనల్లుడు' అయింది. కాని కొన్నిసార్లు యడాగమము వచ్చి 'మేనయల్లుడు' అయింది. దీనినే 'వైకల్పికము' అంటారు. అంటే ఒకసారి సంధి జరగడము, జరకగపోవడము. నాలుగవ పదము 'ఒక + ఒక' = 'ఒకొక' కావాలి. కాని 'ఒకానొక' అనే వేరే రూపము వచ్చింది. దీనిని 'అన్యవిధము' అంటారు. ఇలా నాలుగు రూపాలలో సంధి జరిగిన విధానాన్ని 'బహుళము' అని వ్యవహరిస్తారు.

**కింది పదాలను కలిపి రాయండి.**

1. పుట్టిన + ఇల్లు = ____________________
2. దూత + ఇతడు = ____________________
3. సీత + అమ్మ = ____________________

## III. వ్యక్తీకరణ - సృజనాత్మకత

### స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) కవిరాజమూర్తి కవితాశైలిని వివరించండి.

ఆ) మనిషి ఎలా బతుకాలని కవి ఆశించాడు?

ఇ) కవి ఎటువంటి ముసుగును తొలగించాలని కోరుకున్నాడు?

ఈ) కవి మరణభయాన్ని ఏ విధంగా అధిగమించాలని భావించాడు.

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) 'మానవ సంగీతం' పాఠ్యభాగ సారాంశాన్ని తెలుపండి.

ఆ) 'మానవ సంగీతం' ద్వారా కవి అందించిన సందేశాన్ని వివరించండి.

### సృజనాత్మకత

**1. కింది ప్రశ్నకు సమాధానం రాయండి.**

అ) 'మానవ సంగీతం' కవిత నీకు ఎటువంటి ప్రేరణ కలిగించిందో తెలుపుతూ నీ మిత్రులకు లేఖ రాయండి.

### సూక్తి

ఉదయం కానే కాదనుకోవడం నిరాశ
ఉదయించి అట్లానే ఉండాలనుకోవడం దురాశ

**- కాళోజి**

# 6 స్వాతంత్ర్య రథము

– మామిండ్ల రామగౌడు

## కవి పరిచయం



14-01-1943
06-06-2003

తెలంగాణ ఆధునిక కవుల్లో మామిండ్ల రామగౌడు ఒకరు. ఈయన నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండల కేంద్రంలో బాలమ్మ, మల్లాగౌడు దంపతులకు జన్మించాడు.

బి.ఓ.ఎల్ చదివి తెలుగు పండితునిగా ఉద్యోగం చేశాడు. శబరిమాత శతకం, నరసింహ శతకం, కవి గౌడప్ప శతకం వంటి భక్తి, నీతి శతకాలతోపాటు రసతరంగిణి, గౌడ ప్రబోధం, కవితా సుధాలహరి మున్నగు రచనలు చేశాడు.

వస్తువైవిధ్యత కలిగిన రచనలు చేసిన రామగౌడు సుకవి సుధాకర, మధురకవి, కవి కోకిల వంటి బిరుదులు పొందాడు. పలు సత్కారాలు అందుకున్నాడు.

ఈ పాఠ్యభాగం గేయ ప్రక్రియకు చెందినది. లయాత్మకంగా ఉండి ఆలపించేటందుకు వీలుగా ఉండేది గేయం. అది పల్లవి, చరణాలతో కూడి ఉంటుంది. కొన్ని గేయాలలో పల్లవి పునరావృతమవుతుంది. సంగీత సాహిత్యాల మేళవింపే గేయం. ప్రస్తుత పాఠ్యాంశం మామిండ్ల రామగౌడు రాసిన 'కవితా సుధాలహరి' ఖండకావ్య సంపుటిలోనిది.

## పాఠం ఉద్దేశం

దేశమంతా స్వాతంత్ర్య వజ్రోత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నవేళ దేశ దాస్య శృంఖలాలను త్రెంచిన త్యాగధనులను స్మరించుకోవాల్సిన అవసరం ఉంది. ఆంగ్లేయుల కుటిలనీతిని ఎదురించి ఈ జాతి స్వేచ్ఛ కోసం అహర్నిశలు శ్రమించిన గాంధీజీ వంటి మహనీయులను స్మరించుకుంటూ, వారి సేవలను కొనియాడుతూ దేశమాత సేవకోసం వారు చూపిన మార్గంలో నడుచుకొని దేశమాత సేవకు పునరంకితం కావాలని తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

## I

అదిగో స్వాతంత్ర్య రథ
మ్మదిగో మన గాంధి పథము
జయధ్వజము కేలదాల్చి
సాగెనదిగొ జనయూథము.

వినిపించెను నలుదిక్కుల
విజయభేరి నినాదములు
జయహిందని పలికె భరత
జాతి సాధు వాదమ్ములు.

సత్యాగ్రహ సమరార్ణవ
జనిత సుధారస కలశము
త్యాగధనుల తపఃఫలము
ధర్మచక్ర యోగబలము.

శాంత్యహింస యను వ్రతమ్ము
సహనము సమతా మతమ్ము
భవ్యమ్మై వెలిగె ఘనము
భారత స్వాతంత్ర్య దినము.

శ్వేతజాతి కుటిల నీతి
సింధురములు ఘీంకరించి
సింధువులను లంఘించియు
హిందుదేశ మాక్రమింప.

అరిమదేభముల దఱుమగ
నహింసాంకుశము ధరించి
హరియై గాంధీజీ ది
వ్యావతారమును దాల్చెను.

మాయోపాయాంధ కార
మగ్నమైన భరతావని
స్వాతంత్ర్య మహోదయమున
స్వర్ణదీప్తితో వెలిగెను.

భారతాంబ కట్టువడిన
బానిస సంకెళ్లు తెగియు
మణిమయాసనము నెక్కియు
మనల నేలినట్టి దినము.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. త్యాగధనులు అంటే ఎవరు?
2. గాంధీజీ ధరించిన ఆయుధం ఏమిటి?

## II

శ్వేతమకరి విషదంష్ట్రల
జిక్కిన స్వాతంత్ర్య మణులు
శాంత్యాయుధ ఘాతమ్ముల
సామాన్యుల వశమాయెను.

రక్తపుటేరులు బాఱగ
రాజ్యమ్ముల గెలుచుకొనెడు
ప్రభువుల కాలమ్మేగెను
ప్రజాస్వామ్యమై సాగెను.

ఎన్నియుగమ్ముల పిమ్మట
పున్నెమ్ముల పంట పండె
బానిస బ్రతుకుల వనిని ప్ర
సూన పరిమళములు నిండె

సుప్రసన్న వదనమ్ములు
సుస్థిర మయసదనమ్ములు
మంజుల నందన వనములు
మధుర సౌఖ్య జీవనములు.

విశ్వవాణి వినుతింపగ
విమలకీర్తి నర్తింపగ
భారత సౌభాగ్యేందిర
పరిపాలన పెంపొందగ.

కులమతముల కుడ్యమ్ముల
కూలద్రోసి ప్రశాంతముగ
జాతీయ సమైక్య రత్న
సౌధములో నివసింతుము

జాతిపిత మహాత్మాగాంధి
సాధించినదీ విజయము
భరతదేశ స్వాతంత్ర్యము
సుర లొసంగు దివ్యవరము.

సకల జనులు సమానముగ
స్వాతంత్ర్యామృతము గ్రోలి
స్వార్థ దుష్ట భూతములకు
సమాధులను గట్టవలెను.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. కులమతాల గోడలు కూలగొట్టాలి అన్న కవి మాటలనుబట్టి మీకేమి అర్థమైంది?
2. రక్తపు ఏరులు పారగా / రాజ్యాన్ని గెలుచుకొనే రాజుల కాలం పోయింది అన్న కవి మాటల్లోని ఆంతర్యమేమిటి?

## III

కుటిల రాజనీతిజ్ఞుల
జటిల సమస్యలను దీర్చి
భారత రాజ్యేందిర గుణ
పాఠమ్ముల నేర్పుచుండె.

ఆయమ కనుపాపలలో
నారంజ్యోతులుగ వెలిగి
తల్లియడుగు జాడలలో
తరలి పోవుదము నిత్యము.

కాలకూట విష సదృశము
లేల భేద వివాదములు
మానవతయె ప్రమోదమ్ము
మతములెల్ల జూదమ్ములు

దీన జనోద్ధరణమునకు
దీక్షబూని బృహత్కార్య
దక్షులమై దారిద్ర్యపు
దైత్యాళిని దునుమవలెను.

నిర్మలమగు మనజెండా
నీడలందు బ్రతుకుచు మన
కంటిరెప్ప వలె దానిని
కాపాడుట కడు ధర్మము.

స్వాతంత్ర్యమ్మనుభవింప
ప్రతి పౌరుని జన్మహక్కు
తల్లిపాలు గ్రోలుటకై
తనయుల కెందులకు చిక్కు.

దేశమాత సేవలకై
దీక్షాకంకణ ధరులై
జనులెల్లరు విజయేందిర
సందేశము విని మనవలె.

స్వాతంత్ర్య ప్రజాశ్రేణికి
సస్యశ్యామల క్షోణికి
జయము జయము మన భారత
జననికి జయమంగళములు.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. కవి వేటిని జూదములు అన్నాడు?
2. దీక్షా కంకణ ధరులు అంటే ఏమిటి?

## సారాంశం

1. అదిగో అదే మన స్వాతంత్ర్యమనే రథం. అదే మన మహాత్మాగాంధీ చూపిన మార్గం. ప్రజలంతా గుంపులుగా జయపతాకాలను చేతబట్టి ముందుకు సాగుతున్నారు.
2. నలువైపుల విజయ నినాదాలు, భేరీ నాదాలు వినిపిస్తున్నాయి. భరత జాతి సాధు జనులందరూ జైహింద్ అని ఎలుగెత్తి చాటుతున్నారు.

3. సత్యాగ్రహ పోరాటమనే సముద్రాన్ని మథించడం వలన పుట్టిన స్వాతంత్ర్యమనే అమృతకలశం, త్యాగమూర్తుల తపఃఫలం, ధర్మవీరుల యోగబలం.

4. శాంతి, అహింస అనే నియమాల పాలన, సహనం, సమత్వం మన అభిమతాలుగా భవ్యంగా, ఘనంగా వెలుగుతున్నదీ నేటి స్వాతంత్ర్య దినం.

5. కుటిల నీతిగల తెల్లవారు అనే ఏనుగులు సముద్రాలు దాటి ఈ దేశాన్ని ఆక్రమించారు.

6. శత్రువులనే మదపుటేనుగులను తరుముటకు అహింస అనే అంకుశాన్ని ధరించిన ఆ విష్ణువే గాంధీజీగా అవతరించాడు. (గాంధీజీ అహింసా అనే ఆయుధంతో తెల్లవారు అనే మదపుటేనుగులను తరిమాడు.)

7. కపట ఉపాయములచేత చీకటిమయమై క్రుగ్గిన భారతదేశం స్వాతంత్ర్యమనే ఉదయకాంతిలో బంగారు రంగుతో వెలిగింది.

8. భరతమాత దాస్యపు సంకెళ్లు త్రెగిపోయి మణులు పొదిగిన సింహాసనంను ఎక్కి మనలను పరిపాలిస్తున్న రోజు.

9. ఆంగ్లేయులనే మొసలి విషపుకోరల్లో చిక్కిన స్వాతంత్ర్యపు మణి శాంతి అనెడి ఆయుధ దెబ్బలకు సామాన్య ప్రజల వశమైంది.

10. రక్తపాతంతో రాజ్యాలు గెలుచుకునే రాజుల కాలం పోయి ప్రజాస్వామ్యం వచ్చింది.

11. ఎన్నో యుగాల తర్వాత పుణ్యపు పంట పండింది. బానిసత్వం అనే వనంలో బ్రతుకులు వెళ్లదీస్తున్న జీవితాలలో పూల వాసనలు నిండాయి.

12. నేడు అందరి ముఖాల్లో ప్రసన్నత, అందరి ఇళ్లల్లో శాంతి, సుస్థిరత అంతటా మనోహరమైన ఉద్యానవనాలతో ప్రజలందరికీ మధురమైన సుఖజీవనం లభించింది.

13. ప్రపంచమంతా కీర్తిస్తుండగా, స్వచ్ఛమైన దేశకీర్తి, నాట్యమాడుతుండగా, భారతదేశ సౌభాగ్యమనే లక్ష్మీ అభివృద్ధి పథంలో సాగింది.

14. కులమతాల గోడలను కూల్చివేసి జాతీయ సమైక్యత అనే రత్నాల మేడలో ప్రశాంతంగా నివసిద్దాం.

15. జాతిపిత మహాత్మాగాంధీ భారతదేశ స్వాతంత్ర్యాన్ని సాధించాడు. అదే మనకు దేవతలు ఇచ్చిన దివ్యమైన వరం.

16. దేశ ప్రజలందరూ సమానంగా ఈ స్వాతంత్ర్యమనెడి అమృతాన్ని తాగి స్వార్థం, దుర్మార్గాలకు సమాధి కట్టాలి. అనగా వాటిని మనదేశంలో లేకుండా చేయాలి.

17. రాజనీతి వేత్తల కపట నాటకాలను అరికట్టి భారత రాజ్యలక్ష్మి వారికి గుణపాఠాలను నేర్పుచున్నది.

18. భరతమాత కనుపాపల్లో ఆరనిదీపాలుగా వెలిగి, ప్రతినిత్యం ఆ తల్లి అడుగుజాడల్లో నడుద్దాం.

19. కాలకూట విషంతో సమానమైన ఈ భేదభావాలు మనకెందుకు? మతాలన్ని జూదక్రీడ వంటివి. మానవత్వమే అందరికీ సంతోషకరం.

20. దీనజనులను ఉద్ధరించుట అనే గొప్ప కార్యమునకు దీక్షను తీసుకొని, సమర్థులమై దారిద్ర్యమనే రాక్షసిని తరిమేయాలి.

21. పవిత్రమైన భారత పతాకం నీడలో బతుకుతూ, దానిని మన కంటికి రెప్పలా కాపాడడమే మన ధర్మం.

22. దేశంలోని ప్రతి పౌరునికి స్వాతంత్ర్యాన్ని అనుభవించే హక్కు ఉంది. తల్లిపాలు తాగేందుకు కొడుకులకు ఆటంకాలెందుకు?

23. దేశమాత సేవచేయుటకు ప్రజలందరూ దీక్షాకంకణ బద్ధులై, స్వాతంత్ర్య సందేశాన్ని గ్రహించి సుఖంగా జీవించాలి.

24. స్వాతంత్ర్యం పొందిన ఈ ప్రజలకు, సస్యశ్యామలమైన ఈ భరతభూమికి జయమగుగాక.

మన భారతమాతకు అన్నింటా శుభమగు గాక!

## పాఠ్యాంశ అన్వయం

ఎందరో దేశభక్తుల త్యాగఫలంగా సిద్ధించిన మనదేశ స్వాతంత్ర్య దినమునకు సంబంధించిన గేయం ఈ స్వాతంత్ర్య రథం. దేశ స్వాతంత్ర్యాన్ని, అందుకు పోరాడిన గాంధీజీ వంటి మహనీయుల త్యాగాలను, దేశ ఔన్నత్యాన్ని కీర్తిస్తూ సాగిన గేయమిది.

కపట నాటకాలతో కుట్రలు పన్ని వ్యాపారం మిషతో ఈ దేశంలోకి అడుగుపెట్టిన ఆంగ్లేయులు మెల్లగా ఈ దేశాన్ని ఆక్రమించారు. వారి దుర్మార్గపు రాజనీతిని అమలుచేసి మనలను బానిసలుగా మార్చారు. మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించిన వారి విషపు కోరల నుండి అహింస, సత్యాగ్రహాలు అనే ఆయుధాలతో మన బానిస సంకెళ్లను త్రెంచిన మహానుభావులు గాంధీజీ తదితరులు. ఆ పుణ్యమూర్తుల యోగబలం, దృఢసంకల్పంతో స్వాతంత్ర్యం సిద్ధించింది. జలియన్ వాలాబాగ్, చౌరా చౌరీ సంఘటనలు జరిగినా సంయమనం కోల్పోకుండా శాంతి, అహింసలతో స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నాం.

ఈ స్వాతంత్ర్య ఫలాలు దేశ ప్రజలందరికీ అందాలంటే కులమతాల అడ్డుగోడలను తొలగించి జాతీయ సమైక్యతవైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. కాలకూట విషం వంటి ఈ భేదభావాలను వదలి అందరం

ఒక్కటే అనే భావనతో ముందుకు సాగాలి. కులాల కుమ్ములాటల్లో, మతాల మంటల్లో చిక్కుకోకుండా దేశప్రజలంతా అన్నదమ్ముల వలె కలిసిమెలిసి ఉంటూ దారిద్ర్యమనే రాక్షసిని తరిమికొట్టాలి. దీనులకు, పేదలకు చేయూత నిచ్చేందుకు కంకణబద్ధులమై మానవత్వమే మా మతం అని చాటాల్సిన అవసరం ఉంది. నిర్మలమైన, పవిత్రమైన మన జండా నీడలో బతుకుతూ మన భారత పతాకాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. భరతమాత కనుపాపల్లో ఆరని దీపాలుగా వెలుగుతూ ప్రతినిత్యం ఆ తల్లి అడుగుజాడల్లో నడువాలి. కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషలు వేరైనా మనమంతా భారతీయులమని చాటుతూ దేశమాత సేవచేయుటకు కంకణ బద్ధులం కావాలి. ప్రతి పౌరుడు అణువణువునా దేశభక్తిని, భరతమాతపై అచంచల ప్రేమను చూపించాలి. ఈ రోజుల్లో ప్రతిదానికి దేశాన్ని తిట్టే దౌర్భాగ్యం దాపురించింది. ఈ దేశ స్వాతంత్ర్య సిద్ధి కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసిన దేశభక్తుల త్యాగాలను నిత్యం స్మరించుకుంటూ, ఆ స్ఫూర్తిని అందిపుచ్చుకొని ముందుకు సాగాలి. దేశమే ముందు తర్వాతే ఏదైనా అనే భావనను మనలో పెంపొందించుకోవాలనే సందేశాన్ని ఈ స్వాతంత్ర్య రథం గేయం అందిస్తుంది.

## భాషా సామర్థ్యాలను సాధిద్దాం

### I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది గేయపంక్తులను చదువండి. దాని ఆధారంగా ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు గుర్తించండి.**

శ్వేత జాతి కుటిల నీతి
సింధురములు ఘీంకరించి
సింధువులను లంఘించియు
హిందుదేశ మాక్రమింప.

శ్వేతమకరి విషదంష్ట్రల
జిక్కిన స్వాతంత్ర్య మణులు
శాంత్యాయుధ ఘాతమ్ముల
సామాన్యుల వశమాయెను.

అ) కుటిల నీతి సింధురములు అని వీరిని పోల్చాడు... ( )

ఎ) సింధువులను          బి) హిందూదేశ వాసులను

సి) ఆంగ్లేయులను          డి) సింధురములను

ఆ) 'సింధువు' అంటే... ( )

ఎ) సముద్రం బి) బిందువు సి) శ్వేతజాతి డి) ఆకాశం

ఇ) శ్వేతజాతి వారంటే... ( )

ఎ) హిందుదేశ వాసులు బి) ఆంగ్లేయులు

సి) శ్రీలంకవారు డి) ఆఫ్రికావారు

ఈ) ఆంగ్లేయులను కవి వేటితో పోల్చాడు? ( )

ఎ) కుక్కలు, నక్కలు బి) కుక్కలు, పిల్లులు

సి) పిల్లులు, ఏనుగులు డి) కుటిల ఏనుగులు, మొసళ్ళు

ఉ) దేశ స్వాతంత్ర్యమనెడి మణి వేటి విషపుకోరల్లో చిక్కింది? ( )

ఎ) ఏనుగు బి) ఎలుక సి) మొసలి డి) నక్క

## II. భాషాంశాలు

### పదజాలం

**1. గీత గీసిన పదాలకు అర్థాలను రాయండి.**

అ) అరేబియా అర్ణవం మనదేశానికి పశ్చిమంవైపు కలదు. __________

ఆ) మీరు బాగా చదివితే మీ తల్లిదండ్రులకు ప్రమోదం కల్గుతుంది. __________

ఇ) ప్రతి ఇంటి చుట్టూ ప్రహరి కుడ్యం ఉంటుంది. __________

ఈ) మనమంతా మంచి పథములో నడువాలి. __________

**2. కింది పదాలకు సొంతవాక్యాలు రాయండి.**

ఉదా : సమరం = యుద్ధం – సమరం ఎప్పటికీ మంచిది కాదు.


అ) విజయభేరి = __________

ఆ) సత్యాగ్రహం = __________

ఇ) త్యాగధనులు = __________

ఈ) అహింస = __________

**3. పాఠ్యాంశం ఆధారంగా మనదేశాన్ని సంబోధిస్తూ కవి వాడిన పేర్లను రాయండి.**




**4. కింది పదాలకు పర్యాయ పదాలు రాయండి.**

ఉదా : అవని = భూమి ధాత్రి

అ) పథం = ________ ________

ఇ) సింధురము = ________ ________

ఈ) సింధువు = ________ ________

ఉ) మకరి = ________ ________

**5. కింది పదాలకు నానార్థాలు రాయండి.**

ఉదా : భూతం = ప్రాణి న్యాయం భస్మం

అ) మాయ = ________ ________ ________

ఆ) అరి = ________ ________ ________

ఇ) అమ = ________ ________ ________

ఈ) సూనం = ________ ________ ________

**4. కింది పదాలకు ప్రకృతులకు వికృతులు, వికృతులకు ప్రకృతులు రాయండి.**

ఉదా : భేరీ – బేరి

అ) మణి – ________

ఆ) పబువు – ________

ఇ) జూదం – ________

ఈ) కీర్తి – ________

## వ్యాకరణాంశాలు

### వృద్ధిసంధి

★ **కింది పదాలను విడదీయండి.**

ఉదా : రసైక = రస + ఏక = (అ + ఏ = ఐ)

1. ఏకైక = __________ + __________ (          )

2. వసుధైక = __________ + __________ (          )

ఉదా : దివ్యైరావతం = దివ్య + ఐరావతం (అ + ఐ = ఐ)

3. దేశైశ్వర్యం = __________ + __________ (          )

4. అష్టైశ్వర్యాలు = __________ + __________ (          )

ఉదా : ఘనౌషధి = ఘన + ఓషధి (అ + ఓ = ఔ)

5. వనౌషధి = __________ + __________ (          )

6. మహౌషధి = __________ + __________ (          )

ఉదా : రసౌచిత్యం = రస + ఔచిత్యం (అ + ఔ = ఔ)

7. దివ్యౌషధం = __________ + __________ (          )

8. నాటకౌచిత్యం = __________ + __________ (          )

పైన ఇచ్చిన పదాలను విడదీసినప్పుడు మీరు గమనించిన విషయాలు సరిచూడండి.

1. ఈ సంధి ఏర్పడేటప్పుడు ప్రతిసారి పూర్వస్వరంగా అ, ఆ లలో ఒకటి వచ్చింది.
2. పరస్వరం స్థానంలో వరుసగా ఏ, ఐ, ఓ, ఔ లున్నాయి.
3. 'అ' కారానికి ఏ, ఐ లు కలిసినప్పుడు 'ఐ' వచ్చింది.
4. 'అ' కారానికి ఓ, ఔ లు కలినిసనప్పుడు 'ఔ' వచ్చింది.

   ఐ, ఔ లను 'వృద్ధులు' అంటారు.

**సూత్రం :** అకారానికి (అ, ఆ, లకు) ఏ, ఐ లు పరమైతే 'ఐ' కారం, ఓ, ఔ లు పరమైతే 'ఔ' కారం ఏకాదేశంగా వస్తాయి.

## III. వ్యక్తీకరణ - సృజనాత్మకత

### స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) స్వాతంత్ర్య రథము పాఠ్యభాగ కవిని గురించి తెలుపండి.

ఆ) 'స్వాతంత్ర్యం త్యాగధనుల తపఃఫలం' అని కవి అనడానికి గల కారణాలేమిటి?

ఇ) జాతీయ సమైక్యత ఎప్పుడు సాధ్యమవుతుంది?

ఈ) 'మన జెండాను కంటికి రెప్పవలె కాపాడుట మనధర్మం' అంటే మీకేమి అర్థమైంది?

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) 'దేశమాత సేవలకై దీక్షా కంకణధరులు కావాలి' దీనిని వివరించండి.

ఆ) 'స్వాతంత్ర్యాన్ని అనుభవించడం ప్రతిపౌరుని జన్మహక్కు ఎలాగో దేశాన్ని గౌరవించడం ప్రతిపౌరుని బాధ్యత' సమర్థిస్తూ రాయండి.

### సృజనాత్మకత

**1. కింది ప్రశ్నకు సమాధానం రాయండి.**

అ) స్వాతంత్ర్య రథం గేయం చదివారు కదా! గేయ లక్షణాలు తెలుసుకున్నారు కదా! భారతదేశ గొప్పతనాన్ని తెలుపుతూ గేయం రాయండి.

### సూక్తి

స్వాతంత్ర్యం అనేది ఓ కనిపించని మహా అదృష్టం.
అది లేనప్పుడు గానీ దాని విలువ తెలియదు.

– రవీంద్రనాథ్ ఠాగూర్

గద్య భాగం

# 7 మా వూరు మాట్లాడింది

– డా॥ సి. నారాయణ రెడ్డి

## కవి పరిచయం



29-07-1931
12-06-2017

ప్రముఖకవి, సాహితీపరిశోధకుడు, బహుభాషావేత్త, ఆచార్య సింగిరెడ్డి నారాయణ రెడ్డి 'సినారె'గా సుప్రసిద్ధుడు. రాజన్న సిరిసిల్లా జిల్లా హనుమాజీపేటలో జన్మించాడు. తల్లిదండ్రులు సింగిరెడ్డి బుచ్చమ్మ, సింగిరెడ్డి మల్లారెడ్డి. నారాయణ రెడ్డి 10వ తరగతి వరకు హనుమాజీపేటలో, సిరిసిల్లలో, కరీంనగర్‌లో చదువుకున్నాడు. హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ కళాశాలలో ఇంటర్మీడియట్, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఏ., ఎం.ఏ. పూర్తిచేశాడు. ఆయన విద్యాభ్యాసం డిగ్రీవరకు ఉర్దూమీడియంలో సాగింది. ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం పర్యవేక్షణలో 'ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు, ప్రయోగములు' అనే అంశంపై ప్రామాణికమైన పరిశోధన చేసి డాక్టరేట్ పట్టాపొందాడు.

నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మధ్యతరగతి మందహాసం, ప్రపంచపదులు, రామప్ప, మా వూరు మాట్లాడింది మొదలైన కావ్యాలు 70కి పైగా రాశారు. సినీగేయ రచయితగా 3,500లకు పైగా పాటలు రాశాడు. సినిమా పాటలకు సాహితీ గౌరవాన్ని కల్పించాడు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యుడుగా, అధికారభాషా సంఘం అధ్యక్షుడుగా (1981–85), అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (1985–89), తెలుగు విశ్వవిద్యాలయం (1989–92) ఉపకులపతిగా, రాజ్యసభ సభ్యుడు (1997–2003) గా, సాంస్కృతిక మండలి ఛైర్మెన్‌గా పనిచేశాడు. తెలంగాణ సారస్వత పరిషత్తుకు సుదీర్ఘకాలం అధ్యక్షుడుగా సేవలు అందించాడు. భారతప్రభుత్వం 1977లో పద్మశ్రీ, 1992లో పద్మభూషణ్ బిరుదులతో సత్కరించింది. 'ఋతుచక్రం' కావ్యానికి రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం (1965), 'మంటలూ మానవుడు' కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం (1974), 'విశ్వంభర' కావ్యానికి జ్ఞానపీఠ్ పురస్కారం (1988) లభించాయి.

నారాయణ రెడ్డి కళాశాల విద్యార్థి దశలోనే కాళోజీ, దాశరథి వంటి వారితో కలిసి 'తెలంగాణ రచయితల సంఘం' స్థాపించాడు. శబ్దశక్తి, అర్థయుక్తి సినారె కలానికి, గళానికీ ఉన్న ప్రత్యేకత.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం వ్యాసప్రక్రియకు చెందినది. వ్యాసం అంటే వివరించి చెప్పడమని అర్థం. సమగ్రత, సూటిదనం, స్పష్టత, సులభంగా అర్థమవడం అనేవి వ్యాస లక్షణాలు. ప్రస్తుత పాఠ్యభాగం డా॥ సి. నారాయణ రెడ్డి రచించిన 'మా వూరు మాట్లాడింది' అనే గ్రంథంలోనిది.

## నేపథ్యం / ఉద్దేశం

నారాయణ రెడ్డి గారు 1970 ప్రాంతంలో మాండలిక పదాలతో ఆరు పాటలు రచించాడు. ఆ తర్వాత ఆసక్తితో జానపద గీతాల్లో, జానపదుల వ్యవహారంలో ఉన్న మరికొన్ని మాండలిక పదాలను విశ్లేషిస్తూ, అర్థ వివరణతో వ్యాసాలు రచించాడు. ఆ వ్యాసాలను 'మా వూరు మాట్లాడింది' పేరుతో ప్రచురించాడు. 'పసుల పోశమ్మ' అనే పాత్రను సృష్టించుకొని, ఆ పాత్ర ద్వారా మాండలిక భాషను మాట్లాడిస్తూ, ఆ మాండలిక పదాల పుట్టుకను, వాటి అర్థాల వెనుక కథలను చమత్కారంగా, ఛలోక్తిగా వివరించిన తీరు ఆసక్తిగొలుపుతుంది. మాండలికపద వైభవాన్ని, సొబగుల్ని పరిచయం చేయడంతోపాటు మాండలికంపై ఆసక్తిని, గౌరవాన్ని ఇనుమడింపజేయడం ఈ పాఠం ఉద్దేశం.

## I

"పట్నం నుండి ఎప్పుడస్తిరి బాంచను?" ఆప్యాయంగా అడిగింది పసులు పోశమ్మ. "పొద్దున్నే వచ్చిన పోశమ్మా, ఇంకా ఆ బాంచనేమిటి? కాలంమారి"... నా మాటకు మధ్యలో అడ్డొచ్చి పోశమ్మ అన్నది. "అదేంది బాంచను! ఏది మారితేంది. మేం మీ గులాపోల్లం". నా బుర్రలో గిర్రున తిరుగుతున్నాయి ఆ రెండు మాటలు. "బాంచను", "గులాపోల్లం".

ఎక్కడివీ మాటలు! ఎప్పటివీ మాటలు! అలనాటి విషవృక్షంలాంటి నైజాం నవాబు ఫ్యూడల్ వ్యవస్థకు పూసిన పిచ్చిపూలవి. ఇలాంటివి ఎన్నెన్నో ఎప్పుడో రాలిపోయాయి. ఇంకా మిగిలివున్నవాటిలో ఇవి కొన్ని. "బాంచను" అంటే "బానిసను". "గులాపోల్లం" అంటే "గులాములం". బానిసతనానికి, వెట్టిచాకిరికి ఇంకా మిగిలివున్న శిథిల పదశేషాలివి.

"మస్కుల లేసినా పని ఒడుస్తలేదయ్యా" – పోశమ్మ ఉవాచ. మళ్లీ రెండు మాటల మీద తిరుగుతున్నది నా మనస్సు. "మస్కుల, ఒడుస్తలేదు". ఒడుస్తలేదంటే పూర్తి కావడంలేదని. ఇది నేను మా వూళ్లో చిన్నప్పటి నుంచి వింటున్న మాటే. "నాలుగు మక్కంకులు పంపించు" అంటే "నిన్ననే ఒడిసిపాయె" అనడం. "వడియు" అనే క్రియ వుంది. కారడం, ఇంకడం అనే అర్థంలో. ఒడిసిపోవడమంటే ఇదే. అయిపోవడమన్న మాట. మరి "మస్కుల" సంగతి. మస్కుల, మబ్బుల అనే రెండు మాటలు తెలతెలవారుజామున అనే అర్థంలో వాడుకలో ఉన్నాయి. ఈ రెండు మాటలు మననం చేసుకుంటూ వుంటే మరికొన్ని పదాలు బిలబిలా మూగుతున్నాయి. "అంబటాల్ల, ఎండుగులాల్ల, పసులాల్ల, ఎసర్లాల, గైరాల్ల"! ఎన్నెన్ని ఆల్లలు. ఏమిటీ ఈ ఆల్లలు. ఆల్లలంటే – యాల్లలు – వేళలు. మస్కుల మొదలుకొని గైరాల్ల వరకు అన్నీ వేళావిశేషాలే.

"మస్కుల" అంటే మసకవేళ. "మబ్బుల" అన్నా మసకవేళే. మసకకూ, మబ్బుకూ ఇక్కడ ఒకే అర్థం. అంటే వేకువజామున అని. చీకటి పోలేదు, వెలుతురు రాలేదు. ఈ రెంటికి మధ్య స్థితి మసకవేళ, మబ్బువేళ.

"కండ్లకేమన్న మబ్బు గమ్మిందా" అనే అదిలింపులోని మబ్బు మసకే.

పొద్దు పొడిచింది. బారెడెక్కింది. జాముసేపయింది. చేలలో, పొలాల్లో పనిచేసే రైతులకు అన్నమో, అంబలో తీసుకెళ్తారు భార్యలో, బిడ్డలో. అదే "అంబటాల్ల". పండిన ధాన్యం ఇంటికి తెచ్చి వాకిళ్ళలో ఎండబోస్తారు. "అంబటాల్ల"కు ఎండబోస్తే అది సాయంత్రం ఏ నాలుగు, అయిదుగంటల మధ్యో ఎండుతుంది. అదే "ఎండుగులాల్ల". ఆరబోసిన ధాన్యం ఎండేవేళ. పశువులు ఇల్లకో, కొట్టాలకో చేరేవేళ "పసులాల్ల". పొద్దు వాలుతుంది. సాయంత్రం ఆరు గంటలు అయ్యి కాకముందే పొయి రాజుతుంది. అన్నం ఉడుకుతుంది. ఎసరు దిగుతుంది. అదే "ఎసర్లాల్ల". ఇవి సరే. చివరి మాట మాటేమిటి? "గైరాల్ల" – ఇది ఏ వేళ?

గైర్ అంటే పరాయి, తనది కానిది. గైర్+వేళ=గైరాల్ల. ఏమిటేమిటి? "వేళ కాని వేళ" అనేది విన్నారు కదా! అదే ఈ "గైరాల్ల". ఇంగ్లీషులో Odd time. "మస్కుల" నుంచి "ఎసర్లాల్ల" వరకు కానివేళ ఈ గైరాల్ల. అది జామురాత్రి కావచ్చు – అర్ధరాత్రి దాటిపోవచ్చు.

ఈ వేళల జోలల్లో నేనుంటే పోశమ్మ సణుగుడు – వడ్లు చెరుగుతూ, "అన్నీ తర్రలే. అందరోలిగే మనం జేసినం. కాని పని అద్దెమద్దెమయి పోయిందయ్య"–

"అద్దెమద్దెం" – మద్దెల ముక్తాయింపుల్లా ధ్వనించిన పునరుక్తులు. మిగతా మాటలు ఎగిరిపోయినై. "అద్దెమిద్దెమే" అద్దం లాంటి చెవిలో అగుపిస్తూ వినిపిస్తూ వున్నది. "అద్దెమద్దెమయి పోయింది" అనే వాక్యం వెనక ఊపిరి తీసుకునే నిట్టూర్పును బట్టి, ఆ వాక్యం నిరాశను పుక్కిలిస్తున్నదని తెలిసింది. కానీ మాటల తీగల మాటున దాగిన స్వరరహస్యాలు కనుక్కోవాలి కదా! మీటితే కదా అవి బయటపడేది.

"అద్దెమద్దెం" – "అర్ధమర్ధం" – ఏమిటి దీని అర్థం? అర్థం అంటే సగమా? ఔను సగమే. మరో అర్థమన్నా సగమేనా? ఔను సగమే. అర్థం అర్థం అంటే సగం సగం ఎందుకు కాకూడదు? "అద్దెమద్దెమయి పోయింది" అన్న పోశమ్మ వాక్కులోని అర్థం అర్థమయిపోయింది. అంటే పూర్తిగా ఫలించలేదు అనే అర్థం సార్థకంగా పలికింది యాసగా, పదవిపరిణామ పరిశోధకులకు కొండంత ఆశగా.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. 'అద్దెమద్దెం' అనే పదానికి రచయిత ఇచ్చిన వివరణ ఏమిటి?
2. వేళలకు సంబంధించి ఎన్ని రకాల పదాలు ఉన్నాయి?

## II

"ఆడపిల్లలు లేనివాడు – ఓయమ్మలారా
యాడబన్నా తెల్లవారు – నా ఓయమ్మలారా"

పొలంలో నుంచి పాట వినిపిస్తున్నది. పాడుతున్నదెవరా అని చూస్తే పసుల పోశమ్మ. పోశమ్మ మాటల్లో మాండలికాల మాటలు దొరికిన నాకు ఈసారి ఆమె పాటలో వర్తమాన సాంఘికస్థితిని వడబోసిన భావన దొరికింది. ఆడపిల్లలు కన్నతండ్రి పడే ఇబ్బందులు ఇందులో భంగ్యంతరంగా ధ్వనించాయి. ఆడపిల్లలను కననివాడు ఎక్కడ పడుకున్నా తెల్లారిపోతుందట.

ఆడపిల్లలంటే పెళ్లిళ్లు ఉరుముకొస్తాయి. పెళ్లిళ్లంటే బోలెడు కట్నాలు పళ్లు కొరుకుతాయి. ఆ ఉరుముల్లో – ఆ యెడాపెడా చరుపుల్లో కన్నతండ్రికి కన్నంటుకోదు. మరి మగరాయుళ్లను కన్నవాడు "రొమ్మున చేయిడి" నిద్రపోతాడు. కట్నాల సమస్యతో కటకటలాడే ఆడపిల్లల తండ్రుల అవస్థను ఆ జానపద హృదయం ఎంత అర్ద్రంగా ఆవిష్కరించిందో –

ఈ పాటను గూర్చి ఆలోచిస్తూ ఇలా నేను ప్రవహిస్తూ పోతూవుంటే పక్కచేనిలో కోడెగిత్తను తెగబాదుతున్న శబ్దం వినిపించింది. "ఏమిటి పోశమ్మా! పాపం ఆ కోడెను చంపేస్తున్నారు" అన్నాను. ఔను "పసిగోదను నాగలికి కడితే ఏంనడుస్తది? కైముదిరినంకనే కట్టాలె" – పోశమ్మ వాక్యంలో మళ్లీ మాండలిక భాషాయోష మందహాసం చేసింది. పాట నుంచి మాటకూ నా మనసు పరవళ్లు తీసింది. 'గోద' అంటే గొడ్డు – పసిగోద అంటే ఇంకా ముదరని కోడెగిత్త. అది సరే. ఈ కైముదరడం ఏమిటి? ముదరడం తెలుసు. కైముదరడం! ఆరు శతాబ్దాల వెనక్కి ఎగిరిపోయింది పదజిజ్ఞాస.

"ప్రాయమింతకు మిగుల కైవ్రాలకుండ
కాశికాఖండమను మహాగ్రంథమేను
తెనుగు చేసెద..." (కాశీఖండం – అవతారిక 7వ పద్యం)

శ్రీనాథుని వాణి వినిపించింది ప్రౌఢ సుందరంగా. అప్పటికే శ్రీనాథుడు చాలా చాలా కావ్యాలు వ్రాశాడు. కాదు, కొన్నిటిని అలా ఊదేశాడు. నెత్తిమీద పిల్లజుట్టున్న రోజుల్లోనే మరుత్తరాట్చరిత్ర వ్రాశాడు. మొలక మీసం మొలిచేనాటికే శాలివాహన సప్తశతి గుప్పించేశాడు. ఆ తర్వాత శృంగార నైషధం, భీమఖండం – అలా అలా పూర్తి చేశాడు. మరి వయసు మళ్లిపోతున్నది. ఇంచుమించుగా వాలిపోతున్నది. మరీ వాలకముందే – పండి ఒరిగి పట్టు తప్పక ముందే – కాశీఖండం రాస్తాను అన్నాడు. అందుకు అతడు వాడిన అచ్చతెనుగు నుడి – ఆనాటి పలుకుబడి – "కైవ్రాలు"ట. పైరుపండి ఒరిగితే అది కైవ్రాలినట్టు. శ్రీనాథుని కాలంలో అంటే ఆరువందల ఏళ్ళ క్రితం వాడుకలో ఉన్న ఈ 'కై'వ్రాలడంలోనే కాదు, పడడం, సడలడం, ముదరడంలోనూ చోటు చేసుకుంది. 'కై' అంటే చెయ్యి – 'కై'వ్రాలడమంటే చెయ్యి వాలిపోవడమన్నమాట. తొలిదశలో ఈ అర్థమే ఉన్నా తరువాతి కాలంలో చెయ్యి అనే అర్థం తొలిగిపోయి కైవ్రాలడమన్న పదానికి వాలిపోవడమనే అర్థం ఏర్పడింది. శ్రీనాథుడు 'కైవ్రాలు' అనే అర్థంలోనే 'కైపడు' 'కైసడలు' అనీ ప్రయోగించడం కనిపిస్తుంది.

పసుల పోశమ్మ ప్రయోగించిన 'కైముదరడం' అనే పదానికి మాత్రం బాగా ముదరడం అనే అర్థం సరిగ్గా కుదురుతుంది.

"ఔను బాపూ! కైముదురంగనే కోడెను నాగలికికట్టాలె. అబద్ధం కాదు – నువ్వద్ది" –

'ఔనౌను పోశమ్మా! నీమాట అబద్దం అని నేనెందుకంటాను' అన్నాను గాని – 'నువ్వద్దే' – అనలేకపోయాను. ఎందుకంటే 'నువ్వద్దే' అనే పదం తొలిసారిగా విన్నవాళ్లకు 'నువ్వు వద్దే' అన్న భావం స్ఫురించవచ్చు గదా! పోశమ్మ నన్ను వద్దని ఎలా అంటుంది. అందుకని ఆగిపోయాను. 'నువ్వద్ది' వెనక ఏదో విపరీతశబ్దం సుఖంగా నిద్రిస్తున్నదని, ప్రయత్నం సాగింది ఆ పదాన్ని మేల్కొల్పడానికి. 'నువ్వద్ది' అంటే అంతుపట్టలేదు. 'అంతుపట్టలేదా' అంటూ ఆ పక్కనే ఉన్న 'అబద్ధం' ముందుకొచ్చింది. ఒరె ఒరె! అబద్ధాన్ని బొత్తిగా మరిచిపోయానే. "అబద్ధాన్ని మరిస్తే నువు చాలా గొప్పవాడివోయ్" – ఓ అంతరాత్మా! శాంతించు కాసేపు అర్థచర్చలో ఉన్నాను. 'నువ్వద్ది–నువ్వద్ది–నువ్వద్ది' ముమ్మారు నెమరువేసుకున్నాను. ఒక

మెరుపు మెరిసింది. 'నిబద్ధి' అని. నీవు – నువ్వుగా మారడం ఉంది. నిబద్ధి – నువ్వద్ధి అయివుంటుంది. నిబద్ధి – నిబద్ధం వికృతి ఎందుకు కాకూడదు? సరే నిబద్ధం అంటే అబద్ధం కానిది. అబద్ధం కానిది నిబద్ధం – అంటే నిజం. నిబద్ధం నిబద్ధిగా మారి, నిబద్ధి నివ్వద్ధిగా మారి, నివ్వద్ధి నువ్వద్ధిగా మారిపోవడం – పదపరిణామజ్ఞులకు గిరి అంత సంతోషాన్ని గరిటలో నూరిపోయడం.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. కైముదరడం – గురించి వివరిస్తూ రచయిత చెప్పిన అంశాలు ఏమిటి?
2. 'అబద్ధం కాదు – నువ్వద్ధి' అని అనడాన్ని మీరెలా అర్థం చేసుకున్నారు?

## III

సన్నసన్నగా ముసురు. చెప్పులు కొంచెం కొంచెం దిగబడుతున్నాయి. నెమ్మది నెమ్మదిగా నడుస్తున్నాను. చాలా రోజులయింది. పసుల పోశమ్మ కనిపించింది. చినుకుల్లా ఆలోచనలు. "అయ్యో బాపూ! పిల్లతొవ్వ బట్టినవు. జారిపడేవు" – పసుల పోశమ్మ చల్లని కంఠస్వరం. పచ్చని పైరులాంటి ఆప్యాయత. ఆ పలకరింపు మళ్లీ నా చెవిలో మారుమోగింది. 'పిల్లతొవ్వ' ఎంతెంతో మెత్తగా ఎద అంచులు మీటింది. పిల్లగాలి ఉంది. పిల్లవాగు ఉంది. మరి ఈ 'పిల్లతొవ్వ' – పిల్లత్రోవ అంటే కాలిదారి. కాలినడకతో పోయేది పిల్లతొవ్వ, బండ్లు సాగేది 'బండ్లబాట'. చిన్న, లేత అనే అర్థాల్లో ఉన్న 'పిల్ల' అనే పదం తోవతో కలుపుకున్న పొత్తు ఎంతో కొత్తగా భాసించింది.

పోశమ్మా నేనూ అలా నడుస్తూనే ఉన్నాము. 'తుర్ తుర్ తుర్' అంటూ ఒక అమ్మాయి ధ్వన్యనుకరణం చేస్తూ దూసుకుపోయింది మా యెదటి నుంచి. అలాగే తేరిపారచూస్తున్నాను ఆ అమ్మాయివైపు. పోశమ్మ నా విస్మయాన్ని గమనించి అన్నది 'ఏందిబాపూ బీరిపోతున్నావు. అదో బిత్తిరిది". బీరిపోతున్నవు, బిత్తిరిది – ఒక్క మాటుగా రెండు మాటలూ రెక్కలెత్తాయి. నేను విస్తుపోయి చూస్తున్నాను. అదే బీరిపోతూ చూడడమన్నమాట. 'బీరిపోవు' గురించి ఆలోచిస్తుంటే భారతంలోని విరాటపర్వం గుర్తుకొచ్చింది. తిక్కన్న ప్రయోగం స్మృతికి తగిలింది. 'పొడిచిన వెస బీఱువోవక యొండొరు నందంద పొడుచుచు' (విరాట 2–347). ఇక్కడ బీఱువోవక అంటే బలహీనం కాక అని. ప్రాచీన కావ్యాల్లో ఈ 'బీఱువోవు' అనే పదం వ్యర్థం కావడం, బలహీనం కావడం అనే అర్థంలోనే ఉంది. ఇంతకూ బలహీనం కావడం అనే గుణం నివ్వెరలోనూ జరుగుతుంది. ఆశ్చర్యంలో నీరుగారిపోయే లక్షణం లేదా మరి, ఆ 'బీఱుపోవు' మాటే ఈ 'బీరిపోవు'గా మారింది. అర్థవ్యక్తిలో చిన్న మార్పును తెచ్చిపెట్టుకుంది. 'బీరిపోవు'లో నుంచి 'బిత్తిరిది' ఎదురొచ్చింది. ఆ అమ్మాయి వాలకం చూస్తుంటే స్తిమితం లేని వ్యక్తిలా ఉంది. అరపిచ్చో, పావుపిచ్చో ఉన్నట్టూ అనిపించింది. 'బిత్తిరిది' ఆవిడ. బిత్తరం అంటే చంచలం అని ప్రాచీన కావ్యాల సాక్ష్యాలు బోలెడు. ఆంధ్ర కవితాపితామహులే అన్నారు కదా మనుచరిత్రలో 'అనిమేషత్వము మాన్చె బిత్తరపుచూపు' అని. బిత్తరచూపు, చంచలమైనచూపు, బిత్తరం ఉన్నది బిత్తరిది. అంతే. అదే 'బిత్తిరిది'. అంటే మనస్ చాంచల్యమున్నది. మరో రకంగా చెబితే పిచ్చిది. ఇది స్త్రీపరంగానే కాదు. పురుష పుంగవునికి కూడా వర్తిస్తుంది. 'బిత్తిరోడు' అని. అప్పుడప్పుడు ఇది ఆమ్రేడితమవుతుంది. 'ఏహే! బిత్తిరి బిత్తిరి జేస్తవు'. 'బిత్తిరిది' కాస్తా అచ్చుతప్పుకు లోనై 'బిత్తళిది' అయితే వ్యవహారం బెడిసిపోతుంది. 'బిత్తళి' అంటే దిసమొలది.

మనసులో ఈ మాటలవేళ్లు తవ్వుతూనే పోశమ్మను "ఏమిటీ ఊరిసంగతులు" అని అడిగాను. ఏవేవో సమాచారాలు ఏకరువుపెడుతున్నది. మంచీచెడూ, న్యాయం అన్యాయం ఆమె మాటల్లో వెలుగునీడల్లా స్ఫురిస్తున్నాయి. చెబుతూ చెబుతూ అనేసింది. "ఆడు ఈ ఊరికి మొక్కులమైపోయిండయ్యా" అని. మొక్కులం అనే మాటలో 'మొక్కు'ను విడదీసి చూస్తే రావలసిన అర్థం రాదు. అంతేకాదు పోశమ్మ చెప్పింది. ఒక దుర్మార్గుణ్ని గురించి. మొక్కులమైపోయిండు అంటే కంటకమైపోయాడనో, బల్లెం అయిపోయాడనో అర్థం రావాలి. మొక్కలం అనే పదానికి 'ముష్కరత్వం' అనే అర్థముంది. అసలు ముష్కరం వికృతే మొక్కలం. తమాషాగా మారింది రంగు. శ్రీనాథుడు కాశీఖండంలో అన్న 'శక్ర నీ మొక్కలంబుల్ వినంబడ్డవే కావె' అనే దండకభాగం ముష్కరత్వాన్నే బలపరిచింది. ఆ దుర్మార్గుడు ఊరికి 'మొక్కులమై' పోయాడంటే ముష్కరుడయ్యాడన్న మాట. ఆ మాట అలా అలా తిరుగుతూ ఉండగా 'బాపూ' అని దూరం నుంచి పిలుపు. అరే... అరే... అదుగో – మైసయ్య. మైసయ్యకు నన్ను ఎలుగెత్తి పిలిచే చనువేర్పడింది. బాగుంది. కానీ వానచినుకులాంటివాడు. చేతికందడే. "మైసయ్యా! ఉండు. ఉండు. నీతో పని ఉంది". లాభంలేదని నేనూ పరుగుతీశాను. పట్టేశాను. కిలకిల నవ్వుతూ అన్నాడు. 'బాపూ! అబద్ధమాడుతున్నావ్! నాతో నీకు పనికాదు, పాట కావాలె". ఎంత బాగా చదివాడు నా అంతరంగాన్ని. "ఔను మైసయ్యా! ఈసారి ఒక కొత్తపాట పాడు. నాలుగు నుడుగులు చదివి తుర్రుమనొద్దు. ఏదీ పాడు" నేను బతిమిలాడడం భావ్యం కాదని అనుకున్న పోశమ్మ "వారీ!" అంటూ ఉరిమేసరికి మైసయ్య అందుకున్నాడు.

"కాల్లిరుగగొట్టిండు నా దేవుడు – కాల్ల
కడియాలు దెచ్చిండు నా దేవుడు.
నడుమిరుగగొట్టిండు నా దేవుడు – నడుము
ఒడ్డాలం దెచ్చిండు నా దేవుడు
మెడలిరుగగొట్టిండు నా దేవుడు – మెడల
కంటెనే వెట్టిండు నా దేవుడు."

ఈ రకంగా పాడుతూ పోతున్నాడు. ఎవడీ దేవుడు? ఎందుకలా చేస్తున్నాడు? కాళ్లు విరగ్గొట్టడమెందుకు? కడియాలు తేవడమెందుకు? ఎందుకింత క్రూరత్వం? ఏమిటీ కసి? సమాధానం పాట చివరి పంక్తుల్లో దొరికింది.

"బాయిాల కప్పోలె వాడున్నడూ
బంగారు బొమ్మోలె నేనున్నా
చేతూల కట్టోలె వాడున్నడూ
సెనిక్కాయ పువ్వోలె నేనున్నా."

తెలిసింది విషయం. ఆ దేవుడు భర్త. ఆవిడ భార్య. ఆమె వన్నెలో బంగారుబొమ్మ. పరువంలో విరగబూసిన సెనగపువ్వు. అతడు బావిలోని కప్ప. కూపస్థమండూకం. అజ్ఞాని. మూర్ఖుడు. చేతిలో కట్టెవంటివాడు. కసితప్ప రసికత

ఎరుగనివాడు. ఆమె అందాన్ని చూస్తే అతనికి అసూయ. ఏదో నెపంతో చావబాదేవాడు. ఏ పెళ్లికో వెళ్లాలన్నప్పుడు మాత్రం ఎంతో ఆప్యాయత ఉన్నట్టు కడియాలూ, కంటె, ముక్కుపుల్లలూ, వొడ్డాణం తెచ్చి పెట్టుకో అనేవాడు. జోడుకుదిరిన ఈ పడుచుజంటలో ఆ పసిడిబొమ్మ పడుతున్న పాట్లనూ, నిర్వేదాన్నీ ఎంత హృదయద్రావకంగా వర్ణించిందీ జానపదగీతిక. 'కూపస్థ మండూక' అనే సంస్కృత న్యాయాన్ని అచ్చతెలుగులో అందరికీ అందుబాటులో ఉండేట్టు 'బాయిల కప్పోలె' అనడం తెలుగునుడికి ప్రాణం పోయడం. 'సెనిక్కాయ పువ్వోలె' అనే ఉపమకూడా సరికొత్తదే. ఆ పల్లెపడుచుకు తనకు సన్నిహితంగా ఉన్నపూలే గుర్తొస్తాయి. పారిజాతాలూ, మందారాలూ స్ఫురించవుగదా. సెనగపువ్వు కళ్లముందు శిరసూపింది. అంతే. అది ఈ పాటలో విరబూసింది.

ఇంత చక్కని పాటపాడిన మైసయ్యను మెచ్చుకోవాలనీ, పాడమని గద్దించిన పోశమ్మకు కృతజ్ఞతలిచ్చుకోవాలనీ చూస్తే – ఏదీ? ఆ యిద్దరూ లేరే? మెచ్చుకోలు కోసం పాడిన పాట కాదుగదా అది. పైరగాలిలాంటిది. స్వచ్ఛంగా, స్వచ్ఛందంగా వీస్తుంది. పయనం తనది. ఫలితం మనది.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. బిత్తిరి – పదం వెనక ఉన్న కథ ఏమిటి?
2. 'మొక్కలమైపోయిండు' అని ఎవరిని అంటారు?

## పాఠ్యాంశ అన్వయం

మనం మాట్లాడుతున్నది తెలుగు భాషే అయినా, అందులో మాండలిక భేదాలున్నాయి. ఆ మాండలికాల్లోనూ ప్రాంతాలను బట్టి భాషావ్యవహారంలో తేడాలు ఉంటాయి. ఇలా ఏ ప్రాంతంలో వ్యవహరించే భాష ఆ ప్రాంతం వారికి ప్రత్యేకతను సంతరించిపెడుతుంది. చదువుకోసమో, ఉద్యోగం కోసమో ఒక ప్రాంతంవారు మరో ప్రాంతానికి వెళ్ళినప్పుడు, ఇతర ప్రాంతాలవారి రచనలు చదివినప్పుడు ఉపన్యాసాలు విన్నప్పుడు భాషావ్యవహారంలోని భేదాలను గమనించవచ్చు.

సాధారణ వ్యక్తులు భాషావ్యవహారంలోని తేడాలు గమనించి ఆశ్చర్యపోతారు, ఆనందపడతారు. కానీ భాషాభిమానం కలిగిన వ్యక్తులు భాషావైవిధ్యాన్ని తెలుసుకోవడంతోపాటు ఆ పదాల పుట్టుకకు గల కారణాలను విశ్లేషిస్తారు. మనం సాధారణ పదాలుగా భావించి ఉపయోగించే పదాల వెనుక ఉన్న విశిష్టమైన, విశేషమైన అర్థాలను విశ్లేషించి అందరిలో భాషాభిమానాన్ని పెంపొందిస్తారు. నారాయణ రెడ్డి 'మా వూరు మాట్లాడింది' అనే ఈ పాఠం ద్వారా ప్రాంతీయ భాష విశిష్టతను మాధుర్యాన్ని పరిచయం చేశాడు.

మన ప్రాంతంలో వ్యవహరిస్తున్న పదాల పుట్టుక వెనుక ఉన్న ఆసక్తికరమైన కథలను తెలుసుకొని అందరికీ తెలియజేయాలి. రోజువారి వ్యవహారంలో ఆ భాషను ఉపయోగించాలి. మన భాషను ప్రేమించడమే కాదు, ఇతరుల భాషను, యాసను గౌరవించాలి అన్న మంచి సందేశాన్ని ఈ పాఠం అందిస్తుంది.

# భాషా సామర్థ్యాలను సాధిద్దాం

## I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది లేఖను చదువండి. దారి ఆధారంగా ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.**

బందరు,
18-03-1936.

From
విశ్వనాథ సత్యనారాయణ, M.A.
బచ్చుపేట, బందరు.

**ఆర్యా,**

మీకు నేను అపరిచితుడనయ్యును పేరు విన్న మాత్ర పరిచయము పురస్కరించుకొని యీ లేఖ వ్రాయుచున్నాను. నేను ఇదివరకు ఎప్పుడు హైదరాబాదు రాలేదు. అచ్చటికి వచ్చి నా గ్రంథముల ప్రచారము చేయవలయునని యున్నది. 1. ఆంధ్ర ప్రశస్తి, 2. అనార్కలీ, 3. కిన్నెర పాటలు, 4. వేణరాజు, 5. ఏకవీర, 6. సౌభద్రుని ప్రణయయాత్ర (శ్రీ నాయని సుబ్బారావు గారిది) వీరు ప్రస్తుతం నరసరావుపేట High School Assistant గా ఉంటున్నారు. వీరు నాకు పరమాప్తులుగాన వీరి గ్రంథము కూడ నా గ్రంథమాలలో బ్రచురించినారు. ఈ ఆరు పుస్తకములు తమకు పంపించుచున్నాను. ఇందు నాచే రచింపబడిన గ్రంథములు ప్రకటితములు గావలసియున్నవి. ఈ గ్రంథమాలకు తెలుగు దేశంలో కొన్ని చోట్ల చందాదారులను, అభిమానులను, రాజ పోషకులును చేర్చితిని, ఇప్పుడు తమ స్థలములో గూడ చేర్చవలయునని యున్నది. కానీ స్థానిక బలము, పలుకుబడి, పరిచయం, ఔదార్యముకల ఏ మిత్రులో సహాయము చేసినగాని నేనట్టి పని చేయజాలను. మిమ్మల్ని గూర్చి నేను వినుటయు తమ పత్రిక కొన్నాళ్ళు నేను చూచుటయు గారణములుగా మీరీ సాయము నాకు చేసి పెట్టుదురని విశ్వాసము నా మనస్సులో గలిగినది. దాని పురస్కరించుకొని యీ యుత్తరము వ్రాయుచున్నాను. నేను ఈ నెలాఖరుకు హైదరాబాదు వత్తును. తమకు వీలయినచో మకాం మీ యింటనే చేయుదును. నాకు వేరే పరిచయస్తులు లేరు గనుక దయచేసి నన్ను మిత్రునిగా పరిగణించి యీ నా ప్రయత్నమునకు సానుకూల పడెదరని యాసించుచున్నాను.

చిత్తగించవలెను
**విశ్వనాథ సత్యనారాయణ**

To
సురవరం ప్రతాపరెడ్డి గారు

ప్రశ్నలు :

అ) ఈ లేఖ ఎవరు ఎవరికి రాశారు?

ఆ) 'పరమాప్తులు' అని ఎవరిని అంటారు?

ఇ) 'సౌభద్రుని ప్రణయ యాత్ర' ఎవరు రాశారు?

ఈ) విశ్వనాథ సత్యనారాయణ రచనలు ఏవి?

ఉ) "అపరిచితుడు' అంటే అర్థం ఏమిటి?

## II. భాషాంశాలు

### పదజాలం

**1. కింది వాక్యాల్లో పర్యాయపదాలను గుర్తించి రాయండి.**

అ) పోతన భాగవతమనే కృతిని రచించాడు. ఆ కబ్బము ఎంతో ఆదరణ పొందింది.

ఆ) అధర్మ మార్గాన్ని విడనాడాలి. అక్రమ మార్గాన్ని వదిలిన వారికి శుభాలు కలుగుతాయి.

ఇ) గ్రామాల్లో అన్ని వస్తువులు లభిస్తున్నాయి. నేడు జనపదాలు పట్నాలను తలపిస్తున్నాయి.

**2. కింది పదాలకు నానార్థాలు గుర్తించి రాయండి.**

( శ్వాస, అజ్ఞానం, కోరిక, ప్రాణము, మేఘం, హృదయము )

అ) మబ్బు = ________________ ________________

ఆ) ఊపిరి = ________________ ________________

ఇ) మనస్సు = ________________ ________________

**3. కింది పదాలకు సొంతవాక్యాలు రాయండి.**

అ) ఎలుగెత్తి = ________________________________

ఆ) ఏకరువు = ________________________________

ఇ) ఒడుస్తలేదు = ________________________________

ఈ) నూరిపోయి = ________________________________

ఉ) తుర్రుమను = ________________________________

**4. కింది పదాలను సరైన అర్థాలతో జతపరచండి.**

| | | | |
|---|---|---|---|
| అ) ఎసర్లాల | (     ) | i) | వేళ కాని వేళ |
| ఆ) మస్కుల | (     ) | ii) | అబద్ధం కాదు నిజం |
| ఇ) గైరాల్ల | (     ) | iii) | చీకటి పోని, వెలుతురు రాని స్థితి |
| ఈ) నువ్వద్ది | (     ) | iv) | పూర్తిగా ఫలించలేదు |
| ఇ) అద్దెమద్దెం | (     ) | v) | అన్నం వండుకునే సమయం |

## వ్యాకరణాంశాలు

**★ కింది వాక్యాలు పరిశీలించండి.**

అ) కృష్ణయ్య ఎప్పుడు తెల్లనివస్త్రాలు ధరిస్తాడు.

ఆ) అది పావని పుస్తకం

ఇ) హైరదాబాదు నగరం అందమైనది.

**వాక్యంలో గీత గీసిన పదాలు గమనించండి.**

తెల్లని వస్త్రాలు – తెల్లనైన వస్త్రాలు

పావని పుస్తకం – పావని యొక్క పుస్తకం

హైదరాబాద్ నగరం – హైదరాబాద్ అనే పేరుగల నగరం

పై పదాల్లో వేర్వేరు అర్థాలు గల పదాలు ఒకే పదంగా ఏర్పడ్డాయి కదా. ఈ విధంగా అర్థవంతమైన రెండు పదాలు కలిపి ఒక పదంగా ఏర్పడటాన్ని **'సమాసం'** అంటారు. సమాసంలో మొదటి పదాన్ని పూర్వపదం అని, రెండవ పదాన్ని 'ఉత్తరపదం' అని అంటారు. సమాస పదాన్ని వివరించి చెప్పడాన్ని 'విగ్రహవాక్యం' అంటారు. పై పదాల్లో 'పావని పుస్తకం' సమాస పదం. ఆ పదాన్ని వివరించి చెప్పిన 'పావని యొక్క పుస్తకం' అనేది విగ్రహవాక్యం.

**★ కింది సమాస పదాలు పరిశీలించండి.**

అ) అన్నదమ్ములు

ఆ) నాలుగు వేదాలు

అన్నదమ్ములు – అన్న మరియు తమ్ముడు. ఈ సమాసపదంలోని అన్న, తమ్ముడు ఇద్దరూ ప్రధానమే. ఇలా రెండు లేదా అంతకంటే ఎక్కువ సమప్రాధాన్యంగల పదాలతో ఏర్పడే సమాసాన్ని **'ద్వంద్వ సమాసం'** అంటారు.

నాలుగు వేదాలు – నాలుగు సంఖ్యగల వేదాలు. ఈ సమాసపదంలో సంఖ్యను సూచించే 'నాలుగు' పూర్వపదంగా ఉంది. ఇలా సంఖ్యావాచకం పూర్వపదంగా ఉండే సమాసాన్ని **' ద్విగు సమాసం'** అంటారు.

**కింది పేరా చదువండి. అందులోని సమాస పదాలను గుర్తించి, వాటికి విగ్రహవాక్యాలు, సమాసం పేరు రాయండి.**

అది ఒక అందమైన పల్లెటూరు. ఆ ఊరిలో సీతారాముల దేవాలయం ఉంది. ఆ ఊరికి నాలుగుదిక్కుల్లో నాలుగు చెరువులు ఉన్నాయి. మంచి పంటలు పండుతాయి. రైతులంతా సంతోషంగా ఉంటారు. శ్రీరామనవమి ఉత్సవాలు వేడుకగా నిర్వహిస్తారు. ఆ ఊరిలో రామలక్ష్మణులు అనే సోదరులు ఉన్నారు. వారికి కూరగాయలు అమ్మే దుకాణం ఉంది. వారి వ్యాపారం బాగా సాగుతుంది. శ్రీరామనవమి ఉత్సవాలకు ప్రతి ఏడాది లక్షరూపాయలు విరాళం ఇస్తారు.

| | సమాస పదం | విగ్రహవాక్యం | సమాసం పేరు |
|---|---|---|---|
| అ) | ________ | ________________ | ________ |
| ఆ) | ________ | ________________ | ________ |
| ఇ) | ________ | ________________ | ________ |
| ఈ) | ________ | ________________ | ________ |
| ఉ) | ________ | ________________ | ________ |

## III. వ్యక్తీకరణ – సృజనాత్మకత

### స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) 'బావిలో కప్పలా ఉండకూడదు' అంటే మీకేమి అర్థమైందో రాయండి.

ఆ) ఆప్యాయతను పచ్చని పైరుతో కవి ఎందుకు పోల్చి ఉంటాడు?

ఇ) పని తొందరగా ఒడువాలంటే ఏం చేయాలి?

ఈ) 'మావూరు మాట్లాడింది' పాఠ్యభాగ రచయిత గురించి రాయండి.

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) మాండలిక పదాల వెనుక దాగి ఉన్న ఆసక్తికరమైన అర్థాలను సొంతమాటల్లో వివరించండి.

ఆ) 'మెచ్చుకోలుకోసం పాడిన పాట కాదు కదా' అని అనడం వెనక కవి ఉద్దేశం ఏమై ఉంటుంది.

### సృజనాత్మకత

**1. కింది ప్రశ్నకు సమాధానం రాయండి.**

అ) మీ ప్రాంతంలో వాడుకలో ఉన్న పదాలు సేకరించండి. ఆ పదాలతో అర్థవంతమైన గేయం లేదా వచన కవిత రాయండి. దానికొక శీర్షికను పెట్టండి.

**సూక్తి**

మాతృభాషని నిరాదరించడమంటే
మాతృమూర్తిని తిరస్కరించడంతో సమానం.
– మహాత్మా గాంధీ

# 8 హైదరాబాద్ నగరం

– ఏనుగుల వీరాస్వామి

## కవి పరిచయం



1780–1836

ఏనుగుల వీరాస్వామి (1780–1836) మద్రాసులో జన్మించాడు. మద్రాసు హైకోర్టులో ప్రధాన దుబాసీ (Chief Interpretor) గా పనిచేశాడు. ఆంగ్లం, తెలుగు, సంస్కృతం, తమిళ భాషల్లో మంచి పట్టు సంపాదించాడు. తెలుగు భాషకు ఎనలేని సేవ చేసిన ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ ఆయనకు బాగా సన్నిహితుడు.

వీరాస్వామి కన్యాకుమారి మొదలు కాశ్మీరు వరకు భారత దేశమంతటా రెండుసార్లు పర్యటన చేసి తన మిత్రుడైన కోమలేశ్వరపురం శ్రీనివాసపిళ్లైకి జాబులు రాసాడు. వీరాస్వామి మరణానంతరం శ్రీనివాసపిళ్లై ఆ ఉత్తరాలను 'కాశీయాత్ర చరిత్ర' పేరుతో 1838లో మొదటిసారిగా ప్రచురించాడు. తర్వాత ఇది అనేక ముద్రణలు పొందింది. తెలుగులో యాత్రారచనకు ఆద్యుడుగా వీరాస్వామి పలువురికి మార్గదర్శకుడయ్యాడు.

ఈ పాఠం యాత్రారచన ప్రక్రియకు చెందినది. యాత్రారచన తెలుగుసాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానాన్ని పొందిన ప్రక్రియ. ఇంగ్లీషులో 'ట్రావెలాగ్'గా వ్యవహరిస్తారు. ఏదైనా యాత్ర సందర్భంగా చూసిన ప్రదేశాలు. అక్కడ నివసించే మనుషులు, వారి వృత్తులు, ఆచారాలు, సాంఘిక పరిస్థితులు తదితర విషయాల సమాహారమే యాత్రారచన. ప్రస్తుత పాఠ్యభాగం ఏనుగుల వీరాస్వామి రాసిన 'కాశీయాత్ర చరిత్ర' నుండి గ్రహించబడింది.

## నేపథ్యం / ఉద్దేశం

1830 మే 18న వీరాస్వామి ఉత్తరదేశ యాత్రకు మద్రాసు నుండి బయలుదేరి తిరుపతి, కడప, కర్నూల్, హైదరాబాద్, నాగపూర్, అలహాబాద్ మీదుగా కాశీకి చేరుకున్నారు. 15 నెలల, 15 రోజులు సాగిన యాత్రలో భాగంగా హైదరాబాదు నగరాన్ని దర్శించినపుడు వారి అనుభవాలను, ఆనాటి నగర సామాజిక స్థితిగతులను, పరిపాలనా విధానాలను, ప్రజా జీవితాన్ని తెలియజేయడమే ఈ పాఠ్యాంశం ఉద్దేశం.

# I

ఆ షాపురము 3 ఘంటలకు వదిలి రాత్రి 8 ఘంటలకు 6 కోసుల దూరములో నుండే హయిదరాబాదు షహరు ప్రవేశించి షహరుకు సమీపమందుండే బేగంబజారు అనే పేటలో నొక తోటలోని బంగాళాలో దిగినాను. ఆ షాపురము వదిలిన వెనుక 2 కోసుల దూరములో షంసాబాదు అనే బస్తీ గ్రామము కోటసహితముగా నొకటి యున్నది. అదివరకు దోవసరాళము. లోగడిమజిలీబాట వలెనే 1 గడియదూరము మిట్టయెక్కుచు గడియదూరము పల్లములో దిగుచు దారిని నడవవలసినది. షంసాబాదు మొదలు చిన్న తిప్పలు దారికి నాలుగుపక్కలా అగుపడుచు వచ్చును. దారి కొంచెమయిన రాతిగొట్టుగలది. దగ్గిర దగ్గిర చిన్న గ్రామాలున్నవి. అనేక మశీదులు చూచుచు పోవచ్చును. చిన్న చెరువులు కొన్ని యున్నవి. వాటి కింద మామిడితోపులున్ను, కూరగాయల తోటలున్ను వేసియున్నవి.

ఆ దినము మొహర్రం అనే పండుగ ఆరంభమయినది. ఆ తొమ్మిదో దినము ఆ షహరుకు కంచికి గరుడసేవ ముఖ్యమైనట్టుగా ఆ మొహర్రం పండుగ ప్రబలమైన యుత్సవము. ఆ యుత్సవ కాలములో పరమాత్ముని చైతన్యము ఆ షహరులో నెక్కువగా ప్రకాశించుటచేత అనేక వేలమంది యితర మతస్థులుగా నుండేవారు కూడా షహరుకు వచ్చి ఆ తొమ్మిదోదినము మొదలు ఆఖరువరకు నుంచున్నారు. సకలవిధములయిన యారాధనలను అంగీకరించి “యాదృశీ భావనా యత్ర సిద్ధి ర్భవతి తాదృశీ” అనే వచన ప్రకారము లోకుల యిష్టసిద్ధిని చేసే పరమాత్ముడు ఒక్కడే గనుక ఆ యుత్సవకాలములో పరమాత్ముని చైతన్యము అక్కడ ప్రతిఫలించుటచేత ఆ స్థలము ఆ కాలమందు పుణ్యస్థలమని భావించి అక్కడ నట్టికాలమందు నన్ను ప్రవేశపెట్టినందుకునీశ్వరుని చాలా కొనియాడడ మయినది.

29 తేది రాత్రి మొదలు జూలాయి నెల 8 తేదీ సాయంకాలమువరకు హయిదరాబాదు షహరుతో చేరిన బేగంబజారులోనున్నాను. ఆ రాత్రిమొదలు జూలాయి రాత్రివరకు శికందరాబాదు అనే పేరుగలిగిన యింగిలీషువారి దండు ఉండే బస్తీకి సమీపముగా నున్న కాకగూడ మనే బొమ్మ దేవరు నాగన్నతోట చావిడిలోనుంటిని.

హయిదరాబాదు షహరుకుచుట్టు బేగంబజారు అనే బస్తీ యొకటి యున్నది. ‘అందులో సాహుకార్ల కొఠీలు కలవు. అది షహరు కంటే వాసయోగ్యము. అక్కడికి కోసెడు దూరములో కారువానా అనే బస్తీ యొకటి యున్నది. అది రత్నాలు వగయిరా అమ్మేవర్తకులుండే స్థలము. ఆ బేగంబజారుకు చేరినట్టు యింగిలీషు రిసైడెంటు వారి ఖర్చుక్రింద విస్తారముగా నున్న అలంకారముగా నున్న ఒక హవేలీ కట్టించుకొని నిజాముకు బాడిగె ఇచ్చుచు కాపురమున్నాడు. హవేలి చుట్టున్ను లోకులున్ను వర్తకులున్ను ఇండ్లు కట్టుకొని యుండుటచేత నొక పెద్ద బస్తి అయినది. ఆ స్థలము పేరు చంద్రఘాటు అనుచున్నారు.

హహరు లోపల షాలిబండ అనే పేరు కలిగిన యొక పేట యున్నది. ఆ స్థలమందు అక్కడి బ్రాహ్మణులు ఇండ్లు కట్టుకొని కాపురమున్నారు. దివాన్ పేష్కారు చందులాలు అక్కడ ఇండ్లు కట్టుకొని కాపురమున్నాడు. నిజాందేవిడి షహర్ నడమ నున్నది. అనేకులయిన పెద్దమనుష్యులు, అమీరులు వుమరాలనే పేరు కలవారు, సాధారణపు వర్తకులు, నిజాం వంశస్థులున్న షహరునడమ కాపురమున్నారు. షహరునడమ మక్కామజ్జిత్ అనే యొక తురకల జపశాలయున్నది. దాని స్థూపీలు రెండు మొలాము చేయబడి యున్నవి గనుక బహుదూరానికి తెలియుచున్నవి. మశీదుకు నెదురుగా లోగడి దివాన్‌మీరాలం అనే వాడు కట్టించిన కారంజీలు లోతుగా నున్నవి. వాటికి సమీపముగా చౌకు అనే పేరుగల గుజరీ అంగడి యొకటిన్ని, బట్టలు యంగళ్లు, పాత్రసామాను యంగళ్లున్ను ఉన్నవి. నాల్గు దోవలు చేరడానకు గాను కట్టిన యొక గొప్ప

స్థూపీ గలిగి నాలుగు ద్వారాలు గలిగిన యొక చావడిన్ని యున్నది. షహరులో రాజవీధులయందు గుండురాళ్లు పరచియున్నవి. అట్టి వీధులలో నుండే కశ్మలమయిన యడుసులో నడిచేవారి పాదాలు పూడిపోవుచున్నవి. ఇండ్ల యలంకారమున్ను సందులకు సందియున్ను యితర దక్షిణదేశపు షహరులలో వాసముచేసే వారికి ఇష్టముగా నుండవు. రాజవీధులలో ఏనుగలు మొదలయిన వాహనాలు యెల్లప్పుడు సంచరింపుచున్నవి. గనుకనున్ను మనుష్యులందరున్ను, ఆయుధపాణులై మెత్తని వారిని కొట్టి నరుకుచున్నారు గనుకనున్ను, షహరులో యితర దేశస్థులు సవారీ మీద పోయి రావలసియుంటే ఆయుధపాణులైన వాక్పారుష్యము కలవారిని కొందరిని కూడా పిలుచుకొని పోవలసియున్నది.

కృష్ణానది దాటినది మొదలు హైదరాబాదు వరకు పకీరులు నిండియున్నారు గనుక సవారీ మీద నెవరు వచ్చినా అడుగడుగుకు పకీరులు పొగిడి బిక్షం అడగక మానరు. వారికి కొన్ని గవ్వలయినా యిచ్చి పోకపోతే అవమానము తోచుచున్నది. చెన్న పట్టణపు రూపాయి 1కి అక్కడి పయిసాలు 50. పయిసా 1కి 20 పుంజీల గవ్వలు. పుంజీ 1కి గవ్వలు 4. యీ హయిదరాబాదులో పిచ్చిరూపాయలని యొక దినుసున్ను గోవింద బఖీలని యొక దినుసున్ను చెలామణి యవుచున్నవి. ఆ రూపాయలు ఒక చేతి నుంచి యొక చేతికి వచ్చేటప్పుడు యొకటి రెండు పయిసాలు వట్టమియ్యకనే చెలామణి కానేరదు. చెలామణి రూపాయలకు అక్కడివారు చేసే పరీక్ష అసదృశ మయినది. ఎట్టి రూపాయల కయినా ఒక దోషము పెట్టకమానరు. చెన్న పట్టణపు కుంఫిణీ రూపాయలకు ఆ తొందర లేదు. అయితే అవి దొరకవు. మరి అక్కడి రూపాయలకు రూపాయి 1 కి సాలు 40.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. మొహర్రం పండుగ సమయంలో వీరాస్వామి హైదరాబాదు నగరాన్ని సందర్శించడంపట్ల ఈశ్వరుణ్ణి ఎందుకు కొనియాడాడు?
2. కారువానా బస్తీ విశిష్టత ఏమిటి?

## II

ఈ షహరు గోడకు చేరినట్టుగా 'ముసి' అని అక్కడి వారిచేత చెప్పబడుచున్న ముచుకుంద నది పారుచున్నది. ఆ నది వాడపల్లెవద్ద కృష్ణలో కలియుచున్నది. అది గొప్పనది. పోయిన సంవత్సరం నదీ ప్రవాహము ఎక్కువగావచ్చి ఢిల్లీ దరవాజా వద్ద యింగిలీషువారు కట్టిన వారధిని పగలకొట్టి ఆ షహరులో కొన్ని వీధులున్ను, బేగంబజారులో కొన్ని వీధులున్ను ముంచివేసి పోయినది. బేగంబజారుకున్నూ, షహరుకున్నూ నడమ ఆ నది దాటుటకు పూర్వకాలమందు తురకలు మంచి రాళ్ళతో అతి బలముగా నొక్క వారధి యేనుగలు మొదలయినవి గుంపుగా నెక్కి పోవడానకు యోగ్యముగా కట్టినారు. ఆ షహరు చుట్టున్ను చిన్న తిప్పలున్నవి. కొండలు మెండు. అనేక తిప్పల కొనలయందు మశీదులు కట్టబడి యున్నవి. హిందూదేవాలయాలు లేవు.

షహరుకున్ను ఇంగిలీషు దండుకున్ను 2 కోసుల దూరమున్నది. నడమ హుశేను సాగరమనే పేరుగల యొక గొప్ప చెరువున్నది. ఆకట్టమీద యింగిలీషువారు గుఱ్ఱపుబండ్లు పొయ్యేటందుకు యోగ్యముగా బాట ముచ్చటగా చక్కచేసి మొగలాయి వాహనాలున్నూ మనుష్యులున్ను ఎక్కినడిచి చెరచకుండా బాటకు, ఇరుపక్కల తమ పారా పెట్టియున్నారు. జాతులవాండ్లను తప్ప ఇతరులను ఆ కట్టమీద హుకుములేక ఎక్కనియ్యరు. ఈ జాతులవారిని పరంగీలని ఏలచెప్పు చున్నారంటే ఫిరంగీలతో

సహవాసము చేసేవారు గనుక ఫిరంగీవారని ఈ దేశస్థు లనసాగినారు. అది యితర దేశాలలో పరంగీవారని అభాసముగా అనబడుచున్నది. కుంఫిణీ లష్కరు ఉండే స్థలము హయిదరాబాదుకంటే నానాటికి ఎక్కువగా బస్తీ అవుచున్నది. 20 సంవత్సరముల క్రిందట నేను చూచినదాని కంటే మిక్కిలి బస్తీ అయియుండుటను చూడగా ఆశ్చర్యముగానున్నది. షహరులో వస్తువులకు సుంకములేదు. ఏవస్తువుమీద సుంకానికి ఎవడు ఊహించి దరఖాస్తు చేసినా దివానీ ఆ సుంకము గుత్తకు ఇచ్చుచున్నాడు. కట్టెల బండ్లకు, విస్తరాకులకున్ను, షహరులో రావడానికి నాలుగయిదు తీరువలు. తీరువ తీసేవాని జోరావారి కొద్దిన్ని ఇవ్వవలసియున్నది. చంపినా అడిగే దిక్కులేదు. యింగిలీషు దండులో ఈ తొందరలులేకుండా న్యాయ విచారణ కూడా కొత్తవాల్ చావడిలో కమ్మిస్నేరైయాటు అసిస్టాంటు గుండా జరుగుచున్నది. గనుక లోకులున్ను వర్తకులున్ను ఆ దండులో వసించడానికి మిక్కాలి ఇచ్ఛయింపుచున్నారు.

అక్కడి యిండ్లకంతా ఎన్ని మిద్దెలు అంతస్తులుగా కట్టినా స్తంభాల మీద పయి పూరి మోపుచేసి మట్టి గోడలు పెట్టి, ఆ గోడలపయిన నాజూకుగా, సన్న గార చేసి కావలసిన చిత్రములతో పూయుచున్నారు. అక్కడి గులక కలిసిన యెర్రరేగడ మట్టి మిక్కిలి గట్టిగా నుంచున్నది.

యింగిలీషు దండులో నేను దిగిన స్థలము వాసయోగ్యము, ఆ షహరు చుట్టునుండే భూమి బహుసారవత్తమయినది. ఏ వృక్షము వేసినా అతి వీర్యముతో పయిరయి వచ్చుచున్నది. అయితే పయిరు పెట్టే శ్రద్ధ యెవరికిన్ని 2 కారణములచేత లేదు. మొదటి కారణమే మంటే బీదలయినవారు ఏ చెట్టువేసినా వాటి ఫలమును క్షేమముగా, ఆయుధాలే ఆభరణములుగా నుంచుకొని దర్పమే యశస్సుగా భావించుకొని యుండే లోకులు అనుభవించనియ్యరు. రెండోదేమంటే ఉపపన్నులు తోటలు వనాలు వేసుకొనవలెనంటే రాజకీయములయిన విపత్పరంపరలు అప్పుడప్పుడు వారికి కలుగుటచేత ఆ సుఖము ననుభవించడానికి ప్రాప్తిలేక నున్నది. ఇంతకున్న ఓర్చివేసిన చెట్లు బహు బాగా అయియున్నవి. చోటా అరంజీపండ్లు విస్తరించి కలవు. సకల విధములయిన పండ్లున్ను, అరటిపండ్లు దప్ప మంచివిగానే దొరుకును. అయితే అతిప్రియము. చెన్న పట్టణము కంటే మూడింతలవెల యివ్వలసినది. కూరగాయలు ఆ ప్రకారమే ప్రియములయినా మహా రుచికరములుగా నున్నవి. వస్త్రాలు, ఆభరణాలు శిపాయిలకు లాయఖు అయినవి ఆషహరులో దొరుకును. భారీరత్నాలు వగయిరాలు ఉంచుకొని విక్రయించేవారు తమ కాపునిమిత్తమై కొంత శిబ్బందిని వుంచుకొనవలసియున్నది. తద్వారా ఒక గొప్ప గౌరవము వారికి గలుగుచున్నది. అందువలన రత్నాలు, నగలు, కావలసిన గొప్పవారు వారి యింటికి వెళ్ళి, వారిని పిలిపించుకొని కావలసినది వారు చెప్పిన ధరకు పుచ్చుకొని తమకు సమ్మతి అయినప్పుడు ఖరీదు నిచ్చుచున్నారు. వర్తక సరణిగా అట్టి గొప్పవస్తువులుకొని అమ్మడము లేదు. సాత్విక ప్రభుత్వముకల రాజ్యములో మెదిగినవారికి ఆ షహరులో ఉనికిన్ని, ఆరాజ సంచారమున్ను, భయప్రదములుగా నుంచున్నవి.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. మూసీనదికి చెప్పబడిన మరొక పేరేమిటి?
2. జాతుల వారిని పరంగీలని ఎందుకన్నారో తెలుపండి.

## III

ఆ షహరుకు 3 కోసుల దూరములో గోలకొండ అనే ప్రదేశ మొకటియున్నది అక్కడ బలమైన కోటయున్నది. అందులో నిజాముయొక్క అంతఃపుర స్త్రీలు సంస్థానముయొక్క మూలధనముతో కూడా ఉన్నారు. అందులో విస్తరించి

గృహములు కట్టుకొని మనుష్యులు కాపురమున్నారు. ఆ షహరులో పెద్దమనుష్యులు ఆనందము కొరకు చేసుకోవడమేమంటే ఒక బగీచా అనే చిన్నతోటవేసి, అందులో జలధారలు పయికిలేచే కారంజీలు కట్టి యుంచుకొనుచున్నారు. ఆ జలసూత్రాలు అలంకారముగానే యుంచున్నవి.

అక్కడి రాజ్యతంత్రము జరిపే క్రమమంటే పూర్వకాలమందు ఢిల్లీ పాదుషాను, శిఫాయి ధర్మముచేత సంతోషపెట్టి, ఆ రాజ్యమును జాగీరుగా పుచ్చుకొన్న ఆ సబుజా వంశస్థులు ఇప్పుడు రాజ్యము చేయుచున్నారు. యింతకుమునుపు షౌలరు జంగు అనే అతడు దొరతనముచేసి, సంవత్సరము కిందట చనిపోయాడు. అతని కొడుకులలో నొకడయిన నాసర్ద్దౌలా అనే అతడు ఇప్పుడు కుంఫిణీవారి సహాయము చేతకట్టుకొని ప్రభుత్వమును వహించియున్నాడు. ఈ నవాబుకింద ఒక దివాన్ జాగీరు అనుభవింపుచున్నాడు. అతని కింద ఒక ఫేష్కారు సకల రాజ్య తంత్రము విచారింపుచున్నాడు. ఉండే రాజ్యమంతయు నవుకరులయిన అమీరు ఉమరాలనే పెద్దమనుష్యులకు జాగీరులుగానున్ను, పారంపర్యముగా ప్రభుత్వము చేసేవారికి జమీనులుగానున్ను, భాగించి జమీనుదారుల వద్ద మాత్రము సాలుకు ఇంత మాత్రమని రూకలు వసూలు చేసుకొనుచున్నారు. అమానిగా తాలుకాల నుంచుకొని మామిలియ్యతు వ్యవహారమును జరుపుకోవడము నిండాలేదు. వారి వారి అధీనముగా నుండే భూమికి వారు వారు పూర్ణమయిన స్వాతంత్ర్యము గలిగి ఆయా భూములలోని కాపురస్థులను భర్త భార్య మీద చెల్లించే అధికారముకంటే ఎక్కువయిన అధికారముతో నేలుచున్నారు. ఆనబాబు పెద్దలవద్ద 80 సంవత్సరముల కిందట కుంఫిణీ వారు స్నేహమూలకముగా ప్రవేశించి 6 పటాలాలను, వారి తయినాతిగా శికందరాబాదు అనే స్థలములో ప్రవేశపెట్టి, వకీలు భావనగానొక రిసైడెంటును అక్కడ నిలిపినారు. ఆ పటాలాల జీతానికిగాను కడప, బళ్ళారి జిల్లాలు రెండున్ను ఈ నవాబు వద్ద జాగీరుగా కుంఫిణీవారు పుచ్చుకొని యిప్పటికిన్ని అనుభవించుచున్నారు. క్రమక్రమముగా రాజ్యతంత్రములో ఏ పని జరిగించవలసి వచ్చినా రిసైడెంటు అనుమతిలేక జరిపించే వాడికెలేని ఘట్టము ఇప్పట్లో పొసగియున్నది. తమకు రూకలు కట్టని బలవంతులయిన జమీనుదారుల వద్ద సాలేనా పయికము వసూలు చేసుకొనేటట్టు కందనూరు నవాబు రాజ్యము కుంఫిణీవారి యధీనము చేసినట్టే, కొద్ది కొద్దిగా చేయుచు వచ్చుచున్నారు. అటువంటి జమీందారులవద్ద కుంఫిణీవారు రూకలు వసూలుచేసి నిజామునకు ముజరా యిప్పించుచున్నారు. సదరహి 6 పటాలాలు గాక నింకా 12 పటాలాల పర్యంతము రిసైడెంటు మూలకముగా కొలువు పెట్టి యింగిలీషు వారి ఖాయిదాలో వుంచి అలు వాల్ మొదలయిన స్థలములలో నుంచి నెల నెలకు, వారిజీతము రిసైడెంట్ మూలకంగా ఆ నవాబు దివాన్ ఫేష్కారు యిచ్చుచు, రూకలుకట్టని జమీదారునిమీదికి కావలసినప్పుడు కావలసిన మట్టుకు ఆ ఫౌజును పంపించుచు వచ్చుచున్నారు. ఇప్పుడు దివాన్ ఫేష్కారు చేసే చందులాలా సదరహిజాస్తి పటాలాల జీతానికిగాను నెల 1కి, సుమారు 3 లక్షల రూపాయలు యిచ్చుచున్నాడు.

యిదిగాక నవాబు మనోవర్తి ఖర్చులకు గాను నెల 1కి 3 లక్షల రూపాయలు ఇవ్వవలసి యుంచున్నది. ఇంతేగాక నజరుయినా యతులుగా కొంతసెలవు. చందులాలుకు తగులుచు వచ్చుచున్నది. ఇది పోగా మిగిలిన వస్తువులు ఆ దివాన్ పేష్కారు చేసేవాడు సమ్మతమైన వ్రయము చేసుకొనుచు వచ్చుచున్నాడు. ఆ ప్రయములు చెయ్యడమునకు రాజ్యములో అయ్యే వసూలు చాలక దివాన్ పేష్కారు అప్పులతో తహతహ పడుచున్నాడు. ఆ నవాబు రాజ్యమంతా కుంఫిణి వారి వల్ల చాలా భయమును పొందియున్నది.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. గోలకొండ ప్రాంతపు పెద్దమనుషులు ఆనందం కోసం ఏం చేసేవారు?
2. అసబుజా వంశస్థులు హైదరాబాద్ ప్రాంతాన్ని ఢిల్లీ పాదుషా నుండి ఎలా పొందారు?

## పాఠ్యాంశ అన్వయం

ప్రతీఒక్కరు ఏదో ఒక సందర్భంలో యాత్ర చేయడం సర్వసాధారణమైన విషయం. ఏనుగుల వీరాస్వామి కూడా కాశీని దర్శించాలని కాంక్షతో తన పరివారంతోసహా బయలుదేరాడు. మార్గమధ్యంలో ఎన్నో నగరాలు సందర్శిస్తూ హైదరాబాదు నగరాన్ని చేరుకున్నాడు. ఆ కాలం నాటి హైదరాబాదు నగర భౌగోళికాంశాలను జాగ్రత్తగా పరిశీలించాడు. ఈ ప్రాంతంలోని సుప్రసిద్ధమైన ప్రదేశాలను తెలుసుకొని వాటి ప్రాముఖ్యతను కూడా చెప్పాడు. ఇక్కడి ప్రజలు జరుపుకునే పండుగలను గురించి ప్రస్తావించాడు. ఆనాటి సామాజిక స్థితిగతులు తెలియజేసేలా ఆర్థిక రాజకీయ పరిస్థితులను వర్తక వాణిజ్యాలను విశ్లేషించాడు. ప్రజల వృత్తులు, పంటలు, ఆహార పానీయాలను, ఇష్టమైన వ్యాపకాలను తెలుసుకునే ప్రయత్నం చేసాడు. పరిపాలనా విధానాన్నిబట్టి ప్రజా జీవనాన్ని అంచనా వేసాడు. ఇలా హైదరాబాదు నగరాన్ని భిన్న కోణాల్లో దర్శించి నమోదు చేసాడు.

మనం కూడా ఏదైనా కొత్త ప్రదేశాన్ని దర్శించే అవకాశం కలిగినప్పుడు అక్కడి ప్రాంత విశేషాలతోపాటు సాంఘిక ఆర్థిక రాజకీయ పరిస్థితుల్ని, ప్రజల జీవన విధానాన్ని ఆచార వ్యవహారాల్ని తెలుసుకొని లిఖిత రూపం ఇచ్చినట్లయితే అది తప్పకుండా భావితరాలకు ఉపయుక్తం అవుతుంది.

## భాషా సామర్థ్యాలను సాధిద్దాం

### I. అవగాహన – ప్రతిస్పందన

**1. కింది గద్యాన్ని చదివి ఐదు ప్రశ్నలు తయారుచేయండి.**

ప్రపంచంలోని అద్భుత దృశ్యాల్లో నయాగరా జలపాతం ఒకటి. ఈ విషయం విశ్వవిదితం. నయాగరాను అమెరికావైపు నుంచీ, కెనడా దేశభాగం నుంచీ చూడొచ్చు. నాకు కెనడా నుంచి నయాగరా జలపాతాలను చూసే అవకాశం కలిగింది. ఈ వైపు నుంచి అగుపించే నయాగరా దృశ్యం నయనపర్వం, సమగ్రం కూడా

ఎక్కడిదీ నయాగరా? కాలానికి తోబుట్టువు. ఎవరు కనుక్కున్నదిది? ఫాదర్ లూయీ హెన్నిపిన్. ఎప్పుడు? 1678లో ఇప్పటికీ క్షణం ఆగదు ఈ జలపాతం, కాలంలా. ఇది ప్రతి సంవత్సరం పన్నెండు మిలియన్ల జనాన్ని ఆకర్షిస్తున్నది. చూసిన ప్రతి కంటిలో సువర్ణ దృశ్య కావ్యాన్ని చిత్రిస్తున్నది.

**ప్రశ్నలు :**

అ) ______________________

ఆ) ______________________

ఇ) ______________________

ఈ) ______________________

ఉ) ______________________

## II. భాషాంశాలు

**పదజాలం**

**1. కింది పదాలకు పర్యాయ పదాలు రాయండి.**

ఉదా : పేట = నగరం, బజారు

అ) వారధి = __________ __________

ఆ) దండు = __________ __________

ఇ) బాడిగ = __________ __________

**2. కింద కొన్ని పదాలున్నాయి. వాటిలోకి ప్రకృతి పదాలకు వికృతులను జతచేసి రాయండి.**

( స్తంభం, గారవం, రత్నము, కంబం, గీము, రతనము, గౌరవం, గృహము )

ఉదా : గృహము – గీము

అ) __________ – __________

ఆ) __________ – __________

ఇ) __________ – __________

**3. కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలను రాయండి.**

ఉదా: రూకలు = నాలుగు రూకలు సంపాదించాలంటే చాలా కష్టపడాలి.

అ) విస్తారం = ______________________________

ఆ) యోగ్యం = ______________________________

ఇ) చావడి = ______________________________

**వ్యాకరణాంశాలు**

**★ కింది సమాస పదాలను వాటి విగ్రహవాక్యాలను పరిశీలించండి.**

అ) ముక్కంటి – మూడు కన్నులు కలవాడు.

ఆ) గరుడవాహనుడు – గరుడుడు వాహనముగా కలవాడు.

ఇ) పద్మాక్షి – పద్మం వంటి కన్నులు కలది.

పై పదాలలో మొదటి పదానికి గాని రెండవ పదానికి గాని ప్రాధాన్యం లేదు. రెండు పదాలు కలిసి మరో పదం యొక్క అర్థాన్ని స్ఫురింపజేస్తున్నాయి. ఇలా మరో పదం యొక్క అర్థానికి ప్రాధాన్యం ఉన్న సమాసాన్ని "బహువ్రీహి" సమాసం అంటారు.

ఉదా : 'ముక్కంటి' అనే సమాస పదంలో 'మూడు' అనే పదానికి ప్రాధాన్యం లేదు. 'కన్నులు' అనే పదానికి కూడా ప్రాధాన్యం లేదు. 'మూడు కన్నులు కలవాడు' అని మరో అర్థానికి ప్రాధాన్యం ఉన్నది. ఇట్లా సమాసంలోని పదాల అర్థాలకు కాకుండా, మరో అర్థానికి ప్రాధాన్యం ఉన్నది కాబట్టి ఇది బహువ్రీహి సమాసం.

**★ కింది సమాస పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసం గుర్తించండి.**

అ) ఆజానుబాహుడు ______________________ ____________

ఆ) చతుర్ముఖుడు ______________________ ____________

ఇ) చక్రపాణి ______________________ ____________

ఈ) గరళకంఠుడు ______________________ ____________

ఉ) నీలవేణి ______________________ ____________

## III. వ్యక్తీకరణ - సృజనాత్మకత

### స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) 'యాదృశీ భావనా యత్ర సిద్ధి ర్భవతి తాదృశీ' వచనాన్ని మీరు ఏ విధంగా అర్థం చేసుకున్నారు?

ఆ) మూసీ నది గురించి రచయిత చెప్పిన విషయాలు ఏమిటి?

ఇ) గోలకొండ కోట విశేషాలు ఏమిటి?

ఈ) ఏనుగుల వీరాస్వామిని గురించి రాయండి.

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) 'హైదరాబాదు నగరం' పాఠం ఆధారంగా ఆనాటి వ్యవసాయం, వర్తకం గురించి మీరేమి అర్థం చేసుకున్నారు?

ఆ) హైదరాబాదు నగరపు రాజ్యపాలనా విధానాన్ని వీరాస్వామి ఏ విధంగా తెలియజేసాడు?

### సృజనాత్మకత

**1. కింది ప్రశ్నకు సమాధానం రాయండి.**

అ) మీరు చేసిన యాత్ర గురించి తెలియజేస్తూ వ్యాసం రాయండి.

**సూక్తి**

'దేశాటనం పండిత మిత్రతాచ'


పండితులకు దేశాటనం మిత్రునిలాంటిది.

**- ఆర్యోక్తి**

# 9 ప్రచార సాధనాలు

– ఆచార్య పేర్వారం జగన్నాథం

## కవి పరిచయం



23-08-1934
29-09-2008

ప్రముఖకవి, విమర్శకుడు, విద్యావేత్త ఆచార్య పేర్వారం జగన్నాథం జనగామ జిల్లా ఖిలాషాపురంలో 23 ఆగస్టు, 1934 సం॥లో సయ్యమ్మ-సంతాజీ దంపతులకు జన్మించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. తెలుగుతోపాటు "ఆరె జానపద సాహిత్యం – తెలుగు ప్రభావం" అనే అంశంపై పిహెచ్.డి. పూర్తి చేశాడు. సాగరసంగీతం, వృషభపురాణం, గరుడపురాణం అనే కవితా సంపుటాలతోపాటు, సాహిత్యావలోకనం, సాహితీవసంతం అనే వ్యాస సంపుటాలను కూడా వెలువరించాడు. ప్రముఖ సంస్కృత పండితులు ఆచార్య రవ్వా శ్రీహరితో కలిసి 'ఆరె భాషా నిఘంటువు'ను వెలువరించాడు. అనేక గ్రంథాలకు సంపాదకత్వం కూడా వహించాడు.

వరంగల్ లోని సికెఎం కళాశాల ప్రిన్సిపాల్‌గా, కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడిగా, కాకతీయ అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేశాడు. 29 సెప్టెంబర్, 2008న వరంగల్‌లో మరణించాడు. సమకాలీన సాంఘిక, రాజకీయ పరిస్థితులపై అధిక్షేపాత్మక ధోరణిలో కవిత్వం చెప్పడం ఈయన ప్రత్యేకత.

## నేపథ్యం / ఉద్దేశం

'ప్రసంగ వ్యాసం' ప్రక్రియను పరిచయం చేస్తూ, 1992 సం॥ కాలం నాటి ప్రచార సాధనాలు, సమాజంపై వాటి ప్రభావం గురించి తెలియజేయడం. పిల్లలలో ప్రచార సాధనాల వినియోగం, పాటించాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించడం ఈ పాఠం ఉద్దేశం. ప్రస్తుత పాఠం పేర్వారం 'సాహితీ వసంతం' అనే వ్యాస సంపుటి నుండి తీసుకోబడింది.

# I

ఏదైనా ఒక విషయాన్ని గానీ, సమాచారాన్ని గానీ, ప్రజా సమూహాలకు ఒక్కుమ్మడిగా అందించే ప్రక్రియ ప్రచారమవుతుంది. ఈ ప్రక్రియకోసం ఉపయోగించే వ్యవస్థలను సాధనాలంటాము. పూర్వకాలంలో ఉన్న సాధనాలు వేరు. నేడు ఉపయోగంలో ఉన్న సాధనాలు వేరు. వాటి పనితీరుకూ, వీటి పనితీరుకూ ఎక్కడా పోలికలు లేవు. అట్లాగే నాటి ప్రచార వస్తువుకూ, నేటి ప్రచార వస్తువుకూ ఏమాత్రం పోలికలులేవు. వైజ్ఞానిక సాంకేతిక రంగాల్లో మానవుడు సాధించిన విజయాలన్నింటినీ నేటి ప్రచార సాధనాలు సమర్థవంతంగా వాడుకుంటున్నాయి. అందువల్ల నేటి ప్రచార సాధనాలు తక్కువ శ్రమతో అతి తక్కువ వ్యయంతో ఎక్కువ ప్రజలకూ, ఎక్కువ ప్రదేశాలకూ అంతకుమించి ఖండాంతరాలకూ సులభంగా సమాచారాన్ని అందజేస్తున్నాయి. ఇది నేటి మానవుడు సాధించిన ఘన విజయం.

పూర్వం ప్రజలకు ఏదైనా సమాచారం అందించాలంటే గ్రామ గ్రామానికి వెళ్లి దండోరావేసి ప్రజల్ని ఒకచోటికి సమీకరించి సమాచారాన్ని తెలుపుతుండేవాళ్లు లేదా ఏదైనా ఒక విషయాన్ని ఎల్లప్పుడూ ప్రజలకు తెలుపుతూ ఉండవలసిన అవసరాన్ని గుర్తించినప్పుడు వాటిని శిలాశాసనాలద్వారా ప్రకటిస్తూ ఉండేవాళ్లు. ఐతే వీటికి చలనశీలత లేదు. నిశ్చలంగా నీరవంగా సమాధిస్థిత మునిపుంగవులవలె ఉండి ఈ శాసనాలు ప్రజలకు మౌన సందేశాలను అందిస్తూ ఉండెడివి. ఇక సాహిత్యంలోకి వెళ్లితే వివిధ రకాలైన పక్షులు ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికీ, ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికీ సమాచారాన్నో, సందేశాన్నో చేరవేసిన ప్రసక్తి కనిపిస్తుంది. ఇదికాక హనుమత్సందేశం, సంజయరాయబారము వంటివి ఉండనే ఉన్నాయి. వీటిలో ఒకరి అభిప్రాయాన్ని మరొకరికి అందజేయడమే తప్ప సామూహిక ప్రయోజనాన్ని ఆశించే ప్రజాబాహుళ్యప్రసక్తి లేదు, కనుక ఇవి ప్రచార ప్రక్రియలోకి చేరవు.

పూర్వకాలంనాటి ప్రచార సాధనాలకూ, నేటికాలపు ప్రచార సాధనాలకూ మరొక ముఖ్యభేదమున్నది. ప్రాచీన ప్రచార సాధనాలవద్దకు తరచుగా ప్రజలే వెళ్లి తెలిసికోవలసి ఉండెడిది. కాని నేటి ప్రచార సాధనాలు ప్రజలవద్దకు వెళ్లుతున్నాయి. ఒక్కొక్కప్పుడవి విశ్వరూపం ధరించి ఇంటింటా వెలుస్తున్నాయి. కుటుంబ సభ్యులతో విడదీయరాని అనుబంధాన్ని పెంచుకుంటున్నాయి. ప్రచార ప్రక్రియ నేడు ప్రజల దైనందిన వ్యవహారాల్లో ప్రబలమైన శక్తిగా రూపొందింది, మనిషి జీవితాన్నది నియంత్రిస్తున్నది. ఆధునిక యాంత్రిక నాగరికతా వైభవాన్నీ సమకాలిక సమాజ జీవన సరళినీ ఈ ప్రచార సాధనాలు మన కనులముందు రూపు కట్టిస్తున్నాయి. ఒక్క లిప్త కాలంలో ప్రపంచాన్నంతా చాపచుట్టగాచుట్టి జానెడు తెరపైకి కుదించి చూపిస్తున్నాయి. మనిషి లేచింది మొదలు మళ్లీ పడకమీదికి వెళ్లేదాకా ఈ ప్రచార ప్రభావం నుండి తప్పించుకోలేకపోతున్నాడు. నేటి మనిషి జీవితాన్ని శాసిస్తున్నది ప్రభుత్వ శాసనం కన్నా ప్రచార ప్రక్రియే అనడం అత్యుక్తికాదు. ప్రచార సాధనాలు నేడు కేవలం సమాచారాన్ని మాత్రమేకాక విజ్ఞాన వినోదాల్ని అందజేస్తున్నాయి.

రాచరికపు రోజుల్లో కంటే ప్రజాస్వామ్య యుగంలోనే ప్రచార సాధనాల అవసరం బాగా ఉంటుంది. ప్రజాస్వామ్యం ఆరోగ్యకరంగా, విజయవంతంగా పనిచేయాలంటే ప్రచార వ్యవస్థ సమర్థవంతంగా ఉండాలి. మారుతున్న ప్రజా జీవన మార్గాలకూ, అభిరుచులకూ, ఆదర్శాలకూ, విలువలకూ అనుగుణంగా ప్రచార వ్యవస్థ తన్నుతాను మార్చుకుంటూ ప్రజల జీవనశైలిని అత్యున్నతంగా తీర్చే ప్రయత్నం చేస్తుంది. చేయాలి కూడ. రాచరికపు వ్యవస్థలో ప్రజలకూ, ప్రభుత్వాలకూ సన్నిహిత సంబంధాలంతగా ఉండవు. ప్రజలు ప్రభుత్వంలో భాగస్వాములయ్యే అవకాశం చాలా తక్కువ. ప్రభుత్వ కార్యక్రమాలుగానీ, విధానాలుగానీ ప్రజలకు తెలియపరచే బాధ్యత ఆ ప్రభుత్వాలు స్వీకరించవు. రాచరికంలోని ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ

కార్యక్రమాల్ని విస్తృతంగా చేపట్టే అవకాశం కూడ తక్కువే. అందువల్ల రాచరికపు వ్యవస్థలో ప్రచార సాధనాల వాడకం అంతగా ఉండదు. కాని ప్రజాస్వామ్య వ్యవస్థలో అలాకాదు. అందుకు పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ప్రజా సంక్షేమ కార్యక్రమాల్ని ఎప్పటికప్పుడు విస్తృతంగా రూపొందిస్తూ ప్రజలకు తెలియపరచవలసిన బాధ్యత ప్రజాప్రభుత్వాలపై ఉంటుంది. ప్రజాభీష్టంలేని కార్యక్రమాలు ప్రజాప్రభుత్వాలు చేపట్టడానికి వీలులేదు. ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలియపరచడమేకాక ప్రజల అభీష్టాలనూ, మనోభావాలనూతెలిసికోవలసిన బాధ్యత ప్రజా ప్రభుత్వాలది. ఇక్కడ ప్రజలే ప్రభుత్వం. ప్రభుత్వమే ప్రజలు. ఎన్నికలలో ప్రచార సాధనాల అవసరం మరీ ఎక్కువ. ఆయా రాజకీయ పార్టీలు తమ తమ విధానాలను ప్రకటించుకొని ఓట్లకోసం ప్రజలవద్దకు పోతాయి. అవి ప్రచార సాధనాలను విరివిగా ఉపయోగించుకుంటాయి. ప్రజాస్వామ్యయుగంలో ప్రచారమన్నది పరమపవిత్రమైన ధర్మకార్యంగా గుర్తించాలి. కొన్ని నైతిక సూత్రాలను పాటించాలి. ఎక్కడైనా ఒక అబద్ధంకానీ, పొరపాటుకానీ, అవాస్తవమైన వార్తకానీ తెలిసో తెలియకో దొర్లిందంటే దానివల్ల లక్షలాది అమాయక ప్రజలు బలవుతారని గుర్తించాలి.

ఈ కాలంలో వాడకంలో ఉన్న ప్రధాన ప్రచార సాధనాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి –

1) ఆకాశవాణి
2) దూరదర్శన్
3) సినిమాలు
4) పత్రికలు
5) ప్రదర్శన కళా రూపాలు

వీటిలో మొదటి రెండు అంటె – ఆకాశవాణి. దూరదర్శన్‌లు ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేస్తున్నాయి. వీటికి స్వతంత్ర్య ప్రతిపత్తిని కలిగించే ఆలోచన ఆలోచనగానే ఉండిపోయింది తప్ప అది క్రియారూపం ధరించలేదు. ఇందులో ఒకటి వినిపించడం ద్వారా మరొకటి వినిపిస్తూ కనిపించడం ద్వారా ప్రజలకు సమాచారంతోపాటు వినోదాన్నీ, విజ్ఞానాన్నీ కలిగిస్తున్నాయి. కనుక వినిపిస్తూ కనిపించే ప్రక్రియకు గిరాకీ ఎక్కువ. మూడవదీ, నాలుగవదీ అయిన సినీమాలు, పత్రికలు ప్రజల అధీనంలో ఉన్నాయని చెప్పడం పేరుకేగాని అవి పూర్తిగా ధనికుల, పెట్టుబడిదారుల చేతుల్లోని కీలుబొమ్మలుగా పనిచేస్తున్నాయి. వాటి లక్ష్యం ధనార్జన, సొంత ప్రయోజనాన్ని సాధించుకోవడం, ప్రభుత్వ యంత్రాంగం ముందు బలవత్తరమైన శక్తిగా రూపొందడం. కనుక ఇవి ప్రజలపక్షం ఉన్నట్లే ఉండి తమ స్వార్థ ప్రయోజనాల్ని సాధించుకోవడంలో పరుగులు తీస్తున్నాయి. ఇక చివరిదైన ప్రదర్శన కళారూపాలనే ప్రక్రియ. ఈ కళలు మాత్రమే ప్రజల్లో పుట్టి, ప్రజల పోషణలో పెరిగి, ప్రజల చేతుల్లో ఊపిరి పోసుకుంటున్నాయి. ఇవి ప్రచారానికి బాగా పనికి వస్తున్న సాధనాలు. ఐతే ప్రచారం అనేసరికల్లా చాలా వరకు ఈ కళారూపాలు మళ్లీ ఏ ఆకాశవాణి మీదనో లేక ఏ దూరదర్శన్ మీదనో ఆధారపడవలసి వస్తున్నది.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. ప్రచార సాధనాలు అంటే ఏవి?
2. ప్రచార సాధనాలవల్ల ఉపయోగం ఏమిటి?

## II

ఇప్పుడిక ఆకాశవాణి దూరదర్శన్‌ల పనితీరు గురించి ఆలోచిద్దాం. ప్రభుత్వ ప్రచార సాధనాలుగా ఈ రెండూ స్థూలంగా ఒకే మూకలో పనిచేస్తుంటాయి. ప్రభుత్వం తన వివిధ కార్యక్రమాల ప్రచారానికి బాగా వినియోగించుకుంటున్న సాధనాలీ రెండున్నూ. వీటి కార్యక్రమాలు ముఖ్యంగా మూడు రకాలుగా ఉంటున్నాయి. అవి –

1) సంక్షేమ కార్యక్రమాలు

2) అభివృద్ధి కార్యక్రమాలు

3) ప్రభుత్వ విధానాలకు సంబంధించిన కార్యక్రమాలు

ఇదికాక వార్తల ద్వారానూ ప్రభుత్వ సమాచారం కొంత ప్రజలకు చేరుతున్నది. సాంకేతిక పరమైన వ్యత్యాసంవల్ల ప్రచార పద్ధతుల్లో తేడా ఏర్పడుతున్నదేతప్ప ప్రచార సరళిలోగానీ, దాని స్వభావంలోగానీ ఆకాశవాణికీ దూరదర్శన్‌కూ పెద్ద తేడా కనిపించదు. ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్న సంక్షేమ కార్యక్రమాల్లో ప్రధాన అంశాలు ఈ విధంగా ఉంటున్నాయి –

1) జనాభా నియంత్రణ

2) వరకట్న నిర్మూలన

3) అక్షరాస్యత

4) పర్యావరణ కాలుష్య నివారణ

5) పొదుపు

6) మాదక ద్రవ్యాలపై వ్యతిరేకత

ఇంకా ఇలాంటి అంశాల్ని ప్రభుత్వం ఈ రెండు సాధనాల ద్వారా ప్రచారం చేస్తున్నది. ప్రజల్లో వీటి గురించిన స్పృహ కలిగిస్తున్నది. అంతేకాక ఎప్పటికప్పుడు దేశానికి తారసిల్లే మతకలహాలవంటి రుగ్మతల గురించి కూడ ప్రచారంచేసి శాంతి భద్రతల్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నది. వీటన్నింటినీ ప్రజలకు తెలియపరచవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అది ప్రజా ప్రభుత్వాల కనీస ధర్మం కూడ. ఐతే వీటి గురించి మితిమీరిన ప్రచారం జరిగినప్పుడు మాత్రం ప్రజలు విసుక్కోవడం సహజం. అంతేకాక సమయ సందర్భాలు లేకుండా అదేపనిగా వీటి గురించి ప్రచారం చేయడం అనుచితంగా ఉంటుంది. ప్రజలు దూరదర్శన్ వంటి సెట్లను కొనుక్కోవడం ఈ ప్రచార వస్తువుకోసం కాదు. వినోదంతో కూడిన విజ్ఞానం వాళ్లు ఆశించేది. ఐతే ఈ సంక్షేమ కార్యక్రమాలు నాటకీకరణ ద్వారా ప్రసారమైనప్పుడు మాత్రం కొంత ఆసక్తికరంగా, ఆకర్షణీయంగా ఉంటున్నాయి.

అభివృద్ధి కార్యక్రమాల గురించి కూడ వీటిద్వారా తగిన ప్రచారం జరుగుతున్నది. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం వంటి రంగాల్లో జరుగుతున్న అభివృద్ధి గురించీ, దేశం సాధిస్తున్న ప్రగతి గురించీ, అందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి గురించీ ప్రముఖులతో ప్రసంగాలూ, ముఖాముఖి చర్చలూ ఏర్పాటుచేసి ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నాయి. వాళ్లను విజ్ఞానవంతులుగా తయారుచేసే ప్రయత్నం జరుగుతున్నది. ముఖ్యంగా వ్యవసాయరంగంలో రైతులు అవలంభించవలసిన నూతన పద్ధతులు

పంటలు నష్టపడకుండా కాపాడుకుంటూ ఎక్కువ దిగుబడికోసం చేపట్టవలసిన చర్యలూ వివిధ పంచాయితీల ద్వారా జరుగుతున్న సర్వతోముఖ అభివృద్ధి ఆయా బ్యాంకుల ద్వారా ప్రజలకు అప్పుల రూపంలో అందుతున్న ఆర్థిక సహాయం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఆకాశవాణి. దూరదర్శన్‌ల ద్వారా విరివిగా ప్రచారమవుతున్నాయి. వీటి ద్వారా గ్రామీణ ప్రజలు కొంతలో కొంతైనా లాభపడుతున్నారు. ప్రభుత్వం సమకూరుస్తున్న సౌకర్యాలూ, నిధులూ, వాటి వివరాలూ వాటిని పొందగలిగే మార్గాలూ వంటి పద్ధతుల గురించి కూడ విరివిగా ప్రచారం జరిగి రెడ్‌టేపిజం బాగా తగ్గించగలిగితే ఎక్కువ మంది లాభపడుతారు. ప్రచార సాధనాలు సఫలీకృతమవుతాయి.

ఇక మూడవదైన ప్రభుత్వ విధానాల సంగతి. నూతన విద్యా విధానం, నూతన ఆర్థిక విధానం, నూతన ప్రజాపంపిణీ విధానం బడ్జెట్‌లో వడ్డించే కొత్త కొత్త సరికొత్త పన్నులువంటి అనేక విధానాలను ప్రభుత్వం సమర్థించుకుంటూ ప్రచారం సాగించుకుంటుంది. వాటివల్ల ఒనగూడె విజయ పరంపరల గూర్చి మేధావులతో ప్రసంగాలు చేయిస్తుంది. ఇటీవల బంగారాన్ని విదేశాల్లో కుదువబెట్టడం గూర్చి కూడ ప్రభుత్వం తన చర్యను సమర్థించుకుంటూ చక్కగా ప్రచారం చేసుకున్నది. సాంకేతికంగా ఎంతో ప్రగతిని సాధించిన ప్రచార సాధనాలు ఈ రోజుల్లో ప్రతి వార్తను, ప్రతి అంశాన్ని ప్రపంచం నలుమూలలదాకా చేరవేస్తున్నాయి. కొన్ని భయంకరమైన వార్తలు దేశాన్ని దావానలంలా చుట్టుముదుతుంటాయి. ప్రపంచంలో ఎక్కడో ఏమూలనో జరిగిన సంఘటన గురించి మరుక్షణంలోనే ప్రపంచ ప్రజలందరూ వినగలుగుతున్నారు. ఆ దృశ్యాన్ని కనగలుగుతున్నారు. వెంటనే ప్రతిస్పందించగలుగుతున్నారు. ప్రచార సాధనాల సహకారంవల్లనే ప్రజల ఉద్యమాలు విజయవంతమవుతున్నాయి. అవి సహకరించనినాడు నీరుగారుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రపంచ ప్రజల సాత్వికారగుణాల్ని శాసించేవి ప్రచార సాధనాలే అని చెప్పకతప్పదు. వాతావరణ వైపరీత్యాల గురించీ, తుఫాను హెచ్చరికల గూర్చి ప్రచార సాధనాలు ఎప్పటికప్పుడు తెలుపుతూ ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నాయి. అందువల్లనే ఇటీవల సంభవించిన తుఫాను భీభత్సంలో వేలాది ప్రజలు ఈ ప్రచార సాధనాల మూలంగానే తమ ప్రాణాల్ని కాపాడుకోగలిగినారు. అంతేకాక కిడ్నాపుల వ్యవహారాల్లోనూ ప్రచార సాధనాలు అమోఘమైనపాత్ర వహిస్తున్నాయి. ప్రపంచాన్నంతా ఒక్క క్షణంలో కదిలించగలిగిన మహాశక్తి ప్రచార సాధనాలకున్నది.

వ్యాపార ప్రకటనలవల్ల ప్రజలకూ, దేశానికీ ఎక్కువగా అన్యాయమే జరుగుతున్నదని చెప్పక తప్పదు. ప్రకటనలు ఎక్కువ భాగం ధనిక వర్గ ప్రయోజనాల్ని సాధించేవిగా మాత్రమే ఉంటున్నాయి. ప్రకటనలన్నీ 'అత్యుత్తమమైనవే కనుక వినియోగదారులు గందరగోళంలో మునిగిపోతున్నారు. అల్పాదాయం కలిగిన ఎక్కువ మంది ప్రజలకు ఈ నానారకాల ఆకర్షణలతో కూడిన ప్రకటనలవల్ల నిరాశా నిస్పృహలే మిగులుతున్నాయి. క్రమంగా దేశీయ సంస్కృతి అంతరించి మనుషులు "మేడిన్ యూరోపు"లై పోతున్నారు. ముఖ్యంగా ముక్కుపచ్చలారని బాలబాలికలు ఈ కుసంస్కారానికి బలైపోతున్నారు. వాటిని అనుకరించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ వ్యాపార సంస్కృతి స్వేచ్ఛాపూరిత వ్యక్తిత్వ వికాసానికి అవరోధం కలిగిస్తున్నది.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. "ప్రజా పంపిణీ విధానం" గురించి నీకేమైనా తెలుసా?
2. వ్యాపార ప్రకటనలు అనగా నీవేమి అర్థం చేసుకున్నావు?

## III

ఇక ప్రచార సాధనాల్లో మూడవదైన సినిమాల గురించి ప్రస్తావిస్తాను. దీన్ని సినిమాకళ అనడంకంటే సినిమా పరిశ్రమ అనడం సబబుగా ఉంటుంది. ఎందుకంటే ఈ రోజుల్లో అసాంఘిక ప్రవృత్తిని భారీఎత్తున ఉత్పత్తిచేసే పరిశ్రమ సినిమా ఒక్కటే. వీటివల్ల సమాజానికి మేలుకంటే చెడే ఎక్కువగా జరుగుతున్నది. ఇవి మంచిని పెంచడానికి బదులుగా ప్రజలపై కుసంస్కారాన్ని బాగా రుద్దుతున్నాయి. ఎప్పుడో ఒకప్పుడు తప్పిపోయి ఒకటీ అరకంటే మించి మంచి సినిమాలు రావడంలేదు. ఈ సినిమాలచేతుల్లో ప్రజల అభిరుచులు బలవన్మరణం చెందుతున్నాయి. వీటి దుష్ప్రభావం నుండి నేటి యువతీయువకులూ, బాలబాలికలూ తప్పించుకోలేకపోతున్నారు. ఎక్కువభాగం సినిమాలు బాధ్యతారహితంగా అశ్లీల దృశ్యాలతో, కంగాలీడాన్స్‌లతో, అసభ్యకరమైన సన్నివేశాలతో వెండి తెరలపై వీరవిహారం చేస్తున్నాయి. మరికొన్ని యువకుల ఉద్రేకాల్ని రెచ్చగొట్టి సొమ్ము చేసుకుంటున్నాయి. చక్కని సందేశాత్మకమైన, సంస్కారవిలసితమైన వస్తువును స్వీకరించి నైతికస్థాయిని పెంచే విధంగా, ధర్మబద్ధంగా ఉండడానికి బదులు సినిమాలు వికృత రూపంలో అవతరిస్తున్నాయి. జాతి జీవన సర్వస్వాన్నీ దాని అంతరాత్మ స్వరూపాన్నీ, జాతి అనుభవించిన భిన్నరాగాలనూ, భిన్న కోణాలనూ చిత్రించి సమాజానికందివ్వగలిగిన అవకాశం, అర్హత, ఆర్థికస్తోమత, విశాలవేదిక, తగిన హంగులూ ఇవన్నీ ఉండికూడా సినిమాలు వాటిని వినియోగించుకోలేపోతున్నాయి.

ఇక నాలుగవ ప్రచార సాధనమైన పత్రికల గురించి ఆలోచిద్దాం. ఇవి చిరకాలం నుండి ప్రజలకు సమాచారంతోపాటు విజ్ఞాన వినోదాల్ని అందిస్తూ తమ పవిత్ర ధర్మాన్ని నెరవేరుస్తున్నాయి. ఒకప్పుడు దేశంలో సాగిన సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమానికీ, స్వాతంత్ర్యోద్యమానికే పత్రికలే సారథ్యం వహించినాయంటే అత్యుక్తి కాదు. వర్తమానయుగంలోనూ ప్రజా జీవితంలోని ఒక్కొక్క రంగానికి ఒక్కొక్క పత్రిక అంకితమై సేవలందిస్తున్నది. ప్రపంచంలో ఎక్కడైనా ఏదైనా సంఘటన జరిగిన మరుక్షణంలో అది అక్షరరూపం ధరిస్తున్నది. అంతేకాక విశ్వరూపాన్ని కూడా ధరించి ప్రపంచమంతా వ్యాపిస్తున్నది. ఆకాశవాణి, దూరదర్శన్‌లవంటి సాధనాలు లభ్యపడని ప్రాంతాలకు కూడ ప్రయాణించి పత్రికలు ప్రజల్ని నిత్య చైతన్యమూర్తులుగా తయారుచేస్తున్నాయి. ఆకాశవాణి, దూరదర్శన్‌లు కూడా ప్రసారం చేయలేని వార్తలను, విషయాలను సమగ్రంగా, సవివరంగా పత్రికలు ప్రజలకు అందజేస్తున్నాయి. అందుకే ప్రచార సాధనాలన్నింటికన్నా పత్రికలదే అగ్రతాంబూలంగా ఉంటున్నది. కనుక అవి నిష్పక్షపాతంగా నిర్భయంగా వ్యవహరింపవలసి ఉంటుంది. ఒక్కొక్కప్పుడవి సత్యాన్వేషణ జరిపి నిజాన్ని బయటపెట్టవలసి ఉంటుంది. అవి ప్రజల పక్షాన నిలిచే సత్యసంశోధిక సంస్థలవంటివని కూడా చెప్పాలి. పత్రికల్లో స్థానిక వార్తలకు చోటు కలిపించడం అవసరమే ఐతే ఈనాటి తెలుగు దినపత్రికలు స్థానిక వార్తలకోసం జిల్లాలవారీగా ప్రత్యేక అనుబంధాల్ని ప్రచురిస్తున్నాయి. అవి క్రమంగా ప్రజాజీవన రంగాలన్నింటికీ ప్రాకి తిమింగిలాలుగా తయారవుతున్నాయి. అందువల్ల కనిపించిందానినల్లా వాటి కడుపులోకి తోయడం అవసరమవుతున్నది. ఈ పద్ధతివల్ల చిన్న చిన్న స్థానిక పత్రికల నడ్డి విరిగినట్లవుతున్నది. పెద్ద పెద్ద సభలూ, సమావేశాలూ ఎంత గొప్పగా జరిగినా తరచుగా జిల్లా సంచికల్లోనే నెట్టేస్తున్నారు. అందువల్ల పత్రికల ప్రధానాశయమే దెబ్బ తింటున్నది.

సాహిత్య, సాంస్కృతిక, వైజ్ఞానిక రంగాలకు పత్రికల సేవ అపారంగానే ఉంటున్నది. దేశం ఎదుర్కొంటున్న క్లిష్ట సందర్భాల్లో ఏది మంచో, ఏది చెడో, ఏది చేయవచ్చునో, ఏది చేయరాదో ప్రజలకు సహేతుకంగా విప్పి చెప్పవలసిన బాధ్యత పత్రికలపై ఉన్నది. అవి ప్రజలకు మార్గదర్శకం వహించే గురుపీఠంవంటివి. కాని అనేక సందర్భాల్లో పత్రికలు ఆశించినదానికి

భిన్నంగా చరిస్తున్నాయి. ఇది బాధాకరమైన విషయం. అందుకే ఒక చోట సుప్రసిద్ధ పత్రికా రచయిత స్వర్గీయ శ్రీ తురగా కృష్ణమోహన్‌రావు – "మనకి రాజ్యాంగం ప్రసాదించిన స్వాతంత్ర్యాలలో అతిముఖ్యమైనదని చెప్పదగింది పత్రికా స్వాతంత్ర్యం. ఈ స్వాతంత్ర్యాన్ని మనం లోకకళ్యాణార్థం వినియోగించుకోలేకపోయామనే చెప్పాలి. చాలా సందర్భాల్లో దీన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాం సరికదా! అనేక సందర్భాల్లో దీన్ని దుర్వినియోగం చేయడంకూడా జరిగింది." ('తెలుగులో పత్రికా రచన – 'మహతి' – యువభారతి ప్రచురణ) అంటూ వాపోవడం జరిగింది. మరో సంగతి. అప్పుడప్పుడు 'పత్రికా స్వేచ్ఛ' అంటూ పత్రికలవాళ్లు గోలపెట్టడం జరుగుతున్నది. ఈ స్వేచ్ఛ పత్రికల యజమానులకోసమా? సంపాదకమండలి కోసమా? విలేఖరుల కోసమా? లేక ప్రజాభిప్రాయ ప్రకటన కోసమా? ఈ ప్రశ్నలన్నింటిలో చివరిదానికే ప్రాముఖ్యమున్నది వేరే చెప్పవలసిన పనిలేదు. ఐతే ఈ "పత్రికాస్వేచ్ఛ" అనే హక్కును అనేక సందర్భాల్లో దుర్వినియోగపరచడం జరుగుతున్నది. ఏదైనా ఒక పత్రికా సంపాదకుడు ఎవరైనా ఒక నాసిరకం రచయితను తమ ధారావాహిక ప్రచురణలతో ఆకాశానికెత్తడం ఘోరమైన నేరం. అట్లాగే తమ చుట్టూ ప్రదక్షిణలుచేసి మచ్చిక చేసుకోలేని ఉత్తమ రచయితల్ని సైతం పత్రికలు తమ దరిదాపులోకి కూడా రానివ్వకపోవడం దేశద్రోహంకన్న మించిన పాపం. మరో ముఖ్య విషయమేమిటంటే పుస్తక సమీక్షలు కూడ ఒకందుకు కొత్తగా వెలువడుతున్న పుస్తకాల్ని ప్రచారం చేయడానికనే ఉద్దేశించినవి. ఐతే వాటివల్ల రచయితలందరికీ సరియైన న్యాయం జరుగడంలేదు. సాధారణంగా ఈ పుస్తక సమీక్షలు వీడు అయినవాడూ, వీడు కానివాడూ, వీడు అక్కరకు రానివాడూ అన్న పద్ధతుల్లో సాగుతున్నాయి. మరికొన్ని పత్రికల చిత్రచ్ఛాయల్లో కొందరు భాషాభిక్షుకులుచేరి యువ రచయితల్ని పెడమార్గంలోకి దింపుతున్నారు. అనారోగ్యకరమైన సాహిత్యం తప్ప వాళ్లు ఉత్తమ సాహిత్యాన్ని యువకులకు పరిచయం చేయడంలేదు. మంచి సాహిత్యాన్ని వాళ్లు చదువరు. ఇతరుల్ని చదువనివ్వరు. వీల్లు తమ చేటురాతలతో సాహిత్యాన్ని కలుషితం చేస్తున్నారు. ఈ లోపాల్ని సరిదిద్దుకోవడం పత్రికలకు పెద్ద సమస్యేమీకాదు. అలాంటి శుభసమయం త్వరలో వస్తుందనీ, రావాలనీ ఆశిద్దాం.

ఇక ఐదవది ప్రదర్శన కళారూపాలు. ప్రదర్శన కళారూపాలలో కొన్ని ప్రసిద్ధమైన వాటిని ప్రభుత్వం ప్రచార సాధనాలుగా వాడుకుంటున్నది. కొన్ని సందర్భాల్లో ఇవి నేరుగా రంగస్థలంపై ప్రదర్శింపబడుతున్నాయి. ఇప్పుడిప్పుడు వీటిని ప్రచార లక్ష్యంతో దూరదర్శన్ ద్వారా ప్రదర్శించడం ఎక్కువైంది. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలూ, అభివృద్ధి కార్యక్రమాలూ వీటి ద్వారా బాగా ప్రచారం పొందుతున్నాయి. ప్రజల నాకర్షించడానికి బాగా ఉపయోగింపబడుతున్నాయి. ముఖ్యంగా బుర్రకథ, హరికథ, గొల్లసుద్దులు వగైరా కళారూపాల్ని ఈ ప్రచార కార్యక్రమాలకు వాడుతున్నారు. ఐతే అనేక సందర్భాల్లో ప్రచారం వాచ్యమైపోయి ప్రజలకు ఆయా కళా ప్రక్రియలపై ఉన్న గౌరవం సన్నగిల్లుతున్నది. కనుక ఈ కళారూపాల ద్వారా కేవలం ప్రచార వస్తువేకాక, ఏ కళాప్రక్రియ ఎందుకు పుట్టిందో దాన్నే ప్రధాన వస్తువుగాచేసి మధ్య మధ్య ప్రచార వస్తువు గూర్చిన ప్రస్తావన తేవడం కళకు న్యాయంచేసినట్లవుతుంది. ఒక్కొక్క ప్రదర్శన కళకు ఒక్కొక్క ప్రత్యేకమైన చారిత్రక, సామాజిక నేపథ్యం ఉన్నది. ఆయా ప్రదర్శన కళలు, ఆయా చారిత్రక సందర్భాల్లో ప్రజల అవసరాన్ని తీర్చడానికి ప్రజల అభిరుచుల కనుగుణంగా పుట్టి వికసించినాయి. వాటి నేపథ్యాన్ని చక్కగా అవగాహన చేసుకొని, కళా గౌరవం తగ్గకుండా ప్రచారం కోసం వాడుకుంటే వాటికి న్యాయం చేసినట్టవుతుంది.

ఇవేకాక మారుతున్న ఈ యుగంలో అగ్గిపెట్టెలు, బస్సులు కూడ ప్రచార సాధనాలుగా పనికివస్తున్నాయి. ఏది ఏమైనా మారుతున్న ప్రజల అవసరాలూ, అభిరుచులూ, విలువలకూ అనుగుణంగా ప్రచార సాధనాలు మారకతప్పదు. ఐతే అవి

దేశీయ సంస్కృతిని పరిరక్షించే విధంగా, జాతీయతను పరిపోషించుకుంటూ ప్రజలకు ఉత్తమ సంస్కారాన్ని అందిస్తూ ప్రచార సాధనాలు తమ కార్యక్రమాల్ని రూపొందించుకోవడం అవసరం. అవి స్వస్థానవేష భాషల్ని ప్రదర్శించాలి. స్వాభిమానాన్ని ప్రజ్వలింపజేయాలి. సహజ సుందరమైన వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేయాలి.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. ఏది ఘోరమైన నేరం?
2. పత్రికా స్వేచ్ఛ గురించి రచయిత ఏమి చెప్పాడు?

## పాఠ్యాంశ అన్వయం

వేగవంతమైన ఇంటర్‌నెట్ సమాచార వ్యవస్థతో “అరచేతిలో వైకుంఠం’లాగా ఇప్పుడు అన్నీ మన చేతిలోని ఫోన్‌లో తెలుసుకునే సౌకర్యం కలిగింది. అయితే అత్యధిక జనాభా కలిగిన మనదేశంలో ఈ ఆధునిక సమాచార వ్యవస్థవల్ల లాభంతోపాటు నష్టం కూడా ఉంది. వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ట్విట్టర్ వంటి మాధ్యమాలు, అనేక యాప్స్ అపరిమిత జ్ఞానంతోపాటు అనవసర విషయాలకు ప్రాధాన్యం ఎక్కువగా ఇస్తున్నాయి. విద్యార్థులు విజ్ఞానం కోసం ఈ ప్రచార సాధనాలు, సామాజిక మాధ్యమాలను వివేకంతో వినియోగించుకుంటూ ఉన్నతంగా ఎదగాలి. అంతేగాని వాటి చేతిలో బందీఅయి జీవితాన్ని నాశనం చేసుకోకుండా, చైతన్యంతో ఉత్తమ భవిష్యత్తు కోసం ఆదర్శమార్గంలో నడవాలి.

## భాషా సామర్థ్యాలను సాధిద్దాం

### I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది గద్యాన్ని చదివి ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

శ్రీకృష్ణుడు ఒకప్పుడు తన నోట్లో విశ్వరూప సందర్శనం చేయిస్తే ఇప్పుడు నట్టింట్లో ‘నెట్’ తిష్ట వేసుక్కూచున్నది. ‘ఇంటర్‌నెట్’ ఇవాళ మనుషుల పనిలో భారాన్ని తగ్గించి మనసుల మధ్య దూరాన్ని పెంచుతున్నది. ఒకప్పుడు ‘లేఖ’లు, టెలిగ్రామ్‌లు, టెలిఫోన్లు మనుషుల మధ్య ఇంత సమాచార వేగాన్ని పెంచకపోయినా ఒత్తిడిలేని జీవనం ఉండేది. ఇప్పుడు ‘సెల్‌ఫోన్’ శరీరభాగాల్లో ఒకటిగా మారిపోగా, టీవి ఇంట్లోని వస్తువుల్లో ఒకటిగా మారింది. ఫోను సంభాషణలు, వీడియోకాల్స్ మనిషికి మనిషికి మధ్య దూరాన్ని తగ్గించడంతోపాటు ఆత్మీయతానుబంధాలను మాయం చేశాయి.

**ప్రశ్నలు :**

అ) విశ్వరూప సందర్శనం చేయించింది ఎవరు?

______________________________

ఆ) 'నెట్' ఎక్కడ తిష్ఠవేసుకు కూర్చున్నది?

______________________________

ఇ) మనుషుల పనిలో భారాన్ని తగ్గించింది ఏమిటి?

______________________________

ఈ) మనిషి శరీర భాగాలలో ఒకటిగా మారిపోయిందేమిటి?

______________________________

ఉ) ఒకప్పుడు మనుషుల మధ్య సమాచార మార్పిడి ఎలా జరిగేది?

______________________________

## II. భాషాంశాలు

### పదజాలం

**1. కింది పదాలకు పర్యాయ పదాలు రాయండి.**

అ) అభీష్టం = ____________ ____________

ఆ) శక్తి = ____________ ____________

ఇ) సమూహం = ____________ ____________

ఈ) రైతు = ____________ ____________

ఉ) ప్రజ్వలించు = ____________ ____________

**2. కింది పదాలకు సొంతవాక్యాలు రాయండి.**

అ) దండోరా = ______________________________

ఆ) రుగ్మత = ______________________________

ఇ) ధర్మము = ______________________________

ఈ) వ్యవసాయము = ______________________________

ఉ) దుర్వినియోగము = ______________________________

**3. కింది పదాలలో ఆ విషయానికి సంబంధంలేని పదం ఉంది గుర్తించండి.**

అ) ఆకాశవాణి, దూరదర్శన్, సినిమా, భోజనము, పత్రిక

ఆ) జనాభానియంత్రణ, అక్షరాస్యత, వరకట్న నిర్మూలన, పొదుపు

ఇ) వాట్సప్, ఫేస్‌బుక్, సెల్‌ఫోన్, ట్విట్టర్, యూట్యూబ్

**4. కింది జాతీయాలకు అర్థం రాసి, సొంతవాక్యాలలో ప్రయోగించండి.**

అ) కీలుబొమ్మ = ______________________

ఆ) ఆకాశానికెత్తడం = ______________________

## వ్యాకరణాంశాలు

**★ కింది సమాస పదాలను గమనించండి.**

అ) గుణసంపద = గుణములనెడి సంపద

ఆ) కాలచక్రం = కాలమనెడి చక్రం

ఇ) సంసారసాగరం = సంసారమనెడి సాగరం

పై సమాస పదాలలో ఉపమాన, ఉపమేయములకు భేదం ఉన్నా లేనట్టు చెప్పబడింది. ఇట్లా అభేదం చెప్పడాన్ని **'రూపక సమాసం'** అంటారు. రూపకం అంటే ఆరోపించడం. ఒకదానియందు మరొక దాని ధర్మాన్ని ఆరోపించడం.

పై ఉదాహరణ 'గుణసంపద' యందు 'సంపద' పదం యొక్క ధర్మాన్ని గుణము అనే పదము యందు ఆరోపించారు. ఆ రెండు పదాల మధ్య భేదం ఉన్నా అభేదం చెప్పబడింది. దీనినే రూపక సమాసం అంటారు. ఈ సమాసాల విగ్రహవాక్యం చెప్పేటప్పుడు 'అనెడు' అనే పదం వస్తుంది.

**★ కింది సమాస పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి.**

అ) ఆశాసౌధం ______________________ ____________

ఆ) గానామృతం ______________________ ____________

ఇ) కోపాగ్ని ______________________ ____________

## III. వ్యక్తీకరణ – సృజనాత్మకత

**స్వీయరచన**

1. **కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) పేర్వారం జగన్నాథం గురించి తెలుపండి.

ఆ) ఈ పాఠ్యభాగ రచన కాలంలో ఉన్న ప్రధాన ప్రచార సాధనాలు ఏవి?

ఇ) ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్న సంక్షేమ కార్యక్రమాలలో ప్రధాన అంశాలు ఏవి?

ఈ) మారుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రచార సాధనాలు ఎలా ఉండాలని రచయిత అభిప్రాయపడ్డారు?

2. **కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) పాఠం ఆధారంగా ఆకాశవాణి, దూరదర్శన్‌ల గురించి వివరించండి.

ఆ) ప్రచార సాధనాలుగా సినిమారంగం ప్రజలపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందని రచయిత అభిప్రాయం వ్యక్తం చేశారు.

**సృజనాత్మకత**

1. **కింది ప్రశ్నకు సమాధానం రాయండి.**

అ) దూరదర్శన్ గురించి ఈ పాఠంలో తెలుసుకున్నారు కదా! మీరు కోరుకునే కొన్ని కార్యక్రమాలను సూచిస్తూ, వాటిని ప్రసారం చేయమని దూరదర్శన్ సంచాలకులకు లేఖ రాయండి.

**సూక్తి**

'పత్రికొక్కటున్న పదివేల సైన్యంబు'


– నార్ల వెంకటేశ్వర రావు

గద్య భాగం

# 10 ఆదివాసులు

– బూసాని బాబురావు వర్మ

## రచయిత పరిచయం



28-08-1927
01-09-2020

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు బూసాని బాబూరావు వర్మ హైదరాబాద్‌లో జన్మించాడు. విద్యార్థి దశలోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నాడు. హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయాలని సాగిన ఉద్యమాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నాడు. ఈ క్రమంలో నిజాం పోలీసుల దాష్టికాలను ఖండిస్తూ నిరసన ప్రదర్శనలు నిర్వహించడంలో ముందున్నాడు.

రాష్ట్ర వెనకబడిన తరగతులు మరియు సహకార సంస్థ తొలి డైరెక్టర్‌గా పనిచేశాడు. నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ మెంబర్‌గా, ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులుగా పనిచేశాడు. అవకాశం ఉన్న ప్రతి వేదికపై బి.సి, ఆదివాసీల సమస్యలను లేవనెత్తేవాడు. హైదరాబాద్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు జ్ఞాపకార్థం బూర్గుల రామకృష్ణారావు ఫౌండేషన్‌ను ఏర్పాటుచేసి అనేక కార్యక్రమాలు నిర్వహించాడు. పాలమూరు విశ్వవిద్యాలయానికి బూర్గుల రామకృష్ణారావు పేరును పెట్టాలనేది ఆయన ప్రగాఢ వాంఛగా ఉండేది.

ఈ పాఠం వ్యాసప్రక్రియకు చెందినది. సూటిగా, స్పష్టంగా, నిర్దిష్టంగా, సులభంగా అర్థమయ్యేలా ఉండటం వ్యాసం లక్షణం. ప్రస్తుత పాఠ్యభాగం వట్టికోట ఆళ్వారుస్వామి సంకలనం చేసిన 'తెలంగాణం' అనే గ్రంథంలోనిది.

## నేపథ్యం / ఉద్దేశం

దేశంలో ఇతర ప్రజలతో పోల్చినప్పుడు ఆదిమవాసుల జీవితాలు, ఆచార వ్యవహారాలు భిన్నంగా ఉంటాయి. వారిలో మళ్లీ వేరువేరు తెగలు, ఆచార వ్యవహారాలు ఉంటాయి. నాగరిక సమాజాలకు దూరంగా అడవుల్లో ఉండే ఆదిమజాతుల విశ్వాసాలు, సంస్కృతీ సంప్రదాయాల గురించి అవగాహన కలిగించడంతోపాటు వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యతను తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

# I

చెంచు జాతివారు దక్కన్లోని చాల పురాతన కాలపు ఆదిమవాసులు. వారు ఎక్కువగా మహబూబ్ నగర్ జిల్లాలోని మన్ననూరు గ్రామ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరు అల్పసంఖ్యాకులు అయి ఉన్నప్పటికీ, తమ మతాచార కర్మలను, తూచ తప్పకుండ పాటిస్తూ వస్తున్నారు. వారు 'గారెల మైసమ్మ' అనే స్త్రీ దేవత పైననూ, హిందువుల 'భగవానుడు' అనే దేవునికి చాలా దగ్గరి సంబంధం కలిగి ఉండే 'భగవంతరు' అనే పురుష దేవత పైనను విశ్వాసము కలిగి ఉంటారు. 'గారెల మైసమ్మ' అనే దేవతకు క్రూర జంతువులను అదుపులో ఉంచే శక్తి, వేటలో మంచి అదృష్టమును ప్రసాదించే శక్తి గలదని వారి విశ్వాసము. ఆ దేవత పువ్వులు పూచుటకు, పండ్లు పండుటకు కారణమని చెప్తుతారు. ఇదిగాక వేటకాండ్రకు, ఆహారమును ప్రోగుచేసుకునే వారికి, ప్రాణాధారములైన పై రెండు ఆరణ్యక వస్తువులపై ఆమెకు సంపూర్ణ అధికారము కలదని వారి నమ్మకము. చెంచులు వేటకు బయలుదేరేముందు, ఆ దేవతను దర్శించి, తమకు సహాయము చేయవలసినదని ప్రార్థిస్తారు. వేటలో చంపిన ప్రతి మృగములోను, కొద్ది భాగము ఆమెకు నైవేద్యముగా ఇస్తారు. ఇదే విధముగా వారు తినే పండ్లలో మొదటి పండును 'గారెల మైసమ్మ'కు నైవేద్యము పెట్టిన తరువాత వారు తింటారు.

'భగవంతరు' అనే దేవత ఒక ఆకాశ దేవత అని స్పష్టముగా చెప్పవచ్చును. ఈ దేవత వర్షపాతమును, ఉరుములను అదుపులో ఉంచుతుందని వారి నమ్మకము. ఈ భూలోకములో చేసిన పాపాలవల్ల మనిషి ఆత్మ ఘోర పిశాచ రూపము దాలిస్తే తప్ప ప్రతివ్యక్తి 'భగవంతరు' నుండి జన్మించి, మరణించిన తరువాత అతని జీవాత్మ తిరిగి ఆ 'భగవంతరుని'లోనే లీనమైపోతుందని చెంచువారి విశ్వాసము. 'గారెల మైసమ్మ'కు వలె 'భగవంతరు'నకు తొలి పండును నైవేద్యం పెట్టరు. కాని అనేక సందర్భాలలో ఆ దేవుణ్ణి పూజిస్తారు. ముఖ్యమైన ఈ ఇరువురు దేవతలనేగాక, చెంచులు ఇంకా అనేక చిన్న చిన్న దేవుళ్ళను కూడా కొలుస్తారు. ఆ దేవుళ్ళకు ఇరుగు పొరుగు గ్రామాల తెలుగు ప్రజలు కొలిచే దేవుళ్ళకు దగ్గరి పోలిక ఉంటుంది. చెంచుజాతి వారిలో మతాచార కర్మలు, అంత ఎక్కువగా లేవు. వారికి మత గురువులు ఉండరు. అవసరమైనప్పుడు ప్రతి చెంచువాడు స్వయంగా వెళ్ళి దేవతను ఆరాధిస్తాడు. మత కర్మలు చేయడంలో స్త్రీలు పాల్గొనరు. చెంచుజాతివారు పూజాదులలో పశువధ, పితృదేవతలకు శ్రాద్ధాదులు చేయరనే విషయము ముఖ్యముగా గమనించదగినది.

## కొండరెడ్లు

పురాతన కాలం నుండి సంచార సేద్యం చేసుకుంటూ ఉండే కొండజాతులలో కొండరెడ్ల మతము చెంచుల మతముకన్న చాలా భిన్నముగా ఉంటుంది. కొండరెడ్లకు దేవునిపై విశ్వాసము లేదు. వారు మనుష్య రూపములో ఉన్న చిన్న చిన్న కొండదేవత లెందరినో కొలుస్తారు. ఆ దేవతలు మనుష్య రూపములోనే అడవులలోను, పర్వత శిఖరాలపైనను ఉంటారని వారి విశ్వాసము. ముఖ్యమైన ఈ ఇరువురు దేవతలనేగాక, చెంచులు ఇంకా అనేక చిన్న చిన్న దేవుళ్ళను కూడా కొలుస్తారు. ఆ దేవతలు సర్వశక్తిమంతులు కారు. కాని వారు మనుష్యులకు సహాయము చేయడానికి, లేదా బాధ కలిగించడానికి సమర్థులని వారి అభిప్రాయము. ఆ దేవతలకు పక్షులను, పందులను బలి ఇస్తారు. కొండదేవతలకు ఇచ్చే బలులే కాక, వ్యవసాయపు పనులలో జయము కలుగవలెనని భూదేవతకు రక్త బలులను ఇస్తారు.

కొండరెడ్లలోను, వారి ఇరుగుపొరుగులో ఉండే కోయలలోను, మనుష్యబలులు ఇచ్చే క్రూరాచారము కలదు. ఆ ఆచారము ఇప్పట్లో వాడుకలోలేదు. చెంచులవలెగాక, కొండరెడ్లు పెద్ద పెద్ద విందులు, ఉత్సవాలు ఏర్పాటుచేస్తారు. సాధారణముగా, అవి తెలంగాణ గ్రామీణ నాగరికతను అనుసరించి, చేసే మతకర్మలను పోలి ఉంటవి. పంట కోతలు కాగానే కొత్త ధాన్యాన్ని మరణించిన పితృదేవతలకు సమర్పించుతారు. ఇంతకు తప్ప వేరే పితృకర్మలు వారిలో లేవు.

## కోయలు

కోయలు రెండు సంవత్సరాలకు ఒకసారి వరంగల్ జిల్లా, ములుగు తాలూకాలోని మేడారం అనే గ్రామంలో ఒక జాతర ఏర్పాటుచేస్తారు. ఆ జాతరలో వారు "సారళమ్మ" (తల్లి) మరియు "సాదెళమ్మ" (కూతురు)* అనే ఆ ఇద్దరు దేవతలను పూజిస్తారు. ఆ జాతి వారి విశ్వాసము ప్రకారము 'సారళమ్మ', 'సాదెళమ్మ' అనే దేవతలు పర్వత ప్రాంతంలో ఎవరికి కనిపించకుండ ఉంటారు.

రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఆ జాతరలను సేవించడానికై యాత్రికులు దూర దూరం నుండి వస్తారు. జాతరలో సుమారు ఒక లక్షమంది ప్రజలు పాల్గొంటారు. ఈ జాతరకు కోయలేగాక ఇతరులుగూడ ఎక్కువ సంఖ్యలో వస్తారు. 'సారళమ్మ' 'సాదెళమ్మ' దేవతలు జాతర సందర్భములో చుట్టు అడవిలో ఉన్న క్రూరజంతువుల నోళ్ళను, యాత్రికులెవరికి హానికలుగకుండ ఉండేటందుకై కట్టివేస్తారని కోయల నమ్మకము. దగ్గరనే ఉన్న పసరా నదీ తీరాన, పెద్ద భక్తి ఉత్సాహాలతో కోయలు పూజలు చేసుకుంటు ఉండగా, సంతానాభిలాషగల స్త్రీలు అనేకులు దేవతల ఊరేగింపు సమయములో, సాగిలబడి దేవతలకు నమస్కారాలు చేస్తూ ఉంటారు. 'సారళమ్మ' వారికి సంతాన ప్రాప్తిని ప్రసాదిస్తుందని స్త్రీలకు గట్టి విశ్వాసము.

మేడారంలో పూజాకర్మలు జరిగే చోటు ఏమంత ఆకర్షణీయంగా లేదు. అక్కడ ఒక మూర్తికూడ ఉండదు. అయితే తాత్కాలికంగా అమర్చబడిన, మూడు కొయ్య ద్వారాలలో, గంటలు కట్టబడి ఉంటవి. చెట్టు క్రింది భాగంలో, మొరటుగా చిత్రించబడిన, కొయ్య స్తంభములు కొన్ని ఉంటవి. మత కర్మలకు సంబంధించిన వస్తువులు ఒక కుండపైన పెట్టుతారు. కాని వాటిలో ఒక్కటి కూడా దేవతా చిహ్నాముగా పరిగణింపబడదు. మేడారం జాతరకు మ్రొక్కుబళ్లు చెల్లించడానికి ఎందరో వస్తూ ఉంటారు. మ్రొక్కుబళ్ళ రూపంలో ఎంతో ధనము సమర్పించుతారు. ఇది ఆ జాతర యొక్క ప్రత్యేకత.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. సారళమ్మ, సాదెలమ్మ దేవతలపై కోయలకు ఉన్న విశ్వాసం ఎలాంటిది?
2. చెంచుల విశ్వాసాల గురించి నీవు ఏం తెలుసుకున్నావు?

## II

## గోండులు, కోలాములు, నాయక్ పోడులు

గోండులు, కోయలు, కొండరెడ్లు వీరందరి మతాచారాలలోను, కొంత సారూప్యము గోచరిస్తుంది. తమ పంటలకు అరిష్టములు రాకుండుటకు వీరు భూదేవిని పూజిస్తారు. గోండులు మరియు కోయలు తమ యిలవేల్పులను పూజిస్తారు. అట్లా చేయవలెనని వారి పురాణాలలో ఉన్నది. గోండులకు కులదైవము 'పెర్సాపేన్' (పెద్ద దేవుడు). ఈ పెర్సాపేన్ దేవతా రూపమును దాల్చిన ఆ జాతి పూర్వ పురుషుడేనని వారి విశ్వాసము.

ఆ జాతివారు సంవత్సరానికి రెండుసార్లు ఈ పెర్సాపేన్‌కు ఉత్సవాలు జరుపుతారు. ఈ ఉత్సవాలలో వారు ఆ దేవతకు పక్షులను, మేకలను, ఆవులను బలి ఇస్తారు. ప్రతి శుభాశుభకార్యారంభమునకు ఈ పెర్సాపేన్‌ను ప్రార్థిస్తారు. చచ్చినవారి ఆత్మలు పెర్సాపేన్‌లో లీనమవుతాయని వారి నమ్మకము. వీరిలో ప్రతి వంశానికి ఒక గురువు ఉంటాడు. ఆయన ఈ పెర్సాపేన్‌ను కొలుస్తాడు. ఒక ప్రధాన్ అనే బత్రాజు ఉంటాడు. పూజలు నిర్వహిస్తూ వారి వంశ చరిత్రను మరిచిపోకుండా పఠిస్తూ ఉంటాడు.

వారు శివపూజ కూడా చేస్తారు. అయితే ఇది పెర్సాపేన్ పూజకు భిన్నంగా ఉంటుంది. శివపూజలో టెంకాయలు మాత్రమే కొడతారు. కాని జంతుబలినీయరు.

మరణించిన వారి విషయములో ఈ గోండుల చర్యలు, కోయల చర్యలు చాలా వింతగా ఉంటవి. దహన సంస్కారములలో వారి చితి దగ్గర ఆవును బలి యిస్తారు. రాత్రంతా చితి చుట్టూ నాట్యం చేస్తారు. మరణించిన వారి గౌరవార్థం, స్మారక చిహ్నంతో గొప్ప విందులు చేస్తారు. ఆ విందుల సందర్భంలో గోవును బలిగా ఇవ్వడం చాలా అవసరముగా భావించబడుతున్నది. మరణించినవాడు, తన కొడుకుకో, కూతురుకో, తిరిగి మనుమడి రూపంలో పుడుతాడని వారి నమ్మకము.

కుల గురువులే కాక, వీరిలో పురోహితులు కూడా ఉంటారు. వారు దేవతలకు పూజలు చేస్తారు. ఈ పూజారులను 'భక్తాల్' అని పిలుస్తారు. వారికి దేవతలతో నేరుగా సంబంధం ఉంటుందని నమ్మకము. వారికి శివమెక్కుతుంది. అంటే ఆ దేవత వానిలో ప్రవేశించి తన తలపులను వాని నోట ఇతరులకు తెలుపుతుంది అని వారి విశ్వాసము.

గోండుల మతములో మానవ జీవితానికి సంబంధించిన విషయాలన్నీ ఉన్నవి. ఆ మతము సదాచారములకును, పూర్వాచారములకును ఎక్కువ ప్రోద్బలమిస్తుంది. మరణించిన వారికిని, జీవించిన వారికిని, జరిగిన విషయాలకును, జరుగుచున్న విషయాలకును ఏదో ఒక అవినాభావ సంబంధం ఉన్నదని వారి నమ్మకము.

ఆదిలాబాదు జిల్లాలో కేసలాపురం అనే గ్రామంలో గోండులు సంవత్సరమునకు ఒకతూరి ఒక జాతర జరుపుతారు. కొండ జాతులలో ఇది చాల గొప్ప జాతర. కనుల పండువుగా ఉంటుంది. ఈ జాతరకు దూర దూర ప్రాంతాల నుండి వేలకొలది గోండులు వస్తారు. వారు అచ్చట 'నాగశేష' అనే దేవతను పూజిస్తారు.

నెమలి ఈకలతోను, చిత్తరువులతోను అలంకరించి చెక్కిన కొయ్యబద్ద కోలాములందరికి ముఖ్యదేవత. ఆ బద్దకు 'అయాక్' అని పేరు. కోలామి భాషగాక, యితర భాషలో మాట్లాడునప్పుడు ఆ దేవతను 'భీమన' లేక 'భీమదేవ' అని పిలుస్తారు. ఇది గోండుల 'భీమపేన్'కు చిహ్నమని కోలాములును ఒప్పుకుంటారు. ప్రతి కోలాముల గ్రామము వెలుపల ఈ 'అయాక్' గుర్తుగల విగ్రహాలు ఉంటవి. 'అయాక్'నే గాక రోగములు రాకుండుటకై 'పోలకమ్మ'ను, గ్రామమునకు ఏ ఈతిబాధలును రాకుండ కాపాడుటకై 'గాబురాక్' అనే దేవతను పూజిస్తారు.

ఇంచుమించుగా నాయక్ పోడుల మతమును కోలాముల మతమును పోలి ఉంటుంది. 'భీమలియాక్' లేక 'భీమన' వీరి ముఖ్యదైవము. ఈ దేవుడు కోలాముల 'అయాక్'ను పోలియుంటాడు. జనన మరణ సందర్భములలో వీరు ఆచరించే కర్మలు తక్కువ. జాతి హిందువులు ఆచరించు కర్మలతో కలిసియుండును.

బంజారాల లేక లంబాడాల యిష్టదైవము "శీతలాభవాని". ఈ దేవత పెద్ద పెద్ద ఏడు రాళ్ళ రూపంలో ఉంటుంది. ఈ రాళ్ళను వారు సాధారణముగా వారి తండా దగ్గరి మైదానంలో పాతుతారు. ఈ ఏడు రాళ్ళలో, నడిమిరాయి పెద్దదిగా ఉంటుంది. దానికి సింధూరం పట్టిస్తారు. దసరా దివసాలలో ఈ దేవతకు పెద్ద ఉత్సవాలు జరుపుతారు. ఈ సందర్భంలో బంజారాలు వారి పశువులనన్ని ఆ దేవతకు చుట్టూ ఉంచుతారు. క్రిందటి రాత్రి ఉపవసించిన ఒక బంజారా అక్కడ ఆ రోజు పూజారిగా ఉంటాడు. ప్రతి కుటుంబపు పెద్ద ఒక పళ్లెం నిండా శనగ గుగ్గిళ్ళు, ఒక కోడిని పట్టుకవస్తాడు. శనగ గుగ్గిళ్ళ పళ్లెం పూజారిముందు పెట్టి, కోడితల కత్తితో నరికి పూజారి ఎదుట ఉండే జెముడు జిగురులో ఆ తలను వేసి కోడిని పశువులవైపున విసరివేస్తాడు. ఆ కోడి రక్తాన్ని పశువుల కొమ్ములకు పూస్తారు. పూజారి గుగ్గిళ్ళలో తన భాగమును తీసుకొని మిగిలినవి అచటి భక్తులకు పంచిపెట్టును.

బంజారాల మరియొక దేవుడు "శివభయ్యా" – ఈ దేవత పేరిట ప్రమాణము చేసిన ఏ బంజారా కూడా అసత్యమాడదు. అట్లు చేసిన వారి ఆప్తులు చత్తురనియు, వారి పశువులకు హాని కలుగుతుందనియు వారి మూఢనమ్మకము. బంజారాలు బరువులు మోసే పశువులను పూజిస్తారు. ఈ పూజకుగాను ఒక పశువును "హతదియా" అనే పేరుతో వేరుగా ఉంచుతారు. ఈ పూజలవలన వారికి, వారి పశువులకు ఏలాంటి రోగములు రావని వారి నమ్మకము.

ఆదివాసులలో చాలా తెగలు మంత్ర తంత్రములను నమ్ముతారు. మాంత్రికునకు భయపడతారు. గోండులు దుష్టములగు మంత్రములందు దృఢవిశ్వాసము గలవారై ఉంటారు. గారడీవారూ, మంత్రకాండ్లు చేసే క్రియలవల్ల చాలా బాధలు కలుగుతాయని గోండులు భావిస్తారు. కొండరెడ్ల జాతులలో మంత్ర తంత్రములు చాలా ప్రాముఖ్యము వహించియున్నవి. చెంచుజాతివారికి దీనిలో అంత నమ్మకములేదు. బంజారాలు కూడా కులతంత్రాలలో చిక్కుకొనరు. కాని మంచివి చెడ్డవి అయిన మంత్ర తంత్రములు వారి అనుభవములో కూడ ఉన్నవి. "జనతా" అనబడు మంత్రవైద్యుడు, పశు, మనుష్య రోగములకు చికిత్స చేస్తాడు. తరుచు ఈ పనిచేసే స్త్రీ "దకూన్" అని పిలువబడుతుంది. మంచి మంత్ర వైద్యుడు "నింబూకాట్నా"(నిమ్మకాయలు

కోసేవాడు) అని పిలువబడుతాడు. ఇతడు దుష్టమాంత్రికులను, దుష్టశక్తులను కట్టివేస్తాడు. అందువలన ఇతనికి గొప్ప గౌరవస్థానము కలదు.

ఆదివాసులు కానివారు తరుచు ఆదివాసులతో కలియుటవలన వీరిలో నాగరికమైన హిందూమత సంప్రదాయములు చేరుకున్నవి. ఇప్పుడు దూర గ్రామములలో నివసిస్తున్న భిల్లులలో గూడ ఆదివాసుల పూర్వ పద్ధతులు చాలా వరకు అంతరించినవి.

రోజు రోజుకు మారుతూ ఉన్న సమాజ పరిస్థితుల ప్రభావం ఆదివాసులపైన కూడా చాలావరకు పడుతూ ఉన్నది. అచిర కాలములోనే ఆదిమ జాతులు భారత సమాజంలో ఐక్యమై పోగలరని విశ్వాసము. అయితే చరిత్రకు కూడ అందని, యుగాల నుండి గతానుగతికంగా వస్తూ ఉన్న వారి సాంస్కృతిక సాంప్రదాయాలు సంరక్షింపబడటం జాతీయావసరంగా భావింపబడవలసి ఉన్నది.

* సమ్మక్క తల్లి, సారలమ్మ కూతురని జనశ్రుతి.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. మరణించిన వారిపట్ల గోండుల ఆచారాలు ఎలా ఉంటాయి?
2. 'నింబూకాట్యా' అంటే ఎవరు? అతనికి ఎందుకు గౌరవస్థానం ఉంది?

## పాఠ్యాంశ అన్వయం

భారతదేశం సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం. దేశంలోని ప్రజల వేషభాషలు, ఆచార వ్యవహారాలు భిన్నంగా ఉన్నా 'భారతీయత' అనే ఏకసూత్రతపై దేశమంతా ఒక్కటిగా మనుగడ సాగిస్తూ 'భిన్నత్వంలో ఏకత్వం' కలిగిన దేశంగా గుర్తింపు పొందింది. దేశంలోని ప్రతి కులానికి, మతానికి, జాతులకు ప్రత్యేకమైన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఉంటాయి. ఆయా జాతులవారు ప్రాచీన కాలం నుంచి తమ సంస్కృతిని కాపాడుకుంటూ వస్తున్నారు.

అభివృద్ధి చెందిన మైదాన ప్రాంతంలో నివసించే ప్రజలకే కాకుండా, మైదాన ప్రాంతాలకు దూరంగా, అభివృద్ధికి ఆమడదూరంలో అడవుల్లో నివసించే ఆదివాసులకు కూడా తమవైన ఆచార వ్యవహారాలు ఉన్నాయి. అందులోనూ అందరికీ ఒకే రకంగా కాకుండా వారిలో కూడా ఎవరికి వారికి ప్రత్యేకమైన సంస్కృతి సంప్రదాయాలు ఉంటాయి. ఆదివాసుల ఆచార వ్యవహారాల్లోని వైవిధ్యాన్ని, ఆ విశేషాలను ఈ పాఠం తెలియజేస్తుంది. ఈ దేశంలో ఏ మూలన నివసిస్తున్నవారికైన తమదైన సంస్కృతి సంప్రదాయాలు ఉంటాయి. అయితే నేటి కాలంలో ఆధునికత అడవుల్లోకి కూడా ప్రవేశించింది. ఆదిమవాసుల జీవితాల్లో పెనుమార్పులు తీసుకొస్తున్నది. దాంతోపాటు వారి సంస్కృతి, సంప్రదాయాలను కూడా కనుమరుగు చేస్తూ ప్రమాదంగా మారుతున్నది. మన సంస్కృతే గొప్పది. మన ఆచారాలే గొప్పవి అని కాకుండా, దేశంలో ప్రతి జాతికి తమవైన సంస్కృతి సంప్రదాయాలు ఉన్నాయని వాటిని కనుమరుగు కాకుండా కాపాడుకోవాలనే ఎరుకను ఈ పాఠం కలిగిస్తుంది.

## భాషా సామర్థ్యాలను సాధిద్దాం

### I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది గద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

మన మనసులోని భావాలను, ఆలోచనలను, సమాచారాన్ని ఇతరులకు తెలుపడానికి ఉత్తమసాధనం ఉత్తరం. ఒకప్పుడు ఉత్తరం అనే దానిని నేడు మనం లేఖ అంటున్నాం. సాధారణంగా అన్ని సందర్భాలలో

వ్యక్తులతో, సంస్థలతో ప్రత్యక్షంగా చర్చించలేని విషయాలను లేఖల ద్వారా చేరవేస్తాం. లేఖలను ఒకప్పుడు పక్షుల ద్వారా, జంతువుల ద్వారా చేరవేసే వాళ్ళు, స్మార్ట్ ఫోన్స్ లేని రోజులలో ఉత్తరాల కోసం ఎదురు చూసేవారు. దీనిలో ఒక ఆనందం, ఉద్వేగం దాగి ఉండేది. కానీ, సాంకేతిక పరిజ్ఞానం పెరిగి, నేడు ఎస్.ఎం.ఎస్., ఈమెయిల్, సామాజిక మాధ్యమాల స్థాయికి చేరింది. అయితే మనుషుల మధ్య అనుబంధాలను ఆనాటి లేఖలు ఏర్పరచినట్లుగా నేటి సామాజిక మాధ్యమాలు ఏర్పరచలేకపోయాయనవచ్చు. ఉత్తరాలు సంఘజీవితంలో ఒక భాగం. వ్యక్తిగత విషయాలకు సంబంధించిన లేఖలే కాదు, వ్యాపార సంబంధ, ఉద్యోగ సంబంధ లేఖలు రాయడం కూడా ముఖ్యమైన అంశమే. భవిష్యత్తులో వివిధ రంగాలలో స్థిరపడే విద్యార్థులకు వ్యక్తిగతంగానూ, విద్యా, ఉద్యోగ, వ్యాపార పరంగానూ లేఖారచన చేయడం అవసరమే. అందుకే, మనం లేఖారచన ప్రాధాన్యతను గుర్తించి, చక్కని శైలిలో, స్పష్టంగా లేఖలు రాయడం నేర్చుకోవాలి.

**ప్రశ్నలు :**

అ) లేఖల ప్రయోజనం ఏమిటి?

________________________________

ఆ) సామాజిక మాధ్యమాలు ఏం చేయలేకపోయాయి?

________________________________

ఇ) లేఖలు ఎన్ని రకాలుగా ఉంటాయి?

________________________________

ఈ) నేడు లేఖ ఏ స్థాయికి చేరింది?

________________________________

ఉ) విద్యార్థులు లేఖారచన ఎందుకు నేర్చుకోవాలి?

________________________________

## II. భాషాంశాలు

### పదజాలం

**1. కింది పదాలతో సొంతవాక్యాలు రాయండి.**

అ) విశ్వాసం = ________________________

ఆ) అంతరించు = ________________________

ఇ) ప్రాణాధారం = ________________________

ఈ) క్రూరాచారం = ________________________

ఉ) సారూప్యము = ________________________

**2. కింది వాక్యాల్లోని ప్రకృతి – వికృతులను గుర్తించండి.**

అ) అమ్మానాన్నలతో జాతరకు వెళ్ళాను. మా యాత్ర చాలా ఉత్సాహంగా సాగింది.

ఆ) కుమార్ ప్రాణం విలువ తెలిసినవాడు. అందుకే రక్తదానం చేసి రోగి ప్రాణం నిలిపాడు.

ఇ) దేవుణ్ని భక్తిశ్రద్ధలతో పూజించాలి. బత్తిలేని పూజలు దేవుడు స్వీకరించడు.

**3. కింది పట్టికను పరిశీలించండి. పాఠ్యభాగానికి సంబంధించిన పదాలను గుర్తించి రాయండి.**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| కు | ల | గ | మ | త్త | చ | జ్ఞ | ట | కా | భ |
| ల | మ్మ | స | మై | ల | రె | గా | త | ర | గ |
| దై | య | క | ర | జ | ఝ | చ | ణ | త | వం |
| వం | త్స | ఉ | కో | గ | కొం | డ | దే | వ | త |
| ని | ధి | శి | వ | భ | య్యా | య్య | క | గ్గ | రు |
| వా | మ్మ | ళ | దె | సా | రం | గోం | డు | లు | న్న |
| భ | ళ | లు | సం | వా | మ | ది | ఆ | తు | గం |
| ల | ర | చ్చ | క | గ | తం | ర | రో | హి | జా |
| త | సా | క | త్న | ర | మ | నీ | కో | రో | త |
| శీ | వు | గో | పె | ర్సా | పే | న్ | ఘూ | పు | ర |

1. గారెల మైసమ్మ
2. ______
3. ______
4. ______
5. ______
6. ______
7. ______
8. ______
9. ______
10. ______

## వ్యాకరణాంశాలు

**1. కింది ఉదాహరణలు పరిశీలించండి.**

బురద నవ్వింది కమలాలుగా

పువ్వు నవ్వింది భ్రమరాలుగా

పుడమి కదిలింది చరణాలుగా

జడిమ కదిలింది హరిణాలుగా.

అన్ని పాదాల చివర 'గా' అనే అక్షరం వచ్చింది కదా. ఇలా ఒకే అక్షరం అన్ని వాక్యాల్లో మళ్లీ మళ్లీ రావడాన్ని పునరుక్తం అంటారు. ఇలా పాదంలో, పదంలో, వాక్యాల చివర ఒకే రకమైన అక్షరం పునరుక్తమైతే అది 'అంత్యానుప్రాస' అలంకారం.

**2. కింది ఉదాహరణలు పరిశీలించండి.**

మా పొలంలో బంగారం పండింది.
రాకేశ్ తాటిచెట్టంత పొడవు ఉన్నాడు.

పై వాక్యాల్లో పంట బాగా పండింది అని చెప్పేందుకు బంగారం పండింది అని చెప్పబడింది. అలాగే చాలా పొడవుగా ఉన్నాడు అని చెప్పేందుకు తాటి చెట్టంత పొడవు అని చెప్పబడింది. ఇలా ఉన్నది ఉన్నట్లుగా కాకుండా ఎక్కువచేసి చెప్పడాన్ని అతిశయోక్తి అలంకారం అంటారు. అంటే అతిశయించి చెప్పడం అతిశయోక్తి.

**3. కింది వాక్యాల్లోని అలంకారాలు గుర్తించండి. లక్షణాలతో సమన్వయం చేయండి.**

అ) భూగోళం పుట్టుక కోసం రాలిన సురగోళాలెన్నో
ఈ మానవ రూపం కోసం జరిగిన పరిణామాలెన్నో

ఆ) నగరంలో మేడలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

**4. అంత్యానుప్రాస, అతిశయోక్తి అలంకారాలకు ఉదాహరణలు రాయండి.**

## III. వ్యక్తీకరణ – సృజనాత్మకత

### స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) మీ ఊరిలో జరిగే జాతర విశేషాలు తెలపండి.

ఆ) మీకు ఇష్టమైన దేవత ఎవరు? ఎలా పూజిస్తారు?

ఇ) సమాజంలో గౌరవం ఎప్పుడు లభిస్తుంది?

ఈ) 'ఆదివాసులు' పాఠ్యభాగ రచయిత గురించి రాయండి.

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) గిరిజనుల నమ్మకాలు, ఆచారాల నుంచి మీరేమి తెలుసుకున్నారో సొంతమాటల్లో రాయండి.

ఆ) ఆదివాసుల సంస్కృతీ సంప్రదాయాలు సంరక్షించడం జాతీయ అవసరంగా భావించాలి – సమర్థిస్తూ రాయండి.

### సృజనాత్మకత

**1. కింది ప్రశ్నకు సమాధానం రాయండి.**

అ) మేడారం లేదా కేస్లాపూర్‌లో నేడు జాతరలు ఎంత వైభవంగా జరుగుతున్నాయో తెలుసుకోండి. ఆ విశేషాలు తెలుపుతూ చక్కని వ్యాసం రాయండి.

### సూక్తి

ధర్మాన్ని రక్షించే మనిషిని
మృత్యువు కూడా రక్షిస్తుంది.

– కౌటిల్యుడు

గద్య భాగం

# 11 గురుశిష్య బంధం

– సామల సదాశివ

## కవి పరిచయం



11-05-1928
07-08-2012

డా॥ సామల సదాశివ కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా, దహేగాం మండలం, తెనుగుపల్లె గ్రామంలో జన్మించాడు. సామల చిన్నమ్మ, సామల నాగయ్యలు ఆయన తల్లిదండ్రులు. ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ఆరంభించిన సదాశివ ప్రిన్సిపాల్‌గా పదవీవిరమణ పొందాడు. ఈయనకు తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, ఫారసీ, మరాఠీ భాషలో లోతైన ప్రవేశం ఉండేది. సదాశివ వివిధ భాషాసాహిత్యాలు, వివిధ సంగీత సంప్రదాయాలు తెలిసినవాడు. తొలినాళ్లలోనే కలంపట్టి పద్యకావ్యాలు, శతకాలు రాశాడు. ఉర్దూ, తెలుగు భాషల్లో ఎన్నో రచనలు చేశాడు. తన గ్రంథాల ద్వారా కావ్య సంగీతతత్త్వాలను అందరికీ తెలియచేశాడు. సహృదయుడిగా, సౌజన్యశీలిగా ఆయన అందరికీ సుపరిచితులు. ప్రభాతము (1949), సాంబశివ శతకము (1950), నిరీక్షణము (1952), ఉర్దూ సాహిత్య చరిత్ర (1963), అమ్జద్ రుబాయిలు (1963), మిర్జాగాలిబ్ (1969), ఫారసీ కవుల ప్రసక్తి (1975), మలయమారుతాలు (2001), యాది (2005), సంగీత శిఖరాలు (2006), స్వరలయలు (2009) మొదలైనవి సదాశివ ప్రముఖ రచనలు. సంగీత సాహిత్యాలకు సదాశివ చేసిన విశేష సేవకుగాను ఎన్నో పురస్కారాలు ఆయనను వరించాయి. 1998లో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి, 2002లో కాకతీయ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్లను స్వీకరించాడు. 2011లో ఈయన రచించిన 'స్వరలయలు' గ్రంథం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందింది. ప్రస్తుత పాఠ్యభాగం 'వ్యాస' ప్రక్రియకు చెందింది. ఈ పాఠ్యభాగం 'యాది' గ్రంథం నుండి తీసుకోబడింది.

## నేపథ్యం / ఉద్దేశం

ఎన్ని తరాలు, యుగాలు మారినా గురుశిష్యుల మధ్య ఉండే సంబంధం మారలేదు. మారదు కూడ. మాన్యులను, సామాన్యులను సమానంగా చూసే ఉదాత్తవర్తనులు, శిష్యవత్సలులు అయిన గురువులే దీనికి కారణం. 'గురువు లేక విద్య గురుతుగా దొరకదు' అన్న వేమన మాట అందరికి తెలిసిందే. అలాగే 'గురువులేని విద్య గుడ్డి విద్య' అంటారు కదా! మన సంస్కృతిలో గురుశిష్య సంబంధానికుండే ప్రత్యేక విశిష్టతను, గురుముఖతః పొందిన విద్య వేరుగా ఉంటుందన్న భావనను తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

## I

ఇంతకు ముందు నా శిష్యులు కొందరిని (శిష్యులమని చెప్పుకున్నవాళ్లనే) యాది జేసుకున్నాను. మా వంటి పంతుళ్లకు అదొక మధురానుభూతి. మా గురువులను యాది జేసుకోవటం మరింత మధురానుభూతి. మా గురువులను తరువాత యాది జేసుకుంటాను. మా గురువులందరు గొప్ప గొప్ప డిగ్రీలు పొందిన వాళ్లు కారు. సామాన్య చదువులు చదువుకున్నవాళ్లే. అయినా వాళ్లు బోధించే పద్ధతి, వాళ్ల విద్వత్తు చాల గొప్పవి. మన సంస్కృతిలో గురుశిష్య సంబంధానికొక ప్రత్యేక విశిష్టత వున్నది. ఆధ్యాత్మిక సాధనలో, సంగీతంలో, సాహిత్యంలో గురువు స్థానం ప్రముఖమైంది. కొండొకచో అనివార్యమైంది. ఆధ్యాత్మిక సాధనలో గురువులేందే నడువదు. గురువు మార్గదర్శకత్వం లేకుండా జ్ఞానం దొరకదు. అయితే కొందరు మానస గురువును నమ్ముకొని గొప్పవాళ్లయినారు. కబీర్ కులమేమిటో సరిగా తెలియనందున ఎవరూ అతనికి మంత్రోపదేశం చేయటానికి సిద్ధపడలేదట. ఆకాలపు గొప్ప ఆధ్యాత్మిక గురువు స్వామీ రామానంద మంత్రోపదేశం చేసినట్లు కథ వున్నది కాని సాహిత్య చరిత్రకారులు దానినంతగా నమ్మరు. కబీర్‌కు స్వామీ రామానంద మానస గురువై వుంటాడు. అయినా అతని కాలం వాళ్లతన్ని 'నిగురా' అనేవాళ్లు. నిగురా అంటే గురువులేనివాడు. అట్లాగే బేపీర్ అన్నా గురువులేనివాడే. పీరో ముర్షద్, మురీద్, ఖలీఫా అనే మాటలు సూఫీ సంప్రదాయానికి చెందినవి. ఇస్లాంలోను పీర్, మురీద్‌ల సంప్రదాయం వున్నది. హిందుస్తానీ సంగీతంలో, ఉర్దూ సాహిత్యంలో గురుశిష్య సంప్రదాయం అనివార్యమైందని ఒకప్పుడు భావించేవాళ్లు. ఇప్పటికీ పండిత్ రవిశంకర్, ఉస్తాద్ అమ్జదలీఖాన్ మొదలైనవాళ్లు శాస్త్రీయ సంగీతం గురుశిష్య పరంపరలోనే నేర్చుకోవాలని చెప్తూ ఉంటారు. ఈ గురుశిష్య పరంపర ఎందుకు తెగిపోయిందో, దాన్ని తెంపిన మహనీయులెవరో అదంతా శ్రీ సద్గురు శివానందమూర్తి గారి పత్రికకు రాయనున్నాను. అది వారి ఆజ్ఞ. అంటే శివాజ్ఞ. ఇక్కడ టూకీగా కొన్ని ముచ్చట్లు చెప్తాను. ఉర్దూ సాహిత్యంలో కూడా ఉస్తాద్ స్థానం ముఖ్యమయింది. ఉస్తాద్‌ను బట్టే శిష్యునికి పేరు వచ్చేది. ఉస్తాద్ ఇస్లాహ్ (పరిష్కరణ) చెయ్యని గజల్‌ను నిన్నమొన్నటి వరకు ఉర్దూ కవులు ముషాయిరాలలో చదివేవాళ్లు కారు. దీవాన్‌లలో చేర్చుకునేవాళ్లు కారు. డా॥ ఎక్బాల్ అంతటివాడు తన తొలినాళ్ల కవితను ఉస్తాద్ దాగ్‌కు పంపుతూ "ఇక దిద్దుబాటు అవసరం లేదు" అనే వరకు దిద్దించుకున్నాడు. మిర్జాగాలిబ్ చిన్నప్పటి నుంచి మేధావి కనక ఆగ్రాలో తన మాతామహుడైన నవాబుగారింట్లో వున్నప్పుడు అతని ఇంట జరిగే సాహిత్య సభల్లో గొప్ప గొప్ప కవులను, విద్వాంసులను విన్నాడు. కవిత చెప్పటం మొదలు పెట్టినాడు. ఢిల్లీ చేరిన తరువాత, అతనికి కవిగా గుర్తింపు వచ్చిన తర్వాత ఓర్వలేనివాళ్లు చాలామంది అతడు బే ఉస్తాదియా అని ప్రచారం చేసినారు. అంటే ఉస్తాద్ లేనివాడు. అయితే అబ్దుల్ సమద్ అనే ఈరాన్ నుంచి వచ్చిన విద్వాంసుడు తన గురువని చెప్పుకున్నాడు గాలిబ్. అంటే ఈ దేశంలో వుండే ఉర్దూ కవులకు ఈ దేశం వాళ్లే గురువులు కానీ తనకు నేర్పిన గురువు ఈరాన్ దేశానికి చెందినవాడు కనుక తన ఫారసీ భాష స్వచ్ఛమయిందని అసూయాపరుల నోళ్లుమూయించినాడు. తాను ఉస్తాద్‌గా ప్రసిద్ధుడైన తరువాత ఒక శిష్యునికి "అబ్దుల్ సమద్ నా కల్పన. నాకు గురువులెవరు లేరు" అని తేల్చి రాసినాడు. గాలిబ్ తరువాత సాహిత్య చరిత్ర పరిశోధకులు ఆగ్రాలోనూ ఢిల్లీలోనూ అబ్దుల్ సమద్ అనే వ్యక్తే లేదని గుర్తించినారు. అతని ప్రసక్తే లేదెక్కడ.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. 'నిగురా' అంటే ఏమిటి?
2. గాలిబ్ గురించి ఇతరులు ఏమని ప్రచారం చేశారు?

## II

మన తెలుగులో గురుశిష్య సంప్రదాయం పటిష్ఠంగా వున్నది తిరుపతి వేంకటకవుల కాలంలోనే. అంతకుముందు ఎవరికెవరు గురువులో తెలియదు. ఆ తరువాత కూడా అంత స్పష్టంగా తెలియదు. చాలామంది ప్రాచీన మహాకవులు తాము ఆరాధించే భగవంతుని దయవలననే కవితాశక్తి లభించినట్లు చెప్పుకున్నారు. మార్కండేయ పురాణం రాసిన మారన మాత్రం తిక్కన తన గురువని చెప్పుకున్నాడు. అట్లాగే వెలగందలనారయ పోతన శిష్యున్నని చెప్పుకున్నాడు. "చెళ్ళపిళ్ల వెంకన గురువంచు చెప్పికొనగా నొక గొప్ప తెలుంగు నాడునన్" అని విశ్వనాథ వారన్నట్లుగా తిరుపతి వేంకటకవులు తమ గురువులని చెప్పుకున్నంత గర్వంగా ఇంకే గురువుల శిష్యులు చెప్పుకోలేదనిపిస్తుంది. ఏదో మాటల సందర్భంగా దీపాల పిచ్చయ్యశాస్త్రి గారు కాశీమజిలీ కథలు రాసిన మధిర సుబ్బన్న దీక్షితులు ఎవరి శిష్యులో? అనే సందేహం వెలిబుచ్చినారు. "మీరు గమనించలేదా శాస్త్రిగారూ! తాను తిరుపతి వేంకట కవుల శిష్యున్నని స్పష్టంగా చెప్పుకున్నాడు" అని అన్నాను."అలా చెప్పండి. అందుకే ఆ పద్య రచన అంత పటిష్ఠంగా, ఆ వచనం అంత నిర్దుష్టంగా వున్నది" అని సంబరపడ్డారు శాస్త్రిగారు. దీక్షితులు తన సతీర్థ్యుడు అని తెలుసుకోవటం శాస్త్రి గారికి ఆనందకరమయింది. గురుబంధువుల మధ్య వుండే బంధమలాంటిది. ఇటువంటి గురుశిష్య పరంపర అనే వ్యవస్థ ఎందుకు విచ్ఛిన్నమైంది? ఏవో కారణాలుంటాయి. ఆ కారణాల గురించి ఆలోచించే ముందు ఆ వ్యవస్థ ఏర్పడటానికి కారణాల గురించి రెండు మాటలు మాట్లాడాడె. రెండు మాటలని ఎందుకంటున్నానంటే అవి చాల వరకు అందరికీ తెలిసినవే కనుక.

వేదాలవతరించిన కాలంలో వేద భాషకు లిపి వున్నదో లేదో తెలియదు. వేదాలు భట్టీ పట్టాల్సినవే. ఒకరి నుంచి ఒకరికి ముఖతః అందించబడినాయి. అందుకే ఏ విద్యయినా గురుముఖతః సంపాదించవలసిందే అని కట్టుబాటు ఏర్పడింది. శాస్త్రాల సంగతీ అంతే. వేదవేదాంగాలను ఆనాటి పండితులు ఈనాటి కంప్యూటర్లలాగా బుర్రల్లో భద్రపరుచుకునేవాళ్లు. వాళ్లే గురుకులాలు నడిపే కులపతులు. వాళ్లే శాస్త్రబోధ చేసే ఆచార్యులు. తమ దగ్గరికి వచ్చే విద్యార్థులకు వాళ్లవాళ్ల అర్హతను, అభిరుచిని, అవసరాన్నిబట్టి విద్యాదానం చేసేవాళ్లుగురువులు. ఏ విద్యా లిఖిత రూపంలో లేనప్పుడు ఆయా విద్యలను కంఠస్థం చేసుకున్న గురువులను సేవించనిదే దొరికే మార్గాంతరం లేదు కదా! గీతోపదేశం చేసి జగద్గురువని కీర్తింపబడిన శ్రీకృష్ణునికీ సాందీపని అనే గురువుండేవాడు. ఆ గురువు దగ్గరే కుచేలుడనబడే సుదాముడు కృష్ణుని గురుభాయి. అంటే క్లాస్‌మేట్.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. పోతన శిష్యుడెవరు?
2. తమ దగ్గరకు వచ్చే విద్యార్థులకు దేనిని బట్టి గురువులు విద్యాదానం చేసేవారు?

## III

ఏ ప్రాంతంలో వుండేవాళ్లు ఆ ప్రాంతం భాషలో రాయటం, ఆ యాసలో మాట్లాడటం పరిహసించవలసిన అంశం కాదు. ప్రశంసించవలసిన అంశం.

సంగీత సాహిత్యాల్లో గురుశిష్య పరంపర ఆవశ్యకతను గురించి మాట్లాడుతూ ప్రాంతీయ భాషాభేదాల ప్రసక్తిలో పడి చాల దూరం వచ్చినాను. నేను చెప్పదలచుకున్నదేమంటే బళ్లలో మాకు ఉర్దూ ద్వారా బోధన జరిగేది కాని ఏ పండితులనో ఆశ్రయించి మేము సంస్కృతాంధ్రాలు నేర్చుకున్నాము. మాకు సంస్కృతాంధ్రాలు నేర్పిన గురువులైనా, ఫారసీ ఉర్దూ సాహిత్యాలు నేర్పిన గురువులైనా చక్కగా నేర్పినారు. ఒక ఉర్దూ మౌల్వీ సాహెబు యాదికి వస్తున్నారు. ఇంతకుముందు యాదిలో కాగజ్‌నగర్ హాస్పిటల్‌లో మొదటి డాక్టరుగా వచ్చిన నాటక ప్రియుడు డా॥ సీతారామయ్య గురించి రాసినాను. 42 సంవత్సరాల క్రిందట నేను సిర్పూర్‌లో డిప్యూటీ ఇనస్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా పనిచేస్తుండగా కాగజ్‌నగర్ వెళ్లినప్పుడల్లా డాక్టర్‌ను కలిసేవాన్ని. అప్పుడా హాస్పిటల్ ఎస్.పి.ఎం. దగ్గరే వుండేది. దాని దగ్గరే మా పర్యవేక్షణలో నడుస్తున్న తమిళ మీడియం ప్రాథమిక పాఠశాల వుండేది. ఒకనాడు పాఠశాల పర్యవేక్షణ జరిపి హాస్పిటల్‌కు వెళ్లినాను. డా॥ సీతారామయ్య వున్నారు. ఒక లేడీ డాక్టర్ కూడా వున్నదక్కడ. అప్పుడే ఉద్యోగంలో చేరిన అమ్మాయి. మా యిద్దరి పరిచయాలైన తర్వాత, "మీది వరంగల్లంటున్నారు. మీ నాయన గారేమి చేసేవారమ్మా!" అని అడిగినాను. "వారు టీచర్‌గా ఉద్యోగ విరమణ చేసినారు. ఉర్దూ బోధించేవారు" అన్నదా డాక్టరమ్మ. "వారి పేరేమిటి? అంటే, "ఫాతెహా సాహెబ్" అన్నది. నేను వెంటనే కుర్చీలోంచి లేచి ఆమెకు మళ్లీ సలామ్ చేసినాను. "అదేమిటి?" అంటే, "అమ్మా! నా గురు పుత్రిక ముందర కూర్చున్నాను. వరంగల్లులో ముగ్గురు మౌల్వీ సాహెబులు ఉర్దూ చెప్పేవాళ్లు. ముగ్గురూ బాగా చెప్పేవారే కాని మీ నాయన గారు చెప్పిన ఉర్దే బాగా వొంటబట్టిందనుకుంటాము" అన్నాను. తర్వాత సిర్పూర్ వెళ్లిపోయినాను. అప్పట్లో కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్ వెళ్లాలంటే పొద్దున్న పదిన్నర ప్యాసెంజర్ ట్రేన్‌కే వెళ్ళాల్సి వుండేది. మరే వాహనం లేదు. సిర్పూర్ స్టేషన్‌లో దిగి నడుచుకుంటూ మైలు మైలున్నర దూరం ఊరిలోకి వెళ్లాలె. రిక్షాలు లేవు. సిర్పూర్ టౌన్‌లో నా ఆఫీసు సడకు పక్కనే ఉన్నది. వెనకవైపు మేము నివసించే యిల్లు.

ఎండాకాలం. పగలు పన్నెండు గంటల ప్రాంతాన. నా ఆఫీసు ముందరి నుంచి, చెమటలు చేతి దస్తీతో తుడుచుకుంటూ, సడక్కు ఇరువైపుల ఏదో చూస్తూ వడివడిగా నడిచి వెళ్తున్నారు ఫాతెహా సాహెబు. వారికి ఎదురుగా వెళ్లి సలామ్‌చేసి, "ఈ యెండలో ఎటువెళ్తున్నారు? నీడలోకి దయచేయండి" అని ఆఫీసులోకి ఆహ్వానించినాను. ఆరాం కుర్చీలో కూర్చుండి, "ఇక్కడ సదాశివ్ అనే నా శిష్యుడొకడు నాజిర్‌సాబ్‌గా పనిచేస్తున్నాడట. కాగజ్‌నగర్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్న మా అమ్మాయి చెప్పింది. ఎక్కడా ఆఫీస్ బోర్డ్ కనిపించటం లేదు" అన్నారు. "నేనే మీ శిష్యున్ని. సదాశివను" అని పరిచయం చేసుకుంటే, మౌల్వీ సాహెబ్ సంతోషం పట్టలేక లేచి, నన్ను గుండెకదుముకొని, షేర్వానీ తీసి కొక్కేనికి తగిలించి మళ్లీ కూర్చున్నరు. మా చెప్రాసీ తెచ్చిన నీళ్లతో ముఖం, కాళ్లూ, చేతులూ కడుక్కుని హాయిగా కూర్చున్నారు. స్కూల్లో చదివేటప్పుడు నేను వెనక బెంచీల మీద కూర్చుండేవాణ్ణే. కాబట్టి వారికి నాపేరే గుర్తున్నది కానీ రూపం గుర్తులేదు. అయినా అంతదూరం ఎండలో పడి నడిచి వచ్చినారంటే శిష్యులపట్ల ఎంతటి దయగలవాళ్లో అప్పటి గురువులు! మా బాప ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసినవారు కనుక, పాతెహా సాహెబ్ దగ్గర కూర్చోబెట్టి వంట యేర్పాట్లకు ఇంట్లోకి వెళ్లినాను. అప్పటికే భోజన సమయం మించిపోయింది గనక అదనంగా ఏదో మామూలు వంట చేయించి అందరం కలిసి భోజనం చేసినాము. తరువాత మౌల్వీ సాహెబ్ గారికి గదిలో మంచం వేయించినాను. అలసిపోయి వున్నారు గనక వెంటనే నిద్రపోయి సాయంకాలం లేచినారు. రాత్రి డిన్నర్ మా బాపనిగ్రానీలో. వున్నదాంట్లో గొప్పగానే యేర్పాటయింది. ఊరిలోని ఇద్దరు ముగ్గురు మిత్రులను పిలిపించి సరదాగా మాట్లాడుతూ అన్నం తిన్నాము. ఎండాకాలం కనుక రాత్రి వాకిట్లోనే మూడు మంచాలు వేసుకొని పడుకున్నాము. కాసేపు మాట్లాడి మా బాప నిద్రలోకి జారుకున్నారు. కానీ పగలంతా పడుకున్న పాతెహా సాహెబ్ ఫారసీ

ఉర్దూల గురించి తెలుగు పత్రికలలో రాస్తున్నానన్న సంగతి విన్నారు కనుక నాకు ఉర్దూ సాహిత్య విశేషాలు చెప్పటం మొదలుపెట్టినారు. వారి పూర్తి పేరు అబుల్ ఫతెహా పాతెహా అనుకుంటాను. ఫాతెహా అనేది వారి కలం పేరయి వుంటుంది. ఎలాంటి పటాటోపాలు, ఆర్భాటాలు లేకుండా ఉర్దూ గజల్‌లోని అందాలను వెలికితీస్తూ చెప్పేవారు. ఆ రాత్రి వారు చెప్పిన మాటలన్నీ శ్రద్ధగా విన్నాను. మధ్యమధ్యన వారు చదివిన పేర్లను రాసుకున్నాను. వారు ప్రస్తావించిన గ్రంథాల పేర్లను రాసుకున్నాను. పన్నెండేళ్ల కిందట వారు చెప్పిన సాహిత్య విశేషాలను అంతగా అవగాహన చేసుకునే వయస్సు కాదు. ఆ రాత్రి వారు చెప్పిన ప్రతి మాటా అర్థం చేసుకోగలిగాను. ఏ అర్థరాత్రో వారు నిద్రపోయినారు. మర్నాడు నాష్తా తరువాత ఎవరి జీప్ మీదనో రైల్వేస్టేషన్ వరకు పంపి కాగజ్‌నగర్ రైలెక్కించి వీడ్కోలు చెప్పినాము.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. 'ప్రశంసించవలసిన అంశం' ఏమిటి?
2. ఆ రోజు రాత్రి ఫాతెహా సాహెబ్ సదాశివకు ఏమి చెప్పాడు?

## IV

పాఠశాలలో సిలబస్ ప్రకారం చదివిన విద్య వేరు. గురుముఖతః సందేహ నివృత్తి చేసుకుంటూ పొందిన విద్యవేరు. అని ఆనాడు తెలుసుకున్నాను. అంతవరకు నేను వివిధ పత్రికల్లో రాసిన ఉర్దూ సాహిత్య వ్యాసాలు ఎంత కచ్చా పక్కాగా వున్నాయో, ఎంత అపరిణతంగా వున్నాయో గ్రహించగలిగినాను. అందుకే గురుశిష్య సంప్రదాయంలో నేర్చిన విద్య గొప్పదని నేనూ భావిస్తాను.

అదిలాబాదు హైస్కూల్లో మాతోపాటు పనిచేసే మౌల్వీ ఇస్లామొద్దీన్ సాహెబ్‌గారు ఉర్దూ మీడియం తరగతులకు ఉర్దూ బోధించేవారు. వారిప్పుడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఎప్పుడో 60, 65 యేండ్ల కిందట దేవ్‌బంద్‌లో ఏదో పెద్ద పట్టా పుచ్చుకొని ఉత్తరాది నుంచి నిజాం రాష్ట్రానికి వచ్చిన ఇస్లాముద్దీన్ సాహెబ్ ఎక్కడెక్కడో పనిచేసి చివరికి ఆదిలాబాదులో స్థిరపడ్డారు. వారు ఏమి చదివినారో, ఎంత చదివినారో తెలియదు. ఫారసీలో మంచి పండితులని మా భావూ మాస్తరనేవారు. విద్యార్థులకు శ్రద్ధలేనందున వారు ఉర్దూ బొటాబొటిగా చెప్పేవారని వినేవాళ్లం. ఖురాన్ షరీఫ్ తప్ప ఏ సాహిత్య గ్రంథం వారు చదువగా చూడలేదు. వారింట్లో కూడా ఎటువంటి పుస్తకాలుండేవి కావు. ఉర్దూ సాహిత్య పత్రికలుండగా వారు దినపత్రిక గూడా చదివేవారు కారు. అరవై అయిదేండ్ల కిందట ఏమి చదివినారో అదే. తరువాత చదివిందేమీ లేదు. స్టాఫ్ రూములో కూర్చున్నా ఏ దుకాణంలో కందిపప్పు బాగుంటుందో, ఎక్కడ నాణ్యమైన వస్తువులు చౌకగా దొరుకుతాయో ఆ విషయాలే మాట్లాడే వారు కాని పొరపాటున కూడా ఒక ఉర్దూ షేరో ఒక ఫారసీ షేరో చదివేవారు కారు.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. ఎటువంటి విద్య గొప్పదని రచయిత భావిస్తున్నాడు?
2. ఇస్లాముద్దీన్ సాహెబ్ గురించి చెప్పండి.

## పాఠ్యాంశ అన్వయం

'ఆచార్య దేవోభవ' అంటూ గురువుకు అగ్రపీఠం వేసిన సంస్కృతి మనది. 'నడయాడే దైవం – నడిపించే రూపం" అని గురువును కీర్తిస్తాం. వ్యక్తి జీవిత వికాసానికి గురువే తొలి మార్గదర్శి. విద్యారంగంలో ఎంతటి సాంకేతిక విప్లవాలు వచ్చినప్పటికీ 'గురువు' పాత్రను అవి ఏమీ తగ్గించలేకపోయాయి. అనాదిగా వస్తున్న గురుశిష్య సంబంధం ఇప్పటికీ అలాగే ఉంది. వశిష్ఠుడు – శ్రీరాముడు, సాందీపని – శ్రీకృష్ణుడు, ద్రోణుడు – అర్జునుడు, సమర్థరామదాస్ – శివాజీ, రామకృష్ణ పరమహంస – వివేకానందుడు, కృష్ణశంకరపాండ్యా – గాంధీజీ, ఇయదురై సోలోమోన్ – అబ్దుల్‌కలాం, జ్యోతిబాపూలే – అంబేద్కర్, జక్కీసాహెబ్ – దాశరథి, రాఘవరెడ్డి – కాళోజీ ఇలా అవిచ్ఛిన్నంగా గురుశిష్య సంబంధం కొనసాగుతూనే ఉంది. ఈ సంబంధం చాలా గొప్పది. విడదీయరానిది. గురువే ప్రత్యక్షదైవం అనే దృఢనమ్మకంతో గురువును అనుసరించే శిష్యుల భవిష్యత్తు బంగారుమయం అవుతుంది. రోజూ పాఠశాలకు, కళాశాలకు వెళ్ళి గురువు చెప్పే పాఠాలు శ్రద్ధగా వినడం, సందేహాలను నివృత్తి చేసుకోవడం, ఇంటికి వెళ్లిన తర్వాత చెప్పిన పాఠాలను పునఃశ్చరణ చేసుకోవడం, క్రమశిక్షణతో మెలగడం అలవాటు చేసుకుంటే ఎంతో మంచిది. అటువంటి విద్యార్థికి బయటి ప్రపంచపు అనంత జ్ఞానవాకిళ్లను తెరిచి చూపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయునిదే. దీనికి ఉపాధ్యాయుడు మంచి చదువరి కావడం అవసరం. గురువుకోసం శిష్యుడు, శిష్యునికోసం గురువు శ్రమిస్తేనే ఉత్తమ ఫలితాలు సాధ్యం అవుతాయి. ఉత్తమ గురువు, ఉత్తమ శిష్యుడు లోకంలో ఒక వెలుగు వెలుగుతారు. దైవం, గురువులలో మొదటి నమస్కారం గురువుకే పెడతాను అన్న కబీర్ మాట అప్పుడు సార్థకమవుతుంది.

## భాషా సామర్థ్యాలను సాధిద్దాం

### I. అవగాహన – ప్రతిస్పందన

**1. కింది పేరాను చదువండి. ఐదు ప్రశ్నలు తయారుచేయండి.**

గురువుగారి గ్రంథాలయం నుంచి టీకా తాత్పర్యాలు ఉండే రఘువంశ, కుమారసంభవ కావ్యాలు తీసుకున్నాను. ఒక్కొక్క కావ్యం నుంచీ మూడు సర్గలు చదివితే చాలు. రోజూ రెండు శ్లోకాలు చదివి అర్థం చేసుకో, అర్థం కానిచోట అడుగు చెబుతాను అని గురువుగారన్నారు. ఆ విధంగా ఆ కావ్యాలు చదవలేదనే లోటు తీర్చుకున్నాను. శబ్దాలు, ధాతువులు వల్లిస్తున్నాను. దాదాపు ఐదు నెలలకే మేఘసందేశం ముగిసింది. అది రెండు సర్గల చిన్న కావ్యమే అయినా ప్రపంచ సాహిత్యంలోనే అగ్రగణ్యమని ప్రసిద్ధి పొందినది. ఇప్పుడు కావ్య పాఠం నాకు కష్టంగాలేదు. శ్రీ గురువుల బోధనాశక్తి చేత కావ్యాన్ని అవగాహన చేసుకునే పరిజ్ఞానం కలిగింది. మల్లినాథుని

వ్యాఖ్యానం అర్థం చేసుకుంటున్నాను. గోడల అల్మేరాలోని గ్రంథాలు చాలా అపురూపమైనవి. "సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు, బెంగాలీ, హిందీ" భాషలలో ఉన్నాయి. ఆ బీరువాల తాళం చెవులు నాకు ఇచ్చినారు. నేను చదవగలిగిన పుస్తకాలను శ్రద్ధగా చదివేవాణ్ణి. తెలుగు కావ్యాలు, కావ్య విమర్శలు, ఆంధ్ర కవుల చరిత్రలు, లక్షణ గ్రంథాలు, వీరేశలింగం పంతులుగారి రచనలు ఆసక్తితో చదువుకునేవాణ్ణి. నాకు గ్రంథ వ్యాసంగం వల్ల ఒంటరితనం అనిపించేది కాదు.

పై విషయం చదివారు కదా! దానిపై ఐదు ప్రశ్నలను తయారుచేయండి.

అ) ______________________

ఆ) ______________________

ఇ) ______________________

ఈ) ______________________

ఉ) ______________________

## II. భాషాంశాలు

**పదజాలం**

**1. గీత గీసిన పదాలకు అర్థాలను రాయండి.**

అ) చిన్నప్పుడు ఆడుకున్న ఆటలు యాదికి వస్తున్నాయి. ______________

ఆ) చదువుకోవడం అనివార్యమనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలి. ______________

ఇ) అబ్దుల్ కలాం మహా మేధావి. ______________

ఈ) మంచి పనులు చేసినప్పుడు పిల్లలను ప్రశంసించండి. ______________

ఉ) చదువులో ఏవైనా సందేహాలు వస్తే వెంటనే గురువులను అడిగి వాటిని తీర్చుకోండి. ______________

**2. కింది పదాలకు అర్థాలు రాసి, వాటితో సొంతవాక్యాలు రాయండి.**

ఉదా: విద్వత్తు = పాండిత్యం

బిరుదురాజు రామరాజు విద్వత్తు చాలా గొప్పది.

అ) ఆజ్ఞ = ______________

______________________

ఆ) ప్రసక్తి = ____________________

______________________________________________________________

ఇ) వడివడిగ = ____________________

______________________________________________________________

ఈ) తొలి = ____________________

______________________________________________________________

ఉ) సలామ్ = ____________________

______________________________________________________________

**3. ఇచ్చిన ఆధారాలతో గళ్లలో పదాలను రాయండి.**

అ) జ్ఞానాన్ని ఇచ్చేవాడు.

ఆ) తూకం, భారం

ఇ) ____ సొమ్ము బరువు చేటు.

ఈ) చెట్టును ఇలా కూడా అంటారు.

ఉ) వానలు పడకపోతే వచ్చేది.

ఊ) పంటలకు వేసేది.

ఋ) గౌరవాన్ని ఇలా కూడా పిలుస్తారు.

ఎ) తప్పెటపై వేసేది.

| | | |
|---|---|---|
| గు | రు | వు |
| | రు | వు |
| | రు | వు |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |

## వ్యాకరణాంశాలు

**★ కింది ఉదాహరణను పరిశీలించండి.**

వానలు వెలసినవి. మేఘాలు తొలగిపోయినవి. సూర్యకిరణాలు చక్కని ప్రకాశంతో లోకంలో నిండినవి. సరస్సుల్లో కమలాలు వికసించినవి. రాత్రులలో నక్షత్రకాంతులతో ఆకాశం వెలిగిపోతున్నది.

పై పేరాలోని వానలు వెలయడం, మేఘాలు తొలగిపోవడం, సూర్యకిరణాలతో ప్రపంచం ప్రకాశించడం, కమలాలు వికసించడం, రాత్రిపూట ఆకాశం వెలిగిపోవడం శరత్కాలపు సహజమైన లక్షణం. ఇట్లా ఏదైనా విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగా వర్ణించడం ఒక అలంకారం. దీనిలో కవి అతిశయంగా చెప్పడంగాని, ఉపమానంతో

విషయగౌరవం కల్పించుట గాని ఉండదు. ఇలా ఉన్న విషయాన్ని సహజంగా చెప్పడాన్ని 'స్వభావోక్తి' అలంకారం అంటారు.

స్వభావోక్తి అలంకారం : స్వభావ + ఉక్తి – సహజంగా చెప్పుట

విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగ వర్ణించడమే 'స్వభావోక్తి' అలంకారం.

**★ కింది వాక్యంలోని అలంకారాన్ని గుర్తించండి.**

ఆ లేడిపిల్లలు చంచలమైన కన్నులతో, చెవులు రిక్కించుకొని చెంగుచెంగున దుంకుతున్నాయి.

## III. వ్యక్తీకరణ – సృజనాత్మకత

### స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) 'గురువు మార్గదర్శకత్వం లేకుండా జ్ఞానం దొరకదు' అని రచయిత ఎందుకు అన్నాడో రాయండి.

ఆ) మిర్జాగాలిబ్ తన గురువుగా అబ్దుల్ సమద్‌ను సృష్టించాడు. ఎందుకు?

ఇ) సామల సదాశివ జీవితాన్ని, రచనలను తెల్పండి.

ఈ) 'గురుశిష్య సంప్రదాయంలో నేర్చిన విద్య గొప్పదని నేను భావించాను' అని సదాశివ ఎందుకు అని ఉంటాడు?

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) 'ఆధ్యాత్మిక సాధనలో, సంగీతంలో, సాహిత్యంలో గురువు స్థానం ప్రముఖమైంది' అని రచయిత ఎందుకు అభిప్రాయపడినాడో వివరించండి.

ఆ) పాఠం ఆధారంగా ఇరువురు ఉర్దూ గురువుల గుణగణాలను విశ్లేషించండి.

### సృజనాత్మకత

**1. కింది ప్రశ్నకు సమాధానం రాయండి.**

అ) పాఠంలో గురుశిష్య సంబంధం గురించి తెలుసుకున్నారు కదా! దాని గొప్పతనాన్ని గేయ రూపంలో రాయండి.

**సూక్తి**


ఒక విద్యార్థి యొక్క వ్యక్తిత్వాన్ని, సామర్థ్యాన్ని,
భవిష్యత్తును రూపుదిద్దే మహోన్నత వ్యక్తి ఉపాధ్యాయుడు.

– అబ్దుల్ కలాం

# 12 మా కాలంలో వృత్తులు

– డా॥ కపిలవాయి లింగమూర్తి

## కవి పరిచయం



30-03-1928
06-11-2018

తెలంగాణ గర్వించదగిన పరిశోధకుల్లో డా॥ కపిలవాయి లింగమూర్తి ఒకడు. ఆయన నాగర్‌కర్నూల్ జిల్లాలోని బల్మూర్ మండలం జినుకుంట గ్రామంలో జన్మించాడు. మాణిక్యమ్మ, వేంకటాచలం ఆయన తల్లిదండ్రులు. చిన్నప్పుడే తండ్రి మరణించడంవల్ల లింగమూర్తి తన మేనమామ చేపూరి పెద్దలక్ష్మయ్యవద్ద పెరిగాడు. వారివద్దే సంస్కృతం, తెలుగు సాహిత్య విషయాలను అభ్యసించాడు. పాలెం కళాశాలలో చరిత్రోపన్యాసకులుగా పనిచేసాడు. లింగమూర్తి సాహిత్య, చరిత్ర రంగాల్లో చేసిన అరుదైన పరిశోధనలకు గుర్తుగా కవితాకళానిధి, పరిశోధక పంచానన, కవికేసరి, వేదాంత విశారద బిరుదులను వివిధ సంస్థలు అందించాయి. ఆయన ప్రతిభాపాటవాలను గుర్తించిన పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను అందించి, గౌరవించింది.

లింగమూర్తి అనేక ప్రక్రియల్లో రచనలు చేశాడు. ఆయన పరిశోధక వ్యాసాల్లో సాహిత్యం, చరిత్ర, శాసనాలు, సంప్రదాయం, మరుగునపడిన అనేక క్రొత్తవిషయాలు పాఠకులను ఆకట్టుకొంటాయి. చూతపురీ విలాసం, శ్రీమత్ప్రాప గిరిఖండం, రామోదహరణం, దుర్గాభర్గ శతకాలు, సాలగ్రామ శాస్త్రం, భాగవత కథాతత్త్వం, పాలమూరు జిల్లా దేవాలయాలు, కావ్యగణపతి, కంకణ గ్రహణం, శ్రీరుద్రాధ్యాయం, ఇంద్రేశ్వర చరిత్రము, లక్ష్మీపురనరహరి కీర్తనలు, సంక్షిప్త ఆబ్దికవిధానం, మాంగళ్యశాస్త్రం, పామర సంస్కృతం, నాగరకందనూలు కథ, జీవుడు – దేవుడు, సాలగ్రామం, మద్యపానం (హరికథ), నాగమణి (నవల) వంటి అనేక గ్రంథాలు రచించాడు. లింగమూర్తి లోతైన పరిశోధనతో, విషయ పరిజ్ఞానంతో అందించిన అనేక వ్యాసాలు, గ్రంథాలు ఈనాటి పరిశోధకులకు ఎంతో ఉపయోగకరమైనవి. ప్రస్తుత పాఠ్యభాగం లింగమూర్తి ఆత్మకథ 'సాలగ్రామం' నుండి గ్రహింపబడింది.

## నేపథ్యం / ఉద్దేశం

తెలంగాణ ప్రాంతంలో పూర్వం గ్రామీణ జీవితాలకు అద్దంపట్టే విధంగా ఈ పాఠ్యాంశం ఉంటుంది. గ్రామాల్లో వృత్తిపని చేసేవాళ్ల నైపుణ్యం ఎలా ఉంటుందో తెలుసుకోవచ్చు. అలాగే వివిధ వృత్తులవాళ్లు ఒకరిమీద మరొకరు ఆధారపడి జీవించడం, పరస్పర సహకారం, కలిసిమెలిసి జీవించే 'సామాజిక తత్త్వం' ఈ పాఠం ద్వారా బోధపడుతుంది.

# I

మా చిన్ననాటికి, ఈనాటికి కాలంలో చాలా మార్పు వచ్చింది. ఈ అర్ధశతాబ్దిలో తెలంగాణ గ్రామాల స్వరూపం పూర్తిగా మారిపోయింది. గ్రామంలో సాధారణంగా అన్ని వృత్తుల వారుండేవారు. వారికి శుభాశుభ కార్యాలలో విధులు మరియు వానివానికి కట్టడులు గూడ ఉండేవి. ఈ విధులు మరియు కట్టడులాకాలంలో గ్రామాలలోని అన్ని వర్గాల మధ్య ఐక్యతను కాపాడుతూ వారికి జీవనోపాధిని గూడ చూపినవనటం అతిశయోక్తి కాదు.

అపుడెవరింటిలో ఏ శుభాశుభ కార్యం జరిగినా దానికి నిర్ణీతమైనవారు వచ్చి అక్కడ తమ విధులు నిర్వర్తించవలసిందే. లేకుంటే అది వివాహమైనా, ప్రేత సంస్కారమైనా సకాలంలో జరుగక ఆగిపోతూనే ఉండేది. అందువల్ల ఆనాడు గ్రామాలలో పనివారితో ఇతరులెవరుగూడ ఏ విషయంలోను పేచీలు పడేవారు కాదు. వారితో పేచీ పడినపుడా గ్రామంలో అతని సంసారిక జీవనం గడవటం దుస్తరంగా ఉండేది. అందువల్ల అప్పుడు వృత్తివారితో పడకుంటే ఊరు విడిచినవారు కూడ ఉండేవారు.

మా కాలంలో ఏ వృత్తివారిని చూచినా వారికి తమ వృత్తిలో చేతినిండా పని ఉండేది. ఉగాది వెళ్లిందంటే కమ్మరి దాతి ప్రారంభమై అది దాదాపు సంక్రాంతి వరకు అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉండేది. మనది వ్యవసాయ దేశం కనుక రైతుకు కఱ్ఱుకొండి, పార–పలుగు, కొడవలి, గొడ్డలి అన్నీ ఆ దాతి నుండి సిద్ధం కావలసిందే.

భారతదేశంలో సగటు వాహనం బండి. ఆనాడు ఈ బండ్లన్నీ మయబ్రహ్మ దాతి నుండి రూపొందవలసినవే. అప్పటికి సరకు రవాణాకు బండికి మించిన సాధనం మరొకటి లేదు. కాబట్టి శిల్పులైన విశ్వకర్మలకు ఈ వాహనాల మూలంగానే రథకారులనే మరో రూఢి నిలిచింది.

వ్యవసాయదారులకు క్షేత్రసామగ్రి అంటే గుంటక, నాగలి, గొఱ్ఱు, దంతె మొదలైనవన్నీ మనుమయ బ్రహ్మల కర్మశాల నుండి రూపొందవలసినవే. అందువల్ల వీరిద్దరానాడు గ్రామానికి వతనుదార్లే. దేశానికి రైతు వెన్నెముకైతే, ఆ వెన్నెముకను వీరిద్దరు ఒరిగిపోకుండ నిలబెట్టేవారై ఉండేవారు.

వీరు దుమ్ముగుంటుకలు మొదలుకొని కల్లం దులిపేవరకు రైతులకుచితంగానే సేవచేసి అతని కల్లంలో తమ ప్రతిఫలం తీసుకునేవారు. కాలవశంగా ఒకవేళ ఒక సంవత్సరం పంట సరిగా రాకపోతే వీరు రైతుతోపాటుగానే ఏడంతా ఎండుతూ ఉండేవారు. అందువల్ల వీరిపట్ల మనకు గీత బోధించే 'కర్మణ్యే వాధికారస్తే – మాఫలేషు కదాచన' – 'నరుడా! నీకు కర్మయందే అధికారంగాని ఫలితాన్ని గురించి ఆలోచించవద్దు' అనే గీతాదేశం ఈ దేశంలో ప్రాచీనం నుండి రైతులపట్ల వారికి వెనుక ఉన్న ఈ మనుమయుల పట్ల సర్వదా సార్థకంగా ఉండేది.

కర్మతోపాటు మనదేశం యొక్క మరొక విశేషం కర్మకౌశలం. భగవద్గీత ఈ కర్మ కౌశలాన్నే "యోగః కర్మ సుకౌశలం" అని ఒక యోగంగా చెప్పింది. మనిషికెపుడు కర్మలో కౌశలమేర్పడుతుందో అపుడతని కర్మ అంతా శిల్పమౌతుంది.

ఈ శిల్పమనేది వస్త్వాశ్రయంగాదు కర్మాశ్రయమే. కాబట్టి కర్మకౌశలం కలవాడు మట్టిపని చేసినా, కఱ్ఱపని చేసినా, రాతిపని చేసినా, ఏది చేసినా సరే అది శిల్పమే అవుతుంది. అట్లా అతడు తాను చేనేత వస్తువును తీర్చిదిద్దటంలో మునిగినపుడు మనసేకాగ్రమై అది యోగం కూడా అవుతుంది.

పూర్వం పనివారికంతా గ్రామాలలో విధులుండేవని చెప్పినాను. ఆనాడు ఏ గ్రామంలో ఎవరు కొత్తగా ఇల్లు కట్టుకున్నా అక్కడికి మయబ్రహ్మ వెళ్లి స్థలం కొలిచి ఆయం కట్టి ముగ్గు పోయవలసిందే. ఏ రైతు కల్లంలో బంతి తిరిగి ధాన్యం రాశి పడినా దాన్ని విశ్వకర్మ వెళ్లి కొలువవలసిందే. అట్లా కుండ పట్టినందుకు వారికి ఖండికి ఒక కుండ వర్తన క్రింద ఉండేది.

కొన్ని ప్రాంతాల్లోని కుండలు చాలా పెద్దవిగాని మా గ్రామానిది చిన్నకుండ. చేయి తిరిగినవాడు కొలిచితేనే కుప్ప సదిరి వస్తుంది కాని లేకుంటే సదిరి రాదని రైతుల నమ్మకం.

కల్లం కొలవటమేగాదు దాని తీర్పుగూడ ఖండికి ఏ పనివారికెంతెంత కట్టడి అనే తీర్పుకూడ మావారి అధీనంలోనే ఉండేది.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. పూర్వం గ్రామాల్లో ప్రజలు జీవనోపాధికి వేటిపై ఆధారపడ్డారు?
2. వ్యవసాయదారులకు అవసరమైన పనిముట్లు ఏవి?

## II

కాకతీయుల కాలంనాటివరకు ఈ కల్లం తీర్పులేకాక కరణీకాలు మరియు దేవతా ప్రతిష్టలు, వాని పూజావిధుల హక్కుగూడ మావారికే ఉండేది. తర్వాతి కాలంలో మారిపోయింది.

శిల్పం అనేది గూడ మొదట విశ్వకర్మల యొక్క పంచవృత్తులకు సంబంధించియే ఉండి తర్వాత అది తక్కిన రంగాలకు వ్యాపించింది.

జాషువాగారు గబ్బిలంలో భారతదేశంలో కళగాని పని కనిపించదని అన్నాడు. ఆయన అన్నటువంటి ఈ మాటలో అక్షరసత్యం ఉంది. కనుక ఒక్క ఈ దేశంలోనే గాదు ఏ దేశంలోనైనా కర్మ కౌశలం గలవాడు చేసేపని అంతా అతడు కమ్మరిగాని, కుమ్మరిగాని, చాకలిగాని, మంగలిగాని అది కళనే అవుతుంది.

అమరాబాదు తాలూకాగా ఉన్న కాలంలో అక్కడి చాకళ్లు చలువకు ప్రసిద్ధిగా ఉండేవారట. వారు బట్టను పలుచని గంజి నీటిలో గుంజి వానిపై అభ్రకం రేకుల పొడి చల్లి చలువచేసేవారట. అభ్రకం రేకులు గాజు పొరలవలె ఉంటవి కాబట్టి అది బట్టకు ఈనాటి లామినేషనల్ వలె అంటుకొని ఎండకు మెరుస్తూ వానికి వన్నె పెట్టేదట.

ఆనాడు చాకలి ఉదయం వచ్చి గుడ్డలు తీసుకొని వెళ్లి సాయంకాలం మూడు లేదా నాలుగు గంటలవేళ ఇంటింటికి తిరిగి ఎవరి బట్టలు వారికివేసి బట్టలుతికేవాడు. రాత్రికి మళ్లీ అన్నానికి వచ్చేవారు. రాత్రివేళ చాకలిని చాకలి అనరు. అందుచేత అప్పుడు వారు తెల్లాకులవారమని చెప్పుకునేవారు.

వారు వారానికోనాడు సాకెర పెట్టేవారు. ఇది ఇంటివారికి మొదలే చెప్పేవారు. కాబట్టి సాకెరనాడు వారికి గృహస్థులు తమ ఇంటిలోని పచ్చడాలు, పడక బట్టల వంటివి పెద్దవి వేసేవారు. వారవి పెద్దబానలో చౌడు కలిపిన నీటిలో ఉడికించి ఉతికేవారు. కాని ఈనాడిదంతా మాసిపోయింది. చౌడు బదులు సబ్బులు వచ్చినవి. సాకెర బదులు వారెవరి బట్టలు వారింటి దగ్గరనే ఉతికి వెళ్లుతున్నారు.

గుంటూరు మంగళ్లకు ప్రసిద్ధి. అందుచేత పూర్వం కొందరక్కడ వెళ్లి పని నేర్చుకొని వచ్చేవారు. ఆనాడు అష్టమి, అమావాస్య మంగళవారం తప్పించి పొది తీసుకొని మంగలియే ఇల్లిల్లు తిరిగేవాడు. కాని ఈనాడది లేదు. మనమే అతని దగ్గరకు వెళ్లుతున్నాము.

మా పట్టికంతా ఆనాడు మామిళ్లపల్లె జాతర ప్రసిద్ధి. ఆ జాతర కుండలకు బాగా ప్రసిద్ధి. అక్కడికి వచ్చే కుండలు పలుచగా అరటి ఆకువలె ఉండి చక్కగా కాలి గట్టిగా ఉంటవని స్త్రీలు ముచ్చట పడేవారు.

పూర్వం పెండ్లిండ్లలో నల్లగుండల పేర పోలులోనికి రెండు అయిరేను పేర్పులు, నాలుగు పటువలు, ముప్పది మూడు ముంతలు, వానిపైకి మూతలు, ముప్పదిమూడు జతల ప్రమిదలు కావలసి ఉండేది. కాబట్టి కుమ్మరివారికి అగ్రజాతుల వివాహాలంటే పండుగ పండేది. కాని ఈనాటి వివాహాలలో పెద్దపోలు కాదుగదా! కొందరిండ్లలో సామాన్యమైన పోలుకూడ లేకుండ పోయింది. పండుగలు వచ్చినవంటే ఆనాడు దర్జీలకు తీరని గిరాకి. వారు మనిషి ఆకారానికి తగినట్లుగా దుస్తులు కుట్టి రూపొందించటం నిజంగా ఒక కళనే. ఈనాడు దర్జీలెందరో ఉన్నా అందరు మాత్రమీకళలో నిష్ణాతులు కారనియే చెప్పవలె.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. కర్మకౌశలం అంటే ఏమిటి?
2. చాకళ్లు బట్టలు ఉతకడంలో ఎలాంటి నైపుణ్యం చూపించేవారు?

షర్టు కుట్టడంలో దర్జీవారికి గల్లా ఒక పరీక్ష. అది పైన ఒక గుండి పెడితే క్రిందివరకు పాసిపోకుండ నిలువవలె. ఈ మెళకువ గల్లా కత్తిరింపులోనే ఉంటుందంటారు.

## III

పూర్వం వ్యవసాయదారులకు తప్ప చెప్పులందరి కవసరమయ్యేవి కావు. కాని ఈనాడు చెప్పు తొడగని మనిషి కనిపించడు. అయితే ఎప్పుడైనా మీరు అరిగిన చెప్పులను పరిశీలించండి. చాలా జతలలో మెడిమె ఏదో ఒకవైపు మాత్రమే ఎక్కువగా అరిగి ఉంటుంది. చెప్పులంతటా సమానంగా అరగటం తక్కువ.

మనం నడిచే అపుడందరి అడుగులు నేలపై ముక్కుకు సూటిగా సమకోణంలో పడవు. కొందరి పాదాలు సాధారణంగా కొంచెం బయటివైపు తిరిగి ఉంటవి. అంటే అపుడా పాదాల మెడిమెలు లోపలివైపుకు దగ్గరవుతవి. చెప్పులలో మన పాదాన్ని ఉంగరంకాక పైకప్పు కంట్రోలు చేస్తుంది. పూర్వం గ్రామాలలో చెప్పులు కుట్టేవారు పనివారైనప్పుడు వారు మన నడకను గమనించి చెప్పుకు పైకప్పు నమర్చేవారు. వారు మొదట కాలు కొలత తీసుకొని అడుగులు తయారుచేసి పిమ్మట వానిపై మన పాదం మోపించి పాదం ఏవైపు తిరిగి ఉందో గుర్తించుకొని కప్పులమర్చేవారు. అప్పుడు చెప్పు సరిగా కాలుకు ఆని సమంగా అరుగుతుంది. కాని ఈనాటి కంపెని చెప్పులట్లాకావు. వారు చెప్పులన్నిటిని కప్పులు సమకోణంలో అమర్చుతారు. అందువల్ల కంపెనీ చెప్పులు కొందరి పాదాలకు ఒకవైపు మాత్రమే అరుగుతుంటవి. కనుక వృత్తులలో ఇటువంటి సూక్ష్మాలెన్నో ఉన్నవి.

ఇటువంటివన్నీ వృత్తివారికి ప్రకృతి పరిశీలనవల్ల తెలిసి వస్తుంటవి. కనుక ఈ పరిశీలనకు వారికి తమ వృత్తిపై ఏకాగ్రత అవసరం. ఈ ఏకాగ్రత మనిషికి శీలం వల్ల కలుగుతుంది. శీలం అంటే మనో నిగ్రహం. శాస్త్రంలో ఈ శీలమే సమాధిగా చెప్పబడింది. ఋషులకు ఈ సమాధి తమ లక్ష్యం పైననో లేదా ఇష్టదైవం పైననో కుదిరి నిలుస్తుంది. అదేవిధంగా

పనివారికి తన వృత్తిపై అది నిలువవలె. కర్మవల్ల కలిగే లాభాన్ని ఊహించుకునే వానికెప్పటికి దానిపై ఏకాగ్రత కుదిరి అందలి మెళకువ బోధపడదు.

ఇట్లా ఈ మెళకువ వ్యక్తికి ఈ పని, ఆ పని అనిగాదు అన్ని పనులలోను అవసరం. అది వృత్తికి జతపడెనా ఆ పని కళ అవుతుంది. శాస్త్ర విద్యలన్నీ బుద్ధి బలంచేత అభ్యసించవచ్చుగాని కళకు మాత్రం హృదయమే అవసరం. శాస్త్రం ఎంతవరకు విద్యనాశ్రయించిందేకాని కళ అట్లాకాదు. అది వృత్తి నాశ్రయించి ఉంటుంది. ఇది ఆ రెండింటికి గల భేదం.

ఆ కాలంలో బ్రతుకుదెరువుకు కులవృత్తియే ముఖ్యం. కులవృత్తి ఎవరికైనా చిన్నతనం నుంచి అలవడవలసిందే 'చదువుకు ముదురు సాముకు లేత' అని సామెత. కాస్త వయసు ముదిరిన తర్వాతనైనా శ్రద్ధ ఉంటే నాలుగక్షరాలు నేర్చుకోవచ్చుగానీ కులవృత్తి ఒకసాము క్రిందనే లెక్క కాబట్టి అది బాల్యం నుంచీ అలవాటు కావల్సిందే.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

1. ఫలితాన్ని గురించి ఆలోచించకుండా కర్మ చేయడం ఎలా?
2. శాస్త్రం–కళకు అభ్యాసంలో ఎలాంటి తేడా ఉంది?

## పాఠ్యాంశ అన్వయం

స్వాతంత్ర్యం రావడానికి వెనుకా – ముందూ మన గ్రామీణ ప్రాంతాల్లో 'వృత్తినైపుణ్యం' ఎలా ఉండేదో కపిలవాయి లింగమూర్తి ఈ పాఠ్యాంశంలో క్షుణ్ణంగా వివరించారు. ఆ రోజుల్లో రవాణా, బయట ప్రాంతాల్లోని వ్యక్తులతో సంబంధాలు తక్కువగా ఉండేవి. కాబట్టి ఎవరి గ్రామంలో వారు జీవించేవారు. ఆయా వృత్తులవాళ్లు తమ నైపుణ్యాలకు అనుగుణంగా ఇతరులకు సహకరిస్తూ, తాము సహకారం పొందుతూ జీవించేవారు. అదంతా పరిమితమైన జన సంఖ్య మధ్య జరిగిన విశేషం. గ్లోబలైజేషన్ తర్వాత ప్రపంచం కుగ్రామంగా మారిపోయింది. ప్రపంచం ఒక మార్కెట్‌గా మారిపోయింది. దాంతో వృత్తులు ఫలానావారే చేయాలన్న నియమం కట్టుతప్పింది. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినట్లు యంత్రాంగం, సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయి వస్తూత్పత్తి పెరిగిపోయింది. ఒక ప్రాంతం నుండి ఇంకో ప్రాంతానికి కాకుండా ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య వస్తుమార్పిడి జరుగుతుంది. కళవృత్తిగా మారి – అదే కులంగా మారిన స్థితి నుండి ఇప్పుడు ప్రపంచమే ఒక 'విపణి' (మార్కెట్)గా మారిపోయింది. అయినా రూపాంతరం చెందిన కులవృత్తులు, 'ప్రొఫెషన్'గా, ఫ్యాషన్‌గా చేసుకొంటున్నారు. ఒకప్పుడు భారతదేశంలోని ఏ వృత్తి అయినా ప్రకృతి విధ్వంసంలేని వస్తూత్పత్తికి ప్రాధాన్యం ఇచ్చేది. ప్రకృతి నుండి వచ్చిన కర్రలతో వెదురువస్తువులు, మట్టి నుండి కుండలు, తోలు నుండి చెప్పులు, చెట్ల నుండి విస్తరాకులు, దొప్పలు... ఇవన్నీ భూమి నుండి పుట్టి భూమిలో కలిసేవే. ఇప్పుడు ప్లాస్టిక్ భూతంగా మారిపోయింది. అలాగే విచ్చలవిడిగా ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానానికి ప్రకృతి విధ్వంసం అయిపోతున్నది. ఈ రెంటి మధ్య సంఘర్షణ మనకు అర్థం కావాలంటే కపిలవాయి లింగమూర్తి రచన 'వృత్తుల వృత్తాంతాలు' చదువాల్సిందే.

## భాషా సామర్థ్యాలను సాధిద్దాం

## I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది పేరాను చదివి ఇచ్చిన ప్రశ్నలకు సరైన జవాబును గుర్తించండి.**

బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా దేశంలో తీవ్ర ఆందోళన బయలుదేరింది. అదే వందేమాతరం ఉద్యమం. నిరసన ప్రదర్శనలు, విదేశీవస్త్ర బహిష్కరణలు జరిగినవి. లోకమాన్య బాలగంగాధర తిలక్ 'స్వరాజ్యం నా జన్మహక్కు' అని ప్రథమంగా చాటి ప్రజల్లో గొప్ప ప్రబోధం గావించారు. తిలక్ మహాశయుని ప్రభుత్వం మాండలే జైలులో నిర్బంధించింది. బంకించంద్రచటర్జీ ఆనందమఠంలో వ్రాసిన "వందేమాతరం" గీతాన్ని సైతం నిషేధించింది. పత్రికలను అణచివేసింది. వందేమాతరం ఉద్యమం బాలగంగాధర తిలక్, లాలాలజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్ (లాల్, బాల్, పాల్) నాయకత్వాన దేశవ్యాప్తమయ్యింది. ఈ తీవ్ర ఆందోళన ఫలితంగా 1911లో ఇంగ్లాండు రాజు బెంగాల్ విభజనను రద్దుగావిస్తూ ఉత్తర్వు జారీచేయక తప్పలేదు.

అ) బెంగాల్ విభజన ఏ ఉద్యమానికి దారితీసింది? ( )

ఎ) సహాయ నిరాకరణ　　బి) వందేమాతర ఉద్యమం

సి) శాసనోల్లంఘన　　డి) ఉప్పు సత్యాగ్రహం

ఆ) తిలక్ ఇచ్చిన గొప్పనినాదం ఏది? ( )

ఎ) జైహింద్　　బి) చలో ఢిల్లీ

సి) పోరాడండి లేదా మరణించండి　　డి) స్వరాజ్యం నా జన్మహక్కు

ఇ) వందేమాతర గీతం ఏ గ్రంథంలో ఉంది? ( )

ఎ) సత్యశోధన　　బి) ఆనంద్ మఠ్

సి) గీతారహస్యం　　డి) గీతాంజలి

ఆ) లాల్-బాల్-పాల్ అనేవాళ్లలో 'పాల్' ఎవరు? ( )

ఎ) యశ్పాల్　　బి) బిపిన్ చంద్రపాల్

సి) ధన్‌పాల్　　డి) జగత్‌పాల్

ఆ) 'బెంగాల్ విభజన' బ్రిటీషు ప్రభుత్వం ఎందుకు రద్దు చేసింది? ( )

ఎ) శాంతియుత నిరసనవల్ల　　బి) దేశంలో రేగిన తీవ్ర ఆందోళనవల్ల

సి) ఎవరూ స్పందించనందువల్ల　　డి) బ్రిటీషు వారికి ఇష్టంలేనందువల్ల

## II. భాషాంశాలు

**పదజాలం**

**1. కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు అర్థాలు రాసి, వాటిని సొంతవాక్యాల్లో ప్రయోగించండి.**

ఉదా: గ్రామాల్లో ఒకరి సహాయం ఇంకొకరికి లేకుంటే బ్రతుకు <u>దుస్తరం</u> అవుతుంది.

దుస్తరం = కష్టం; రైతులు ఆరుగాలం కష్టం చేస్తారు.

అ) ప్రజలు తమ <u>జీవనోపాధి</u> కొరకు వలస వెళ్తుంటారు.

_______________

ఆ) <u>మనోనిగ్రహం</u> లేకుండా ఏ పనిచేసినా ఫలితం పొందలేము.

_______________

ఇ) ఎవరు చేసే పనిలో వారికి <u>మెళకువ</u> అవసరం.

_______________

ఈ) మన గ్రామల్లో చాలా మంది తమ వృత్తి పనుల్లో <u>నిష్ణాతులు</u>గా ఉన్నారు.

_______________

**2. కింది నుడికారాలను జతపరచండి.**

| | | | | |
|---|---|---|---|---|
| అ) | కట్టడులు | (    ) | i) | బట్టలుతికే స్థలం |
| ఆ) | సాకెర | (    ) | ii) | ధాన్యం కొలిచిన వాళ్లకు గౌరవంగా ఇచ్చే కూలీ |
| ఇ) | ఆయంకట్టడం | (    ) | iii) | గ్రామంలోని వివిధ వృత్తులతో సేవచేస్తూ ఆ గ్రామంపై ధాన్యం పొందే అధికారం కలవారు |
| ఈ) | వతనుదార్లు | (    ) | iv) | ఇల్లు కట్టేటప్పుడు కొలతలనుబట్టి వాస్తుప్రకారం యజమానికి వచ్చే గణితఫలం |
| ఇ) | వర్తన | (    ) | v) | పూర్వం వృత్తిపనుల వాళ్లకిచ్చే ధాన్యం |

**భాషాక్రీడలు**

**3. కింది పదాల వరుసలో ఒక పదం వేరుగా ఉంది. దాని కింద గీత గీయండి.**

అ) పార, కొడవలి, గొడ్డలి, బట్టలు

ఆ) వివాహం, పెండ్లి, లగ్గం, ఊరేగింపు

ఇ) వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, విశ్వకర్మ

ఈ) సాకెర, తెల్లాకులవారు, పచ్చడాలు, క్షవరం

ఉ) నల్లగుండలు, పేర్పులు, ఐరేనికుండలు, దర్జీలు

వ్యాకరణాంశాలు

ఛేకాను ప్రాసాలంకారము

★ **ఈ వాక్యాన్ని పరిశీలించండి.**

నీటిలో పడిన తేలు తేలుతుందా!

ఈ వాక్యంలో తేలు, తేలు అనే పదాలకు అర్థాలు వేరు వేరుగా ఉన్నాయి. ఆ పదాలు వెంటవెంటనే ప్రయోగించబడ్డాయి. హల్లుల జంట అర్థభేదంతో వెంటవెంటనే వాడబడితే దానిని 'ఛేకానుప్రాసాలంకారం' అంటారు.

మరికొన్ని వాక్యాలు చూడండి. సమన్వయం చేయండి.

అ) అరటి తొక్క తొక్కరాదు.

ఆ) నిప్పులో పడితే కాలు కాలుతుంది.

ఇ) తమ్మునికి చెప్పు! చెప్పు! తెగిపోకుండా నడువుమని.

హల్లుల జంట అర్థభేదంతో అవ్యవధానంగా వస్తే ఛేకానుప్రాసం.

## III. వ్యక్తీకరణ – సృజనాత్మకత

స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) కపిలవాయి లింగమూర్తి రచనలు పేర్కొనండి.

ఆ) విశ్వకర్మలకు 'రథకారుల'నే పేరు ఎందుకు వచ్చింది?

ఇ) పనివారితో పేచీపడితే వచ్చే కష్టాలను చర్చించండి.

ఈ) 'కళ వృత్తిని ఆశ్రయించి ఉంటుంది' అని రచయిత ఎందుకన్నాడు?

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) గ్రామీణ ప్రాంతాల్లో విశ్వకర్మల వృత్తిపని వ్యవసాయానికి ఎలా దోహదపడింది?

ఆ) చాకలి, మంగలి, కుమ్మరి వృత్తుల సేవాదృక్పథం తెలియజేయండి.

సృజనాత్మకత

**1. కింది ప్రశ్నకు సమాధానం రాయండి.**

అ) 'గ్రామీణ వృత్తులు – ప్రస్తుతం పరిణామాలు' అంశాన్ని సొంతమాటల్లో 'ఆత్మకథ'లా రాయండి.

### సూక్తి


జ్ఞానం మనకు శక్తిని ఇస్తుంది.
ప్రేమ మనకు సంపూర్ణతను ఇస్తుంది.

– సర్వేపల్లి రాధాకృష్ణన్

# 13 మంకు

- జి. సురమౌళి

## రచయిత పరిచయం



08-12-1935
20-03-1995

జి. సురమౌళి రాజన్న సిరిసిల్లా జిల్లా బోయినపల్లి మండలం విలాసాగరం గ్రామంలో జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు సుభద్రమ్మ, రాజేశ్వర శాస్త్రి.

ఈయన జయప్రకాశ్ ముఖాముఖి, శ్రీసానే గురూజీ – ఆలోచనా విధానాలు, లోహియా దర్శనం, లోహియా అనవద్య అతీత అమేయ వ్యక్తిత్వాలు, లోహియా భాషాసమస్య, లోహియా కులాల సమస్య, కలిసి బతుకుదాం, హింసారాధన, సాంఘిక విప్లవ రథసారథి బి.ఆర్.అంబేద్కర్ మొదలగు రచనలు చేశాడు. 'కలిసి బ్రతుకుదాం' గ్రంథానికి భారత ప్రభుత్వ బహుమతి వచ్చింది. సాంఘిక విప్లవకారుడు అంబేద్కర్ పుస్తక అనువాదానికి 1992లో తెలుగు విశ్వవిద్యాలయం వారు ఉత్తమ అనువాద పురస్కారం అందించారు.

తెలంగాణలో రాజకీయ కథలు 1946–56 మధ్యకాలంలో చాలా వెలువడ్డాయి. వట్టికోట ఆళ్వారుస్వామి, నెల్లూరి కేశవస్వామి, పి.వి.నరసింహారావుల సరసన నిలబడే కథలు రాసిన వాడు సురమౌళి. ఈయన రాసిన స్వాతిచినుకులు, రక్తపూజ, ముక్కోటి బలగమోయి కథలు సమకాలీన రాజకీయాల్ని చిత్రీకరించాయి. రాజకీయ సిద్ధాంతాలు ఆఖరి సామాన్యుడికి కూడా మేలు జరిగేలా ఉండాలనే ఆలోచనతో రచనలు చేశాడు.

న్యాయవాదిగా, సంఘ సంస్కర్తగా, హేతువాదిగా, కులనిర్మూలన సంఘ నిర్మాతగా, నాస్తికోద్యమ రూపశిల్పిగా, జర్నలిస్ట్‌గా, పత్రికా సంపాదకుడిగా, రేడియో ప్రయోక్తగా, నాటకకర్తగా, అనువాదకుడిగా వీటన్నింటినీ మించి తెలంగాణ భాష నుడికారం, పలుకుబడులు, లోకోక్తులతో రచనలు చేసిన తొలితరం కథకుడు సురమౌళి.

'మంకు' కథ సురమౌళి కథలు నుండి గ్రహించబడింది.

పనగల్లు దాటి ఒడ్ల పొంట బడి ఉరుకుతా వుండు మల్లిగాడు. ఆనయ్య ఆనెంట బడి తరుముతుండు. ఒడ్ల పొంట బడి ఉరుకుడా పెద్దమనిషికి చాతగాలేదు. ఏడ జారి పొలం బురుదల బడ్తనో అని బుగులుపడ్డ అయ్య, ఒక పేద్ద దమ్ము దీసుకొని ఎనుకకు మల్లిండు. “ఇగ దొరకనే దొరకవా?” అని కీకపెట్టు దూరానున్న కొడుక్కు ఇనపడేటంత పేద్దగా కీకవెట్టిండు. పొలం చుట్టు తిరిగి దాని కొనాకు జేరిండు పెద్ద మనిషి. గెట్ల పొంట ఉరికీ ఉరికీ ఆడికే చేరినడు మల్లిగాడు. ‘దొరికితివిరా’ అన్న అయ్య అంకె ఇనంగనే పక్కకున్న మోటబాయిల ఒక్కదుంకు దుంకిండు మల్లిగాడు. అయ్యకు మల్ల చెమటలు బుట్టినయి. గొంత తగ్గిండు పెద్దమనిషి. “ఎందుకు తిప్పలు పెడతవురా, ఇంటికాడ మీ అవ్వ గోడు గోడున ఏడుత్తుంది. బుక్కెడంత దినిపోదువురా” అని బతిలాడిండు. “చాతనైతె ఊకుంచుపో. అవ్వ నా మీదేడుత్తుందా నీ మీదనా?” అని బుదుంగున మునిగిండు.

పెద్ద మనిషి నోరు తడబడ్డది.

పెన్లాన్నూకుంచ చాతగానోడు కొడుకునేం అడ్డునబెడ్తడు. తిరిగీ తిరిగీ కడుపులగాల్తె అదే వత్తడు ఇంటికి. అనుకోని ఎనుకకు మల్గిండు. పనులు పాడుజేసుకోని ఆని కోసం ఎంతకని దిరుగుతడు. దొరుకుతె ఈబ్బగలగొట్టాల్నన్నంత కోపం వత్తుంది. జానెడులేడు. తనంటె చొప్పబెండు కంటె అల్కనాయె... ఆని రోగం అదే తిరుగుద్ది. దాని రోగం గూడదే తిరుగుద్ది. ఏడ్చేడిచి అదే ఊకుంటది. పోరడెక్కువా తనా? బతిలాడి ఊకుండే అంటె యాడవూరుకుంటది. అడ్డమైన తిట్లన్ని తననే తిడ్తది. పోరన్ని జూత్తెనే తనకన్నమంటనట. ఆడు తనకు మాత్రం కొడుగ్గాకపాయెనా? అని మంచికోసమేనాయె తను అన్ని గోప్పడ్డది. తనను తన మంచి కోసం తనయ్య ఎన్ని దెబ్బలు గొట్టలే. అన్ల సగం దెబ్బలన్న బడ్డయా తన కొడుకుమీద. ఇట్ల ఏందేందో ఆలోచిచ్చుకుంట తన పనిమీద తాను వోయిండు.

నిన్న మల్లిగాడు సోపకెగ్గొట్టి, గుట్ట మీదికి వోయిండు. తనొక్కడే పోయిండా తన సోపతిగాన్లెంతమంది రాలేదు? ఆల్లందరిని ఆల్లయ్యలు గిట్లనే కొడుతుంరా? రోజువోయే సోపల కొగనాడు వోక పోతేంబాయె. గుట్ట మీదికి రోజు వోతడు గనుకనా? ఏడాదికి ఒక్కనాడు బల్కి రెండు నాల్లు. పొయ్యేద్ది బోపుకుంట తాతీలున్న నాడు బోతేందంటడు ఆల్లయ్య. తాతీలున్ననాడు గోటీలు బొంగరాలేం గావాలె. తాతీల్లు ఆడుకునుటానికిత్తరుగని గుట్టమీదికి బోవుటానికిత్తరా? గుట్టమీది నుంచి రాంగనే ఈపు బగుల్తదేమోననుకున్నడు మల్లిగాడు. బుగులు పడుకుంటనే ఇంట కాలువెట్టిండు. ఆయాల్లకు ఆల్లయ్య ఇంట్లలేడు. అవ్వ దగ్గరికివోయి, బువ్వ బెట్టిచ్చుకోని తల ముంగల కూకున్నడు.

అవ్వ గూడ గోప్పడ్డది.

అయ్యనడగక చెయ్యక గుట్టమీదికి వోయినందుకు. అయ్యనెందుకడుగాన్నో మల్లిగాన్కి మనుసుకెక్కలే.

అయ్య సంపాయించందే ఆల్లక్కూడాడికెల్లివొత్తది. అందుకని అయ్య జెప్పినట్టినాలన్నది ఆల్లవ్వ. ఆల్లయ్య ఆయినెకు వెట్టిండు. ఆయనె తనకు వెట్టిండు. తాను బుట్టకముందు గిన తనతోటి తనయ్య కరారునామగిన రాయించుకున్నడా. కన్నందుకు బెడుతుండు... ఆల్లయ్య తన మంచి కోసమే చెపుతుండట. అందుకని ఆయినె జెప్పినట్టినాల్నన్నది ఆలవ్వ. తన మంచికోసం జెపుతె తాను మాత్రం ఎందుకినడు. చిన్నప్పుడు తన మంచి కోసం తనను సోపలకు వొమ్మన్నడు. తను వోతలేడా? తన మంచి తనకు దెల్వదా? ...బుక్కెడంత దిని సోపలకు వోదామనుకుంటెనే వుండు. ఇంతల యాన్నుంచో రానే వచ్చిండానయ్య.

బుక్కెడు నోట్ల పెట్టుకున్నడో లేదో 'ఎవలే లోపల' అని అయ్య అంకె యినపడ్డది. తాను బువ్వదింటున్న సంగతి దెల్వంగనే 'ఆన్నియ్యల్ల ఎండబెట్టు బుద్దత్తది' అని ఒక్క అరుపరిసెటాల్లకు మల్లిగాడు ఒక్క గంతేసి దిడ్డిగుంట ఆవల పడ్డడు.

ఆన్నుంచి ఆల్లయ్యను ఉరికిచ్చి, ఉరికిచ్చి తానురికీ వురికీ అయ్య నలిసిపిచ్చిండు. బాయిల నుంచీ గడ్డకెక్కి, తడిసిన బట్టలుతుక్కోని పిండుకోని తడిబట్టలే తొడుక్కున్నడు. పెయి మీదయ్యే ఎండుతయి. అటూ ఇటూ చేన్లల్లా చెల్కల్లా పడి తిరిగిండు.

దోసచేన్ల నాల్గు దోసకాయలు దెంపుక తిన్నడు కడుపుల గాల్తే. ఇగేం జెయ్యాలె. ఏం పని దోసలే మల్లిగానికి. మల్లగుట్ట మీదికి వోదామనుకున్నడు. నిన్నంటె సోపతిగాన్లతోటి పాయె, ఇయ్యాల్లేమున్నది గుట్టమీద. పిల్లబాటపొంటి బాటెటు వోతె అటు దారిపట్టిండు. ఒక చింతచెట్టుకింద పచ్చగడ్డి మీద పండి గొడిసేపు కన్ను మూసి కునుకు దీసుండు. ఎండ నెత్తి మీద కెక్కింది. కన్లు నలుసుకొని లేసి సూసిండు. మల్ల బయిలెల్లిండు. నడీదారి పొన్న జెగమెరుసుకుంట ఏందో రోకలి దొడ్డుపాము బారుతుంది. మల్లిగానికి చల్లచెమటలు వోసినయి.

దండం పెడ్తె పాము పారిపోద్దని కతలిన్నడు మల్లిగాడు. రెండు చేతులు జోడిచ్చి దండం బెట్టవోయిండు. చేతులు రాలే. పాము తన దారిన తాను వోయింది. మల్లిగాడనుకున్నడు. తాను దండం బెట్టినందుకే పాం తనను దయ తలచి పారిపోయిందని. తను మనసుల దండం పెట్టాలని అనుకున్న సంగతి గూడ పాముకు దెలిసింది. రేపు పొద్దుగాల నాగమయ్య గుల్లెకు వోయి దండం బెట్టాలనుకున్నడు. మల్ల కాల్లు ఆడిచ్చిండు.

నడుత్తావుండు దూపయితుంది. ఎండల ఏడ నీల్లున్నయో ఎరుక లేదు. అటీటు మోట బాయిలన్న లేవు. పక్క పొంట ఒక ఒఱ్ఱె బారుతుంది. పోయి కడుపు నిండ నీలుదాగిండు. పక్క పొన్న వున్న గుండు మీద గూకుండి అలసట దీర్చుకుంటుండు. గుండు దొర్లింది. పక్కకు ఉసికల పడ్డడు. గుండు కింద ఒగబూరుదేలు నిద్దురవోతుంది. పక్కకున్న రాయి దీసికోని దాని మీద ఇసిరిండు. తేలు నజ్జునజ్జయింది. ఒఱ్ఱె నీళ్లు పాలోలిగె చాల కమ్మగున్నయి. మల్ల బుక్కెడు నీలు తాగుదామని ఒఱ్ఱెల చెయి బెట్టిండు. నీరు కట్టి తలకాయి లాబెట్టకోకని ఈదుకుంట వత్తుంది. రాయి దీసుకోని దాని తలకాయ మీద వాటగ గొట్టిండు. చచ్చింది. తోక గొట్టకోని కొట్టకోని దాన్ని దీసి గడ్డకు బారేసిండు. నడక సాగిచ్చిండు.

తన కాల్లు తనకు దెల్వకుంటనే ఊల్లెకు దీసుకపోయినయి. ఊల్లెకు వోంగనే సోపయాది కచ్చింది.

సోపతి పిలగాన్ల తోటి వోయి ఆడుకుందామనుకున్నడు. గునగున సోపల కురికిండు. పంతులు లేడు. పిలగాన్లందరు చెట్లకు నీళ్లువోత్తుందు. పొద్దట్నుంచి రానందుకు చెప్రాసి గోప్పడ్డడు. మల్లిగానికి కన్లు మండుతున్నయి. కాల్లు గుంజుతున్నయి. కని చెప్రాసి ఆనితోటి ఎనిమిది గజాల లోతు బాయిల మంచినీల్లు జేద పెట్టిండు. ఆ సోపల పంతులు నెలుకు నాలుగు మాట్ల పాటాలు జెప్తె మా ఎక్కువ. సోప చుట్టు కూరగాయల చెట్లు. కాసిన కూరగాయలు పంతులు తను దిని, తనూరికి పంపిచ్చుకుంటడు. మల్లిగాని చేతులు బీక్క పోతున్నయి. నీల్లు గుంజలేక బొక్కెన బాయిల పడేసిండు. తాను బాయి కాడ గూలపడ్డడు. బొక్కెన బాయిలేసినందుకు మల్లిగాన్ని చెప్రాసి కోప్పడ్డడు. సోపతి గాడొచ్చి లేపట్టి కూకుండపెట్టిండు.

మల్లిగాని పెయ్యి గాల్తుంది. సోపలకు దీస్క పోయి తట్లేసి పండపెట్టిండు సోపతిగాన్లు. పొద్దంగంగ ఇంటి కచ్చి సూత్తే మల్లిగాడింటికి రానేలేదని తెలిసిం దాల్లయ్యకు మల్ల సంకల కట్టె వెట్టుకోని బయలెల్లిండు పెద్దమనిసి. సోపలకు గిన వోయిండేమోనని తిరిగి తిరిగి ఆడికే చేరిండు. తట్లమీద సొమ్మసిల్లి పన్న తన కొడుకును జూసెటాల్లకు పొద్దట్నుంచున్న

కోపమంత కరిగింది. పెద్ద మనిసికి. 'మల్లిగా' అన్నడు గార్వంగ. ఆ మాటల ఎంత గార్వం ఒలకబొయ్యాన్ననా చాతగాలేదు పెద్దమనిసికి. 'నీ కస్సలుకు దొరుకనని!' లేశి వురుకబోయిండు గని మల్ల గూలపడ్డడు. పెద్ద మనిసికన్లు గిఋున దిరిగినయి. యాన్నుంచో ఎండిపోయిన చెర్ల చెలిమ బడ్డట్టు, కన్లల్ల నీల్లూరినయి. సలసల కాగుతున్న రొట్టె పెంక మీద పడ్డట్టు మల్లిగాని పెయి మీద అల్లయ్య కన్ల నీల్లు పడి సుర్రుమని ఆరిపోయినయి. మల్లిగాన్ని బుజానేసుకోని యింటికి బయల్లెల్లిండు పెద్దమనిషి. 'నే నింటికి రాను పో, నన్ను నువ్వు గొడ్తవె' అనుకుంట, కాల్లూ చేతులూ గొడ్తుండు అనయ్యకు. ఇన్నాల్లు గొట్టిన కసి దీర్చుకుంటుండేమో? పెద్దమనిసి ఈపు సున్నం సున్నమయింది. ఇంటికి వొయ్యి కుక్కి మంచంవాల్చి, గొంగడేసి మల్లిగాన్నంల్ల పారేసేదాంక కంపతెట్టె మోసుకచ్చినట్టున్న దాల్లయ్యకు. అల్లవ్వచ్చి ఆని పక్కల గూకుండి, ఏడ్చింది. మల్లిగానికి ఏడుపచ్చింది. 'ఇంత మంకు బనికిరాదురా' అని బుదరగిచ్చిందాల్లవ్వ, తనదా మంకు? ఆ మాటనే అల్లయ్యకు జెప్పుడు చాతగాదేంది అల్లవ్వకు? అని అందామనుకున్నడు కని మాట్లాడె చాతనైతెగద? బోర్ల బొక్కల పండి మొకం మలుసుకోని గోడుగోడుమని ఏడ్చిండు పోరడు పాపం.

'అని మంకుతనంతోటి ఆడే మంచాన పడ్డడు. మందులయ్యను బిల్చుకత్త'నని అల్లయ్య అవుతలబడ్డడు.

## స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) 'పిల్లల మనస్తత్వానికి అద్దం పట్టిన కథ మంకు' సమర్థిస్తూ రాయండి.

ఆ) 'తల్లిదండ్రులు ఎల్లప్పుడూ పిల్లల బాగుకోరుకుంటారు' మంకు పాఠం ఆధారంగా వివరించండి.

# 14 సియాసీ సభలు

– బెల్లంకొండ నరసింహాచార్యులు

## రచయిత పరిచయం

బెల్లంకొండ నరసింహాచార్యులు (1896–1947) మెదక్ జిల్లా తూప్రాన్ సమీపంలోని వడ్డేపల్లి గ్రామంలో జన్మించాడు. బెల్లంకొండ రామానుజాచార్యులతో కలిసి 'దేశబంధు' పత్రికకు సంపాదకత్వం వహించాడు. ఈ పత్రికకు 'ఆంధ్ర విజ్ఞాన ప్రబోధక మాసపత్రిక' అనే ట్యాగ్‌లైన్ ఉండేది. ఈయన అనేక అష్టావధానాలు చేశాడు. నిజాం వ్యతిరేక పోరాటంలో చురుకైన పాత్ర వహించాడు. నరసింహాచార్యులు అనేక కథలు రాశాడు 'ఆంధ్ర రామాశ్వమేధం', 'ఆంధ్ర విశ్వ గుణ దర్శనం', 'చారుమతి పరిణయం', 'కీచక వధ', 'కనకసేన విజయం', 'రాజహంసోపాఖ్యానం', 'చీనాసుందరి' నవల ఈయన ప్రసిద్ధ రచనలు.

రెండు దినములైంది. ఆ వూరిలో ఎంత వెతికినా ఒక్క కోడి అయినా దొరకలేదు. అమీన్ సాబు కోరిక తీరలేదు. ఊరిలో నిలబెట్టి తలొకరికి చెంపవాత పెట్టినాడు. రైతులు ఒకరితో ఒకరు మాటలాడుకొని పరికాపుల బండకుపోయి బలిసిన కోడిని తేవడానికి పాముల బండ నించి బయలువెడలినారు. ఆ వూరికి ఈ వూరికి చుట్టరికాలు ఎక్కువ. ఒక మాట మీద నిలబడేవారూ ఆ వూరిలోన్నూ, ఈ వూరిలోన్నూ సమానంగా యున్నారు. అయిననూ పరికాపుల బండలో నాలుగు వందల ఇండ్లు ఉంటాయి. ఇరవై కోమట్ల కుటుంబాలు, ఇరవై రెడ్ల కుటుంబాలు బతకవచ్చిన శ్రీ వైష్ణవుల కుటుంబము, స్థానికత్వం వున్న అధికార రాజాశ్రితమైన పది పురోహిత కుటుంబాలు, ప్రభువుల కార్యాలు నెరిపే కరణాలు, దేశ్పాండ్యలు, మామిళ్ళ, జామ తోటలు కలిగి పెద్ద పెద్ద గచ్చుబావులు, విశాల భవంతులు కలిగిన సలాం జాగీరుదారులు, రొండు వందలు కాపు కష్టం చేసుకునే వారి ఇండ్లు, నూరు మాల, మాదిగవారివి, తక్కినవి ఇతర జాతులవి ఇండ్లు ఉంటయి.

పాముల బండ మూడువందల ఇండ్లు గల చిన్నవూరు. దొంతి వారి యేలుబడిలో నర్సాపురం మైబేలి చెప్పుచేతలో చివరకు హైదర్ ఆధిపత్యంలో భవిష్యత్తు అరచేతుల ప్రాణాలు పెట్టుకొని ఉన్నది.

* * *

చెరువు దిగితే పరికాపుల బంద రాజయ్య ఎదురుగా వచ్చినాడు. చెప్పకుండ చెయ్యకుండ ఇదేం రాకయని ఆశ్చర్యంగా అడిగినాడు రాజయ్య.

అమీన్ సాబ్ ఆజ్ఞ మంచి కోళ్ళు కావలె, లేనిచో రిక్తహస్తాలతో వూరు విడిచిపోలేము దిగులుతో అన్నాడు శేఖరము. వైశాఖ మాసమనిన్నూ అంగ్రేజీ వారికి చక్కని మామిళ్ళు కొనిపోయి ఇచ్చుటకు పట్నం జాగీర్లు, దొరలు, పటేళ్ళు వూరిలో తిష్టవేసినారు. ఇక్కడ ఏ ఇంట వెతికినా కోడి రెక్కలయిననూ దొరకవు.

ఇంకనూ నిరాశయేనా? నిరాశపడకు. నీకొక రహస్యము చెవిన వేసెదను.

అది యేమిటి?

ఈ ఊరికి శ్రీనివాసాచార్యులనే అయ్యగారు వచ్చియున్నాడు. గుడిపూజ ఒకటే కాదు. మాపటికి భక్తజనుల హరికథ, ఏకాదశి, పున్నమి, అమావాస్యల నాడు భజనలు చేయుచున్నవాడు.

గుడికింద అద్దెకరం చాలీచాలని భూమియున్నది.

పోయినేడు కరువున అరిష్ట పూజలని రోజుకొక ఇంటివారు పూజలు చేయించి, అన్నతర్పణం చేయించినరు. పురోహితులకు ఆయనంటే చాలా ఆగ్రహం. ఏ శాస్త్రంలో చెప్పనిది చేయడం యెందుకని వారి రంధి. బ్రాహ్మణ దానం, గోదానం, భూదానం, స్వర్ణదానం చేయాలని వారు సూచించిన వెంటనే ఆ వూరి దొరలకు గురి కుదరలేదు.

“ఇదంతా ఎందుకు చెప్పుము! కోళ్ళు కావలయును ఇప్పుడు...” మరేదో పట్టకబోయాడు.

“ఆ విషయం చెప్పే ముందు చాలా విషయాలు గ్రహించాలి. ఓపిక పట్టుము”.

అక్కడున్న బూరుగు వృక్షం క్రింద తూమురాత మీద కూర్చుందము. మీ ఊరిలో చర్చించు విషయములు పెక్కుగా కలవు.

నా అయ్యగారు కష్టకాలమున వూరిని ఆదుకొనుటయే కాదు. చాలా క్రొత్త విషయములు చెప్పుచూ హరికథలూ దేవాలయ కార్యక్రమములు నిర్వహించుచున్నాడు.

రంగంప్యాట, జోగిప్యాట, అందవోలు, టేకుమళ్ళ, పొట్లంచెరు, భిక్కనూరు పర్యంతము దేవాలయాలలో పలు భక్తులను పలు కార్యక్రమములకు సమాయత్తం చేయుంచి యా సియాసీ సభలకు యోచన చేయుచున్నాడు. ఇది బ్రహ్మ రహస్యము సుమ.

“సియాసి సభలు అంటే?”

“నిజాము రక్కసి ఫర్మానాలను ధిక్కరించి మెదులుకొను వ్యూహము”.

“ధిక్కరించి బతుకుతామా?”

“బతికినన్ని దినములైనను చాలు వూరు వాడ కదిలితే. ఊరిలోపల వారి కుటుంబాలు మూడు వందలకుపైగా మన వారలు ఒక్కటి కావలయు”నని చెప్పియున్నాడు.

“అది అట్లుంచుము. మనకు కోళ్ళ సంగతి...”

“శ్రీనివాసాచార్యులు పది కోళ్ళను కమ్మి యున్నాడు. మా వూరు ఫలానా అని చెప్పి అమీన్‌సాబు దెబ్బలన్నీ చూపి మార్గం చెప్పుమను... వూరి ప్రవేశం అయిన వెంటనే కుడిపక్క గుడి వెనక అతని నివాసగృహము”.

* * *

ఠీకు తాకున నలుగురు అయ్యగారి వద్దనించి సెలవు తీసుకొని వెళ్ళిపోయినారు. రాజయ్యతో సహా ఐదుగురు శ్రీనివాసాచార్యులకు దండం పెట్టినారు.

“పంచదాసుడను దండ ప్రణామముల అయోగ్యనని ప్రతిదండము సమర్పించెను. మీదుగా చల్లగా నూరేండ్లు బతకాలె”.

“ఏమి కావలయును ఏవూరి వారలు?”

“నేను రాజయ్య వీడు రాయగడ సత్తినారి, పెంటి, నర్సి అయ్యగారూ! మాది పాములబండ. రెండు దినములుగా అమీన్‌సాబ్ కోళ్ళ కొరకు ఆజ్ఞ చేయుచుండిరి. వూరినందు దొరకక ఈ వూరికి వచ్చితిమి. వూరు, వాడ చెప్పుకొనగా మీ సహాయము కొరకు వచ్చితిమి”.

“సరియైనచోటకే వచ్చితిరి”.

“ఆ బావి దగ్గర కాళ్ళు కడుగుకొని ఈ కుండలో నీరు త్రాగుము. సేద తీర్చుకొండి, కోడినిచ్చి పంపెదను” అని అనెను శ్రీనివాసాచార్యులు.

అప్పటికి సమయం మధ్యాహ్నము మండుటెండ జాము నిగనిగలాడుచున్నది. ఆకలితో వచ్చినవారిని వదలి కడుపులు నింపుకొనుట ఇష్టముకాక పొద్దటి ఆరగింపు పులిహోర సొండెలు కలిపిన తాంబాలము తీసి చూసి ఊరి పటేళ్ళు, మాలీ పటేల్, పోలీస్ పటేల్ కరణాలు అందరి ఇండ్లకు పంచగా మిగిలినది తలా పిడికెడు అయిననూ సరిపడుతుంది అని తలంచి అందున సొండెలు కలపడము వలన కడుపు నిండుతుంది. ఆరేడు దొప్పలలో నింపి ఇచ్చెను.

రాజయ్యతో సహా ఆరుగురు తమ దొప్పలయందు ప్రసాదం తీసుకొని వాకిలి మొకాన పోబోయిరి.

“కాదు అది తప్పు. లోపల కూర్చోని సేవించెదము. రండి!” అని పిలిచెను.

ఆశ్చర్యంగా వారు లోనికి వచ్చినారు.

“వెట్టి బానిస బతుకుల నించి బయటకు మార్గం వెతకాలి. మనం బయటకు పోతే అంతా వృథా, బయటకు వెళ్ళకూడదు. మనం కలిసి భుజింతము... వర్ణ వైశమ్యములు ఆవలకు మనుష్యులు లోనకు రావలయును”.

“అయ్యగారు, మీ గురించి చాలా తెలుసుకున్నాము. పూజారి అయివుండి మమ్ములను కలుపుకుంటిరా? దేవుడు ఏమి చెప్పెను? ఇల్లు మైలపడిపోదా?”

“అయ్యో! ఎంతమాట. పుట్టుక మైల, చావు మైల, మట్టి మైల, మనం మనుషులం మైలకాము. దేవుడు చెప్పింది ముక్తి. గజేంద్రుని మొసలి పట్టుకుంటే కాలు విదిలించి బయటకు లాగుచూ పోరినది. చివరకు చక్రముగల శ్రీకృష్ణుడ్ని పిలిచినది. కృష్ణుని చక్రాయుధము కదా ముక్తి కలిగించినది. మనమునూ అంతే మనమునూ ముక్తి మార్గము చూసుకొనవలెను”.

"ముక్తి అనగా ఏమి?" నర్సి నోరు విప్పినాడు.

"అనగా ఇప్పుడున్న భయానక పరిస్థితులను తొలగించుకొని బయటపడుట ముక్తియే యనబడును".

"ఇప్పుడు ఎటువంటి ముక్తి కోరుట ఉచితము? తిండి గింజలు లేని కరువు కాలము ముక్తికి ఎవరు వత్తురు?" రాజయ్య సత్తితో అన్నడు.

"పెద్దోళ్ళ మీదికి ఎదురుపోతే బతుకనిస్తరా అయ్యగారు?"

"వూరిల అయ్య, అవ్వలకు తొవ్వ జూపాలె, మమ్ములను సయిస్తరా? సర్వం కోల్పోయి వున్నాము" అన్నడు పెంటయ్య.

అయ్యగారు గస్తీ నిషాన్ 53 గురించిన్నూ వెట్టిచాకిరీ తత్వము గురించిన్నూ బోధించినాడు. కూలి ఇస్తేనే పనులు చేయాలని చెప్పినాడు.

"సరె. ఇవాళ సాయంత్రము ఈ వూరిలో రేపు సాయంత్రము మీ వూరిలో 'కీచకవధ' ఉత్తర గోగ్రహణము హరికథ కథనము, భక్తజనులకు ప్రసాద వితరణము యున్నది. వూరిలో చాటింపు చేయ"మని చెప్పినాడు.

"ఇప్పటికి నొక కోడి గడ్డివాము నందున్నది, తీసుకొని పో"మ్మనెను.

రెండో రోజు పాములబండ వూరియందు కీచకవధ హరికథ సమాప్తం అయినది.

తెల్లవారి బండమీద వూరి జనులందరూ సమావేశమైనారు. ఇట్టి విషయములను ఎవడో అమీను సాబ్ చెవిలో వూది వచ్చినారు.

పట్నం నించి వచ్చిన తబ్లిక్ సంఘము వార్ని దివాన్‌ఖాన్‌లో మర్యాదలు చేసి గుర్రమెక్కి వచ్చినాడు అమీన్‌సాబ్. ఇరుగ్రామాల వారందరున్నూ అక్కడనే దర్శనమిచ్చినారు.

అయ్యగారు "బ్రతుకు స్వాతంత్ర్యం" అనే పుస్తకం ఇచ్చినాడు. మా వూరి వారికి ధైర్యం వచ్చినది. అయినను చదవరాని బెంగవారిని కలవరపరిచినది.

కోమట్లు, ఖాన్గి పంతుళ్ళు, అయ్యవార్లు దేవాలయాలలో చదువు నేర్పాలని శ్రీనివాసాచార్యులు అవిద్యనొక లోపమయినందున పలువురిని కోరినారు.

అమీన్‌సాబ్ ఈ తతంగం చూసి కోపోద్రిక్తుడయినాడు. "ఖబడ్దార్... ఇది యేం నాట్కం" అని గొంతు పెంచాడు.

"ఇది 'భక్తవిజయం' హరికథా కాలక్షేపం.." అయ్యగారు చెప్పబోయాడు.

"అరె బంద్! ఇది యేషం నాకి తెల్సు గస్తీ నిషాన్ 53 జారీ షురు అయ్యింది. తెలుసూ లేదూ! మకీ సంగం! ఏందీ సమావేశం?"

ఎవ్వరూ మాట్లాడలేదు. అయ్యగారి మాటలు ఆగలేదు. ఏకాకి వంతున.

"అచ్చా మీ సంగతి చెప్తా అనుకొంటూ అమీన్ సాబ్ వెళ్ళిపోయినాడు.

వూరూరా సియాసీ సభలు ఫర్మానాలకు వ్యతిరేకముగా వ్యవహరించుటకు నిర్ణయించినారు.

వర్షాకాలం సమీపించినది. మృగశిర కార్తె తొలి చినుకులు కురిసిపోయినాయి. వూరి జనానికి బావులు పంటలు లేకున్నను సిరికలవారికి అన్ని సంపదలే.

రాంరెడ్డి, సిద్దిరెడ్డి, పోలీస్ పటేల్, హన్మంతరావు జాగీర్లు కాపులను పిలిచినారు. భూమంతుల పరిచారక సేవలకున్నూ, వెట్టిచాకిరీకి ఎవరూ రాలేదు. అమీన్‌సాబ్‌కు కోళ్ళు రాక ఆగిపోయినవి. నాగళ్ళ జాగీర్దారులంతా ఏకమై మీటింగ్ వేసుకున్నారు. లాఠీలతో బయలుదేరి బలవంతంగా పనిచేయించాలని కసితో వూరిమీద పడ్డారు. అయ్యగారు భజన చేస్తున్నాడు.

"అరే పట్టండి! ఏక్ సౌగారోంకో! నీదీ యే వూర్? నీది రూపం ఏది? సియాసీ సభ చేస్తవ్‌రే! భజనకారుల తలలు పగులగొడుతున్న పోలీసులు, అయ్యగారి దగ్గరికి పోబోయారు.

భజన తాళాల చర్మపు తాళ్ళు అందుకొని భజనకారులు తిరిగి భటుల బొమికల పులకరం జ్వరం రగిలించినారు. అమీన్‌సాబ్ తోకముడవక తప్పలేదు.

పదిరోజులు గడిచిపోయినాయి. ఆ వూరిలో కలవారి పాయఖానాలు పశువుల పాకలు కంపు కొడుతున్నాయి. వాకిట ముగ్గులు లేవు. వంటచెరుకు సరఫరా తరిగిపోయినది. బావిల నీళ్ళు తోడువారు లేరు. పశువులకు నీరు, గ్రాసం మాత్రం ఇంటికొకరు వచ్చి వేసి వెళ్ళిపోతున్నారు.

ఈ శికాయత్ మొహతమీన్‌లకు చేరింది. అమీన్‌సాబ్ అవమానంతో చెప్పుకోలేదు.

మొహతమీన్ గ్రామస్తులను విచారించినాడు. "అయ్యా ఈ అమీన్‌సాబ్ కలవారితో చేయికలిపి తీరికలేని యెట్టి చేయించుతున్నాడు. రోజూ తన బంధుమిత్ర పరివారానికి కోళ్ళు, గొర్లు, మ్యాకల విందు, సుర విందు పండుగ చేయిస్తున్నాడు. లేదంటే చెంపదెబ్బలు పెట్టినా ఏమీ చేయలేని వారము. దొరలు వాతలు పెడుతున్నారు. మేమేం తిని బతకాలె! మాకీ అమీన్‌సాబ్ వద్దు. మేమీ వూరు విడిచి వెళ్ళిపోతాం" అని ముక్తకంఠంగా అన్నారు.

నలుగురి చేతిలో పత్రికలు, అణాగ్రంథాలు కనిపించసాగాయి. బలపంతో దిద్దిన చేతులు కాయలు గాసిన చేతులు మొహతమీన్‌ను హెచ్చరించినాయి. తక్షణమే అమీన్‌ను విచారించినారు.

బలం లేనిచోట ప్రమాదమని ఒక్క లిప్తపాటు ఇక్కడ వున్నా మంచిది కాదని గ్రహించినారు. అల్లా! ఖల్సా నిర్మాణంబులు సల్పుమనినాడా? ఖంగాల్ చేయుమనినాడా? తప్పు జరిగింది.

ఈ అమీన్‌ను ఇక్కడి నుండి బర్తరఫ్ చేయుచున్నానని చెప్పి మొహతమీన్ వెచ్చగా జారుకున్నాడు. వూర్లు వూర్లన్నీ ఉమ్మడిగా సియాసీ ఆదర్శములను, గెలుపును పాటించినాయి.

## స్వీయరచన

1. **కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

   అ) పాఠం ఆధారంగా అమీన్‌సాబ్ అకృత్యాలను వివరించండి.

   ఆ) 'ఊర్లు ఊర్లన్నీ ఉమ్మడిగా సియాసీ ఆదర్శాలను, గెలుపును పాటించాయి' అన్న వాక్యాన్ని సమర్థిస్తూ కథను విశ్లేషించండి.

# 15 అడవి పూలు

- బోయ జంగయ్య

## రచయిత పరిచయం



01-10-1942
07-05-2016

డా॥ బోయ జంగయ్య యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట తాలూకా లింగారెడ్డి గూడెంలో మేనమామ ఇంట్లో జన్మించాడు. స్వగ్రామం పంతంగి. తల్లిదండ్రులు ఎల్లమ్మ, మల్లయ్య. బి.ఎ. వరకు చదువుకున్న ఈయన ప్రభుత్వ ఖజానా శాఖలో ఉన్నతాధికారిగా విధులు నిర్వహించాడు. పేదరికం, అంటరానితనం కారణంగా ఎదుర్కొన్న కష్టనష్టాలు, తదనుగుణమైన జీవితానుభవాల నేపథ్యంలో నుండి బోయజంగయ్య అనేక రచనలు చేశాడు. సామాజిక, ఆర్థిక, రాజకీయ దోపిడీ విధానాలను, మూఢనమ్మకాలను సహేతుకంగా ఖండించి, రాజ్యాంగ నైతికతను, శాస్త్రీయ ఆలోచనా దృష్టిని జంగయ్య తన రచనల ద్వారా ప్రబోధించాడు. 1963 నుండి రచనావ్యాసంగాన్ని ప్రారంభించిన జంగయ్య కథ, నవల వచనకవిత, నాటిక, జీవితచరిత్ర, బాలసాహిత్యం లాంటి ప్రక్రియల్లో అనేక గ్రంథాలను రచించాడు. గొర్రెలు, ఎచ్చరిక, చీమలు, తెలంగాణ వెతలు, ఆమె, బొమ్మలు, బొగ్గులు, ఇప్పపూలు, అడవిపూలు మొదలగు కథాసంపుటాలను, జాతర, జగడం, పుట్టుమచ్చ వంటి నవలలను వెలువరించాడు. కష్టసుఖాలు, దేశంకోసం వంటి నాటికలను, నడుస్తున్న చరిత్ర, వెలుతురు, పంచనామ కవితాసంపుటాలను రచించాడు. భారతరత్న డా॥ అంబేద్కర్, సమతావాది బాబూజగజ్జీవన్ రామ్, దేశాధ్యక్షుడు కె.ఆర్.నారాయణ్, గుర్రం జాషువ వంటి మహనీయుల సంక్షిప్త జీవిత చరిత్రలను వెలువరించాడు. ఐదు దశాబ్దాలపాటు తెలుగు సాహిత్యంలో విశేషమైన కృషి చేసిన బోయ జంగయ్యకు తెలుగు విశ్వవిద్యాలయం 2003లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. చాసో స్ఫూర్తి పురస్కారం, విశాల సాహితీ పురస్కారం తదితర పురస్కారాలను అందుకున్నాడు. తెలుగు కథా సాహిత్యంపై బోయ జంగయ్య తనదైన ముద్రవేశాడు. బోయ జంగయ్య రచించిన అడవిపూలు అనే కథాసంపుటి నుండి గ్రహించబడిన అడవిపూలు కథ ఆకలిచావులకు కారణాలు తెలియజేసే కరుణరసాత్మకమైన కథ.

రాంలాల్‌కు జ్వరం రాబట్టి పదిరోజులైంది. ఏమాత్రం తగ్గడం లేదు. తన దెబ్బదేండ్ల కాలంలో ఇంతటి జ్వరం ఎన్నడు ఎరగడు. రంగు మారక మెత్తబడ్డ సన్నని గాజర లాగున్నడు. కాస్త సుస్తి చేసినా ఏర్లకషాయం, ఆకు పసరుతో తగ్గేది రెండవ రోజు వుండేది కాదు. ఈసారి ఆర్.ఎం.పి ఇచ్చిన గోలీలు కూడ మింగిండుకాని జ్వరం తగ్గలేదు. టౌన్ ఆసుపత్రికి వెళ్లలేక తన గుడిసెలోనే పడుకున్నడు. అతను ఎప్పుడు ఉట్టిగా పడుకునేవాడు కాదు. అట్టపోయి కౌంజులనో, ఉడుతలనో ఆఖరికి

ఎలుకలనో ఆపూట కొరకు తెస్తూవుండేది. రాంలాల్ బిడ్డ మోతి తెచ్చె కూలి తండ్రి బిడ్డలకు దినం గడుస్తువుంది. పోయిరాజేయక రెండు రోజులైంది. పరిగడుపున గోలీలు వేసుకోవటం వల్ల రాంలాల్‌కు కండ్లు తిరిగి వల్లు తూలుతుంది. గోలీలు మింగనని బిడ్డతో గొడవ. రాంలాల్‌కు కొడుకుల్లేరు. పుట్టినోళ్లు పుట్టినట్టె రోగాలతో పోతువుంటె బొంద పెట్టిండు. మోతి పుట్టినపుడు బాలంత రోగం వచ్చి తల్లి కన్నుమూసి, బిడ్డ బతికింది. ఆ బిడ్డే రాంలాల్‌ను ఇప్పుడు తల్లిలాగ సాదుతువుంది. రోగం వస్తే మందు ఇప్పిస్తువుంది. ఎట్లయితేనేమి పది రోజులకు కాని రాంలాల్ తేరుకోలేదు. మోతి కట్టెపుల్లలు ఏరడం, ఇప్పపూవు ఏరడం, పొలం పనికి పోవడం చేస్తువుంటుంది.

ఓ జీపు వచ్చి తండా ముందు ఆగింది. "ఏబది కిలోమీటర్ల దూరాన రోడ్డుపని జరుగుతుంది. అక్కడ పని చేయడానికి కూలీలు కావాలి." జీపులో నుండి దిగిన కాంట్రాక్టర్ అన్నడు. పనికోసం ఎదిరిచూస్తున్న గిరిజనులు జీపుచుట్టు చేరి తమ తమ పేర్లను రాయించిన ప్రతి మనిషికి ఓ ఏబది రూపాయల నోటుఇచ్చి లారీ ఎక్కమన్నాడు. మోతి నోటు తీసుకొని వెళ్ళి తండ్రి చేతిలో పెట్టి విషయాన్ని చెప్పి చీరె, రవిక ఓ బస్త సంచిలో సర్దుకుని పయనమైంది. చేతిలో నోటుపట్టుకున్న రాంలాల్‌కు తన బిడ్డ తనను ఒంటరిగా వొదిలి తాను ఒంటరిగా వెళుతున్నందుకు గుండెలో నుండి దుఃఖం తన్నుకొచ్చింది. అదిచూసిన మోతి "అయ్య మనోళ్లందరు ఇక్కన్నెవున్నరు కదా! ఎందుకు దిగులు. నేను వస్తగదా" అంది కన్నీళ్లను తుడుస్తు. తుడిచె చేతులను పట్టుకొని. "నా గురించి కాదు తల్లి నీ గురించి" అన్నడు బొంగురు గొంతుతో.

"నేను ఒక్కదాన్నె పోతలేనుకదయ్య లచిమి, పార్వతి ఇంకా ఇద్దరు మొత్తం ఐదుగురం" అంది.

బిడ్డను తల్లిపోయిన దగ్గరి నుండి తానె తల్లిలాగ పెంచుతు వచ్చిండు. పాతికేళ్లు వచ్చినా పెళ్ళి కూడా చేసే స్థితిలో లేనందువల్ల ఎవరు ముందుకొచ్చి బెల్లం తినరైరి. ఎవరన్న లేపుకపోయిన బాగుండని, అనుకున్న గడియలెన్నో గడిచిపోయినయి. మోతేమో తాను ఎవన్నో ఒకన్ని మనుమాడిపోతే తనతండ్రి గతేమిటి అని ఆ విషయాన్ని అసలు పట్టించుకోలేదు. ఉన్ననాడు తింటు లేనినాడు పస్తుపంటు ఇంతకాలం ఈ తండాలోనే బతికి, ఈరోజు కూలి కోసం లారీ ఎక్కుతువుంటే కళ్లల్లో నీళ్లు తిరిగినయి. లారీలో నిలుచున్న మోతి చుట్టూర చూసింది. కన్నీటి పొర అవతల తండా అంతా మసకమసకగా కనిపించింది. తండాలో తిరిగాడే కుక్కలు అటు ఇటు పరుగెడుతున్నయి. కోళ్లు కోడిపిల్లలు శబ్దం చేస్తూ బెదిరిచూస్తువున్నయి. చెట్లల్లో చెట్లోలే. గుండ్లలో పెద్ద గుండ్లలాగ వాళ్ల గుడిసెలు మధ్య మధ్య పొయ్యిలు వొదిలె పొగలు కప్పును దాటి పైకిలేస్తువుంటె మబ్బులు కదిలినట్టు కనిపిస్తున్నయి. తన గుడిసె, గుడిసెముందు తండ్రి వేసిన మోదుగు ఆకుల పందిరి, నులక మంచం కూడా లేకుండా నేలమీద గోనెపట్టా మీద ముడుచుకున్న తండ్రి రాంలాల్ మరిమరి గుర్తురాసాగిండు. లారీ వచ్చిన తోవ పట్టింది. మోదుగు పొదలు, ఇప్పపూవు చెట్లు దాటి డొంక బాటన పరుగిడుతువుంది. పక్కన చెట్ల నుండి తేనే తెట్టెలను తట్టలో పేర్చుకున్న ఓ గిరిజనుడు బాట దాటి వెడుతువుంటె అతని వెనకాల ఓ ఆరెళ్ళ అర్ధనగ్నంగా బాలుడు తేనె పట్టుముక్కను చప్పరిస్తు నడుస్తువున్నడు. అతని వెనకాల నాలుకను బయటికి సాచి పరుగులాంటి నడకతో కుక్క. దాని చూపంతా బాలుడు చప్పరిస్తున్న తేనెపట్టు ముక్కమీదనే వుంది. లారీ వేగం పుంజుకుంటువుంది. మోతి ఎదలో ఓ మాదిరి భయం కదులుతూ గుండె వేగంగా కొట్టుకోగ ఎడమచేత్తో అదిమి పట్టుకొంది. తాను దగ్గర లేకుండా తన తండ్రి ఎట్ల ఉంటాడో గుర్తుకొచ్చి భరించలేనంతా భయం వేసింది. లారీ పరుగెడుతూనెవుంది. తన తండావాళ్లే కాకుండా వేరె తండాకు చెందిన ఆడ, మొగ వాళ్ళు ఆ లారీలో వున్నరు. అందరు ఆ క్షణంలో తమ తమ కుటుంబాలను తలచుకుంటు వున్నరు. అందులో ఎక్కువమంది ఎన్నడు లారీ ఎక్కని వాళ్లున్నరు, పొట్టకోసం గుట్టలను దాటిపోతున్నరు. పక్షులు ఎందుకు వలసొస్తయో చెప్పలేం మనుషులు మాత్రం రొట్టె, బట్ట కోసం వలస వెలుతుంటరు.

అది ఎత్తొంపుల ప్రదేశం. ప్రధాన రహదారి నుండి ప్రక్కన్నే ఉన్న పల్లెకు మట్టి రోడ్డు వేస్తువున్నరు. లారీ అక్కడికి చేరేసరికి నెత్తిమీదికి పొద్దుచ్చింది. లారీ ఓ వ్యవసాయ బావి దగ్గర ఆగింది. కూలీలంతా దిగి తెచ్చుకున్న కొందరు జొన్న రొట్టెలను మరి కొందరు కొర్రన్నాన్ని తిని కడుపునిండా నీళ్లు తాగింద్రు. “మేస్త్రి సైకిల్‌మీదొచ్చి పదండి పని మీదికి” అని చెప్పిండు. అందరు పని జరుగుతున్న వైపు నడిచింద్రు.

“మీకు కూలికింద డబ్బులు ఇవ్వరు. ఈ పని, పనికి ఆహార పథకం కింద జరుగుతున్నది. బియ్యం ఇస్తరు. మీకు డబ్బులే కావాలంటే ఇస్తం. అప్పుడు నిండు డబ్బులు రావు. కొంత కోసుకొని ఇస్తం” అంటూనె సైకిల్‌ను నడిపిస్తు దాని పక్కమ్మటే తాను నడుస్తు మోతివైపు ఓసారి చూసిండు. పెద్దపెద్ద కళ్లు. ఆ తెల్లని పలువరస మోదుగు మొగ్గ” అనుకున్నడు. ఆమె ధరించిన దుస్తుల అద్దాలు ఎండకు తళుక్కుమంటున్నయి. పాదాల గజ్జెల సందడి ఆమె కదలికలను చెపుతున్నయి.

‘పైకమో బియ్యమో ముందు కూలి పని దొరికితె చాలు’ అనుకుంటు అందరు తలలూపింద్రు. మేస్త్రి నిబంధనలన్నీ చెపుతు నడుస్తున్నడు. కాపరి వెనక గొర్రెలు నడిచినట్టు అతని వెనకాల కూలీలు.

* * *

పోగానే మేస్త్రి కుండ గురిగితో పాటు తలా కొంచెం బియ్యం ఇప్పించ్చిండు. అందర్ని ఓ స్కూల్ ఆవరణలో వుంచిండు. ఎండకాలం కనక ఉండడానికి ఇబ్బందేమిలేదు. స్కూల్ పక్కన్నె బోరు పంపువుంది. దానినీళ్లే వాడకం. అన్నం వండితే చిందూరం రంగు కలిపినట్టుంటే, ఎందుకని మేస్త్రిని అడిగితె, ‘ఇక్కడి నీళ్లు అంతె. ఈ ఊరి జనం పళ్లు పచ్చగా, కొందరి కాళ్లు చేతులు వంకరగా కనిపిస్తలేవు? ఈ నీటి దెబ్బ నుండి తప్పించే మానుడేలేదు. వేరే దేశపువాళ్లు వచ్చి ఆదుకుంటం అన్నరు. ఇక మన నాయకులు అవి చేస్తం ఇవి చేస్తం అంటూనే ఏది చేయలేకపోయింద్రు. పూటకింత చింత పులుసు తాగండి దానికి అదె ఇరుగుడు” అన్నడు మేస్త్రి.

రోడ్డుపని ముమ్మరంగా సాగుతువుంది. ఇచ్చిన బియ్యం అయిపోయినయి. కూలీ డబ్బులు అడిగితే “బియ్యం లారిని తేవడానికి కాంట్రాక్టర్‌సారు మండలానికి పోయిండు” అని చెప్పిండు మేస్త్రి. అట్లా రోజు చెపుతూనే వచ్చిండు. రెండ్రోజుల తరువాత నిలదీయగ ‘బియ్యం లారీని పోలీసులు పట్టుకున్నరట అందుకే ఆలస్యం అని కూలీలకు నచ్చచెప్పచూసాడు. ఆకలిని తీర్చేది ఒక్కతిండే కదా! మాటలు కాదు గదా? మాటలు మాయచేస్తయి. మేస్త్రి తనతో మాట్లాడిన తీరు ఏమంత బాగ అనిపించలేదు మోతికి. కొన్ని మాటలు అన్న వారికి విన్న వారికే తెలుసు. వాటిని ఎవరికి చెప్పుకోలేరు. బయటికి అనలేరు. మోతిది అదే పరిస్థితి. అందుకని కూడా వెళ్ళిపోవాలనిపించింది ఆమెకు.

మోతి ఆకలికి తట్టుకోలేకపోయింది. ఆ రోజు తెల్లవారుజామున తన తండ్రి చనిపోయినట్టు కలరాగ లేచికూర్చొని ఏడిచింది. ‘కూలి డబ్బులిస్తే తన ఊరుకు పోదునుగదా’ అనుకుంది. అనుకున్నట్టె మరునాడు పొద్దున్నె కూలి డబ్బులు ఇవ్వకపోయినా తండా తొవ్వపట్టింది. నాలుగు రోజుల నుండి తిండిలేదు. పొద్దునెత్తి మీదికి వచ్చింది. వంట్లో నడిచే సత్తాలేదు. నడిచి నడిచి కళ్లు బైర్లు కమ్మగ కాసేపు ఓ చెట్టు క్రింద కూర్చుంది. ఓ తంగెడుపూవును తెంపి తలలో పెట్టుకుంది. పూవు తెంపేటప్పుడు ఓ రింగన్నపురుగు రివ్వన లేచిపోయింది. ‘దీని లాగ నాకు రెక్కలుంటే బాగుండు కదా?’ అనుకుంటు పొద్దుకూకె వరకు తండాచేరాలని మళ్ళీ నడవసాగింది. తోవ మధ్యలో తాచుపాము ఎదురైంది. చేతులు జోడిస్తే పాము

కరవకుంట పోతది. కరిచినా ఆకలి బాధ తప్పేదని, మొక్కకుండానే నిలుచుంది. ఈ బాధల కంటె చస్తే మంచిదేమో అనుకుంది. ఓసారి కళ్లు మూసి తెరిచే సరికి పాము దాని దారిన అదిపోయింది. మోతి కాలికున్న అందెల చప్పుడుకు ఏ పాము ఎదురుకాకూడదు. కాని వచ్చింది.

మోతికి చిన్నప్పుడు పోయిన తన తల్లి గుర్తొచ్చి కళ్లల్లో నీళ్లు తిరిగినయి. తోవ మసకమసకగా కనిపించింది. అయిన ఆగకుండా నడుస్తునే ఓ పల్లెలో ఆగి "కొంచెం అన్నముంటె పెట్టమని" అడిగింది. 'ఏమైంది సోరపిల్లవు కూలీ చేసుకోచ్చుగ' అని కసిరారు. 'అడవిలో అభిమానంతో బతికిన తాను ఊళ్లో ఉపాసంతో ఉండవలసివొచ్చింద'ని తలచుకుంటు నడక సాగించింది. తండా చేరేవరకు పొద్దుకూకింది. తండ్రి జ్వరం తగ్గిందికాని మోతికి జ్వరం వచ్చింది. రాత్రంతా ఒకటే మూలుగుడు. పక్క గుడిసె ఆయన వెళ్ళి చెప్పగా ఆర్.ఎం.పి. తెల్లవారుజామున వచ్చి ఓ ఇంజక్షన్ ఇచ్చాడు.

* * *

మరునాడు సూర్యుడు ఉదయించాడు. కాని మోతిలేవలేదు! అది ఇది అనేలోపే తండాలోని జనమంతా రాంలాల్ ఇంటి ముందు గుమిగూడింద్రు. ఏడుపులు పెడబొబ్బలు 'తానిచ్చిన ఇంజక్షన్ వక్రించిందేమో' అనుకుంటు ఆర్.ఎం.పి. పొద్దున్నే తండా పొలిమెర దాటిండు. రాంలాల్ గొంతు మూగపోయింది. బిడ్డ తలాపున మోకాళ్ళ మీద తన తలను వుంచి తాను పెరిగి పెద్దై బుద్ధి నేర్చిన్నుండి జరిగిన వన్నీ తలచుకుంటున్నడు. కళ్లు చుక్కలు చుక్కలుగ కన్నీరు వదులుతువున్నయి. ముక్కులు చిక్కని నీటిని వొదులుతున్నయి. 'అసలు దేవుడు మనిషిని ఎందుకు పుట్టియ్యాలే. వందేండ్లు బతుకు అని ఎందుకు రాయాలె. మల్ల మధ్యన్నె ఎందుకు తీసుకుపోవాలె! ఎక్కడో ఏదో జరిగి పోతూవుంది. అది ఆయన చేతిలో గూడ లేనట్టుంది. అవును ఇన్నేండ్లు బతికిన తనను తీసుకుపోయి ఆ పసిదానిని వదిలిపోవచ్చుకదా' అనుకుంటు మోతివైపు దీనంగా చూసింద్రు. ఏది పట్టనట్టు దీర్ఘనిద్రలో మోతి.

'పాము కరిచిందో, తేలే కరిచిందో' అని కొందరు.

'పాపం పెళ్లి పెడాకులు కాకుండానే పాయె' అని మరికొందరు.

"ఇప్పుడైనా జిల్లడు చెట్టుకుపెళ్లి చేసికొని బొందపెట్టాలి. లేకపోతే తండాకేముప్పు" అని లచ్చిరాంనాయక్ తన నిర్ణయాన్ని ప్రకటించిండు. దానికి అందరు తలలాడించింద్రు!

"ఇది చేతబడె తప్పా మరేంకాదు" అన్నడు ఎదురు గుడిసెవాసి శంకర్‌లాల్. "పడుచుది పనికని పోయి సావును తెచ్చుకుంది. ఎవని కండ్లమన్నుపోసుకున్నడో బిడ్డను మన్నుపాలు చేసే" అంది తండానాయకుని భార్య లచిమి.

"చెట్ల మధ్యన లేడిపిల్లలాగ గుడిసెల మధ్య గెంతేది" అంది ఓ స్త్రీ.

"పోలీసులకెరుకైతే పంచనామ అంటరు. పగల జీరాలంటరు. తొందరగా బొందపెట్టాలె" అన్నడు లచ్చిరాంనాయక్. తండానాయక్ గుంపుగా వున్న జనాన్ని పక్కకు జరుపుతు తన గుడిసెకు నడిచి దబ్బుడంతో తిరిగొచ్చి మోతి కాలిగుత్తిపైన రెండుసార్లు పొడిచి గాయపరిచి చూసారు. పొడిచిన చోట రక్తం చిమ్మలేదు కాని కాస్తంత రక్తం ఉట్టింది. అట్లా ఎందుకు చేసిండో ఎవరికి అర్థం కాక చూస్తువుండిపోయింద్రు. తాను గుడిసెలో నుండి బయటికి వస్తు చేతిని పాము పడగలాగ మడిచి చూపించిండందరికి. ఎవరు మాట్లాడలేదు, చూస్తు నిలుచున్నరు. గిరిజనుల్లో కులపెద్ద ఎప్పుడు పెద్దే. అతనిమాటె చెల్లుతుంది చట్టం కూడా సమ్మతిస్తుంది.

గుడిసెలోపల రాంలాల్ "నా తల్లి నన్ను ఇడిచెళ్ళిపోయిందో" అని నెత్తినోరుకొట్టుకొని మోతి పక్కన్నె సొమ్మసిల్లి పడిపోయిండు. ఆచార ప్రకారంగా అంత్యక్రియలు ఏర్పాట్లు జరిగిపోతూనేవున్నయి. ఎట్ల చచ్చిందని ఎవరయినా ప్రశ్నిస్తే.

"పాము కరిచింది" అని తండా జవాబు.

* * *

తండాలోని గిరిజనులంతా చట్టు నిలుచోని చూస్తువున్నరు. ఏం జరుగుతదో అన్న ఆందోళన వాళ్ల ముఖాలలో స్పష్టంగా కదులుతువుంది. పారెనుక పారతో మట్టా ఎత్తి తట్టనింపి పక్కకు పోస్తువున్నరు ఇద్దరు మనుషులు. వాళ్ల దగ్గర సారవాసన గుప్‌గుప్‌మని వస్తువుంది. పోలీసుల చేతుల్లో లాఠీలు కదులుతువుంటె మట్టిని వేగంగా ఎత్తుతువున్నరు. రాంలాల్ బొంద పక్కన్నె దుఃఖిస్తు కూర్చున్నడు. వెన్ను అంటుకుపోయిన డొక్కలో సుడులు తిరుగుతున్న దుఃఖం! చావుదలకొచ్చిన రాంలాల్ బతకవల్సిన బిడ్డ కన్ను మూసినందుకు కుమిలిపోతు ఆకాశంవైపు ముఖంపెట్టి, నోరుతెరువగా, ప్యాక్ట్రీ గొట్టం వేడి పొగను వొదిలినట్టు ఎదలోని సొద బయటికి వస్తువుంది. నీరొలుకుతున్న మట్టి చిప్పల్లాగ ఆయన కనురెప్పలు.

పారలకంటె ముందు యస్.ఐ. చూపులు బొందను తొవ్వుతున్నయి. డాక్టర్ మాత్రం నిశ్చలంగా చూస్తు నిలుచున్నడు. జానెడు లోతు తొవ్వగానె మొదట గాజుముక్కలు, చీరె పేలికలు కనిపించి మరోపార ఎత్తగానే శవం కనిపించి గుప్‌న గౌలు వాసనొచ్చింది. అక్కడున్న జనం ముక్కులు మూసుకుంటు కొంచం వెనకు జరిగి, తొవ్వేవాళ్లు కాసేపు ఆగి పక్కకు నిలుచున్నరు. వాళ్లతోపాటు కూర్చొని చూస్తున్న ఊరకుక్కలు. తుమ్మచెట్టు నీడన నిలుచున్న యస్.ఐ., డాక్టర్ చేతిరుమాల్లను ముక్కులకు అడ్డం పెట్టుకొని బొంద దగ్గరికి వచ్చి తొంగిచూసి ఇంకా తొవ్వాలి అని మళ్ళీ చెట్ల కిందికి చేరారు. పైన గద్దలు ఎగురుతున్నయి. శవం చుట్టూ ఈగలు ముసురుతున్నయి.

తొవ్వేవాళ్లు చివరికి పీనుగను బయటికి తీసి బొంద ఒడ్డున వుంచగ, చుట్టు నిలుచున్న జనం ఒక్కసారె బొంద దగ్గర్కి రావడానికి కదలగానె పోలీసులు వెనక్కునెట్టి వలయాన్ని విశాలం చేసింద్రు. డాక్టర్ తన విధులను తాను నిర్వహిస్తున్నడు. రాంలాల్ వెళ్ళి బొందలో పడుకున్నది చూసిన పోలీసులు వెళ్ళి ఆయన్ను బయటికి తీసి దూరంగా తీసుకెళ్ళి, కూర్చొబెట్టింద్రు. అది చూసిన జనం కళ్లు కాలువలైనయి. మోతి చిన్నప్పటి నుండి ఆ తండాలో నెమిలిలాగ తిరిగింది. మైనాలాగ మాట్లాడింది. అందుకే ఆమె అందర్కి ఇష్టం. యస్.ఐ. బొంద పక్కన నిలుచోని తిరిగి శవాన్ని పాతి పెట్టించగా చుట్టూర నిలుచున్న జనం అంగలార్చుతు కదిలింద్రు. డాక్టర్ యస్.ఐ. పోలీసులతో జీప్ ఎక్కగా జీప్ అక్కడి నుండి కదిలింది.

* * *

తండా పక్కమ్మటె రాళ్లు పేర్చిన గోడ. దానికి కొంత దూరంలో ఓ పెద్ద మర్రిచెట్టు. దానికింద నులకమంచాలు. అధికారులు వాటిమీద కూర్చున్నరు. మండలాధికారి నిలుచోని తాము ఎవరైంది ఎందుకు వచ్చింది చెప్పి "మీరందరు మేము అడిగిన ప్రశ్నలకు మీకు తెలిసిన నిజాలు చెప్పండి చాలు. అబద్దాలు చెపితే చట్టం చర్య తీసుకుంటుంది" అన్నప్పుడు చెట్టుకింద జనం ఒకరిముఖం చూసుకున్నరు ఒకరు. దాదాపు తండాలోని ఆడ మగ, పిల్లలు అందరు సరే అని తలాడించింద్రు.

"ఏదగిడిన తండా పెద్దను అడగండి, అన్నింటికి ఆయనె" అన్నడు ఓ యువకుడు.

"అట్లాగే" అన్నడు మరో మంచం మీద కూర్చున్న పెద్దాయన. ఆయనే మానవహక్కుల కమీషనర్.

"మోతి మరణం గురించి తెలుసుకోవడానికి వచ్చిన జనంవైపు చూసి అందుకె మీకు తెలిసింది నిజం చెప్పమని ముందే యం.ఆర్.ఓ. కోరడం జరిగింది. మొదటి ప్రశ్న 'మోతి ఈ తండాలోనే పుట్టి పెరిగిన అమ్మాయె కదా?"

"అవును" తండా పెద్ద.

"మీ పేరు"

"లచ్చిరాంనాయక్"

"మోతికి ఎన్ని ఏండ్లుంటయి"

"ఇరువైఐదుండొచ్చు" అంటు తండ్రి రాంలాల్‌వైపు చూసాడు లచ్చిరాంనాయక్.

"మరి పెండ్లి ఎందుకు చేయలేదు."

"పేదరికం వల్లా".

"సరె, ఆమె ఎట్లా చచ్చిందంటరు?".

గతంలో తండావాళ్ళకు తాను చేతిని వంచి చూపించింది గుర్తొచ్చి "పాము కరిచి" అన్నడు లచ్చిరాంనాయక్.

"మరి పంచనామా చేయించారా? పోస్ట్‌మార్టం చేయించారా" అడిగిండు కమీషనర్.

"అడవిలో చిరతపంజా, ఎలుగుకొట్టి చావడం, పాముకరిచి చావడం, మామూలె కాబట్టి వాటి గురించి ఆలోచించలే" అట్లా జరుగుతూనే ఉంటయి అన్నట్టు చూస్తు "అడవిలో తిరిగే మనుషులకు అడుగడుగునా ఆపదలే గడియ గడియకు గండాలే" అన్నడు. అప్పుడు అతని ముఖంలో ఇదే కొత్తేమి కాదు. మాకది మామూలే అన్నట్టు కనిపించింది.

"తరువాత చేసిన పోస్ట్‌మార్టం రిపోర్టులో అట్లాలేదే. ఆమె పేగుల్లో ఏలాంటి ఆహారం లేక కాలీగా వున్నయి. ఆమె తిండిలేక చచ్చిందని రిపోర్టులో వుంది" అన్నడు కమీషనర్.

'అట్లాన' అన్నట్టు చూస్తూ "కావొచ్చు చేసేదేమి వుంది పనికి ఆహారం పనికి పోతే కూలీ చేయించుకొని వచ్చిన బియ్యాన్ని కాంట్రాక్టర్ అమ్ముకొని కూలీల నోట్లో మన్నుకొట్టె" అన్నడు లచ్చిరాంనాయక్.

"ఆ లమ్మె బియ్యపు లారీని పట్టుకుంటేనే ఈ అసలు కథ బయటికొచ్చింది. చివరికి ఆరా తీస్తే ఈ ఆకలి చావు బయటపడింది" అన్నడు యం.ఆర్.ఓ. అది విని ఒక్కసారె బోరున ఏడిచాడు రాంలాల్. రాంలాల్ ఏడవగానె అక్కడున్న ఆడవాళ్ల కళ్లల్లో మోతి కదిలి నీళ్లు తిరిగినయి' పాపం బిడ్డ తిండిలేకనే చచ్చెనా' అనుకున్నరు.

మానవ హక్కుల కమీషనర్ యం.ఆర్.ఓ. వైపు తిరిగి "చూదండి రాంలాల్ కుటుంబానికి చాలా అన్యాయం జరిగింది. వలసపోయిన కూతురు పనికి ఆహారపథకం కూలికి వెళ్లి అటు బియ్యం ఇటు పైకం పొందలేక ఆకలితో కిలోమీటర్లు కొలది నడిచి ప్రాణం వొదిలింది. పనిచేసుకొని జీవించే హక్కు ప్రతి పౌరునికి వుంది. ఆ హక్కును ప్రభుత్వమే కాపాడాలి. ఈమె విషయంలో విఫలమైంది. జీవితాన్ని ప్రారంభించని లేత ప్రాణాన్ని కాపాడలేకపోయింది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాల్సిందే అన్నడు యం.ఆర్.ఓ. వైపు చూస్తు. ఇప్పుడు ప్రభుత్వం చేసేది ఏమిటో ప్రకటించండి" అన్నడు యం.ఆర్.ఓ. వైపు చూస్తు.

"తక్షణం మనం రాంలాల్‌కు ఓ రేషన్‌కార్డు ఇవ్వొచ్చు, ఓల్డ్‌ఏజ్ పెన్షన్ మంజూరు చెయ్యొచ్చు. ఓ పక్కా ఇల్లును కూడ కట్టించి ఇవ్వొచ్చు" అంటు తాను కూర్చున్న చోటునుండి లేచి కమీషనర్ పక్కనొచ్చి నిలుచున్నడు.

"ఈ మూడు ఓకేసారి ఇవ్వండి" అన్నడు కమీషనర్.

"సరే" అన్నట్టు తలాడించాడు. యం.ఆర్.ఓ ఫైలులో పై విషయాలను రికార్డుచేసి కమీషనర్‌తో సంతకం చేయించుకున్నాడు. కమీషనర్ లేచి రాంలాల్ భుజం మీద చేయివుంచి "వస్తాం పెద్దాయన మీకు యం.ఆర్.ఓ. అన్ని ఏర్పాట్లు చేస్తరు" అంటు అక్కడి నుండి కదలగ అక్కడున్న వాళ్లు జీప్ వరకు నడిచి సాగనంపిండ్రు.

* * *

మండలం జీపువొచ్చి తండాలో ఆగింది. అందులో నుండి ఆర్.ఐ. దిగి అందర్ని పిలిచి, తామెందుకొచ్చింది చెప్పిండు. ఎవ్వరు ఆసక్తిని కనబరచినట్టు కనిపించలేదు.

అంతా విని తన కోసం వొచ్చిందేమో, అన్నది ఏమన్న తెచ్చారేమోనని లేస్తు పడుతు వచ్చి నిలుచున్నడు రాంలాల్. అంతకు ముందే వచ్చి నిలుచున్న లచ్చిరాంనాయక్ పెదవి విరిచి లాభం లేదన్నట్టు సైగ చేసాడు.

'మరెందుకొచ్చినట్టు' అని కళ్ళతోనే అడిగిండు రాంలాల్. అప్పుడు అతని ముఖంలో నిరాశ కదిలింది. బిడ్డపోయిన రెండేళ్ళలో చాలా తగ్గిపోయిండు. గడ్డం మీసాలు పెరిగి ముఖం వెడల్పుగా ఉన్నా కళ్ళు నోరు కుంచించుకుపోయి కనుగుడ్లలో జీవకళ తగ్గింది. నుదురుపై నాగలి చాళ్ళ లాంటి ముడతలు తేలినయి.

"ఎన్నికల గుర్తింపు కార్డు కోసం ఫోటోలు దిగాలట" అన్నడు లచ్చిరాంనాయక్.

అదివినగానె రాంలాల్ మౌనంలోకి వెళ్లి, నిదానంగా తన గుడిసె వైపు నడిచిండు.

## స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) అడవిపూలు కథలో రాంలాల్, మోతీల అనుబంధాన్ని తెలియజేయండి?

ఆ) అడవిపూలు కథలోని సందేశాన్ని వివరించండి?

# 16 చిరుదీపం

- బొమ్మ హేమాదేవి

## రచయిత్రి పరిచయం



14-09-1931
26-11-1996

బొమ్మ హేమాదేవి సెప్టెంబర్ 14, 1931 న నిజామాబాద్‌కు చెందిన గంగాదేవి రామాగౌడ్ దంపతులకు జన్మించింది. కరీంనగర్‌కు చెందిన బొమ్మ నారాయణగౌడ్‌ను తన పదహారవయేట పెళ్ళి చేసుకున్నది. తొలుత కరీంనగర్ ప్రాంతంలో తర్వాతి కాలంలో హైదరాబాదులో స్థిరపడ్డది. 1960 దశకం నుంచి రచనలు చేస్తున్న ఈమె దేవి రమ పేరుతో తొలుత కథలు రాసింది. బొమ్మ హేమాదేవికి తల్లిదండ్రులు పెట్టిన పేరు యమున. తర్వాత కాలంలో ఆమె రుక్మిణిగా మారింది. తన పెద్దకోడలు హేమాదేవి పేరుతో రాసిన కుంకుమ పూలు అనే రచన ఆంధ్రజ్యోతి వారపత్రిక నుండి బహుమతిని పొందింది. అప్పటి నుంచి తన రచనలను హేమాదేవి పేరుతోనే వెలువరించింది. 'పొగమంచు' అన్న రేడియో నాటికను రచించింది. 35 వరకు నవలలు రాసినట్లు తెలుస్తున్నది. 'తార' అన్న నవల ఆంధ్రభూమి పత్రిక వారి బహుమతి పొందింది. 1970-80 ప్రాంతంలో ఎక్కువగా కథలు, నవలలు రచించిన బొమ్మ హేమాదేవి తన 65వ ఏట నవంబర్ 26, 1996 నాడు మరణించింది. గృహిణిగా ఉంటూనే మానవసంబంధాలు, కుటుంబ సంబంధాలను కేంద్రంగా చేసుకుని రచనలు చేసింది.

"ప్రభా..... ఓ ప్రభా...." పిలుపులకు ప్రభావతి హాల్లోకి వచ్చి భర్త చేతిలో నించి పోస్టుమెన్ అప్పుడే ఇచ్చిపోయిన ఉత్తరాలని తీసుకుంది.

"ఇంకా ఆ ఉత్తరాలే వచ్చినట్టున్నాయిగా" అన్నాడు మూర్తి.

"ఔనండి..."

"ఊ..." అదోలా అన్నాడు.

"ఏమిటండీ..." మూర్తి పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుంటూ అడిగింది.

"ఇన్ని ఫోటోలు, ఇంకెన్నో ఉత్తరాలు వచ్చాయి కదా! వాడికి ఒక్కటైనా నచ్చటం లేదు. కోడలిని మరి నువ్వయినా ఎన్నుకో".

ప్రభావతి చిన్నగా నవ్వి.

"బాగుంది. పెళ్ళి చేసుకునేది వాడు. ఎంపిక చేసేది నేనా?" అంది.

"ఏమైందీ! నిన్ను నేను చూచానా? కనీసం 'ఇలా ఉంటుంది' అనైనా ఎవరూ చెప్పిన పాపాన పోలేదు. అమ్మకు నచ్చావని నిన్ను నా కోసం, నాన్నకి నచ్చిందని అనసూయని తమ్ముడి కోసం తెచ్చి పెళ్ళి చేయలేదా?" అన్నాడు మూర్తి. కంటద్దాలను తీసి కర్చీఫ్‌తో తుడుస్తూ ప్రభావతివైపు నవ్వుతూ చూస్తూ.

ఈలోగా లోపలికి వచ్చిన నీలూ "జనరేషన్ గ్యాప్" అంటూ నుదురు కొట్టుకుంది.

"ఇంకేం కూతురు వచ్చింది కదా, మాట్లాడండి" అని లేవబోయింది ప్రభావతి.

"అమ్మా! చచ్చేంత ఆకలి" చేతిలోని పుస్తకాలని సోఫా మీద పెట్టి అలాగే తానూ తిరుగుతూ అంది నీలూ.

ప్రభావతి ఏదో అనబోయింది. ఈ లోపలే నీలు "టిఫిన్ ఏం చేసేవమ్మా ఈ రోజూ" అడిగింది.

"ముందు నీకు ఆకలిగా ఉందా లేదా చెప్పు".

"అయ్యో! చచ్చిపోయేంత"

"ఐతే ఏదైనా బాగానే ఉంటుంది పద"

"అమ్మా! గారేలు"

"బూరేలు వద్దా?"

"ఊ... హూ అమిత్ ఖండ్... చాలా రోజులైంది తిని"

"నెల చివరి రోజుల్లో నీ గారాలు ఏంసాగవు" కోపంగానే అంది ప్రభావతి.

"ఎందుకు సాగవు. నాన్న పాకెట్ ఫస్టున, ముప్పయొకటిన ఒక్కలా ఉంటుంది గదా?"

"ఓసేవ్ ఇష్టం ఉంటె తిను లేకపోతే ఊరుకో, నీకు సమాధానాలు చెప్తూ కూచోను" కూతురువైపు కోపంగానే చూస్తూ అంది.

"ఏమండీ... మీకు టిఫిన్ తీసుకురానా?" అడిగింది భర్తను. మూర్తి సమాధానం ఇవ్వకముందే నీలు నాకు గూడా తీసుకురా అమ్మా! అని 'అబ్బా!' అని బాధగా మూల్గింది.

"ఏమైందీ?!" ఆతురతా, కోపం కలిసి ధ్వనించింది ప్రభావతి కంఠం. "క్రికెట్ ప్రాక్టీసు చేశానమ్మా స్పోర్ట్సుడే వచ్చేస్తోంది కదా" నడుం గూడా పట్టుకుని చిన్నగా మూల్గుతూ అంది.

అంతవరకు తల్లిని, కూతురిని నిశ్శబ్దంగా గమనిస్తున్న మూర్తి చిన్నగా నవ్వుతూ

"మీ అమ్మ అమిత్ ఖండ్ చేసిందిలె" అన్నాడు.

"గారెలు – నేతిలో ముంచుకుని తింటె అబ్బ! ఎంత రుచో!" అంది – తన కాళ్ళని వత్తుకుంటూ...

"నీలూ..."

"ఏం నాన్నా?"

"ఈ ఫోటోలు చూచావా నువ్వు"

"ఈరోజు గూడా మళ్ళీ ఫోటోలు ఉత్తరాలూనా? ఒకసారి అడ్వర్‌టైజ్‌మెంట్ ఇస్తేనే ఇన్నా?" అని లేచి – తండ్రి చేతుల్లోనించి ఉత్తరాలు తీసుకుని చదివాక...

"అన్నయ్యకి ఒహ పట్టాన అమ్మాయి నచ్చదు నాన్నా! తనది కొంచెం హైట్ ఎక్కువ కదా! అందుకని ఫోజులు కొడతాడు. మీరు కోప్పడకండి. అన్నయ్య వింటాడు" అంది.

"కోప్పడి కొట్టి పెళ్ళికి ఒప్పించమంటారా? బుద్ధిమంతురాలివే. ఇప్పటికే మీ అమ్మ కూతురిని వెనుక వేసుకుని కొడుకుని ముందుకి వేస్తాడని ఇన్నీ, అన్నీ నిందలు మోపలేదు. ఇహ ఇది గూడా ఎందుకూ? వాడికి నచ్చిన అమ్మాయినే పెళ్ళిచేసుకోనీ" అన్నాడు.

ఈలోగా ప్రభావతి భర్తకు కూతురికి టిఫిన్ తీసుకుని వచ్చి వాళ్ళ చేతికి అందించింది.

"అమ్మా! ఆ చేత్తోనే కాస్త తినిపించగూడదు" అంది నీలు.

"ఉయ్యాల కట్టించనా... ఊగుదువుగాని..."

మనింట్లో "స్థలం ఎక్కడుందమ్మా" అంది ఎంతో అమాయకంగా ముఖం పెట్టి. కళ్ళనిండా కొంటెతనం మాత్రం దాచుకోలేకపోయింది.

"స్థలం ఉండి... ఉయ్యాల కడితే ఊగుతావన్నమాట".

"ఊ హు... నువ్వే ఊపాలి. ఐనా నీకీ పని కొత్త కాదమ్మా" అంది.

ఏమనిపించిందో ప్రభావతి కూతురు దగ్గరకు వచ్చి ప్రక్కన కూర్చుని అనవసరంగానే నీలు జుత్తుని సవరిస్తూ "మరీ ఇంత బద్దకమైతే ఎట్లానే నీలూ... నీ ఈడుకి నాకు ఇద్దరు పిల్లలు పుట్టారు. నువ్వేమో ఇక ఊయల ఊగుతానంటావు" అంది అమిత్‌ఖండ్‌ని స్పూన్‌తో నీలూకి తినిపిస్తూ.

"అమ్మా! తొందరగా వదిన వచ్చే ఏర్పాటు చేయి. నీకు కొంచెం విశ్రాంతిగా ఉంటుంది" అంది.

ఇంకో స్పూన్ అమిత్‌ఖండ్ కోసం నోరు తెరుస్తూ.

ప్రభావతి ఆ మాటకు సమాధానం ఈయకుండా గబగబా ఇంకో స్పూన్ అమిత్ ఖండ్ తినిపించి.

"ఊ ఇహ నువ్వు తిను. నేను నీళ్ళు తెస్తాను" అని లోపలివైపు వెళ్ళబోతూ భర్తతో –

"మీకు 'కాఫా'? 'టీ'నా" అడిగింది.

"ముందు 'టీ' ఇవ్వు కొంచెం ఆగాక 'కాఫీ' ఇద్దువుగాని" అన్నాడు కూతురితో మాటల్లోకి దిగుతూ.

ఈలోగా స్కూటర్ చప్పుడు వినిపించగా

నీలూ, 'అన్నయ్య వచ్చినట్టున్నాడు అనుకుంటూ బద్ధకంగా లేచినా విపరీతంగా వినిపించే హారన్ చప్పుడికి తట్టుకోలేక పరిగెత్తుకుని వెళ్ళి గేట్ తెరిచింది.

ఇద్దరూ కలిసి ఇంట్లోకి వచ్చేసరికి ఇద్దరి మధ్య పెద్ద పోట్లాట ఆరంభం అయింది.

"నువ్వు అంత గట్టిగా హారన్ ఎందుకు కొట్టాలి" అని నీలు. "ఇంట్లో ఉన్నవాళ్ళకి ఎట్లా వినిపిస్తుంది" అని మిథున్ "నేను ఎలా ఉన్నా పరుగెత్తుకు రావాల్సిందేనన్న మాట" సోఫాలో కూలబడ్తూ అంది నీలు.

"నువ్వు చేసే పని మటుకు ఏం ఉంది" తండ్రి పక్కన సోఫాలో కూచుంటూ అన్నాడు మిథున్.

"అంటే ఏమన్నట్టు? చదువుకోవటం పని కాదా?"

"నీలూ! ప్లీజ్ విసిగించకు" తలపై నించి హెల్మెట్ తీసి ముందున్న టేబిల్‌మీద ఉంచి–

"అమ్మా! ఆకలమ్మా – లోపలివైపు తల్లికి వినిపించేలా కేకవేశాడు మిథున్.

"నీలూని ఇటు పంపించు" అంది లోపల నుంచి ప్రభావతి. "ఏం నువ్వు తెచ్చుకోలేవా?" మిథున్‌వైపు చురచురా చూస్తూ అంది నీలు. మూర్తి ఈ మాటలేం పట్టించుకోకుండా తన ఆఫీసు ఫైళ్ళు ఏవో తిరగేస్తూ కూచున్నాడు.

గొణుగుతూ వెళ్ళి రెండు ప్లేట్స్ తెచ్చి మిథున్ ముందుంచింది నీలు – "మంచి నీళ్ళు నువ్వే తెచ్చుకోవాలి" అంటూ.

"నువ్వేం చేస్తావ్?" ప్లేట్‌లో నించి అమిత్ ఖండ్ తీసుకుని తింటూ అడిగాడు.

"నీకెందుకూ? అయినా తొందరగా పెళ్ళి చేసుకోరాదు. మీ ఆవిడైతే... కూచున్న దగ్గరకి అన్నీ తెచ్చి అందిస్తుంది.

"అది సరే... సినిమాకి టికెట్స్ తెచ్చాను తొందరగా రెడీ కావాలీ రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్... హరియప్ నీలూ" అన్నాడు మిథున్.

"నల్గురమా"

"ఆ... మరి...!?"

"అమ్మ ఇంత తొందరగా తెమలదు" అంది. ఫోన్ మోగగానే అటు వెళ్తూ.

"అందరికన్నా చిన్నదానిగా పుట్టటమే తప్పయినట్టుంది. ఇంట్లో అందరి అన్ని పనులు నేనే చేయాలి" అంది మిథున్‌వైపు చూస్తూ. "నీ ఫ్రెండయి ఉంటుంది. అంతకన్నా ఇంకేం పనులుంటాయి. నీకైనా నీ ఫ్రెండ్‌కైనా..." అన్నాడు ఫోన్ గురించి.

నీలు ఫోన్‌లో మాట్లాడి ఫోన్ పెట్టేసి వచ్చి కూచుంటూ –

నేను సినిమాకి రాలేను అన్నయ్యా అంది.

"ఎందుకూ?" ఫైళ్ళలోనించి తలెత్తి కూతురువైపు చూస్తూ అన్నాడు మూర్తి. "ఊరికేనే నాన్నా" అంది కాని మనిషి మాత్రం బాగా బాధ పడసాగింది.

నీ ఫ్రెండ్‌లెవరికైనా ఏదైనా ప్రాబ్లమా?" మిథున్ అడిగాడు.

"ఊ" అంది నీలు.

"వచ్చాక బాధ పడొచ్చు... పద..."

ఆ మాట మీదనించి మళ్ళీ ఇద్దరికి అరగంట దాకా పోట్లాట జరిగింది.

ఆ మీదట – ఎలాగైతేనేం... తల్లి, తండ్రి ఇద్దరు పిల్లలు కలిసి సినిమా చూచి వచ్చారు.

రాత్రి భోజనాలప్పుడు –

"మిధున్! ఈసారి పెళ్ళిళ్ళ సీజన్‌లో నీ పెళ్ళి ఐపోవాలిరా" అంది ప్రభావతి. "ప్చ్..." అన్నాడు మిధున్.

"నాల్గేళ్ళ బట్టి ఆ మాటే అంటున్నావు... ఇప్పుడు ఉద్యోగం గూడా చేస్తున్నావు. ఇంకా ఏమొచ్చిందిరా..." అంది నెయ్యి వేస్తూ కొడుకుతో.

నీలు చాలా బుద్ధిగా తింటూంది. ఎప్పుడూ లేనిది...

"ముందు నీలూ పెళ్ళి కావాలి కదమ్మా – ఇంకో మూడేళ్ళు పోతే నాన్న రిటైర్ ఔతారు. కాబట్టి నీలూ పెళ్ళి ముందు కావాలి" మిధున్ మాటలకు నీలూ చివ్వున తలెత్తి.

"అమ్మ ఆరోగ్యం బాగుండడంలేదు. ముందు ఈ ఇంటికి కోడలు కావాలి" అంది.

"ఆరోగ్యం బాగాలేకపోతే డాక్టర్ చూస్తాడు. పనికి ఇబ్బందైతే మనిషిని పెట్టుకోవచ్చు" మిధున్ మాటలు పూర్తికాకముందే నీలు "అన్నయ్యా! నీ కిష్టమైతే పెళ్ళి చేసుకో – లేదా మానుకో. అంతేకాని నా పెళ్ళి గురించి అస్సలంటే అస్సలు మాట్లాడొద్దు. నేను చచ్చినా పెళ్ళి చేసుకోను" అని తర్వాత తల్లితో...

"అమ్మా నాకు అన్నం తినబుద్ధి కావడంలేదు. ఈ అన్నం పారేయకు ఫరవాలేదు. రేపు తింటాను" అంది పళ్ళెంలోని అన్నం గిన్నెలోకి ఎత్తి మూసి పెడుతూ...

"మళ్ళీ ఏమొచ్చింది దీనికి?" భర్తవైపు చూస్తూ అంది ప్రభావతి.

"ఏమో!" అన్నట్టు భుజాలు ఎగరేసాడు మూర్తి.

"స్నేహితుల సమస్యలన్నీ తన నెత్తిమీద వేసుకుని బాధపడుతుంది. ఇంట్లో అందరిని మరీ బోర్ కొట్టిస్తోందమ్మా నీలూ.. ఈ మధ్య ఈ చాదస్తం నీలూకి ఇంకా పెరిగిపోతూంది" మిధున్ అనగానే మూర్తి

"తోటి మనిషి బాధ పడుతూంటే, ఏదైనా చిన్న సహాయం చేయాలనుకోవడం బోర్... చాదస్తమూనా, వెరీగుడ్" ప్రభావతివైపు చూస్తూ అన్నాడు మూర్తి.

"అది కాదు నాన్నా! అస్తమానమూ స్నేహితుల సమస్యలే ఐతే..."

"మిధున్... తన గురించి – ప్రతి మనిషి యోచించగలగాలి. అదే కరువైపోతోంది ఈ రోజుల్లో" మూర్తి కంఠం నిండా బాధ.

"ఇంతకూ ఎవరికి ఏమైందట" ప్రభావతి అంది.

"తెలియదు..." అన్నాడు మూర్తి "అమ్మా చారుగిన్నె ఇటు జరుపు" మిధున్ అనగానే "బంగాళదుంప వేపుడు నీ కిష్టం కద నాన్నా... ఇంకొంచెం వేసుకో..." అంది ప్రభావతి.

మిధున్ తల్లి మాట తీసివేయడు సాధారణంగా. భర్తకు అప్పడం ఒకటి వేసి, తాను మజ్జిగ వేసుకుంది ప్రభావతి.

నీలూ తినకపోవటంవల్ల ఆమెకు కోపంగా ఉన్నా... మనస్సులో ఓ వైపు బాగా పీకుతోంది. రాత్రి భోజనం తర్వాత అంతా కాస్సేపు హాల్లో కూచోవడం, మాటాడుకోవటం ఆ ఇంట్లో అలవాటు.

నీలూ ముసుగు తన్ని గదిలో పడుకుంది. కాబట్టి ముగ్గురే కూచుని ఆ, ఈ మాటలు మాటాడుకుంటున్నారు.

మాటల మధ్యలో ప్రభావతి లేచి లోపలికి వెళ్ళి ఈ రోజు వచ్చిన ఫోటోలు తెచ్చి మిధున్‌కిస్తూ...

"నీకు రంభ కావాలా? ఊర్వశియా?"

అంత చక్కని అమ్మాయిలు గూడా నీకు నచ్చకపోతే...?" అంది కొడుకుతో.

"అమ్మా! నాకు రంభా ఊర్వశిలు వద్దు. చివరకు జయసుధ, జయప్రదలు కూడా వద్దు. కాని ఈ ఆరు అడుగుల మనిషి ఎత్తుకి సరిపోయె అమ్మాయిని చూడు. ఈ రోజు వచ్చిన ఉత్తరాల్లో గూడా ఎవరికీ నాకు సరిపడే "హైట్ లేదమ్మా" తల్లి చేతికి, తిరిగి కవర్లు అందిస్తూ అన్నాడు మిధున్.

"వాడికింకా పెళ్ళి లేదు" అన్నాడు మూర్తి.

"అవేం మాటలండీ..." బాధపడుతూ అంది ప్రభావతి.

"నాన్న నిజమే అంటున్నారమ్మా ఆరు అడుగుల ఎత్తు మనిషికి సరిపడే అమ్మాయిలే కరువైపోయారు. మూరెడు ఎత్తు, జానెడు జుత్తు. ఈ రోజుల్లో ఆడవాళ్ళు అంతే..." అన్నాడు మెల్లగా.

ప్రభావతి లేచి నీలూ గదిలోకి వెళ్ళి రెండు తిట్టి నాల్గు కొసర్లు వేసి గ్లాసు నిండా వేడిపాలు త్రాగించి తిరిగి హాల్లోకి వెళ్ళిపోయింది.

మూర్తి కూర్చుని చాలా శ్రద్ధగా బిబిసి వార్తలు వింటున్నాడు. ప్రభావతి తమ గదిలోకి వెళ్ళి మేనువాల్చిందో లేదో "అమ్మా!" అని పిలుస్తూ నీలూ వచ్చి తల్లి పక్కలో పడుకుంది. నీలూ అలా రావటం చూచిన మూర్తి రేడియో కట్టేసి తానూ గదిలోకి వచ్చాడు.

"ఏమిటి నీలూ!" అని అడిగాడు.

నీలూ తల్లి పక్కలోకి లేచి కూచుని "మీరు కిరణ్మయిని ఎరుగుదురు కదా?" అడిగింది.

"సరిగ్గా గుర్తుకు రాలేదమ్మా!"

"మనింటికి చాలాసార్లు వచ్చింది నాన్నా... అంటే ఈ మధ్య రాలేదనుకోండి"

"ఊ కావచ్చు... అయితే...?"

"అమ్మాయి కనుముక్కు తీరు చక్కగా ఉండేవి. మోకాళ్ళ కిందికి జడ... నవ్వితే చెంపలు గుంటలు పడేవి ఆ అమ్మాయేనా?" ప్రభావతి అంది నీలూవైపు చూస్తూ.

"నేనైతే అవన్నీ చూళ్ళేదు" అన్నాడు మూర్తి.

"మా బామ్మ చెల్లెలు అలాగే ఉండేదండీ... అందుకు ఆ అమ్మాయి నాకు బాగా గుర్తు" అంది ప్రభావతి.

"ఛంపావ్ పో" అని నవ్వి "ఊ అయితే ఏమిటమ్మా కిరణ్మయికి ఏమిటీ?" అడిగాడు.

"దానికి తల్లి లేదు నాన్నా!"

"అయ్యో! పాపం!" వెంటనే అంది ప్రభావతి.

"ఒక తమ్ముడున్నాడు. ఆ అబ్బాయిని ఎక్కడో దూరాన హాస్టల్లో ఉంచారు. తండ్రేమో మళ్ళీ పెళ్ళి చేసుకుని చిన్న భార్యచేతిలో కీలుబొమ్మ అయిపోయాడు. ఆమె ఆడింది ఆట పాడింది పాట. ఇదేమో ఆ ఇంట్లో పనిమనిషికన్నా హీనంగా చూడబడుతోంది. సరిపడ భోజనం ఉండదు. కూర్చుంటే ఎందుకూ? అని. నిల్చున్నా ఎందుకూ? అన్న ప్రశ్న. నుదుట కుంకుమ పెట్టుకుంటే ఎవరొస్తున్నాడే? అని అడుగుతుంది. పెట్టుకోకపోతే 'ముండ ముఖందానా' అంటుంది. దాని సవతి తల్లికి చేయివాటం గూడా ఉంది. అడపాదడపా దెబ్బలు గూడా సహిస్తుంది ఇది. చిన్నం ఎత్తు పని ఆవిడ ముట్టుకోదు. వాకిలి తుడవటం దగ్గర్నించి ఆమెకు అవసరమైనప్పుడల్లా మంచినీళ్ళు గూడా అందిస్తూ ఉండాలి. ఇన్నిటిని ఇంతకాలం సహించింది. దాని చదువు పూర్తయి పెళ్ళి జరిగిపోతే ఈ నరకం నుండి విముక్తి దొరుకుతుందని".

"ఊ... మరి...!?" మూర్తి అడిగాడు.

"తల్లిని తల్చుకుని, తల్చుకుని ఏడుస్తుంది నాన్నా కిరణ్మయి" నీలూ కంఠం బొంగురు పోయింది. సరిగ్గా మాట్లాడలేకపోయింది. కళ్ళ నించి నీళ్ళు జారి బుగ్గల మీద పడ్డాయి.

"ఊ తర్వాత ఇప్పుడేం జరిగిందీ?" అసహనంగా మళ్ళీ అడిగాడు మూర్తి.

"నిన్న ఓ రాత్రిపూట దెబ్బలు కొట్టి ఇంట్లోనించి ఆ పినతల్లి దాన్ని బైటకు వెళ్ళగొట్టిందట నాన్నా. తండ్రేమో ...ఛీ ...ఛీ ...చూస్తూ నిల్చున్నాడట".

"దెబ్బలు కొట్టాల్సినంత అగత్యం ఏమొచ్చిందట...?" అడిగాడు. నీలూ దీర్ఘంగా ఊపిరి పీల్చుకుని...

"వాళ్ళు కిరణ్ణి కొట్టక తిట్టక ఉండిందుంటే కారణం అడగాలి గాని కొట్టినందుకు కాదు నాన్నా".

"ఏ కారణం లేకుండానే కొట్టగలదు ఆవిడ" అంది.

"మరిప్పుడు కిరణ్మయి ఎక్కడుంది?"

"నా క్లాస్‌మేట్ ఉష లేదూ దానింట్లో ఉందిట. కాని వాళ్ళింట్లో మగపిల్లలు చాల మంది ఉన్నారని ఉష వాళ్ళమ్మ తన ఇంట్లో ఉంచుకోవటానికి ఇష్టపడటంలేదట. లక్ష్మి వాళ్ళింట్లో వాళ్ళ నాన్నకి ఈ వయస్సులో గూడా చాపల్యం అట. అందుకు వాళ్ళ అమ్మ వద్దందట. కళ్యాణి వాళ్ళ ఇంట్లో దాని అన్నయ్యలంత మంచివాళ్ళు కాదని కళ్యాణి అంటుందట. దీప ఉద్యోగస్తురాలు. దాని భర్త మంచివాడే కాని, దీనికి అనుమానం ఎక్కువ" అని కొంచెం ఆగి.

"అమ్మా... నాన్నా... ఒక ఆడపిల్లకు కొన్ని రోజుల కోసం కించిత్తు ఆశ్రయం ఇవ్వలేని ఈ కుటుంబాలు – ఈ గృహాలు – ఈ సంసారాలు ఎందుకూ? మానవత్వం అంటూ లేని ఈ మనుషులెందుకూ?" అంది చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తూ.

"అదేమిటి నీలూ! అంత బలహీనమైపోతున్నావెందుకు? ఇదే వరుసైతే నువ్వెందుకు పనికి వస్తావు?" కూతుర్ని దగ్గరకు తీసుకుని అన్నాడు మూర్తి.

అదికాదు నాన్నా! ఈ బాధలకు తట్టుకోలేక అది ఏ నుయ్యో గొయ్యో చూచుకుంటే…" భయంతో వణికిపోతూ అంది నీలూ.

"జీవితంలో కష్టాలు అనుభవించిన వాళ్ళకి జీవితం విలువ తెలుస్తుందమ్మా. కిరణ్మయి ఎప్పుడు అలా చేయదు. రేపు ఉదయం ఆ అమ్మాయిని మనింటికి తీసుకురా…" మూర్తి మాటలు పూర్తిగాకముందే నీలూ.

"కిరణ్మయిని మనింట్లో ఉంచుకుందామా నాన్నా?" అడిగింది.

"ఏదైనా హాస్టల్లో ఉంచుదామమ్మా".

"మనింట్లో ఎందుకు వద్దు… మీరూ అందరిలాంటివాళ్ళేగా నాన్నా" అప్రయత్నంగా వెంటనే అంది.

"నీలూ! అనవసరంగా మాటలు పారేసుకోబోక… రేపు ఉదయం కిరణ్మయిని తీసుకురా ఆమెకున్న కష్టాలేమిటో అవసరాలేమిటో అన్నీ విచారించాక ఓ నిర్ణయానికి రావచ్చు అంతేకాని, ఉన్నపళంగా ఆ అమ్మాయి బాధ్యత తీసుకోవటం సాధ్యముకాదు. సమంజసమూ కాదు" కఠినంగా అంది ప్రభావతి.

ఏమనుకుందో నీలు వెంటనే అక్కడి నుంచి లేచి తన గదిలోకి వెళ్ళిపోయింది.

"దాన్ని ఎందుకట్లా కోప్పడ్డావు?" నొచ్చుకుంటూ అన్నాడు మూర్తి.

"అది మనసులో ఎలా అనుకుంటే, అక్షరాలా మనం అలాగే మసలుకోవాలి. లేకపోతే మీరు అంతేనా?!" అంటుంది. ఇది ఏమైనా బుద్ధి ఉన్న మాటేనా అని లైటార్పి శాలువ కప్పుకుని పడుకుంది.

ఇంకోరోజు ఉదయం, కాలేజీకి వెళ్ళే ముందు "ఈరోజు కిరణ్ణి తీసుకురానా?" పొడిగా అడిగింది తల్లిని.

"నువ్వూరుకోరా" వెంటనే అంది ప్రభావతి.

"ఐతే దానిని ఇంకెక్కడైనా అరేంజ్ చేస్తాను" నీలూ అంది.

"నీ ఇష్టం" అంది ప్రభావతి.

నీలూ మళ్ళీ తండ్రివైపు చూచింది. "ఆ నెయ్యి ఇటు జరుపు నీలూ…" అన్నాడు తండ్రి.

నీలూకి దుఃఖం ముంచుకువస్తోంది.. అయినా నెయ్యి అటు జరిపి మాటాడకుండా తిని వెళ్ళిపోయింది.

సాయంకాలం నీలూ ఇంటికి వచ్చే సమయం దాటిపోయి చాలాసేపైంది.

రావటంలో ఆలస్యం అయేట్టుంటే సాధారణంగా ఇంటికి ఫోన్ చేస్తుంది. ఈ రోజు ఫోన్ కూడా చేయలేదు. నీలూ గురించే యోచిస్తున్నట్టుంది ప్రభావతి, మిధున్ స్కూటర్ చప్పుడు కాని హారన్ చప్పుడు కాని వినిపించలేదు. మూర్తి వెళ్ళి గేటు తెరవాల్సివచ్చింది.

"నీ కొడుకు గూడా ఏదో సమస్య తెచ్చినట్టున్నాడు" వంటింట్లోకి వచ్చి భార్యతో అన్నాడు.

"ఏమైంది?"

"ఎవరో అమ్మాయిని తీసుకువచ్చాడు."

"బ్రతకనిచ్చేలా లేదు వీళ్ళు" అంది బైటకు నడవబోతూ.

"ఐనా ప్రభా! అంత తొందరపడతావెందుకూ? వాడు ఎలాగూ లోపలికి తీసుకువచ్చాడు కదా... ఏం చెబుతాడో చూద్దాం ఉండు..." అన్నాడు.

ఈలోగా మిథున్, ఆ అమ్మాయి ముందు గదిలోకి వచ్చారు. వచ్చిరాగానే మిథున్ "అమ్మా! నీలూ దార్లో ఉంది. నువ్వు ఖంగారు పడతావేమోనని, బస్ కోసం గూడా వేచి ఉండక నడిచే వస్తోంది పాపం!" అని.

"కిరణ్మయికి ఆరోగ్యం బాగా లేదట. అందుకని నాతో స్కూటర్ మీద పంపించింది. ఆవిడ ముందు గదిలో నుంచోనుంది కూర్చోమన్నా కూర్చోకుండా" అని తన గదివైపు వెళ్ళబోయిన వాడల్లా మళ్ళీ తిరిగొచ్చి "కిరణ్మయిని లోపలికి పిల్చుకో అమ్మా! చాలా దిగులు పడిపోయి ఉంది" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఎన్నడూ లేనిది నీలూ స్నేహితురాలిపై వీడికింత అనుగ్రహం ఏమిటో అని పొయ్యి మీదున్న అన్నం గిన్నె దింపి, ప్రభావతి ముందు గదిలోకి వెళ్ళేసరికి కిరణ్మయి నిన్చునే ఉంది. అయిదు అడుగుల ఎనిమిది అంగుళాల ఎత్తులో.

ఏమనుకుందో ప్రభావతి కిరణ్మయిని ఎంతో ఆదరంగా, ఆప్యాయతగా "రా అమ్మా లోపలికి రా" అని పిలిచి చెయ్యి పట్టుకుని ఇంటిలోపలివైపు తీసుకువెళ్ళింది.

మొత్తం మీద ఏదో ఓ రకంగా ఆ కుటుంబ సభ్యులంతా కలిసి, అందరూ ఉండి గూడా అనాథ అయిన కిరణ్మయి దుఃఖ జీవితంలో పాలుపంచుకుని ఆమె చీకటి బ్రతుకులో 'చిరుదీపం' వెలిగించగలిగారు.

## స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) కుటుంబంలో ఆప్యాయతలను 'చిరుదీపం' కథలో రచయిత్రి ఎలా చిత్రించింది?

ఆ) 'చిరుదీపం' అన్న పేరు ఈ కథకు సరియైనదా? చర్చించండి.

# పదాలు - అర్థాలు

## అ

అంకించు = త్రిప్పు, పట్టుకొను
అంకుశం = ఏనుగు కుంభస్థలమును పొడిచి అదుపులోనికి తెచ్చుటకు ఉపయోగించు ఆయుధం, నిరోధం
అంధకారం = చీకటి
అంబరవీధి = ఆకాశవీధి / ఆకాశమార్గం
అంబుధి = సముద్రం
అంబుజాసనుడు = బ్రహ్మ
అంభోధి = సముద్రం
అంభోజము = కమలము, తామర
అచంచలము = స్థిరమైనది
అనాథ = దిక్కులేనివాడు
అనివార్యం = తప్పనిసరి
అభీష్టం = కోరిక
అబ్జము = తామర
అవని = భూమి
అమర్చి = సవరించి
అర్ణవం = సముద్రం
అరి = శత్రువు
అరిష్టం = కీడు
అరుణము = ఎర్రనిది
అల్క = చులకన
అవని = భూమి, నేల
అవ్వ = తల్లి (తెలంగాణలో తల్లిని అవ్వ అని, తండ్రిని నాయిన, బాపు లేదా అయ్య అని అంటారు)
అసురులు = రాక్షసులు, దైత్యులు

## ఆ

ఆజ్ఞ = ఆదేశం, ఉత్తర్వు
ఆది = మొదటి
ఆర్తి = బాధ
ఆవశ్యకత = అవసరం
ఆయమ = ఆమె
ఆలి = భార్య
ఆలింగనం = కౌగిలింత
ఆసక్తి = ఇష్టము

## ఇ

ఇనాయతు = పెద్దలు చిన్నలకు ఇచ్చే బహుమతి
ఇభము = ఏనుగు
ఇలవేల్పు = ఇంటి దేవత
ఇక్షుదండాలు = చెరుకుగడలు

## ఈ

ఈతిబాధలు = అతివృష్టి, అనావృష్టి మొదలైన ఉపద్రవాలు
ఈప్సితము = కోరబడినది
ఈపు = వీపు

## ఉ

ఉజ్జ్వలము = ప్రకాశము
ఉవాచ = చెప్పబడినది
ఉవిద = స్త్రీ
ఉసిక = ఇసుక

## ఎ

ఎడ = నడుమ, చోటు

## ఒ

ఒడ్లు = దరులు

ఒఱ్ఱె = చిన్నవాగు

ఒండు = మరొకటి

## క

కందు = తపించు

కంఠనాళము = కుత్తుకలోని నరము

కజ్జలము = కాటుక

కడి = కబళము

కప్పు = ఆచ్ఛాదనము

కమనీయం = మనోహరం

కమలాప్తుడు = సూర్యుడు

కరణి = విధము

కర్ణం = చెవి

కరారునామ = ఒబంబడిక పత్రం, నిర్ణయపత్రం

కలిమి = సంపద

కాన్క = కానుక, బహుమతి

కాడు = శ్మశానము

కాసారము = చెరువు

కారంజీ = ఫౌంటెన్

కిడ్నాప్ = అపహరించు

కీక = కేక (పెద్ద అరుపుతో కూడిన పిలుపు)

కీడు = హాని

కీరము = చిలుక

కీలము = మంట

కుజనులు = చెడ్డవారు

కుడ్యము = గోడ

కులసతి = భార్య

కుల్య = కాలువ

కుసంస్కారం = చెడుసంస్కారం

కుఱుచ = పొట్టి

కూరిమి = స్నేహం

కేలు = చేయి

కొనాకు = చివరకు

కొల్లగా = అధికముగా

కోలాహలము = సందడి

కోసు = రెండు మైళ్ళు

కౌశలం = నేర్పరితనం

క్రమ్మఱన్ = మరల

క్షోణి = నేల

## గ

గజం = 3 అడుగులు, ఏనుగు

గరళము = విషము

గళము = కంఠం

గార్వం = గారాబం, గారం

గిరి = కొండ

గుట్ట = చిన్నకొండ

గొడిసేపు = కొద్దిసేపు

గోచరించు = కనబడు

గృహము = ఇల్లు

## ఘ

ఘర్మము = చెమట

ఘాతము = దెబ్బ

## చ

చందము = విధము

చిచ్చు = మంట, అగ్ని

చిత్తరువు = పటంలో గీసిన బొమ్మ

చీకాకు = అసహనం
చెన్ను = అందము
చెప్రాసి = బంట్రోతు, అటెండర్
చెలిమె = తవ్విన కొద్ది ఊరే నీటి గుంత

### ఛ

ఛాయ = నీడ

### జ

జంబూఫలం = నేరేడుపండు
జగత్తు = ప్రపంచం
జలజాక్షి = పద్మముల వంటి కన్నులు గల స్త్రీ
జలం = నీరు
జాడ = దారి, తోవ
జ్ఞానం = తెలివి
జీర = బొంగురు, గీర
జేవురుగట్టు = ఎర్రకొండ

### ఝ

ఝరి = ప్రవాహం

### త

తత్తరం = తొందరపాటు
తథ్యం = తప్పునిసరి
తటాకము = చెరువు
తనూభవుడు = కుమారుడు, కొడుకు
తలపులు = ఆలోచనలు
తాతీలు = సెలవులు
తిప్పలు = కష్టాలు
తీరం = ఒడ్డు, గట్టు
తీవ = తీగ
తునియలు = ముక్కలు
తొంటిపెంపు = మునుపటి గౌరవము
తొడవు = భూషణము

### ద

దండిగా = ఎక్కువగా
దండోరా = చాటింపు
దంష్ట్రలు = కోరలు
దాతి = పనిచేసే స్థలం (కమ్మరి, వడ్రంగి వారు పనిచేసే స్థలం)
ద్వానలం = గొప్ప మంట, విషాదం
దిడ్డి = చిన్నవాకిలి, దొడ్డి, ఇంటి వెనుక పెరడు
దుకూలము = తెల్లవస్త్రం
దూప = దాహం
దుర్జనులు = చెడ్డవారు
దుస్తరం = కష్టం
దుష్ట = చెడు
దీనులు = పేదవారు
దౌవారికులు = ద్వారపాలకులు
ద్వేషము = పగ
దైత్యులు = రాక్షసులు
దైనందిన = ప్రతిరోజు జరుగునది
ద్రవ్యము = ధనం, డబ్బు

### న

నజరు = దృష్టి
నాసిరకం = నాణ్యతలేని
నిగారము = మేలిమి, శ్రేష్ఠము
నిగ్రానీ = పర్యవేక్షణ
నిశ్చలము = కదలనిది
నీరము = నీరు
నీరుకట్టె = నీళ్లలో ఉండే ఒకరకమైన విషరహిత పాము

నెలవు = నివాసం, చోటు
నేరము = తప్పు

## ప

పథము = తోవ
పట్టి = కొంత భూభాగం
పడతి = స్త్రీ
పద్మినీవల్లభుడు = సూర్యుడు
పస్తు = ఉపవాసం
పసిమి = పచ్చదనం
పయస్సు = నీరు
పరికించు = చూడు
పార్థివేశ్వరుడు = రాజులకు రాజైనవాడు
పునరుక్తి = చెప్పినదే చెప్పడం
పునీతుడు = పవిత్రుడు
పెయి = శరీరం
పేచీ = తగవు
పొలుపు = స్థైర్యము
ప్రజ్జ్వలించు = ప్రకాశించు
ప్రతిస్పందన = బదులుగా స్పందించు
ప్రబలం = మిక్కిలి బలం
ప్రమోదం = సంతోషం, ఆనందం
ప్రసంగము = ఉపన్యాసము
ప్రసక్తి = ప్రస్తావన
ప్రజ్ఞ = బుద్ధి
ప్రాచీనం = పాత

## ఫ

ఫణి = పాము
ఫలం = పండు

## బ

బడ్జెట్ = ఆదాయ వ్యయముల అంచనా
బాష్పము = కన్నీరు
బిడారము = ఎడారిలో పయనించు బృందాల విడిది
బుగులు = భయం
బువ్వ = అన్నం
బొొబ్బ = పెద్ద అఱుపు

## భ

భరము = బరువు
భవసాగరము = సంసారమనే సాగరము
భావన = తలపు
భాండము = వంటపాత్ర
భాష్పకణము = కన్నీటి బిందువు
భూషణం = ఆభరణం
భోగి = పాము

## మ

మంకు = మొండితనం
మంజుల = మనోహరమైన
మంజీర = అందె
మకరి = మొసలి
మగ్నం = మునిగినది
మృత్యువు = మరణము
ముఖాముఖి = ఎదురెదురుగా
మునిపుంగవులు = గొప్ప ఋషులు
ముష్టి = పిడికిలి
మస్తకం = తల
మామిలియ్యతు = సర్కారు నిర్వహణము

మిసిమి = నూతన కాంతి

మిసిమింతురాలు = అలసినది

మిట్ట = ఎత్తైన నేల

మేధావి = తెలివిమంతుడు

మైత్రి = స్నేహం

మోటబాయి = నీళ్లు తోడడానికి మోట (కపిల) (గిరుక) అమర్చిన బాయి.

## య

యజనము = యజ్ఞము

యవనిక = తెర

యాది = జ్ఞాపకంలః

యుగ్మం = జత

యూధం = గుంపు, సమూహం

## ర

రణం = యుద్ధం

రవము = ధ్వని

రవళి = ధ్వని

రశ్మి = కాంతి

రుగ్మత = వ్యాధి

రూపం = ఆకారం

రూఢి = ప్రసిద్ధి

## ల

లంపటము = ఆపద

లాయఖు = తగిన

లోభి = పిసినారి

## వ

వదనము = ముఖము

వధ్యశిల = చంపడానికి ఏర్పరచిన రాయి

వడి = వేగం

వల్లి = తీగ

వాక = ఏరు

వాసంతికలు = అడవి మొల్లలు

వార్ధి = సముద్రం

వాహిని = నది

విచ్ఛిన్నం = నాశనం

వితరణం = పంచటం

విత్తం = ధనం

విదితము = తెలియబడినది

విద్వత్తు = పాండిత్యం

విద్వాంసుడు = పండితుడు

విధులు = పనులు

విద్యున్మాల = మెరుపుతీగ

విరసం = కలహం, కొట్లాట

విస్మయం = ఆశ్చర్యం

విశ్వము = ప్రపంచం

వీక్షించు = చూచు

వైరం = శత్రుత్వం

వ్రయము = వ్యయము, ఖర్చు

## శ

శక్తి = బలము

శతాబ్దం = వంద సంవత్సరాలు

శతధార = పదునైన అంచు

శిల = రాయి

శీలం = మంచి ప్రవర్తన

శైలం = కొండ

## స

సంగాతము = స్నేహం

సంశయం = సందేహం

| | | |
|---|---|---|
| సోప | = | బడి |
| సోపతి | = | స్నేహం |
| సజ్జనులు | = | మంచివారు |
| సతి | = | భార్య |
| సఫలీకృతం | = | విజయం సాధించడం |
| సమూహం | = | గుంపు |
| సమ్మతం | = | అంగీకారం |
| సరళము | = | సులభం |
| స్వరం | = | కంఠధ్వని |
| సర్వంకషము | = | అంతటా వ్యాపించిన |
| సర్వమంగళ | = | పార్వతి |
| సలామ్ | = | నమస్కారం |
| సహస్రం | = | వెయ్యి |
| సహేతుకం | = | హేతుబద్ధం |
| సాగరము | = | సముద్రం |
| సాధువు | = | మంచివాడు |
| సాధ్వి | = | పతివ్రత |
| సారూప్యత | = | దగ్గరి పోలిక |
| సింధురం | = | ఏనుగు |
| సింధువు | = | సముద్రం |
| సిరి | = | సంపద, ధనం |
| సీమ | = | ప్రదేశం |
| సుందరమైన | = | చక్కని |
| సుధారసం | = | అమృతం |
| సుమం | = | పువ్వు |
| సురలు | = | దేవతలు |
| సురలోకం | = | దేవలోకం |

## హ

| | | |
|---|---|---|
| హలము | = | నాగలి |
| హవేలి | = | భవనము |
| హసంతికలు | = | మల్లెలు |
| హృద్యము | = | మనస్సునందు పుట్టినది. |
| హితము | = | మేలు |
| హేల | = | విలాసము, తిరస్కారము |

## క్ష

| | | |
|---|---|---|
| క్షితి | = | భూమి |

## నానార్థాలు

| | | |
|---|---|---|
| చిత్తము | = | దయ, మనసు, హృదయం |
| పర్వము | = | పండుగ, కణుపు, మహాభారత భాగం |
| ఫలము | = | పండు, ప్రయోజనము, సుఖము |
| మృగము | = | జంతువు, జింక, వేట |
| సతి | = | భార్య, పార్వతి, పతివ్రత |
| అమృతం | = | సుధ, పాలు, నేయి, పెరుగు |
| వాహిని | = | నది, సేన |
| అరి | = | శత్రువు, చక్రం, అల్లెత్రాడు, కప్పం |
| కుడ్యం | = | గోడ, పూత, దిండు |
| హరి | = | విష్ణువు, కోతి, పాము, కప్ప, ఇంద్రుడు |
| ఊపిరి | = | గాలి, ప్రాణము, శ్వాస |
| ఊరు | = | పల్లె, జనించు, వృద్ధి |
| కావ్యం | = | కృతి, సుఖం |
| ధ్వని | = | శబ్దము, కావ్యస్వరూపం, వ్యంగ్య ప్రధాన పదం |
| నుడి | = | మాట, అపకీర్తి |
| నుడుగు | = | చెప్పు, మాట |

| | | |
|---|---|---|
| న్యాయం | = | చట్టం, తగవు, నీతి |
| పొద్దు | = | ప్రాతఃకాలం, సూర్యుడు, పూట |
| మనస్సు | = | ఇష్టం, హృదయము, అభిప్రాయం, కోరిక |
| మబ్బు | = | మేఘం, చీకటి, అజ్ఞానం |
| మాట | = | వాక్కు, వార్త, ఆజ్ఞ, కలహం |
| రహస్యం | = | ఏకాంతం, గుట్టు |
| సంతోషం | = | తృప్తి, సంతసము |
| స్వరం | = | కంఠధ్వని, సంగీతస్వరం |
| కాలం | = | సమయం, చావు, నలుపు |
| జాతి | = | అలంకారం, కులం, ఛందస్సు |
| తీరం | = | ఒడ్డు, తగరం |
| మూర్తి | = | కాఠిన్యం, ప్రతిమ, శరీరం |
| అండజము | = | చేప, పక్షి, పాము, బల్లి |
| కాంతము | = | ఇనుము, రాయి, వసంతఋతువు, కుంకుమ |
| దక్షుడు | = | శివుడు, నేర్పరి, ఒకానొక బ్రహ్మ, ఒక ముని |
| సరము | = | హారము, నీరు, స్వరము, భావము, చెరువు |
| శ్రీ | = | లక్ష్మి, ఐశ్వర్యము, శోభ, అలంకారము |

## పర్యాయపదాలు

| | | |
|---|---|---|
| అహి | = | పాము, సర్పము, పన్నగము |
| అక్షి | = | కన్ను, నేత్రము |
| జలధి | = | సముద్రము, నీరధి, వనధి, సంద్రము |
| భూవరుడు | = | రాజు, నృపాలుడు, భూపాలుడు |
| విషము | = | గరళము, గరదము, హాలాహలం |
| శంభుడు | = | శివుడు, శంకరుడు, మహేశ్వరుడు |
| సోముడు | = | చంద్రుడు, శశాంకుడు |
| కజ్జలము | = | కాటుక, అంజనము |
| తటాకము | = | చెరువు, కాసారము |
| పథము | = | తోవ, మార్గము |
| భూమి | = | నేల, పుడమి, ధరణి |
| రైతు | = | హాలికుడు, కర్షకుడు |
| వాహిని | = | నది, స్రవంతి, తరంగిణి |
| వృక్షము | = | చెట్టు, తరువు |
| హలము | = | నాగలి, అరక |
| అంకుశం | = | తోత్రం, వేణుకం, శృణి |
| అంధకారం | = | చీకటి, ధ్వాంతం, తిమిరం |
| కలశం | = | కుండ, ఘటం |
| మకరి | = | మొసలి, మకరం |
| శ్రేణి | = | వరుస, పంక్తి, దొంతి |
| అన్యాయం | = | అక్రమం, అధర్మం |
| ఊరు | = | గ్రామం, జనపదం |
| కావ్యం | = | కబ్బము, కృతి, ప్రబంధము |
| సంతోషం | = | ఆనందం, హర్షం, మోదం |
| అరణ్యం | = | అడవి, విపినం, అటవి |
| ఆకాశం | = | అంతరిక్షం, అంబరం |
| కత్తి | = | అసి, కృపాణము, ఖడ్గం |
| తీరం | = | దరి, ఒడ్డు |
| స్త్రీ | = | అంగన, అతివ, తరుణి, మహిళ |
| నిట్టూర్పు | = | ఊపిరి, నిశ్వసనము |

## జాతీయాలు

కుయ్యోమొఱ్ఱో – మొఱపెట్టుకొను

బావిలో కప్ప – తనకు తెలిసినదే ప్రపంచం అనుకునేవాడు

## విశేషాంశాలు

భూతపంచకము = పంచభూతములు; భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశము

సాష్టాంగ దండ ప్రణామములు = తల, ఱొమ్ము, చేతులు, మోకాళ్ళు, పాదములు, మనస్సు, వాక్కు, దృష్టి – ఈ ఎనిమిది అంగములు నేలకు తాకునట్లుగా చేసే నమస్కారము.

కౌశికుడు = కుశికుని వంశములో పుట్టినవాడు

పార్థివుడు = పృథివికి రాజు

పార్థివఈశ్వరుడు = రాజులకు రాజైనవాడు

పూబోడి = పూవువంటి మేను కలది

భీష్మవిషం = 'భీష్మ' శబ్దానికి భయానకమైన, భయంకరమైన అనే అర్థాలు ఉన్నవి. 'భీష్మవిషం' అనగా భయంకరమైన, ప్రాణాంతకమైన విషం అని అర్థం. విషం యొక్క తీవ్రతను తెలుపడానికి 'భీష్మ' శబ్దం ప్రయోగించబడింది.

కులనిధి యంభోది = అంభోధి అనగా సముద్రం. దానికి 'కులనిధి' అనే విశేషణం ఎందుకు చేర్చబడింది? అని ప్రశ్నించుకుంటే 'అది శ్రేష్ఠమైనది కాబట్టి' అనే జవాబు వస్తుంది. 'కులనిధి యంభోధి' అంటే 'శ్రేష్ఠమైన సముద్రం' అని అర్థం. పురాణాల ప్రకారం సముద్రం నుండి కామధేనువు, ఉచ్చైశ్రవం, ఐరావతం, కల్పవృక్షం, చంద్రుడు, మహాలక్ష్మి, అప్సరసలు జన్మించారు. సముద్రాన్ని 'రత్నాకరం' అంటాము. అది అనేక సంపదలకు నిలయం. అందుకే అది శ్రేష్ఠం.

కట్టు ముల్లె = 'కట్టుముల్లె' అంటే 'దాచుకున్న భద్రమైన మూట' అని అర్థం. 'ముల్లెమూట' అనే పదం తెలంగాణలో వాడుకలో ఉంది. 'ముల్లె' అనే పదాన్ని సంపదకు, ధనానికి పర్యాయపదంగా వాడుతారు. 'కొంచెం సహాయం చేస్తే నీ ముల్లె పోతుందా?' అని అనడం మనం వింటుంటాం కదా! 'కట్టుముల్లె' అంటే 'కట్టుకున్న ముల్లె' అని 'దాచిపెట్టుకున్న సంపద' అని అర్థం చేసుకోవాలి.

తురాయి = తలపై చేసుకునే అలంకారములలో 'తురాయి' ఒకటి. దీనిని కొంగ తల ఈకలతో చేస్తారు. 'తురాయి' అనే పదానికి 'తలపైనగ' అనే అర్థం కూడ ఉంది.

మంజీరానది = ఇది గోదావరికి ఉపనది. ఈ నది మహారాష్ట్రలోని బాలాఘాట్ పర్వతశ్రేణిలో పుట్టింది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల గుండా ప్రవహిస్తూ తెలంగాణలో ప్రవేశిస్తున్నది. తెలంగాణలో సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాదు జిల్లాలలో ప్రవహిస్తూ నిజామాబాదుజిల్లా కందకుర్తివద్ద గోదావరిలో కలుస్తున్నది. ఈ మంజీర నదిపై తెలంగాణలో నిజాం సాగర్ ప్రాజెక్టు, సింగూరు ప్రాజెక్టు నిర్మించారు. సింగూరు రిజర్వాయర్ ద్వారా హైదరాబాదు నగరవాసులకు తాగునీరు అందిస్తున్నారు.

చైత్రరథము = ఉత్తర దిక్కుకు అధిపతి కుబేరుడు. ఆ కుబేరుని ఉద్యానవనమే చైత్రరథం. ఆ వనం సెలయేర్లతో, రకరకాల పరిమళ భరితమైన పుష్పాలతో అందంగా ఉంటుంది. అది ఎల్లప్పుడూ వసంత ఋతువుకు నిలయంగా ఉంటుంది. ఆ వనంలో దేవతలు, గంధర్వులు, కిన్నెరులు, విహరిస్తూ ఉంటారు.

నిజాంసాగర్ ప్రాజెక్టు = కామారెడ్డి జిల్లా అచ్చంపేట గ్రామం వద్ద మంజీరా నదిపై నిర్మించిన ప్రాజెక్టు. 2.75 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో దీనిని నిర్మించారు.

భగీరథుడు = దిలీపుని కొడుకు. కపిల మహర్షి శాపానికి గురైన తన తాతలకు ఉత్తమగతులు కలిగించడానికి ఆకాశం నుండి గంగను భూమ్మీదకు తీసుకువచ్చాడు.

రుద్రవీణ = రుద్రవీణ అంటే శివుడి వీణ. శివుడు ఎప్పుడూ నృత్యం చేయడం, పాడడం ద్వారా ఆనందిస్తాడు. మరొక కథనం ప్రకారం రావణుడు రుద్రవీణను కనిపెట్టాడని దానితో శివుడిని ఆరాధిస్తాడని అంటారు. ఈ రుద్రవీణలో మొత్తం ఏడు తీగలు ఉంటాయి.

ఏడుపాయలు = మెదక్‌జిల్లా నాగసానిపల్లె వద్ద ఉన్న పుణ్యక్షేత్రం. ఇక్కడ వెలసిన అమ్మవారు వనదుర్గగా పేరుగాంచింది. ఈ ప్రాంతంలో మంజీరా నది ఏడు పాయలుగా విడిపోయి ప్రవహిస్తుంది. అందుకే దీనికి ఏడుపాయల అని పేరు వచ్చింది. ఇక్కడ ప్రతి సంవత్సరం మహాశివరాత్రి రోజు ఏడుపాయల జాతర జరుగుతుంది.

ఆధ్యాత్మికత = మతాలకు అతీతంగా భక్తిని ఏర్పరచుకునే ఒక ఉన్నత స్థితిని 'ఆధ్యాత్మికత' అంటారు. ఇది ముక్తి మార్గానికి బాట. అది భౌతికమైన పరిమితులకు అతీతమైన ఒక అనుభవం.

మానస గురువు = ప్రత్యక్షంగా చదువు నేర్పకపోయినప్పటికి మనసులో ప్రతిష్టించుకున్న, బలంగా నమ్మిన గురువు.

సూఫీ = ఇస్లాం మతంలో ఒక ఆధ్యాత్మిక ఆచారం ఈ 'సూఫీ' తత్వం. 'విశ్వసోదర ప్రేమ' ఈ తత్వ లక్షణం. ఆడంబరాలకు దూరంగా పవిత్రంగా యోగులుగా, సన్యాసులుగా, ఫకీరులుగా జీవితాన్ని గడిపే వ్యక్తులు సూఫీలు.

సతీర్థ్యుడు = ఒకే గురువువద్ద తనతోపాటు చదువుకున్నవానిని 'సతీర్థ్యుడు' అంటారు. దీనిని సహపాఠి, క్లాస్‌మెట్ అని అర్థం చేసుకోవాలి.

శాస్త్రాలు = శాస్త్రాలు ఆరు. వీటిని 'షట్శాస్త్రములు' అంటారు. 1. తర్కం, 2. వ్యాకరణం, 3. ధర్మం, 4. మీమాంస, 5. వైద్యం, 6. జ్యోతిష్యం

వేదాలు = వేదాలు నాలుగు. 1. ఋగ్వేదం, 2. యజుర్వేదం, 3. సామవేదం, 4. అధర్వణవేదం

వేదాంగాలు = వేదాంగాలు ఆరు. 1. శిక్ష, 2. వ్యాకరణం, 3. ఛందం, 4. నిరుక్తం, 5. జ్యోతిషం, 6. కల్పము.

మౌల్వీ = మౌల్వీ అంటే అధిక విద్యార్హతలు కల్గిన 'పండితుడు' అని అర్థం. సాధారణంగా మదర్సా లేదా దారుల్ ఉలూమ్‌లో పూర్తి చదువులు పూర్తిచేసిన వ్యక్తి అని అర్థం.

నాజిర్‌సాబ్ = నాజిర్‌సాబ్ అంటే విద్యాపర్యవేక్షణ అధికారి.

షేర్ = ఇది ఉర్దూ, ఫారసీ భాషలలోని ఒక సాహిత్య ప్రక్రియ.

కట్టడి = గ్రామాల్లో వృత్తిపనివారికి నిర్ణయించిన ఫలం

వతనుదార్లు = గ్రామాల్లో వివిధ వృత్తులు చేసే నియమిత వ్యక్తులు

కల్లం దులపడం = పంటకోసిన తర్వాత గింజలు తీసుకొనే ప్రాంగణాన్ని ఖాళీ చేయడం

ఆయంకట్టి ముగ్గువేయడం = ఇల్లు కట్టేటప్పుడు వాస్తు ప్రకారం విశ్వకర్మలు ఇంటిని అడ్డం – పొడుగు కొలచి ఫలభాగాన్ని నిర్ణయించి ముగ్గు వేస్తారు.

విశ్వకర్మలు = కంసాలి, వడ్రంగి, కమ్మరి వంటి వృత్తులు చేసే వారిని విశ్వకర్మలు అని పిలుస్తారు.

అమాని = పన్ను బకాయివల్ల లేదా మరేతర కారణంవల్ల ప్రభుత్వపరమైన భూమిని 'అమాని' అంటారు.

బంతి తిరగడం = కోసిన పంట నుండి విత్తనాలు దులిపేందుకు పశువులను లేదా ట్రాక్టర్ గుండ్రంగా తిప్పడం.

ఖండి = నియమితమైన గింజల రాశి

వర్తన = గింజలు కొలిచాక గౌరవంగా ఇచ్చే కూలీ

కొలతకుండ = గింజలు కొలిచే ఇనుపకుండ

రెసిడెంట్ – నేటి కోఠి ఉమెన్స్ కాలేజి

నిజాం దేవిడి – కింగ్ కోఠి భవనం

## వ్యుత్పత్త్యర్థాలు

అమృతం – మరణం లేకుండా చేయునది. (అమృతం)

దుర్గ – వనాది దుర్గము నివాసంగా కలది. (దుర్గ)

తటాకము – జలముచే కొట్టబడినది. (చెరువు)

దైత్యులు – దితి కుమారులు

సౌధము – సున్నం చేత నిర్మితమైనది

## ప్రకృతి – వికృతి

కీర్తి – కీరితి

కుడ్యం – గోడ

ఘీంకారం – గీక

ధర్మం – దమ్మం, దరమం

ఫలం – పండు

విషం – విసం

ఆకాశము – ఆకసము

కులము – కొలము

గౌరవము – గారవము

తంత్రము – తంతు

పక్షి – పక్కి

ప్రాణము – పానము

భక్తి – బత్తి

మంత్రము – మంతరము

యాత్ర – జాతర

రాత్రి – రాతిరి

వైద్యుడు – వెజ్జు

శక్తి – సత్తి

స్త్రీ – ఇంతి